- భాగవతం - పఠన సంప్రదాయం
- ఆమె సుత ఒక తల్లే కదా !
- మనం మరచిపోయిన మహా విద్యాలయం
- బ్రహ్మశ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రి
- ఉపనిషత్తులలో సరస్వతీ ప్రస్తావనలు
- మహాభారతానికి నాయకుడెవరు ?
- గురజాడ 'తొలి కొత్త తెలుగు కథలు' - విశ్లేషణ
- ఆంధ్ర మహాభారతంలాంటి అసామాన్య కావ్యం 'బాపూజీ ఆత్మకథ'

# మూసీ
# MUSI


◆ Samputi : 26 ◆ Sanchika : 09 ◆ Pages : 64 ◆ Rs. 20
◆ July 2023

UGC Care List
Approved Journal



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 9

UGC Care List Approved Journal
హైదరాబాద్ జులై : 2023



వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి

సంపుటి : 26 సంచిక : 9
జులై - 2023
'శోభకృత్' ఆషాఢ మాసం
సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA
సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
**B. Anantha Laxmi**

*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

UGC APPROVED JOURNAL



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

భాగవతం - పఠన సంప్రదాయం ... డా. కాకునూరి సూర్యనారాయణ మూర్తి 7
పద్య మనోహరం - 43 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 12
ఆమె సుత ఒక తల్లే కదా! (బందారం కథలు -19) ... డా. నందిని సిధారెడ్డి 13
మనం మరచిపోయిన మహా విద్యాలయం ... పేపకాయల ప్రసాద్ 17
భారతీయీకరణ13 : ఆంగ్లమూలం : బలరాజ్ మధోక్, తెలుగు : కోవెల సంపత్కుమార21
బ్రహ్మశ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రి : షష్టిపూర్తి సంచిక (గ్రంథాంతరంగం-25) ... ఘట్టమరాజు 25
ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డితో చివరి ముఖాముఖి... పరిశోధక విద్యార్థులు 29
ఉపనిషత్తులలో సరస్వతీ ప్రస్తావనలు ... శ్రీవైష్ణవ వేణుగోపాల్ 33
తెలుగు భాష - సి.పి. బ్రౌన్ కృషి ... కొల్లేటి రవిబాబు 36
ఉస్మానియా విశ్వవిద్యాలయ తొలి తెలుగు అధ్యాపకురాలు : గాలి ఇందిరావందనం ... ఆచార్య వెలుదండ నిత్యానంద రావు 39
కె. విశ్వనాథ్ చలన చిత్రాలు, సామాజిక అవలోకనం - 32 .. టి. లక్ష్మీనారాయణ 41
మహాభారతానికి నాయకుడెవరు? ... కె. సుజన 44
తెలంగాణ కథా ప్రక్రియ - కాలువ మల్లయ్య ... అడావతు రాగ్యానాయక్ 47
గురజాడ 'తొలి కొత్త తెలుగు కథలు' - విశ్లేషణ ... డా. ఎన్. రజని 51
ఆంధ్ర మహాభారతం లాంటి అసామాన్య కావ్యం 'బాపూజీ ఆత్మకథ' ... చిటిప్రోలు వేంకటరత్నం 54

### కవితలు

బోనాల పండుగ ... అవధాని భానుప్రకాశాచార్య - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ -6; దారిదీపాలు ... పుట్టి గిరిధర్ - 6; నా కవనాలు ... ఆర్. నవజీవన్ రెడ్డి -16; విసిరేయాలనిపిస్తోంది ... లక్ష్మి శ్రీనివాస్ - 28; సత్యం ... యముగంటి ప్రభాకర్ - 53; సమయమెందుకో ఊగిసలాడింది ... బి. అంజనీదేవి - 58; జీవితం (తెలుగు గజల్) ... డా. ఆచార్య ఫణీంద్ర - 60; విజ్ఞాన చైతన్య ప్రదాత గురువు ... కనకయ్య నేదునూరి - 62;

### సమీక్షలు

శ్రీగౌరీపెద్ది రామసుబ్బశర్మగారి శతజయంతి విశేష సంచిక ... శివప్రియ 57
శ్రీనివాస విలాస కావ్యద్వయం ... డా. శ్రీరంగాచార్య 59
స్వీకృతి ... 61

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 9  హైదరాబాద్ జులై : 2023

## సంపాదకీయం







వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి


స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**





# మార్గం

లోకంలో ఏదైనా తెలియని వానికి తెలిసేలా చేసే జ్ఞానోపదేశమే మార్గం. మార్గం చెప్పేవాడు మార్గదర్శకుడు. ఈ మార్గం ఏ రూపంలోనైనా కావచ్చు. లోకమార్గం, ప్రకృతి మార్గం, ఆత్మ మార్గం అని ఇవి మూడు రకాలుగా ఉంటాయి. ఈ మూడు మార్గాల్లో ఏదో రూపంలో మనకు మార్గం లభిస్తూనే ఉంటుంది. వ్యక్తి యొక్క శక్తి అనుసారం మార్గం చెప్పేవాని స్థాయి కూడా ఉంటుంది. చిన్న తరగతుల్లో ఉపాధ్యాయులు, పెద్ద తరగతుల్లో ఆచార్యులు పాఠం చెప్పినట్లే, మనకున్న శక్తి ననుసరించి మార్గం బలీయమైనది, ఉన్నతమైనది, ఉత్తమమైనది లభిస్తుంది.

లోకమార్గంలోనే మనం ఆగిపోయి ఉన్నాం. మన చుట్టూ ఉన్న సమాజం, దానిలోని గుణ దోషాలు, బతకడానికి కావలసిన మార్గాలు, మెలగాల్సిన విధానాల వరకే నేర్చుకోవడానికి దాదాపు జీవిత కాలం పడుతుంది. అయినా అన్నీ అనుభవంలోకి రావడమే లేదు. ఎంత నేర్చుకున్నా ఇంకా నేర్చుకోవడానికి మరొకటి ఉంటూనే ఉంటుంది.

లోక వ్యవహారాన్ని అధిగమించేది ప్రకృతి మార్గం. గాలి, ఎండ, వర్షం, చలి, ప్రవాహం, ఆకర్షణ, సూర్యుడు, చంద్రుడు, వెలుగు, వెన్నెల వంటి అంశాల ప్రకృతిగతాలు. ఇవి చాలా విషయాలలో మనకు మార్గదర్శనం చేస్తాయి. ఇదంతా ప్రకృతి. మనలోనూ ఇదే ప్రకృతి ఉంటుంది. పంచభూత సమన్వయం. దాని మార్గాన్ని మనం అందుకుంటే ఈ ప్రకృతి మనకు విజ్ఞానాన్ని అందిస్తుంది. ప్రకృతి గొప్ప గొప్ప సందేశాలను ఇస్తుంది. పరిశీలించే వానిని బట్టి అది తెలుస్తుంది. మార్గదర్శకుని గొప్పదనాన్ని బట్టి ఎన్నో విషయాలు తెలుసుకునే అవకాశం. ఇది కూడా తెలుసుకుంటున్నా కొద్దీ ఇంకా ఏదో మిగిలి ఉందనే భావనే మిగులుతుంది.

ప్రకృతిలోని అన్ని అంశాలూ ఒక చైతన్యం వల్ల మాత్రమే అనుభవంలోకి వస్తాయి. చైతన్య రహితమైన జీవి, శక్తి రహిత వస్తువు ఏ రూపంలోనూ లోకానికి వినియోగపడవు. శక్తి, చైతన్యం అనేవన్నీ పర్యాయపదాలే. సమయానుకూలంగా వినియోగించే మాటలే. మనలోని ప్రాణంలాగా. ఈ చైతన్యం గూర్చి తెలియజేసేవాడు అసలైన మార్గదర్శకుడు. ఆ మార్గమే అసలైన మార్గం. అది ఉంటే అన్నీ ఉన్నట్లే. చైతన్య రహితమైన ఏ శరీరాన్ని, ఏ సమాజాన్నీ మనం ఊహించలేము.

ఈ పరంపరలో మార్గం చెప్పలేని వారెవరు, చెప్పనివారెవరు? చైతన్యంతో కూడుకున్న ప్రతివారూ ఏదో సందర్భాల్లో, ఏదో ఒక సమయంలో ప్రక్కవానికో, పిల్లలకో, మిత్రులకో... ఏదో రూపంలో మార్గం చెప్తూనే ఉంటారు. అది లోకం, ప్రకృతి, ఆత్మ వ్యవహారాలు ఏవైనా కావచ్చు. అందుకే అందరూ మార్గదర్శకులే. పెద్ద చిన్నా అనీ కూడా ఇందులో ఉండదు. మనలో చైతన్యం ఉంటే, మనం చైతన్యంతో కూడుకుని ఉంటే ఏదో రూపంలో మార్గం లభిస్తూనే ఉంటుంది. మార్గం సరియైనది లభిస్తే ధైర్యం ఉంటుంది. ధైర్యంతో ఈ సమాజంలోని సమస్యలను అధిగమించే శక్తి కలుగుతుంది. అందుకే మూలమైన మార్గదర్శకునితో కలిసి ఉంటే జీవితానికి సంబంధించిన మార్గం పరిపూర్ణంగా లభిస్తుంది.

మన మనో నేత్రాన్ని నిరంతరం చైతన్యం, వెలుగుల వైపు కేంద్రీకరిస్తే నిరంతరం సరియైన మార్గం లభిస్తుంది. సరియైన మార్గం లభించకపోతే ఇబ్బందులు నిరంతరం ఎదురు అవుతూనే ఉంటాయి. మనలోని, విశ్వంలోని మార్గదర్శకునితో మనం కూడుకుని ఉండడానికి నిరంతరం ప్రయత్నం చేస్తూనే ఉండాలి. అదే మనం తెలుసుకోవాల్సిన అసలైన మార్గం.

# బోనాల పండుగ



తెలగాణ పండుగల్ వెలలేని శోభతో
నలరారు నెల్లప్పుడవని యందు!
తెలగాణసంస్కృతి యిలలోన యశమొంది
యందరి హృదయాల విందుగూర్చె!
తెలగాణ వంటకాల్ తేజమ్ము జిలికించి
నోరూరగాజేయు నుర్వి నెపుడు
తెలగాణ సత్కళల్ దివిదాక మార్మ్రోగి
దేదీప్యమై వెల్గె దిశలనెల్ల!

యట్టి తెలగాణ ప్రజలెల్ల నద్భుతముగ
పర్వశోభల మునిగిరి పరవశించి,
ప్రేమ కాంతుల దీపాలు వెలుగ జేసి
నవ్వ వెలయించి నిలిచిరి పువ్వులవలె!!

ఆషాఢమదియన్న నానంద మింపారు
బోనాల పండుగ పూర్ణ శక్తి!
అమ్మకై బోనమ్ము నమ్మలందరు దెచ్చి
యర్పించు పండుగ యమిత భక్తి!
పోతరాజుల హేల పొంగియాడెడు నేల
ఊరేగి సాగంగ నుర్వి రక్తి!
కాంక్షల నీడేర్చి కాపాడుమోయమ్మ
యనిమ్రొక్క ప్రకటించు నవని ముక్తి!

వంట వండిన కుండకు పసుపునద్ది,
పసుపు మీదను కుంకుమ వరుసపేర్చి,
వరుసగా వేపమండలు వరల జేసి
వరలు పైమూత కంచుడిన్ వత్తి జేర్చి
వత్తి వెలిగించి మ్రొక్కిరి బత్తితోడ!!

గోల్కొండ జగదంబ కూర్మితో కరుణించు
బోనమెత్తితిమమ్మ పొంగె మనసు!
లంగరౌజున తొట్లె రంగారు భక్తితో
కట్టి మ్రొక్కితిమమ్మ కాంక్ష దీర్చు!
జిల్కునవ్వుల తల్లి బల్కముపేటను
యెల్లమ్మ దయబ్రోచుమెల్లరకును!
ఒజ్జయై విలసిల్లు నుజ్జయినీకాళి
రంగమెక్కెడు తల్లి రక్షసేయు!



లాలు దర్వాజని యేలెడు సింహ వా
హిని కృప ప్రజకెల్ల హితముగూర్పు!

ఘటము నూరేగజేయుచు సంఘటనము
తోడ సాగెడు భక్తి సంతోషమిలను,
గాంచి కరుణించి తెలగాణ గాచుమెపుడు!
అమ్మ బంగారు మైసమ్మ మమ్ముబ్రోచు!!



పొంగిన భక్తిని బోనాల జాతరన్
గాంచగా కన్నులు మించులొలుకు!
చెర్నకోలను బట్టి చిత్రముగా దూకు
పోతరాజుల జూడ పులకరింత!
ఆ పలారపుబండి అవనిపై కదులంగ
ప్రజలంత కేల్మోడ్చి పరవశించు!
శిగములూగెడు వారు సిత్తరమ్ముగనాడ
కనువిందు గల్గగ కాంతులొలుకు!
గావుబట్టుచు, నిమ్మకాయలు కొరుకుచు
ఆవహించగనమ్మ నవని మురియు!




దప్పు దరువుకునాటలు నొప్పిదముగ
బలులనిచ్చెడు సద్భక్తిపరులు వరల
భక్తి యావేశమొకచోట రక్తిగట్టి,
వెరసి నవరసశోభల వేడ్కగాదె!!

**అవధాని భానుప్రకాశాచార్య**
ఫోన్ : 960 320 4507

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 9 
UGC Care List Approved Journal
హైదరాబాద్ జూలై : 2023

# దారిదీపాలు







దారి పొడుగునా దీపాలు
పచ్చని కాంతిని అందిస్తూ
ఊపిరి దాహాన్ని తీరుస్తాయి
పిట్టల నుండి పెద్దల వరకూ
అందరికీ చల్లని గొడుగులు పడుతూ
ఎల్లకాలం బానిసలా బతుకుతాయి!

సూర్యుడు అగ్గిపూలను విసిరినా
చేతులెత్తి అక్కున చేర్చుకుంటాయి
మేఘాలు సముద్రాన్ని కురిపించినా
కూలిపోక ఓర్పుతో నిలబడుతాయి!

విషాన్ని నరాల్లో దాచుకొని
అమృతహస్తాలను అందిస్తాయి
ఆకాశమంత ఆయుష్షును నింపుతూ
మట్టిగుణాన్ని బోధిస్తాయి!

మట్టి కింది తడిని
చిగురాకు నవ్వుల్లో చూపిస్తాయి
వాడిపోయిన బంధాలను అల్లుకుంటూ
హరిత గీతాన్ని నేర్పిస్తాయి!

రాలిపోయిన జ్ఞాపకాలను
ఆచూకీ లేకుండా ఊడ్చి పారేస్తాయి
మనిషిని ఎవరి గుండెలో నాటినా
మొక్కలా చిగురించాలని నివేదిస్తాయి!

మనిషి మట్టి కావాలి
మనిషి చెట్టు కావాలి
మనిషి గుణాన్ని వదిలేసి
ప్రకృతి గుణాన్ని నింపుకొని
దారి దీపాలై కడదాకా పచ్చని వెలుగునివ్వాలి!

**పుట్టి గిరిధర్**
ఫోన్ : 949496 2080

# తుకారాం అభంగం

జనన మరణమను విచారము
విడవకుంటే లేదిక భాగ్యము
ప్రతి దినము సూర్యోదయము
రాత్రి దాటి రాదా....!

భాగ్యవంతుడవు బహు
బంధనాల దాటి నడువు
బురద తామర నంటనట్లు
రాజయోగి నువ్వు వరలు

శాశ్వత సత్య నిత్య నిధానము
యదలోన వెలుగుతున్నది దీపము
నామజపము అంచుల చోటు
జ్యోతి కాంతి మాటున దాగు

తుకా పాండురంగడి దాసు
పలుకు నీదే సత్యవచనము
శోధించు నీలో నుండే దైవము
అదే నీకు తారణ మంత్రము





**అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్**
ఫోన్ : 83283 33720

# భాగవతం – పఠన సంప్రదాయం

**డా. కాకునూరి సూర్యనారాయణ మూర్తి,** అధ్యాపకులు, తెలుగుశాఖ, బిజెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
హైదరాబాద్, ఫోన్ : 995 860 7789

**పరిచయం**

పారాయణము అంటే ఒకవైపునుంచి మరొకవైపుకు ప్రయాణం చేయడం. అలాగే పఠనం అంటే విషయాన్ని మనస్సు ద్వారా ఆత్మకు చేరవేయడం. భారతీయ సంప్రదాయంలో రామాయణ, భారత, భాగవతాలు నిత్య పారాయణగ్రంథాలు. ఇందులో రామాయణం, వ్యక్తి తన కుటుంబసభ్యులతో ఎలా మసలుకోవాలో వివరిస్తుంది. ఆత్మీయానుబంధాలను ఎలా పెంచుకోవాలో తెలియజేస్తుంది. మహాభారతం, వ్యక్తి సమాజంలో తన బాధ్యతను, అలాగే బంధువు లతో, సన్నిహితులతో కలిసి తనదైన పాత్రను ఎలా నిర్వహించు కోవాలో తెలియజేస్తుంది. ఇక భాగవతం, వ్యక్తి – తన ఆత్మతో ఎలా సన్నిహితత్వం పెంచుకోవాలో బోధిస్తుంది.



1. **రామాయణం : వ్యక్తి – కుటుంబం**
2. **మహాభారతం : వ్యక్తి – సమాజం**
3. **భాగవతం : వ్యక్తి – అంత:కరణం**

**ఊహా ప్రతిపాదన**

పురాణాలను, ఇతిహాసాలను, వేదాలను, శాస్త్రాలను పఠనం చేయడం సంప్రదాయంలో ఉంది. వీటిలో కొన్నింటిని మాత్రమే పారాయణం చేస్తుంటాం. ఈ పారాయణాలలో భాగవత పారాయణ విశేషమైనది. భాగవతాన్ని ఏడురోజులలో పారాయణం చేయాలి. దీనికి సప్తాహవిధి అని పేరు. భాగవతాన్ని అధికమాసం వచ్చినప్పుడు సప్తాహవిధిలో పారాయణ చేస్తే విశేషపుణ్యప్రదం, ముక్తిదాయకం అనే ప్రతిపాదనను పలు పురాణాలు సమర్థించాయి. ఊహా ప్రతిపాదనలో, భాగవత సప్తాహ పారాయణవిధి అంటే ఏమిటి? పారాయణ క్రమం ఎలా ఉంటుంది? ఈ విశేషాలన్నీ ఏ పురాణంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు? సప్తాహం చేస్తే కలిగే ప్రయోజనమేమిటి? మొదలైన ప్రశ్నలతో నిరూపించదలచిన అంశం **భాగవతం – పఠన సంప్రదాయం.**

**భాగవత సప్తాహ మహిమ**

పఠన సంప్రదాయంలో తొలిసారిగా ఈ విధానాన్ని శుకమహర్షి ప్రారంభించాడు. పరీక్షిత్తు మహారాజుకు భాగవతాన్ని వినిపింప చేయటంతో ఈ సంప్రదాయం మొదలైంది. ఒక పరిశీలన ప్రకారం మహాభారత యుద్ధం అనంతరం శ్రీకృష్ణుడు ముప్పదిరెండు సంవత్సరాల తర్వాత దేహ త్యాగం చేశాడు. తదుపరి భాద్రపద శుద్ధ నవమితో ఆరంభమైన పౌర్ణిమ వరకు భాగవత సప్తాహం నిర్వహించారు. ఫలితంగా పరీక్షిత్తు మోక్షాన్ని పొందగలిగాడు.

స్కాందపురాణం వాక్యం అనుసరించి భాగవతాన్ని వినని మనుజుడు జంతువుతో సమానమని శుకమహర్షి నారదుడితో చెప్పినట్లు పురాణ వాక్యం.

పద్మపురాణంలోని కథ భాగవత పారాయణ మాహాత్మ్యాన్ని వివరిస్తుంది. తుంగభద్రా నదీతీరంలో ఆత్మదేవుడు ధుంధులి అనే దంపతులుండేవారు. సంతానం లేని ఆ దంపతులకు ఒక సన్యాసి పండును భర్తకు ఇచ్చి అతని ఇల్లాలికి ఇవ్వమని చెప్పాడు. ఆవిడ ప్రసవవేదనకు భయపడి ఆ పండును ఒక ఆవుకు తినిపించింది. తన సోదరి గర్భిణిగా ఉండటంతో, కొంతకాలం తాను గర్భిణివలె నటించి, సోదరికి పుట్టిన కొడుకును తన కొడుకుగా లోకాన్ని నమ్మించింది. ఆ బిడ్డపేరు దుంధుకారుడు. చిత్రంగా మరొకవైపు పండు తిన్న ఆవు మానవదేహంతో, పొడవైన చెవులతో ఉన్న శిశువుకు జన్మనిచ్చింది. ఆ శిశువుకు గోకర్ణుడు అని పేరు పెట్టారు. ఇద్దరిలో దుంధుకారుడు దుష్టుడై, తల్లిని, తండ్రిని సంహరించి, దొంగగా మారి, చివరకు బలవన్మరణం పొంది ప్రేత అయ్యాడు. మరొకవైపు గోకర్ణుడు పుణ్యాత్ముడై తీర్థయాత్రలు చేస్తున్నాడు. ఒకనాడు దుంధుకారుడు కలలో గోకర్ణునకు కనిపించి, తన వేదన ఎలా పోతుంది అని ప్రశ్నించాడు. దానితో గోకర్ణుడు మార్గాన్వేషణ కోసం సూర్య భగవానునికై తపస్సు చేశాడు. భాగవత సప్తాహమే మార్గమని చెప్పగా గోకర్ణుడు నిర్వహించాడు. దుంధుకారుడికి వైకుంఠ ప్రాప్తి కలిగింది.

నారద మహర్షి అనేక ప్రాంతాలు తిరుగుతూ బృందావనం వెళ్ళాడు. అక్కడ ఒక యువతిని చూచాడు. ఆ యువతి

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 9 8 హైదరాబాద్ జూలై : 2023

# పోతన భాగవతము

(ప్రథమ, ద్వితీయ, తృతీయ స్కంధములు)

మొదటి సంపుటము



తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి

పేరు భక్తి. ఆమెకు ఇద్దరు పిల్లలు. జ్ఞాని, విరాగి. వారిద్దరికీ తీవ్ర అస్వస్థత ఉంది. సత్కర్మ చేస్తే వారికి స్వస్థత చేకూరుతుంది అని తెలుసుకొని నారదుడు ఆనందవనంలో భాగవత సప్తాహాన్ని నిర్వహించాడు. ఫలితంగా భక్తి, జ్ఞాని, విరాగి ఈ ముగ్గరికీ దివ్యదేహాలు లభించా యంటూ గీతాప్రెస్, గోరక్‌పూర్‌వారి శ్రీమద్భాగవత పీఠికలో పారాయణ ఫలితం వివరింపబడి ఉంది.

**సప్తాహ విధి**

భక్తి, జ్ఞానం, వైరాగ్యం, తత్త్వం మరియు మోక్షాలను ప్రసాదించేది భాగవతం. రామాయణం, భారతం రెండూ రెండు కన్నుల వంటివైతే భాగవతం హృదయం వంటిది. శ్రవణంతో పరీక్షిత్తు, కీర్తనంతో శుకుడు, స్మరణ చేత ప్రహ్లాదుడు, పాద సేవనతో లక్ష్మి, పూజతో పృథువు, వందనంతో అక్రూరుడు, ధ్యానంతో ఆంజనేయుడు, తక్ష్యంతో అర్జునుడు వైకుంఠుని అనుగ్రహం పొందగా, ఆత్మ సమర్పణతో బలిచక్రవర్తికి విష్ణువు మోక్షం ప్రసాదించాడు.

భాగవతం వేదమనే కల్పవృక్షం నుండి ఆవిర్భవించింది. భాగవతాన్ని సప్తాహం అంటే 7రోజులలో పూర్తిచేయాలి. అతి భయంకరమైన ప్రేతత్వం కూడా భాగవత శ్రవణంతో దూరమవు తుంది. వెదురు చెట్టులో వాయురూపంలో ఉన్న దుంధుకారుడికి మోక్షం లభించింది. భాగవతాన్ని మొదట బ్రహ్మ నారదుడికి చెప్పగా, నారదుడు వ్యాసుడికి, వ్యాసుడు శుకునకు అందజేశాడు. శుకమహర్షి పరీక్షిత్తుకు ఏడు రోజులలో చెప్పగా విని అతడు లోకబంధనాల నుండి విముక్తుడయ్యాడు. సప్తాహ ప్రక్రియ విధి ఇలా ఏర్పడింది.

**సప్తాహం ఎప్పుడు చేయాలి?**

సప్తాహం చేసే విధానం, భాగవతం వినే శ్రోత, చెప్పే వక్త, వీరి విధులు, నియమాలు అనేకం స్కాంద పురాణం వైష్ణవ ఖండం నాలుగవ అధ్యాయంలో ఉన్నాయి. అలాగే పద్మపురాణం ఉత్తర ఖండంలో **'సప్తాహ పాఠ శ్రవణ విధి కథనం'** అనే పేరిట ఆరవ అధ్యాయంలో సవిస్తరంగా వర్ణింపబడి ఉన్నాయి.

భాగవతాన్ని అధికమాసం వచ్చినప్పుడు తప్పనిసరిగా సప్తాహవిధి లో పారాయణ చేయాలి. అధికమాసం వచ్చినప్పుడు ఆ మాసంలోని శుక్లపక్ష నవమి నాడు ప్రారంభం చేసి పౌర్ణిమనాడు పూర్తిచేయాలి.

**ఏడురోజుల విధులు**

**ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే, పారమహంస్యాం, సంహితాయాం, శ్రీ హయగ్రీవ బ్రహ్మ విద్యాయాం....** అంటూ ప్రతి అధ్యాయం చివరా ఉండటం మనం గమనించాలి. గోదోహన మాత్ర సమయం కూడా ఎక్కడా నిలబడని మహానుభావుడు శుక మహర్షి ద్వంద్వాతీత బ్రహ్మానంద స్థితి పొందినవాడు. ఇది ఆయన వివరించిన భాగవతామృతం. అధికమాసానికి పురుషోత్తమ మాసం అనే పేరు కూడా ఉంది. ముప్పది నెలలకు ఒకసారి జ్యోతిష శాస్త్ర నియమాలకు అనుకూలంగా వచ్చేదే అధికమాసం. ఈ మాసంలో సంక్రమణం ఉండదు. శుభకార్యాలు చేయరాదు. కాని పుణ్యఫలమును పెంచుకునే ఆలయ సందర్శనం, సద్గోష్ఠి, సత్సంగం మరియు సప్తాహాలను ఏర్పాటు చేయాలి. సుందరకాండ, శ్రీ రామాయణం, భాగవతం వీటిని సప్తాహ విధులలో నిర్వహించాలి. వీటిలో భాగవత సప్తాహ నిర్వహణ అధిక పుణ్యదాయకం. చాంద్ర, సౌర మానాలలలో వచ్చే తేడాలను ఇలా ప్రతి రెండున్నర సంవత్సరాలకు ఒకసారి చాంద్రమాన గణనలో జ్యోతిషశాస్త్రం సరిచేస్తుంది. ముప్పదిమూడు సంఖ్యలో అరిసెలను ఈ మాసంలో మహారాష్ట్ర వాసులు తప్పక ఇస్తారు.

**సంకల్పం**

సంసార తాపత్రయాలనుండి (దారేషణ, పుత్రేషణ, ధనేషణ) విముక్తి పొందడం అనేదే సంకల్పం. నవమినాడు ముహూర్తం ఎప్పుడు అనే విషయాన్ని దైవజ్ఞుడు నిర్ణయించాలి. స్థల నిర్దేశం చేసుకోవాలి. ఆలయం ప్రత్యేకం. ఇంటిలో కూడా చేసుకోవచ్చు. కృష్ణ పరమాత్ముడి అర్చామూర్తిని స్థాపించి, పూజ చేసి ఇద్దరు శ్రోతలకు వర్ణి ఇవ్వాలి. వక్త ఉత్తర ముఖంవైపు కూర్చుంటే, శ్రోతలు తూర్పుముఖంగా కూర్చోవాలి. ఇది భాగవత పారాయణ సప్తాహ ప్రత్యేకత.

**వార నియమాలు**

మొదటిరోజు వక్త క్షౌరం చేసుకొని (ఆ పిదప వారం రోజులు నిషిద్ధం)

సూర్యోదయం కన్నా పూర్వమే స్నాన సంధ్యావందనాదులు పూర్తిచేసి, కృష్ణమంత్రాలను పునశ్చరణ (1. జపం 2. తర్పణం 3. మార్జనం 4. హోమం 5. భోజనం) విధిలో ఈ సంకల్పం ఉంటుంది.

**"సంసార సాగరే మగ్నం దీనం మాం కరుణానిధే**
**కర్మ మోహ గృహీతాంగం మాముద్ధర భవర్ణావాత్"**

భాగవతాన్ని వ్యాసపీఠంపై ఉంచి, పూజించాలి. ఇకపైన ఈ గ్రంథమే కృష్ణుడు అని, **'మనోరథో మదీయోయం సఫల: సర్వదా త్రయా నిర్విఘ్నేనైవ కర్తవ్యో దాసోహం తవ కేశవ'** అంటూ సంకల్పం చేయాలి. వక్త కన్నా శ్రోతకు ఈ సప్తాహ విధిలో అధిక ప్రాధాన్యం ఉంటుంది. చెప్పేవారికన్నా వినేవారికే విలువ ఎక్కువ. పద్మపురాణం ప్రకారం శ్రోతలు కనీసం ఐదుగురు ఉండాలి. వారికే వర్ణి ఇచ్చి ద్వాదశాక్షరి మంత్రాన్ని జపం చేయవలసిందిగా నిర్దేశించాలి. **'వరణం పంచ విప్రాణాం కథాభంగ నివృత్తయే – కర్తవ్యంతే హరేర్జాప్యం ద్వాదశాక్షర విద్యయా'.** మధ్యాహ్న వేళలో కథా విధానం రెండు ఘడియల పాటు ఉంటుంది. సూర్యాస్తమయం తర్వాత కథా శ్రవణం చేయరాదు. ఏడురోజులు ఉపవాసం ఉండాలి. ఉపవాసం నాలుగు విధానాలలో ఉంటుంది. నక్తం, ఏకభుక్తం, ఆయాచితం, పూర్ణం. వాయుపురాణం ఈ ఉపవాసం ఎలా చేయాలో వివరిస్తుంది.

**నక్తం హవిష్యాన్నమనోధనం వా ఫలంతిలా: క్షీరమథాంబు చాజ్యం**
**యత్పంచగవ్యం యదివాపి వాయు: ప్రశస్తమత్రోతరముత్తరంచ**

పెసరపప్పు వేసి గంజి వార్చని అన్నానికి హవిష్యమని పేరు. హవిష్యం, పళ్లు, నువ్వులు, పాలు, నీరు, నెయ్యి పంచామృతం, వాయుభక్షణం ... ఇవి ఒకటికన్నా మరొకటి ఉత్తమమైనవి. లేదా ఘృతపక్వం, పయఃపక్వం అనే ధర్మం అనుసరించి, ఉప్పు, కారం, నూనె లేని పదార్థాలు కూడా తీసుకోవచ్చు. శరీర ధర్మాన్ని అనుసరించి ఉప్పుకు బదులు సైంధవ లవణం వాడవచ్చు. సూర్యోదయం మొదలు మూడు యామముల కాలం అంటే ఉదయం ఆరు గంటలనుండి సాయంత్ర ఆరంభ సమయం మూడు గంటల వరకు కథా శ్రవణం చేయాలి. బ్రహ్మచర్యం పాటించాలి. విస్తరాకు/ అరిటాకులో భోజనం, పప్పు, తేనె, నూనె పదార్థాలు తినకపోవడం, పర్యుషితాన్న భోజనం తినకపోవడం కొన్ని నియమాలు.

సత్యం, శౌచం, దయ, మౌనం, వినయం, ఉదారబుద్ధి శ్రోతకు, వక్తకు ఉండవలసిన లక్షణాలు. మెడలో తులసిమాల ధరించాలి. సప్తాహం చివరిరోజు పన్నెండుమంది బ్రాహ్మణులకు వ్రత పరిపూర్ణత్వం లభించేట్లుగా భోజనం ఏర్పాటు చేసి వారికి, భాగవత కథామృతాన్ని అందించిన వక్తకూ వస్త్రాదికాదులతో అలంకరించి, అర్చించి దక్షిణ తాంబూలాదులతో సంతోషపరచి భాగవత కోశాన్ని దానంగా ఇవ్వాలి. లభించిన పుణ్యఫలమంతా శ్రీకృష్ణార్పణమంటూ నిస్వార్థంగా సప్తాహం నిర్వహించాలి.



**నిగమకల్ప తరోర్గలితం ఫలం శుక ముఖాదమృత ద్రవ సంయుతం**
**పిబత భాగవతం రసమాలయం ముహురహో రసికాభువి భావుకాః**

అని శుకమహర్షి వాక్యం

**శ్లోకార్థం, శ్లోకపాదం వా నిత్యం భాగవతం పఠేత్**
**య: పుమాన్ సోపి సంసారాన్ముచ్యతే కిముతాఖిలాత్**

అని సంప్రదాయం చెప్తుంది. ఒకరోజు, రెండురోజులు, మూడు, అయిదు, ఏడు, పది, పదిహేనురోజులు లేదా నెల, నలభైరోజులు (మండలం) ఈ విధంగా పారాయణం చేయవచ్చు. వీటిలో ఉత్తమ మైనది (ఏషోపృత్తుత్తమః పక్షః సప్తాహో బహుసమ్మతః) సప్తాహవిధి. పారాయణ విధానాలు అనేకం వ్యాప్తిలో ఉండగా, ఒక పరంపర ఇక్కడ వర్ణితం. మోక్షప్రాప్తికై, కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగుటకై, ధనం కోసం, రోగవిముక్తి కోసం సంతాన ప్రాప్తికోసం దారిద్ర్య నివారణ కోసం, మనస్త బాధా నివృత్తి కోసం.... ఈ విధంగా ఈనాటి గ్రంథాలలో ఎన్నో కొత్త కొత్త కోణాలను ఆవిష్కరించడం గమనించ వచ్చు. సంప్రదాయంలో ఉన్న పారాయణ విధానం మటుకు ఈ విధంగా ఉంది.

**"ఆదౌ శ్రీ కపిలస్య జన్మ భరతాఖ్యానం ద్వితీయే దినే**
**స్తార్తీయే గజరాజ మోక్షణ కథా తుర్యే హరే రుద్భవ:**
**రుక్మిణ్యా హరణంతు పంచమదినే షష్ఠే కథా యోగినాం**
**మోక్షాప్తి నృపతేశ్చ సప్తమదినే సప్తాహ పాఠక్రమ:"**

**1. మొదటిరోజు కపిలుని జన్మవృత్తాంతం వరకు ప్రథమస్కంధం:**

సూతుడిని శౌనకాదులు ప్రశ్నించడం, భక్తి మాహాత్మ్యం, అవతారములు, వేదవ్యాసుని బాధ, నారద పూర్వజన్మ వృత్తాంతం, అశ్వత్థామ ద్రౌపదీసుతులను సంహరించడం, కృష్ణుడు పరీక్షిత్తును రక్షించుట, భీష్మ నిర్యాణం, కృష్ణుడు ద్వారకకు రాక, పరీక్షిత్తు జన్మ వృత్తాంతం, గాంధారీ ధృతరాష్ట్రుల వనవాసం, ధర్మరాజు చింతించుట, కృష్ణ నిర్యాణ వార్త విని రాజ్యాన్ని పరీక్షిత్తుకు అప్పగించి పోవుట (19 సర్గలు 820 శ్లోకాలు).



**ద్వితీయస్కంధం :** ధ్యాన పద్ధతులు, సూక్ష్మ స్థూల రూపాలను వర్ణించుట భక్తి ప్రాధాన్యం, జగత్తు సృష్టి క్రమం, పరీక్షిత్తు సూతుడిని ప్రశ్నించుట, భాగవత లక్షణాలు (10 సర్గలు, 396 శ్లోకాలు)

**తృతీయ స్కంధం :** ఉద్ధవ విదురుల సమావేశం, విదురుడు మైత్రేయుని వద్దకు పోవడం, విదుర ప్రశ్నలు, బ్రహ్మజననం, దశవిధ సృష్టి, కాల విభాగం, సృష్టి వర్ణన, వరాహావతారం, హిరణ్యాక్ష హిరణ్య కశ్యపుల జన్మ, హిరణ్యాక్ష వధ, దేవహుతి కర్దముల వివాహం, కపిలుని జన్మ వృత్తాంతం. (24వ సర్గ వరకు 1018 శ్లోకాలు)

తృతీయస్కంధంలోని 24వ సర్గవరకు మొదటిరోజు పారాయణం చేయాలి. మొత్తం 2,234 శ్లోకాలు.

**2. రెండవరోజు – జడ భరతుడు జన్మించే కథ వరకు తృతీయస్కంధం (మిగతా భాగం)**

కపిలుడు తన తల్లికి .. భక్తి, సాంఖ్యయోగాలు, మోక్షప్రాప్తి, అష్టాంగ యోగాలు, భక్తి, కాల మహిమ, దేహ మోహంలో పడ్డవాడి స్థితి, జీవుని అవస్థ, భక్తిమార్గం చెప్పుట, దేవహుతి మోక్షప్రాప్తి (25 నుండి 33వ సర్గ వరకు 403 శ్లోకాలు)

**చతుర్థ స్కంధం :** స్వాయంభువ మనువు కథ, శంకర, దక్షుల మధ్య వివాదం, దక్షయజ్ఞం, దక్షవధ, ధ్రువోపాఖ్యానం, అంగరాజ చరిత్ర, వేనుడి కథ, పృథు చరిత్ర, పురంజనోపాఖ్యానం (31 సర్గలు 1,451 శ్లోకాలు)

పంచమస్కంధం ప్రియవ్రతుని కథ, అగ్నీధ్రుని కథ, నాభికథ, ఋషభదేవుని కథ, జడభరతుని కథ వరకు (7వ సర్గవరకు 168 శ్లోకాలు)

రెండవరోజు పారాయణం చేయవలసిన మొత్తం శ్లోకాలు – 2022.

**3. మూడవరోజు – పంచమస్కంధంలోని మిగతా భాగం**

జడభరతుని లేడిజన్మ, బ్రాహ్మణజన్మ, రహూగణునకు జడ భరతుని ఉపదేశం, భూమండల వర్ణన, గంగ వర్ణన, సూర్యరథ గమనం, ఇతర గ్రహాల గమన వర్ణన, శింశుమార చక్రం, అథోలోకాల వర్ణన, నరక లోకవర్ణన (8వ సర్గనుండి 26వ సర్గవరకు 19 సర్గలు)

**షష్ఠ స్కంధం :** అజామీళోపాఖ్యానం, విశ్వరూపుని కథ, నారాయణ కవచం, వృత్రాసుర వధ, చిత్రకేతు కథ, పుంసవన వ్రతం (19 సర్గలు).

**సప్తమ స్కంధం :** జయ విజయుల కథ, హిరణ్య కశ్యపుని తపస్సు, ప్రహ్లాదుని జననం, హిరణ్యకశ్యప సంహారం, వర్ణ ధర్మములు, స్త్రీ, బ్రహ్మచర్య, వానప్రస్థ ధర్మాలు, సన్యాసి ధర్మాలు, గృహస్థ ధర్మాలు (15 సర్గలు).

**అష్టమ స్కంధం :** మన్వంతరాలు, గజేంద్రమోక్ష కథ (2 సర్గలు వరకు 126 శ్లోకాలు). మూడవరోజు పారాయణం చేయవలసిన శ్లోకాలు 2203.

**4. నాలుగవరోజు అష్టమస్కంధంలోని మిగతా సర్గలు**

సముద్ర మథన కథ, మోహినీ అవతారం, మన్వంతరాలు, బలి చక్రవర్తి కథ, వామనావతార కథ, మత్స్యావతార కథ (24 సర్గ వరకు)

**నవమ స్కంధం :** సుకన్య చ్యవనుల కత, అంబరీషుని కథ, మాంధాత సౌభరి, త్రివంఖువు, హరిశ్చంద్రుడు, సగరుడు, గంగావతరనం, రామచరిత్రం, నిమి వంశం, చంద్రవంశం, యయాతి, భరతుడు రంతిదేవుడు, కురు, పాంచాల, మగధరాజ వంశాలు, తుర్వసు, యదు, విదర్భ వంశ చరిత్రలు (24 సర్గలు)

**దశమ స్కంధం (పూర్వార్థం) :** దేవకీ వసుదేవుల వివాహం, శ్రీకృష్ణావతారం (3వ సర్గ వరకు) ఈ నాలుగవ రోజు నాటికి పారాయణం చేయవలసిన భాగం ఇంతవరకు, మొత్తం శ్లోకాలు 1951.

**5. అయిదవ రోజు**

పూతనాది రాక్షస సంహారం, గోపికా గీతలు, గోవర్ధనోద్ధరణం, అక్రూర ఆగమనం, మధురలో కుబ్జను అనుగ్రహించుట, కంస వధ, ఉద్ధవగీతలు, అక్రూరుడు హస్తినకు పోవుట (49 సర్గలు).

**దశమస్కంధం (ఉత్తరార్ధం) :** ద్వారక నిర్మాణం, కాలయవనుడు, రుక్మిణీ కల్యాణం వరకు. దశమస్కంధంలో నాలుగవ సర్గనుండి 57వ సర్గవ వరకు మొత్తం శ్లోకాలు 2,336.

నరకాసుర వధ, ఉష అనిరుద్ధుల వివాహం, బాణాసుర యుద్ధం,

సాంబుని కథ, జరాసంధ వధ, శిశుపాల వధ, ధర్మజుని రాజసూయం పూర్తి, బలరాముడు తీర్థయాత్రకు పోవుట, కుచేలోపాఖ్యానం, వసుదేవునకు బ్రహ్మ జ్ఞానోపదేశం, వేదస్తుతి, భార్గవుడు త్రిమూర్తులను పరీక్షించుట, కృష్ణలీల వర్ణన (58 సర్గ నుండి 90 వరకు మొత్తం శ్లోకాలు 1507.

**ఏకాదశ స్కంధం :** యాదవులకు శాపం, కర్మయోగం, శ్రీమన్నారాయణుని అవతారాలు, పూజావిధానం, అవధూతో పాఖ్యానం, సత్సంగం గొప్పదనం, వర్ణాశ్రమ ధర్మాలు, గుణదోష వ్యవస్థ, సాంఖ్యయోగం, త్రిగుణములు, పురూరవుని వైరాగ్యం, భాగవత ధర్మ నిరూపణం, యాదవుల మరణం, పరమాత్ముడు వైకుంఠానికి పోవుట (31 సర్గలు, శ్లోకాలు 1362) ఆరవరోజు పారాయణం చేయవలసిన మొత్తం శ్లోకాలు 2869.

**7. ఏడవరోజు ద్వాదశ స్కంధం**

కలియుగ రాజవంశాలు, కలియుగ ధర్మాలు, చతుర్విధ ప్రళయాలు, శుకుని ఉపదేశం, పరీక్షిత్తునకు మోక్షం, జనమేజయుని సర్పయాగం, వేదశాఖలు, పురాణ లక్షణం, శ్రీమన్నారాయణుని వర్ణన, భాగవత పారాయణ ఫలం (13 సర్గలు శ్లోకాలు 560).

మొత్తం ఏడురోజులలో 1. 2,234, 2. 2,022, 3. 2,203, 4. 1,951, 5. 2,336, 6. 2,869, 7. 560 – మొత్తం 14,175. చివరగా తిరిగి రుక్మిణీ కల్యాణ ఘట్ట పారాయణం చేయాలి.

**ఫలశ్రుతి**

**"య ఇదం శ్రావయేన్నిత్యం యామం క్షణమనన్యధీ:**
**శ్లోకమేకం తదర్థంవా పాదం పాదార్థమేవవా"**

ఈవిధంగా ప్రతిరోజూ ధ్యానం చేస్తే తప్పకుండా ఆ శ్రీహరి కరుణ కలుగుతుంది. కలిదోషాలను తొలగించే శక్తి భాగవతానికి మాత్రమే ఉంది.

**"యత్ర జ్ఞాన విరాగ భక్తి సపాతం నైష్కర్మ్యమావిష్కృతం**
**తచ్ఛృణ్వన్విపఠన్వి చారణ పరో భక్త్యా విముచ్యేన్నర:"**

జ్ఞానం, వైరాగ్యం, భక్తి వీటన్నిటితో కూడిన నైష్కర్మ్య భావనతో కృష్ణ పరమాత్ముడిని త్రికరణశుద్ధిగా ధ్యానం చేస్తూ భాగవతాన్ని స్మరించినా చాలు లోకబంధనాల నుండి విముక్తి లభిస్తుంది. భగవంతుడు భక్త సులభుడు. షడైశ్వర్య యుక్తుడు. సమస్త ఉపాధుల నుండి ముక్తులై సమస్తము భగవానుడే అనే ఆలోచన భక్తి కృష్ణానుశీలనమైన జీవనం గడపడమే ఉపాయం.

**"యం బ్రహ్మావరుణేంద్ర రుద్ర మరుత: స్తున్వంతి దివ్యైస్తవై:**
**వేదైస్సాంగ పదక్రమోపనిషదైర్గాయంతి యం సామగా:**
**ధ్యానావస్థిత తద్గతేన మనసా పశ్యంతి యం యోగినో**
**యస్యాంతం న విదుస్సురా సురగణా: దేవాయ తస్మై నమ:"**

**ఉపసంహారం**

పఠన సంప్రదాయం అంటే ఏదైనా ఒక గ్రంథాన్ని మనస్సుకు చేరేటట్టు నిష్ఠతో నియమపూర్వకంగా కాల నియతితో పారాయణ చేయటం. పారయతి ఇతి పారాయణం. పారయతి అంటే దాటించునది అని అర్థం. నదిని దాటే సమయంలో ఒకవైపునుంచి మరొక వైపుకు చేరే నిమిత్తమై ప్రతి వ్యక్తికి ఓడ, తెప్ప వంటి సాధనాలు ఎలా అవసరమో, లేదా ఈత నేర్చి ఉండడం అనే నేర్పరితనం ఎంత అవసరమో ఆవిధంగానే సంసారబంధనాలు అనే నదిని దాటే క్రమంలో జీవుడిని ఈ లోకంనుంచి ఆ లోకంవైపు చేర్చే నిమిత్తమై సాధనంగా ఆధ్యాత్మిక గ్రంథం తోడ్పడుతుంది. ఈ గ్రంథ సంచయా లలో భాగవతం పరమోత్తమమైనది. ఆత్మతో అనుబంధాల్ని కలిగించేది కనుకనే పోతనామాత్యుడు తన **"పూర్వజన్మ సుకృతంచేత పూర్వకవులు ఎవరూ భాగవతమును తెనుగు చేయలేదని"** వినయంగా తెలియజేస్తూ భాగవతాన్ని తెనిగించాడు. పఠన సంప్రదాయంలో సంస్కృత భాగవతాన్ని సప్తాహ విధిని అనుసరించి, పారాయణ చేయడం ఆర్ష సంప్రదాయం. నవమిరోజు ప్రారంభం చేసి పౌర్ణిమనాడు ఈ పారాయణకు ఉపసంహారం చెప్పాలి. నేటికాలంలో సంస్కృత భాగవతానికి ధీటుగా పోతన భాగవతాన్ని పారాయణ చేస్తున్నారు.

**"శ్రీకైవల్య పదంబు చేరుటకు...."** అంటూ మోక్షాపేక్షతో భాగవత గ్రంథ రచనకు పోతన శ్రీకారం చుట్టాడు. **"ఓం ఐం హ్రీం క్లీం – మహత్వ కవిత్వ పటుత్వ సంపదల్"** అనే సూక్ష్మ అర్థాలతో భాగవతాన్ని బీజాక్షర యుక్తంగా మనకందించాడు. కనుక పఠన సంప్రదాయంలో సప్తాహవిధిలో పోతన భాగవతాన్ని పారాయణ చేయడం కూడా అంతే ప్రయోజనాన్ని మనకందిస్తుంది. లోక కళ్యాణార్థం, ప్రపంచ శాంతికోసం మనలో సత్త్వ గుణాన్ని పెంపొందింప చేసుకోవడం కోసం పఠన సంప్రదాయాన్ని కొనసాగిద్దాం. అందరి క్షేమాన్ని కోరుదాం.

**ఉపయుక్తగ్రంథ సూచి**

1. శ్రీమద్భాగవతమ్ – వ్యాసమహర్షి
2. శ్రీమదాంధ్ర మహాభాగవతం – బమ్మెర పోతన
3. శ్రీమద్భాగవత సంగ్రహము – గీతాప్రెస్, గోరఖ్‌పూర్
4. శ్రీమద్భాగవతోపన్యాసములు – ఆంధ్ర సారస్వత పరిషత్
5. పద్మ పురాణము

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 9 (12) హైదరాబాద్ జులై : 2023

# పద్యమనోహరం - 43

## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు

వరంగల్, ఫోన్ : 994 901 3448

**క్లోనింగన్న అదేమిటో తెలియగా కోరుంగదా బ్రహ్మయే**
**ప్లానింగన్న అదేమిటో తెలియగా ప్రార్థించునా విష్ణువే**
**హానింగూర్చెడు బాంబు సంగతులనే అర్థించునా శంభుడే**
**జ్ఞానంబంతయు నేర్తునీ మనుజులై జన్మంబులన్ బొందినన్**

ఇదొక చమత్కార భావాన్ని ప్రసారం చేసే పద్యం. కీ.శే. డా. రాళ్ళబండి కవితాప్రసాద్‌గారు మచిలీపట్టణంలో జరిగిన శతావధానంలో ఒక పృచ్ఛకుడు అడిగిన ప్రశ్నకు ఇది పద్యరూప సమాధానం.

ఒకవేళ త్రిమూర్తులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరులు మానవులై పుడితే ఏం చేస్తారో చెప్పండని వర్ణనాంశంగా అడిగితే కవితా ప్రసాద్‌గారు త్రిమూర్తులు మనుషులుగా జన్మిస్తే ఈ ఆధునిక విజ్ఞానశాస్త్ర ఫలితాలైన "క్లోనింగ్" ప్రక్రియను గురించి బ్రహ్మదేవుడు, ప్రభుత్వాలు సిద్ధం చేసుకునే 'ప్లానింగు'లను గురించి శ్రీమహావిష్ణువు, లోకాలను క్షణకాలంలో భస్మీపటలం చేసే 'బాంబు'ల తయారీ విశేషాలను గురించి పరమేశ్వరుడు నేర్చుకునే ప్రయత్నాలు చేస్తారన్న భావంతో ఈ పద్యాన్ని చెప్పి అవధాన ప్రేక్షకులను అలరించారు. అంతేగాక సాహిత్యమన్నది ఆలోచనామృతం గనుక దీన్ని గురించి ఆలోచిస్తే చాలా విశేషాలు అర్థమవుతాయి. అవధాని ప్రతిభ కూడా అబ్బుర పరుస్తుంది.

సాధారణంగా అవధానాల్లో చెప్పే పద్యాల్లో చెప్పుకోతగినంతగా కవిత్వ ప్రతిభ కనిపించదని, పద్యాలు రసహీనంగా ఉంటాయని అనుకుంటుంటారు. అయితే కొంతమంది ప్రతిభావంతులైన అవధానుల విషయంలో మాత్రం అవధాన పద్యాల్లో మెరుపు లుంటాయి. డా. కవితా ప్రసాద్‌గారు చేసిన అవధానాల్లోని పద్యాల్లో గొప్ప భావస్ఫురత, కవిత్వస్ఫూర్తి, శబ్ద సంస్కారం పుష్కలంగా ఉంటాయి. ప్రస్తుత పద్యంలోనూ ఒక చమత్కారం చూడొచ్చు.

బ్రహ్మ సృష్టికర్త. విష్ణువు స్థితికారకుడు, పరమశివుడు లయ కారుడు. వాళ్లు యీ కాలంలో యీ నేలపై జన్మిస్తే వాళ్లు కోరుకునేవి కూడా వారి వారి ప్రవృత్తులకు సంబంధించినవే కావడం విశేషం. బ్రహ్మ తెలుసుకోవాలనుకునేది "క్లోనింగు" అంటే అది సృష్టి సంబంధ మైన వైజ్ఞానిక అంశం కాబట్టి ఆయన దాన్ని తెలుసుకోవాలను కోవడం అర్థవంతం. స్థితికారుడైన వానికి "ప్లానింగ్" ముఖ్యం కావున శ్రీమహావిష్ణువు ప్లానింగ్‌ను గురించి తెలుసుకోవాలను కున్నాడు.



శివుడు లయ కారుడు కనక బాంబు విషయం గురించి ఆలోచిస్తాడు. బాంబులు విధ్వంసహేతువులు కనుక పరమేశ్వరునికి దానిపై జిజ్ఞాస.

ఎవరి తత్త్వానికి అనువైన విషయాన్ని వారు తెలుసుకోవడం గురించి, కోరుకోవడంలోని ఔచిత్యాన్ని జోడించి మంచి స్ఫురణతో ధారాశుద్ధి కలిగిన ఈ అద్భుతమైన పద్యాన్ని వర్ణనాంశంలో చెప్పిన అవధాన విద్యా వాచస్పతి డా. రాళ్ళబండి కవితాప్రసాద్‌గారు లోకం మెచ్చిన కవి.





డా. రాళ్ళబండి కవితాప్రసాద్

బందారం కథలు 19


# ఆమె సుత ఒక తల్లే!

డా. నందిని సిధారెడ్డి, ఫోన్ : 9440 381148

డప్పు చప్పుళ్లకు బందం తోట ప్రతిధ్వనిస్తున్నది. ఊర్లో బండ్లు తయారవుతున్నా చప్పుళ్లతో తోటంతా మారుమోగుతున్నది. ముస్తాదు సరిచేసుకుంటూ మోకుపట్టు గమనించుకొని తాటిచెట్టు మీద నుంచే బందంతోటను కలెచూశాడు కిష్టగౌడు. బందంతోటలకు బంగారు కిరీటం తొడిగినట్టు ఎల్లమ్మ గుడి మెరుస్తున్నది. తెలియని మత్తేదో ఆవహించినట్టు గోరింకలు తాటికమ్మల చుట్టే గిరికీలు కొడుతూ అరుస్తున్నాయి. దరువులేవో వింటున్నట్టు తాటికమ్మలు జుట్టు విరబోసుకొని శిగమూగుతున్నాయి. ఒక్కసారిగా తాకిన గాలిస్పర్శకు చెట్టూ, చెట్టుతోపాటే తనూ ఊగిపోయినట్టనిపించింది కిష్టగౌడుకు. భయపడ్డాడు. మోకుతాడు సరిచూసుకున్నాడు. ఎల్లమ్మకు మొక్కుకున్నాడు. ఎల్లమదేవతకు గుడి కట్టాలని ఎంత తాపత్రయపడ్డాడు. కుల పెద్దలను ఒప్పించెతందుకు ఎంత ప్రయాస పడ్డాడు. వాళ్లు ఒప్పుకున్న తర్వాత ఊరిపెద్దల చుట్టూ ఎన్నిసార్లు తిరిగిండు. మేస్త్రీల దగ్గరికి, ఒగ్గు పూజారుల దగ్గరికి, విగ్రహ శిల్పుల దగ్గరికి ఎల్లగౌడు నేసుకొని అదే జీవితమన్నట్టు తిరిగాడు. తలచుకుంటూ గుడి దిక్కు చూశాడు. కళకళలాడుతుంది వాతావరణం. గుడిరంగులు ఎండకు మెరుస్తున్నాయి. కప్పుమీద కొత్త గూనపెంకలు ఎర్రగా, నల్లగా చూస్తున్నాయి. నిశ్శబ్దంగా ఉండే ప్రాంగణం అలంకరించుకుంటుంటే కిష్టగౌడు మురిపానికి హద్దు లేదు. పడమటి దిక్కు చూపు మళ్లింది. గుంజలు పాతి పందిళ్లు వేసుకుంటున్నారు. జాతరలో వెలియబోతున్న దుకాణాలు, రెండుదిక్కులా అంత పొడవునా బారులు తీరుతున్న దుకాణాలను చూస్తే చిన్నప్పటి హుషారు కలిగింది. కాసేపటికి తాటిచెట్టు మీద ఉన్నానన్న సోయి కలిగేసరికి భయమేసింది. ఉధృతంగా గాలి తాకింది. చెట్టు ఊగింది. కమ్మకోసినా, కల్లు గీసినా రెండు చేతులతో పని చేయాల్సి ఉంటుంది. అట్లా గెలలు కోస్తున్నప్పుడే కదా నాయిన మోకు తెగి పట్టా తప్పి అంతెత్తుమీద నుంచి పడిపోయిండు. నడుము యిరిగింది. అప్పుడే కద తమ కుటుంబం చెయ్యి యిరిగింది. అప్పుడే గదా, తన చదువు మానేసి నాయన బాధ్యతలు తలకెత్తుకున్నది. నాయిన నేసుకోని ఎందరు వైద్యుల దగ్గరికి తిరిగిండు. గప్పుడే ఎల్లమ్మకు గుడి కట్టాలన్నడు. ఎవ్వరు యినలేదు. నాయిన మొత్తుకోని మొత్తుకోని మూలకు వడ్డడు. ముస్తాదు తన మెడకు వడ్డది. రాను రాను కాలం గాకపాయె. వానలు వడకపాయె. కల్లు పారకపాయె. అనంగనంగ గౌడులు గప్పుడు ఒప్పుకునిరి. ఎట్లయితేంది? గిప్పటికైన ఎల్లమ్మ గుడి ఎలిసింది. **"ఊరికి తాళ్లుండాలె. తాళ్లకు గౌళ్ళుండాలె. గౌళ్లకు ఎల్లమ్మ గుడి ఉండాలె"** కిష్టగౌడు కత్తితో పటపటా నాలుగు కమ్మలు కొట్టాడు. చప్పుడు చేసుకుంటూ కింద పడిపోయాయవి. ముస్తాదు సరిచేసుకుంటూ మోకుతాడు జరుపుకుంటూ కిష్టగౌడు కిందికి దిగాడు.

ఎల్లమ్మ గుడి నిర్మాణంతో బందంతోటకు కళ వచ్చింది. అనునిత్యం ప్రమాదంతో జీవించే గౌడులకు కొండంత నమ్మకం వచ్చింది. తాగేవాళ్లతో, తాగి ఊగేవాళ్లతో సందడిగా ఉండే తోటకు మొక్కేవాళ్లు, మొక్కులతో శిగమూగేవాళ్ల సందడి కొత్తగా కలిసి వచ్చింది. కొత్తగా వెలిసిన ఎల్లమ్మ కొలుపులతో బందారం పరవశిస్తుంది.

తాటివనం బాట బండ్లతో హెూరెత్తుతున్నది. బండ్లకు రంగు రంగాడు చీరలు, మామిడి తోరణాలు, బంతిపూల దండలు అలంకరించారు. గీరలకు పసుపు, కుంకుమలతో పుదించారు. ఎడ్ల కొమ్ములకు బంతిపూల దండలు కట్టారు. సమరు రాశారు. గంటలు


డా. నందిని సిధారెడ్డి

కట్టారు. గల్లరగల్లరు మోగుతున్నాయి. పిల్లల హుషారు ఆకాశాన్నంటుతున్నది. బండి నడిపే వాళ్లు పోటీ పడుతున్నారు. ఒకరిని మించి ఒకరు పరిగెత్తిస్తున్నారు. ఎల్లమ్మ గుడి చుట్టూ బండ్లు తిరుగుతుంటే తోట వైభవంగా పులకిస్తున్నది.

**"గుడి ముందట ఆగి పరికిస్తున్న కిష్టగౌడుకి ఎల్లమ్మ కష్టం గుర్తొచ్చింది. భర్త జమదగ్నిని కోల్పోయిన ఎల్లమ్మ దు:ఖం గుర్తొచ్చింది. తల్లిని అనుమానిస్తూ గండ్రగొడ్డలితో వెంటబడిన కొడుకు పరశురాముని ఆవేశం తలపుకొచ్చింది. తప్పించుకుంటూ దాక్కుంటూ పరుగెత్తుతున్న ఎల్లమ్మ దాహం... దాహంతో అలమటిస్తున్న ఎల్లమ్మ... అడిగినా నీళ్లవ్వని అజ్ఞానులు, భయస్తులు, అల్లాడిన ఎల్లమ్మ.... కల్లు దాహం తీర్చిన తన పూర్వీకుడు ఎల్లాగౌడు.... దయ తలచిన ఎల్లమ్మకు వైశాఖ వన పూజలు... వరుసగా కళ్లముందు కదిలాయి. కిష్టగౌడు కళ్లలో మురిపెం. అది వైశాఖవనం. ఇది బందారవనం. ఎల్లమ్మకు గౌడుల రుణం....".**

కిష్టగౌడుతో సహా ఇతర గౌడులు గుడి దగ్గర గుమిగూడి మరుసటిరోజు పనులను చర్చించుకున్నారు.

ఎల్లమ్మ ముడి బియ్యం ఊళ్ళో జోగెత్తుతుంటే ఉత్సాహంగా అనిపించింది

నారాయణకు. దప్పు దరువులంటేనే ఎగిరి గంతేస్తాడు నారాయణ. చదువుసంధ్యలు అంతగా ఒంటబట్టలేదు గానీ నారాయణకు భజనన్నా, భాగోతాలన్నీ, జాతర్లన్నా భలే పిచ్చి. జోగు గుంపులో కలిసి ఊరేగుతున్నాడు.

సన్నటి పొడుగాటి కర్ర. కర్ర కొసన కట్టిన చెక్కబొమ్మ. ఎల్లమ్మ ప్రతీక. పసుపు కుంకుమ బొట్లు. చుట్టూ వేప మండలు కట్టారు. కర్రకు అలంకరించిన జాజు. చుట్టూ డప్పులు కొట్టుకుంటూ లయబద్ధంగా యువకుల నృత్యం. కర్ర కూడా పైకి పైపైకి ఎగురుతుంటే, దరువుకు అనుగుణంగా కదులుతుంటే నారాయణకు చూడ ముచ్చట. జోగుకర్ర, గడమాను ఉత్సవం, ఉత్సాహం.

గౌడపెద్ద ఇంటిముందు జోగుబృందం ఆగింది. బిందెతో నీళ్లు తెచ్చి బృందం పాదాల మీద ధారగా పోశారు. గుగ్గిలం పొగపట్టుకున్న తను మరో ఇద్దరు లోపలికెళ్లారు. ఒడిబియ్యం గంపలో పోసుకొని వచ్చారు. గంప ఎత్తుకున్నాయన, పొగపాత్ర కంచుడు పట్టుకున్నాయన తప్ప మిగతావాళ్లంతా ఆడుతున్నారు. పిల్లలు వాళ్లను వెంబడిస్తూ ఉత్సాహపడుతున్నారు. గంపలో బియ్యం నిండుతున్నాయి. వస్త్రంలో మూట కడుతున్నారు. ఒడిబియ్యం ఇస్తారనుకున్న వాళ్ల ఇండ్లకు వెళ్లి జోగు సేకరిస్తున్నారు. జమిడికెలు పట్టుకున్న ఇద్దరు వాయిద్యకారులొచ్చి ఆ గుంపులో కలిసారు. జమిడికేలు పట్టుకున్న వాళ్లు ఎల్లమ్మ పాట పాడుతున్నారు. వాళ్లట్లా మధ్యాహ్నం దాకా తిరుగుతూనే ఉన్నారు.

మధ్యాహ్నం తర్వాత బోనాలు బయలుదేరాయి. మహిళలు కొందరు అలంకించిన బోనం కుండలు ఎత్తుకున్నారు. కొందరు బోనం సర్వలు ఎత్తుకున్నారు. బోనం పాత్రకు పసుపు కుంకుమలు అందంగా అలంకరించారు. అడుగున సున్నం రాశారు. కంఠాన బంతిపూల దండలు చుట్టారు. బోనం మీద కంచుడు. కంచుట్లో దీపం. గాలికి రెపరెపలాడుతున్నాయి దీపాలు. కొన్ని ఆరిపోతున్నాయి. కొన్ని మళ్లా ముట్టిస్తున్నారు. బోనాల ముందు తమ్మలిబాజా. బాజా మందు మాదిగ డప్పులు, డప్పుల జోష్‌తో దరువేస్తూ నాట్యం చేస్తున్నారు. దరువు వేగానికి బోనమెత్తుకున్న ముసలమ్మకు శిగమొచ్చింది. అడుగులు లయబద్ధంగా కదిలిస్తూ చేతుల్లో వేపకొమ్మలు ఊపుతూ అటూ ఇటూ ఇడుతున్నది. మరొకరికి ఊపొచ్చింది. ఆమె శిగమందుకోగానే మరొకామె. ఇట్లా బోనాలు పెరుగుతున్నాయి. శిగాలు పెరుగుతున్నాయి. వాళ్ల నాట్యానికి ఎండ తలవంచుతున్నది. బోనాలకు బాట బరువెక్కుతున్నది. నారాయణ అటునుంచి ఇటునుంచి అటూ ముందుకూ వెనకకూ ఉరుకుతున్నాడు. మరో ఇద్దరు యువకులు తోడయ్యారు.

ఎల్లమ్మ గుడి చేరువయింది. గుడి సమీపంలో చిన్నవొర్రె. వొర్రె ఇసుకలోకి దిగగానే బోనాలెత్తుకున్న వాళ్ల కాళ్లు చుర్రుమన్నాయి. ఇసుక దాటి ఒడ్డెక్కింది గుంపు. గుడి పక్కన చేదబావి. చేదబొక్కెనతో నీళ్లు చేది గుంపు కాళ్లు తడుపుతున్నారు కొందరు స్త్రీలు.

కడవలతో నీళ్లు తెచ్చి ఎల్లమ్మగుడి ముందు సాకబోశారు కొందరు. అప్పటికే గుడి చుట్టూ చాలామంది గుమిగూడి ఉన్నారు. వాళ్లను జరిపి తోవ చేశారు మస్కూరీలు. బోనాలు ఎత్తుకున్న స్త్రీలు ముందుకొచ్చి బోనాలు దించుతూ వరుసగా అలంకరిస్తున్నారు. శిగమూగుతున్నవాళ్ళు జోరందుకున్నారు. అప్పటికే గుడి ముందు శిగాలూగుతున్నారు కొందరు. వాళ్ల భుజాల మీద చేతులు వేసి చేరిపోయారు వచ్చినవాళ్లు. ఆడా మగా తేడా లేదు. భక్తి ఒక్కటే. శిగమొక్కటే. దరువొక్కటే. నాట్యమొక్కటే. కొలుపంతా ఒక్కటే.

ఒగ్గుపూజారులు గుడిబయట పట్నాలు వేస్తున్నారు. ఎల్లమ్మకు పసుపు బండారి ఇష్టం. ప్రత్యేకంగా తయారు చేసిన కట్టె సొంచల్లో పసుపు నింపి అలుకు నేలమీద బోర్లించారు. మరోసారి కుంకుమ, మరోసారి బియ్యంపిండి, కొంత చేత్తో దిద్దారు. అడ్డంగా, నిలువుగా చూస్తుండగానే అపురూప కళాఖండం తయారైంది. ఒకటి, రెండు, మూడు ఎల్లమ్మ పట్నాలు అదంగా, హుందాగా, మార్మికంగా, ఆకర్షణీయంగా అలంకరించారు. నారాయణ ప్రతీదీ అచ్చెరువుగా పరికిస్తూ బీరిపోతున్నాడు.

ఎల్లమ్మ గుడి ముందటి గోడమీద చిత్రాలు నారాయణను ఆకర్షించాయి. చిక్కటి రంగుల్లో తీర్చినట్లున్నాయి చిత్రాలు. చేతిలో దుష్టుల శిరసులు పట్టుకున్న కాళీమాత చిత్రం, తపస్సు చేసుకొంటున్న జమదగ్ని, గండ్రగొడ్డలి పట్టిన పరశురాముడు, బోనమెత్తిన రేణుక, తాటిచెట్టు ఎక్కుతున్న గౌడు, కల్లు ఒంపుతున్న గౌడు, తాటివనం, పుట్టలోంచి వొచ్చే నాగుపాము.... ఇట్లా చాలా బొమ్మలు సజీవంగా చిత్రించారు. దేవత గుడి గోడమీద తాళ్లు, కల్లు పటువ, పుట్ట ప్రత్యేకంగా అనిపించాయి నారాయణకు.

ఒగ్గుకథ జోరందుకుంది. పెద్దతాళం, పెద్దవొగ్గు, డిల్లెండిల్లెం మోగుతున్నాయి. ఆడవేషం వేసుకున్నాయన కథ ఆర్ద్రంగా చెబుతున్నాడు. మగ వేషంలో ఉన్నవాళ్లు కథకు హుషారెక్కిస్తూ పాడుతున్నారు. నడుమ నడుమ లయ కనుగుణంగా అడుగులు వేస్తున్నప్పుడు వినసొంపుగానే కాదు చూడసొంపుగా సాగుతున్నది.

**"సత్యాన్న బోనమంటే గంటెపట్టి తింపుడుకాదు, మాట చేసిపెట్టుడు గాదు. సామాన్యము గాదు. తండ్రి దగ్గరున్న మాయలు మంత్రాలు దీసింది"** రేణుకకు శంకరుడు చెప్పుతున్నాడు.

**"సత్యాన్నబోనమంటే ఓ రేణుక సచ్చిబతికినట్టు. బిడ్డ ఓ రేణుక అరిచెయ్యి రోటు చేసి ఓ రేణుక వడ్లు దంచాలె బిడ్డ, కనురెప్ప చాట చేసి ఓ రేణుక బియ్యం చెరుగాలె బిడ్డ ఓ రేణుక! చాతిమీద పొయ్యి బెట్టి ఓ రేణుక బోనం వొండాలె బిడ్డ ఓ రేణుక, బోనమెత్తి పోవుతుంటే ఓ రేణుక చెడ్డొళ్లు ఎందరోనె ఓ రేణుక! గాలి దూరి దయ్యమవునె ఓ రేణుక. కనికట్టు పెద్దదమ్మ ఓ రేణుక! ఏమి వొచ్చినగాని, ఏమి జేసినగాని నువ్వు అదరొద్దు, బెదరొద్దు, ముందుకేసిన అడుగు వెనక**

వెయ్యొద్దు... బిడ్డా, రేణుక...."

కష్టాలన్నీ గుదిగుచ్చినట్లు కథ సాగుతున్నది. కొందరు ఆడవాళు కథ వింటూ కండ్లకు నీళ్లు పెట్టుకుంటున్నారు. ముక్కు చీది కొంగు తుడుచుకుంటున్నారు. నారాయణ లీనమై వింటున్నాడు.

గుడి ఎదురుగా పోతరాజు గుడి. అక్కడ జమిడికెలు మోగు తున్నాయి. కథకుడు జమిడిక లోపల చెయ్యి మీటుతూ వర్ణిస్తున్నాడు.

చిన్నచిన్న పాములూ... చిటికెనేలి ఉంగరాలు, జమడికె చప్పుడు.... ఆట.... ఏయ్.... బృందం కేక.

నారాయణ దోస్తులతో బైండ్ల కథ దగ్గరికి ఉరికాడు. అటుపక్క నుంచి దుకాణాలు కనబడ్డాయి. పోదామనుకున్నారు. బారు పట్టారు. పీకెలు ఆకర్షించాయి. కర్రకు పీకెలు పెట్టుకొని అమ్ముతున్నాడు. పక్కన బుగ్గలు. పెద్దపెద్దవి రంగురంగులవి కొనాలనిపించింది. నిక్కరు జేబు చూసుకున్నారు. ముందుకు కదిలారు. బచ్చీస పేర్లు, చిలుకల పేర్లు కనిపించాయి. మెడలో చిలుకల పేరు ఒక్కటొక్కటే తినుకుంటూ వెళ్లుతున్నాడొక పిల్లవాడు. నారాయణకు నవ్వొచ్చింది. గాజుల దుకాణం దగ్గర నిలబడి యువతులు పకపక నవ్వుతున్నారు. ముందు ఎడమపక్క కుంకుమ దుకాణం. పక్కన పేలాలు, పుట్నాలు సోలల్లో నింపి ఉన్నాయి. ముందుకు పోకముందే ప్లాస్టిక్ బొమ్మలు, అమ్మాయి, అబ్బాయి, మోటరు, ఆ పక్క వంటగిన్నెలు, గ్లాసులు, లాయిలప్పలు కిందికి పైకి ఆడుకుంటూ పోతున్నాడు పెద్ద పిల్లవాడు. పిల్లంగోవి కొనుక్కుని వాయించరాక పాటరాక అవస్థ పడుతున్నాడు మరో యువకుడు. కళ్లు లేని మరో అతను పిల్లంగోవి చక్కగా పాడుతున్నాడు. ఆడవాళ్లు కొందరు గిన్నెలు బేరమాడుతున్నారు. వెళ్లి పోతున్నవాళ్లను పిలుస్తున్నాడు మరో దుకాణదారు. చివరిదాగా వెళ్లి వెనుదిరిగారు నారాయణ దోస్తులు.

పొద్దు పూర్తిగా వంగినా ఎండ తీవ్రంగానే ఉంది. తీరంలో తీర్థాన్ని పట్టించుకుంటారు గానీ ఎండనెవరు పట్టించుకుంటారు? ఎవరూ లెక్కచేయటం లేదు. ఎవరి హడావుడి వారిది. ఎవరి భక్తి వారిది. ఎవరి ఆనందం వారిది. ఎల్లమ్మగుడి ముందు మనుషులు విరగబడి ఉన్నారు. జరుగుతున్నది చూడటానికి వీలుకానంత క్రిక్కిరిసి ఉన్నారు.

ఇంకా నైవేద్యం సమర్పించలేదు గనక ఆసక్తిగా గుడిలోపలికి చూస్తున్నారు. అటో ఇటో నారాయణ సందు చేసుకొని చొరబడ్డాడు. గౌడులంతా అరుగుమీద ఉత్సాహంగా ఉన్నారు. లోపల విగ్రహ ప్రతిష్ఠ పూజలు పరాకాష్టకు చేరుకున్నాయి. ఎల్లమ్మ నిలువెత్తు పెద్ద విగ్రహం కూచొని ఉన్న విగ్రహం, పట్టుచీరకు వేసిన రంగులు, తీర్చిన ఛాయలు చిత్రకళా నైపుణ్యాన్ని చాటుతున్నాయి. శాస్త్రీయ చిత్రకళకు జానపద చిత్రకళ ఏమీ తీసిపోదు. శిల్పకళ మరింత ప్రత్యేకం. ఒకచేతిలో కత్తి, కత్తి కొనన నిమ్మకాయ. ఒక చేత త్రిశూలం, మరొకచేత ఢమరుకం, ఇంకొక చేత బంగారు పాత్ర, అందాల చుక్కల రవికె. కంఠంలో మామిడికాయ హారం, గుండ్రటి



ముఖం. బంగారువర్ణం. తలమీద ఆరుపడగల నాగసర్పం. పడగలు విప్పి ఛత్రం పట్టిన వైభవం.

పూజారి, విగ్రహశిల్పులు, కిష్టగౌడు గర్భగుడిలో సేవలందిస్తు న్నారు. ఎల్లమకు ముక్కుపుడక అలంకరణ ప్రకటించాడు పూజారి. బంగారు ముక్కుపుడక తీసి పూజారి చేతికిచ్చాడు కిష్టగౌడు. ప్రధానశిల్పి సహకారంతో ఎల్లమ్మతల్లికి ముక్కుపుడక అలంకరించారు.

ఒగ్గుకథ ఆపారు. బైండ్లకథ ఆపారు. పట్నాలు వేసినవాళ్లు బోనాలు తెచ్చినవాళ్లు అందరూ దీక్షగా చూస్తున్నారు. ఒక్కసారి ఎల్లమ్మ జయధ్వానాలు చేశారు. చేతులు జోడించి స్త్రీలు కొందరు పదే పదే మొక్కుతున్నారు.

గౌడుల ప్రాణాలన్నీ ఎల్లమ మీదే నిలిపి సేవిస్తున్నారు. విగ్రహ ప్రతిష్ఠలో చివరి ఘట్టం. చిత్రకన్ను అలంకరణ. హెచ్చరిక చేశారు. చిత్రకన్ను అలంకరించేటప్పుడు ఎల్లమ్మ దృష్టికి ఎదురుగా ఎవరూ ఉండకూడదు. పిల్లలు, పెద్దలు, స్త్రీలు, పురుషులు ఎవరూ ఎదురు రాకూడదు. ఎవరు ఎదురుగా ఉన్నా **'చెట్టూ, పుట్టా, మనిషి, ఊరు ఎవరు ఎదురు నిల్చినా భగ్గున మండుతారు. కాలిపోతారు. అందుకే కాలిపోకుండా రక్షణకోసం ఎదురుగా పోతరాజు గుడి నిర్మిస్తారు.'** మస్కూరీలు జాగ్రత్త పడుతున్నారు. తొంగి చూడకుండా కాపలా కాస్తున్నారు. మళ్లీ హెచ్చరిక గట్టిగా వినిపించింది. అటు అక్క ఎల్లమ్మ, ఇటు తమ్ముడు పోతరాజు. నారాయణకు చూడాలనిపించింది. భయపడి వెనుకకు తగ్గాడు. క్షణం.. నిమిషం.. ఐదు నిమిషాలు. పిల్లవాడెవరో ఎదురు ఉరికొచ్చాడు. పెద్ద మస్కూరీ గుంజి అవతలి మందిలోంచి బయటకు తోసేశాడు.

చిత్రకన్ను అలంకరణ. మరోసారి హెచ్చరిక. అందరిలో భయం. ఏది కాలిపోతుందోనని భయం. అంతలో ఆసక్తి, మరో నిముషం ఎవరూ లేరని నిర్ధారించుకున్నాంక వెండితో రూపొందించిన కండ్లు క్షణంలో అలంకరించారు. అంతే, అదే సమయానికి నారాయణ ఉత్సుకత ఆపుకోలేక ఎదురొచ్చాడు.

పూజారి చెయ్యి తీశాడు. ఎల్లమ్మ కన్ను తెరిచింది. నారాయణ కూలి పడిపోయాడు.

# నా కవనాలు

నా కవనాలు లోకానికి కిరణాలు
బానిసవర్గానికి ఆశాజ్యోతులు
కార్మిక లోకపు ఆర్తనాదాలు
యువశక్తికి ప్రగతిమార్గాలు

నా కవనాలు దగాపడ్డ జనాల ఆత్మఘోషలు
చేయూతనిచ్చి ముందుకి నడిపే
పెళపెళమని గర్జించే మేఘపు ఉరుములు

నా కవనాలు సామాన్యుడి చెమటచుక్క అనే సువాసనలు
అవే సామాన్యుడి ఆకలికేకలు
కసితో రగిలే వాడి బతుకుపోరాటాలు
వాకికి స్ఫూర్తిని ఇచ్చే బ్రతుకు పాఠాలు

నా కవనాలు ఆ సముద్రి ఆగ్రహావేశాలు
కెరటాల సమూహాలు
తుఫాను కలయికలు
ఆ సాగర సంభాషణలు
సాగర గర్భ రహస్యాలు




నా కవనాలు అరిషడ్వర్గాల ప్రస్తావనలు
వాటినుంచి బయటపడడానికి మార్గాలు

నా కవనాలు నిను మేల్కొలిపే విజ్ఞాన వీచికలు
నీ జీవితానికి లక్ష్యాన్ని చూపే మార్గదర్శకాలు

నా కవనాలు మలయ మారుతాలు
ప్రణయగీతాలు, ప్రేమపాఠాలు

నా కవనాలు ప్రకృతి ఒడిలో నిదురోయే జోలపాటలు
హృదయాంతరాలలోని
అగాధాల కావ్యరూపాలు

నా కవనాలు ఆ అనంతుని
పాదసేవలో తరించే పుష్పాలు
ఆ అనంతుని కృపా కటాక్షాలు



**ఆర్. నవజీవన్ రెడ్డి**
ఫోన్ : 9742 377 332

"ఇంత జెప్పినా ఈ పిల్లలు గిట్లెందుకు చేస్తరు. చావు కొని తెచ్చుకుంటరు. ఆ పిలగాన్ని గుంజేసినంకనన్న ఈ పిలగానికి భయముండాలె. పాపం! పుణ్యానికి పోతే పాపం ఎదురైనట్టు. పిలగాడు జచ్చె, పానం పాయె."

"చెట్టో పుట్టో కాలిపోవు నడుమల పిలగాడు పాయె"

"అయ్యో ఎవల బిడ్డో... తల్లి గిటాంకల యాదున్నదో – సూడుండ్రి" తలా ఒక మాట అంటున్నారు. ఒక ముసలమ్మ ముందుకొచ్చింది.

చూస్తే ఏమొస్తదుల్లా. ఏదో ఓటి చెయ్యాలె. ఏ తల్లిదైనా దు:ఖమే గద" తేరిపార చూసి "బడెకోలు ఎల్లవ్వ కొడుకున్నట్టున్నడు" అన్నది.

మస్కూరతను నారాయణను పక్కకు తెచ్చాడు. కదిపి చూశాడు. కదలలేదు. ముసలమ్మ ముక్కు దగ్గర చెయ్యి పెట్టి శ్వాసచూసింది.

"మొస ఉన్నది. దడిగట్టకుండ్రి. జర గాలి ఆడనీ...." మస్కూరీ ఆ గుంపును దూరం జరిపాడు. ఒకామె కొంగుతో గాలి విసిరింది. ఎవరో నీళ్లు తెచ్చి ముఖం మీద చల్లారు. ఒగ్గుపూజారి బండారి తెచ్చి నొసలుకు రాశాడు. కిష్టగౌడు చెవిలో ఒక ఆకు చెప్పాడు. కిష్టగౌడు వెళ్లి ఆకు తెచ్చి నలిచి పసరు ముక్కులో పిండాడు.

నారాయణ కళ్లు తెరిచాడు. కదలాడు.

"ఎల్లవ్వ తల్లి మహిమ"

"ఎంత కోపమో అంత చల్లని చూపు ఆమెది"

ఆమే అవస్థలు పడ్డదే గద. కష్టం సుఖం తెలిసిన తల్లి. ఎట్ల కష్టపెడుతది"

"ఎంతయినా ఆమె సుత ఒగ తల్లే గద"

ఎవరికి వాళ్లు మాట్లాడుతున్నారు. కొద్దిసేపట్లో వాతావరణం మామూలైంది. ఎల్లమ్మకు నైవేద్యం పెట్టారు. ఒడిబియ్యం సమర్పించారు. నాగవెల్లి లగ్గం జానపద పద్ధతిలో వైభవంగా జరిపించారు. వాయనాలైనా, వైభవాలైనా... **'మనిషికెన్నో దేవతకన్ని'.**

# మనం మరచిపోయిన మహావిద్యాలయం

**పేపకాయల ప్రసాద్,** ఫోన్ : 9490712976

అది క్రీ.శ.646. యుద్ధ క్షేత్రంలో విజయోత్సాహంతో ఉన్నాడు తూర్పు చాళుక్య జయసింహ వల్లభుడు. ఆ విజయ స్కంధావారము నుండే గుద్దవాది విషయము (కోనసీమ జిల్లా-రామచంద్రపురం ప్రాంతం)లోని దళియవాయి (తుల్యభాగ నది) తీరస్థమైన పులొంబూరు (పొలమూరు - తూర్పు గోదావరి) గ్రామాన్ని పూర్వ అగ్రహారికులైన శివశర్మ కుమారుడు రుద్రశర్మకు పునర్దత్తం చేస్తూ శాసనమిచ్చాడతడు. దానగ్రహీత రుద్రశర్మ కంతేరువాడి విషయంలోని అసనపురం నివాసి.

మరి కొంతకాలం తర్వాత, ఇదే గుద్దవాది విషయంలోని పట్టివాడ భూమిని అసనపుర నగర వాసియైన వైదిక ధర్మావలంబి ధ్రువశర్మకు (క్రీ.శ.678లో) ధారపోసి ఇచ్చాడు తూర్పు చాళుక్య రెండవ విష్ణువర్ధన (విషమసిద్ధి) మహారాజు. వీరు చేసిన ఈ దానాల్లో ప్రసక్తమైన **"అసనపురం"** సాధారణ గ్రామం కాదు. చరిత్ర - సంస్కృతి పట్ల సరైన స్పృహ, ప్రేమ లేని మన తెలుగువారు మరచిపోయిన ఎన్నో గొప్ప ప్రదేశాల్లో అసనపురం ఒకటి.

పరస్పరం భిన్నమైన ధర్మాలు బలంగా ఢీకొట్టుకొనే అవకాశమున్న పరిసరాల్లో వెలసినప్పటికీ ఏ విధమైన తగవులు లేకుండా శతాబ్దాల కాలం వెలుగులు ప్రసరింపజేసిన ఓ మహా విద్యాసంస్థ గతాన్ని, గోదావరి జిల్లాలను క్రీ.శ.7వ శతాబ్ది నాటికి విద్యానందనంగా నిలిపిన రాజకీయ పరిస్థితులు, తదితర అంశాలను గూర్చి తెలియ చెప్పడమే ఈ వ్యాసం ఉద్దేశం.

పొలమూరు అగ్రహార స్వీకర్త , పట్టెవాడ భూదాన గ్రహీత కూడ "అసనపుర నగర" వాస్తవ్యులుగా ఆయా శాసనాల్లో చెప్పబడ్డారు.

చాళుక్య జయసింహ వల్లభుడు (క్రీ.శ. 642 - 673) వేయించిన 6 శాసనాలలోను, అతడి తరువాత రాజైన రెండవ విష్ణువర్ధనుడు లేదా విషమసిద్ధి (క్రీ.శ.673-682 ) వేయించిన ఒక శాసనం లోను, 12 వ శతాబ్దం చివరిలో 3వ కులోత్తుంగుని కాలపు ద్రాక్షారామ ఆలయ శాసనంలోను "అసనపురం" ప్రస్తావన ఉంది. దక్షిణ భారతదేశంలో ఇస్లాం మతస్థుల దాడులు మొదలైన 14 వ శతాబ్దానికి పూర్వం వరకు నామావశిష్టంగానైనా ఈ విద్యాపీఠం ఉ ండి ఉంటుంది.

క్రీ.శ. 646 నుంచి క్రీ.శ.1180-90ల మధ్య శాసనాలలో పేర్కొనబడిన అసనపురం **"ప్రాచీన ఘటికాస్థానం".** వైదిక ధర్మాభిమానులైన విష్ణుకుండిన ప్రభువులచే స్థాపించబడి, పోషించ



బడిన విద్యాసంస్థ. 12వ శతాబ్దం వరకు దక్షిణ భారతదేశంలో వైదిక విద్యావ్యాప్తికి తోడ్పడి, కాలగర్భంలో కలిసిపోయిన విద్యాసంస్థలు ఘటికలు.

ప్రాచీన భారతీయ ధర్మానికి మూలకందములైన వేద వేదాంగము లలో పారంగతులు, వివిధాగమవేదులు, శాస్త్ర విశారదులు, పురాణేతిహాస బ్రహ్మలు, కవి వరేణ్యులు, యజన యాజనాది కర్మ దీక్షా పరులు, అధ్యయన అధ్యాపన తత్పరులు, తత్త్వ చింతకులు తదితరులు ఘటికాస్థానములలో సభ్యులై, ఆచార్యులై ఉండేవారు . ఇందలి విద్యా బోధకులను సూచించిన **"ఘటశాసి / ఘదెశాసి"** (ఘటికను శాసించేవాడని వాచ్యార్థం కలిగిన ఈ మాటకి **'శాస్త్రి వర్యుడు'** అనే అర్థాన్ని సూచించారు వేటూరి ప్రభాకరశాస్త్రి) అనే పదవిని గూర్చి మల్లికార్జున పండితుడి కాలం నుంచి 16వ శతాబ్దం వరకు వెలువడిన సాహిత్యంలో ప్రయోగాలున్నాయి.

వందల మంది విద్యార్థులు - వైదిక, లౌకిక వాఙ్మయాలను, శాస్త్ర విజ్ఞానాన్ని అభ్యసించడానికి తగిన వసతులు ఉచితంగానే కల్పించి, వేద శాస్త్రాలలో నిష్ణాతులైన పండితులను అధ్యాపకులుగా నియమించి, వారి అధ్యయనానికి అవసరమైన గ్రంథాలను సమకూర్చి, వాటిని భద్రపరిచి, నిర్వహించేందుకు **"సరస్వతీ భండారికుల** (Librarians)**"** ను కూడ ఏర్పాటు చేసి - ఈ మొత్తం వ్యవస్థను పోషించేందుకు అగ్రహారాలను, ఫలవంతమైన భూములను ఆనాటి రాజులే కాక సంపన్నులు, రాజోద్యోగులు కూడ దానమిచ్చే వారని క్రీ.శ.1100 నాటి **"నాగాయి (హైదరాబాద్ ఆర్షశాఖ) శాసనం"** ద్వారా తెలుస్తోంది. (ఆంధ్రుల సాంఘిక చరిత్ర - పుట 4).



ఈ శాసనాన్ని బట్టి అసనపురం ఘటికాస్థానం కూడ 'నాగాయి' లాగే ఉండి ఉంటుందని పరిశోధకులు శ్రీ వడ్డాది శ్రీ రామచంద్ర మూర్తి (భారతి : 1952 ఏప్రిల్) ఊహించారు. దండి కృతమైన దశకుమార చరిత్రను తెలుగులో రాసిన కేతన ఇంటిపేరు **'మూలఘటిక'**. క్రీ.శ.1200 – 1280 మధ్య జీవించిన కేతన పూర్వీకులు వేంగి దేశం వారే. కేతన వేంగిలోని వెంటిరాల గ్రామాధికారి. వీరికి ఇంటిపేరుగా మారిన మూలఘటిక, అప్పటి తెలుగునేల పై వెలసిన ఇతర ఘటికాస్థానాలన్నిటి కంటే ఉన్నతమై వేంగి రాజ్యంలో వెలుగొందిన అసనపురమే అయి ఉండాలి. అయితే కేతన ఇంటిపేరులోను, ఘటశాసి వంటి కావ్య ప్రయోగాల వల్లనే తప్ప అసనపురం ప్రసక్తి సాహిత్యంలో ప్రత్యక్షంగా ఉన్నదా అంటే అనుమానమే!

ఘటికలు కేవలం కవి పండితులకు మాత్రమే కాక సాధారణ పౌరులకు కూడ ప్రవేశం కల్పించేవి. అయితే ఆ రోజుల్లో ద్విజులు కాని వారికి ఘటికలలో ప్రవేశమే తప్ప విద్యాభ్యాసార్హత లేదనేది వాస్తవం. అప్పటి సమాజంలో విద్యావంతులైన ద్విజేతరుల సంఖ్య స్వల్పమే. వైదిక విద్యా గోష్ఠులు నిర్వహిస్తూ, శిష్యులకు – వేదం, తర్కం, న్యాయం, మీమాంస, ధనుర్వేదం, గాంధర్వం, అర్థ శాస్త్రం మొదలైన శాస్త్రాలు బోధిస్తూ, ధర్మ ప్రచారం చేస్తూ ఆధ్యాత్మిక జీవనం గడిపే మహనీయులకు ఈ ఘటికలు నిలువరములైనవని పరిశోధకులు తెలిపారు.

పురాతత్త్వ నిపుణులు E.Hultzsch 'ఘటిక' కు కళాశాల అనే అర్థాన్నిచ్చారు. ఘటికా స్థానాలు ఇప్పటి స్వయం ప్రతిపత్తి కలిగిన విశ్వవిద్యాలయాలు, Residential Colleges లాంటివి. ఘటికలు పెద్ద పెద్ద ఆలయాలను చేరి, వాటికి అనుబంధంగా ఉండేవని చెబుతారు. ఘటికాస్థాన సభాధ్యక్షుడిని "కులపతి" (వైస్ ఛాన్సలర్) అనుకోవచ్చు.

దక్షిణ భారతదేశంలో 3,4 శతాబ్దాల నాటికే ఘటికలు ఏర్పడ్డాయి. తెలుగునాట ఘటిక ఏర్పాటైన అసనపురం నగర ప్రస్తావన చాళుక్య జయసింహ వల్లభుడి పులొంబూరు (పొలమూరు) శాసనంలో కనిపిస్తుంది. చాళుక్యులకు పూర్వం ఈ ప్రాంతాన్ని పాలించిన విష్ణుకుండిన ఇంద్రభట్టారక వర్మ **"యథావిధి వినిర్యాపిత ఘటికావాప్త పుణ్య సంచయుడు"**గా చిక్కుళ్ళ తామ్ర శాసనం (క్రీ.శ. 537)లో చెప్పబడ్డాడు. ఇతడి పాలన కాలంలో ఎన్నో ఘటికలు ఏర్పాటై – వేద పండితులకు ఆశ్రయము, వేద విద్యకు ప్రోత్సాహము లభించాయని శాసనాధారాలున్నాయి.

33 ఏళ్ల తన పాలన కాలంలో మొదటి జయసింహవల్లభ చాళుక్య ప్రభువు అగ్రహార, భూదానాలెన్నో అసనపురం నుంచే చేసాడు. ఈ రాజు వేయించిన నిడుపర్రు శాసనంలో దానగ్రహీత యొక్క తాత మండశర్మ **"ఘటికా సామాన్యుడు"** గా చెప్పబడ్డాడు. ఘటికలో ఆచార్య స్థానాన్ని అధిష్ఠించినవాడే ఘటికా సామాన్యుడని పండితులు నిర్ధారించారు. చతుర్దశ విద్యలలో ఆరితేరిన విద్యార్థులకు, విద్యాపీఠము (ఘటిక) లలో పండిత పరీక్ష (Viva) నిర్వహించి, విజేతలైన విద్యార్థులకు జయపత్రం (డిగ్రీ) అందించే వారనటానికి సాహిత్యాధారాలున్నాయి. (ఆంధ్రుల సాంఘిక చరిత్ర–పుట 157)

ప్రౌఢ దేవరాయల రాజభవన చతుశ్శాలికలోనో, పేరోలగంలోనో డిండిమ భట్టారకుడికి – శ్రీనాథ మహాకవికి మధ్య విద్యాది విషయాలలో జరిగిన వాద వివాదాలకు న్యాయనిర్ణేతగా మాధ్యస్థం చేసిన చంద్రభూష క్రియాశక్తి రాయల వంటి ఉద్దండులను, తర్కం పై 70 వ్యాఖ్యానాలు వల్లె వేసిన గుప్తశర్మ వంటి కూలంకష ప్రజ్ఞాశాలులను, క్రమ, జట, ఘన మొదలైన పాఠ పద్ధతులలో పేరొందిన విద్వన్మూర్తులను, ఆనాటి పంచాయతీ సభ అనే వ్యవస్థలో సభాపతిగా వ్యవహరించిన మేటి ప్రాడ్వివాకుల (Judges) ను, సంఘజీవనాన్ని ధర్మమార్గంలో నడిపించడానికి యత్నించిన ధర్మమూర్తులను, మానవ జీవనమూల్యాలను కావ్యామృతంగా అందించిన కవి శ్రేష్ఠులను ఎందరినో ఇలాంటి ఘటికలు 12వ శతాబ్దానికి పూర్వమున్న తెలుగు సమాజానికి అందించి ఉంటాయి.

తమిళనాట ఇలాంటి సభలే **"సంగ రాజము"** లనే పేరుతో ప్రసిద్ధమై, ఆనాటి కవిపండితుల కృతులను, తత్పూర్వ తమిళ సమాజంలోని సాహిత్య రూపాలను భద్రపరచి, తమిళ భాషా సాహిత్యాల ప్రాచీనతను నిలుపుకున్నాయని, ఆ స్పృహ లేని ఆంధ్రులు మాత్రం నన్నయకి పూర్వమున్న కవుల రచనలను నిర్లక్ష్యం చేసారనే అభిప్రాయం విజ్ఞులలో బలంగా ఉంది. సరస్వతీ భండారికులను పోషించారన్నది నిజమే కావచ్చు కాని, బి.ఎస్.ఎల్. హనుమంతరావు గారు చెప్పినట్లు, అరుదుగా గ్రంథస్థం చేసిన వాటిని చదవటం కంటే గురుముఖతః విని వల్లె వేయడమే ఎక్కువగా ఉన్న విద్యావిధానం కాబట్టి ఆనాటి విజ్ఞానంలో చాలాభాగం నశించి పోయింది.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 9 (19) హైదరాబాద్ జూలై : 2023

**"అపార శబ్దశాస్త్రపారగులైన వైయాకరణులు, భారత రామాయణా ద్యనేక పురాణ ప్రవీణులైన పౌరాణికులు, మృదుమధుర రసభావ భాసుర నవార్థ వచనరచనా విశారదులయిన మహాకవులు, వివిధ తర్క విహిత సమస్త శాస్త్రసాగర గరీయః ప్రతిభులైన తార్కికులు ... ఆదిగా గల విద్వజ్జనంబులు పరివేష్టించి కొలుచుచుండ విద్యావిలాస గోష్ఠీ సుఖోపవిష్టుండయి"** రాజరాజ నరేంద్రుడున్నాడన్న నన్నయ గారి వర్ణన (ఆంధ్ర మహాభారతం: 1-8) ఆనాటి కవి సమాజమును స్ఫురణకు తెస్తుందని పరిశోధకులు భావించారు. సురవరం ప్రతాపరెడ్డి గారన్నట్లు ఘటికాస్థానములే ఆనాటి కవి సమాజములుగా వర్ధిల్లాయి.

అసనపురం ఉనికిని నిర్ధారించే విషయమై 4 దశాబ్దాల కిందట ఆనాటి మేటి సాహిత్య పత్రికయైన భారతిలో వాదాలు నడిచాయి. అసనపురం – గుంటూరు జిల్లాలో ఉందని భావరాజు వెంకట కృష్ణారావు; పెద్దాపురం పరిసరాల్లో ఉండి ఉంటుందని మల్లంపల్లి సోమశేఖర శర్మ భావించారు. విష్ణు కుండినులు, తూర్పు చాళుక్యుల నుంచి పొలమూరును దానంగా పొందినవారు ఒకే కుటుంబం లోని వ్యక్తులు కావడం , వారు అసనపుర వాసులే కావడం మూలాన పొలమూరుకు సమీపంలోనే ఉన్న ద్రాక్షారామం పరిసరాల్లో అసనపురం ఉంటుందని చాగంటి శేషయ్య, రాళ్ళబండి సుబ్బారావు అభిప్రాయపడ్డారు. బహుశః వీరి దృష్టిలో అసనపురం అంటే ద్రాక్షారామం పక్కనే ఉన్న **"హసన బాద"** గ్రామం కావచ్చు.

**"హసనబాద"** గ్రామానికి పూర్వనామం ఎడఋపల్లి కావచ్చని అంటారు పరిశోధకులు. క్రీ.శ. 4 లేదా 5 శతాబ్దాల ఆరంభంలో ఎపుడో కాంచీపురం నుంచి పాలించిన ముక్కంటి కాడ్వెట్టి (త్రిలోచన పల్లవ) చక్రవర్తి దక్షిణ దిగ్విజయ యాత్ర సందర్భంలో శాస్త్రవిదులకు ఎడఋపల్లి దివ్యక్షేత్రాన్ని దానమిచ్చాడు. క్రీ.శ 1179లో అదే గ్రామాన్ని అగ్రహారంగా పునర్దత్తం చేసాడు బేత కంఠిక విజయాదిత్య చాళుక్య వంశానికి చెందిన సర్వలోకాశ్రయ విష్ణువర్ధన మహారాజు. శాసనంలో చెప్పబడిన సరిహద్దుల ఆధారంగా ఇప్పటి హసనబాద గ్రామమే ఎడఋపల్లి అని నిరూపించారు శ్రీ ముసునూరి సాంబశివ రామమూర్తి. (భారతి, జనవరి 1968). ద్రాక్షారామం కంటే ముందే శ్రీ భీమేశ్వర స్వామి దివ్యక్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన ఎడఋపల్లి అగ్రహారాన్ని వేదశాస్త్ర పారంగతులైన బ్రాహ్మణులకు విద్యావ్యాప్తి నిమిత్తం దానం చేయటాన్ని బట్టి ద్రాక్షారామం సమీపంలో వైదిక విద్యావ్యాప్తికి కృషి జరిగిందన్నది నిజం. క్రీ.శ.12వ శతాబ్దం చివరిలో హసనబాద గ్రామం ఎడఋపల్లి గా పిలువబడింది.

క్రీ.శ. 646 నుంచి క్రీ.శ. 1180 – 90 ల మధ్య శాసనాలలో పేర్కొనబడినది అసనపురం. హీనార్థాన్ని స్ఫురింపజేసే ఎడఋ శబ్దం తో పిలువబడటాన్ని బట్టి పూర్వ వైభవాన్ని కోల్పోయిన అసనపురమే



– కాలక్రమాన ఎడఋపల్లి గా మారి, ఆ పై పూర్వనామానికి చివర బాద చేరి ఉంటుందేమో అనిపిస్తుంది. కాని హసనబాద గ్రామమే అసనపురం అనటానికి, ఆ గ్రామ ప్రాచీనతను చాటే చిహ్నాలు ఇతర ఆధారాలు లేవని చరిత్ర పరిశోధకులు శ్రీ కొల్లూరు సూర్యనారాయణ పరిశోధకుల వాదాలను త్రోసి పుచ్చారు.

మహాభారతంలో రాజరాజును ప్రశంసిస్తూ నన్నయ రాసిన **"రాజమహేంద్ర కవి సమాజ సురక్ష్మాజ"** అనే మాటలలోని **'రాజమహేంద్ర కవి సమాజము'**నకు అసనపుర ఘటిక అనేదే అర్థమని సారంగు లక్ష్మీనరసింహారావు చెప్పగా, ఘటికల స్వరూపమును గూర్చి లభిస్తున్న సమాచారం ఆధారంగా చరిత్ర విద్యాధర తురగా కృష్ణమూర్తి అసనపురమును రాజమహేంద్రవరం గా నిరూపించే ప్రయత్నం చేసారు. కాని అసనపురం – కంతేరువాడి పరిధిలోని గ్రామం అనే శాసన ప్రస్తావనను బట్టి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో గుంటుపల్లి గుహల సమీపంలోని **"అసన్నగూడెం ఆనాటి అసనపురమని"** ఎస్.ఎస్. రామచంద్రమూర్తి (2004) నిర్ధారించారు.

క్రీ.పూ. నుండి జైనం, బౌద్ధం విలసిల్లిన ప్రాంతంలోనే వెలసినప్పటికీ ఆయా మతాలతో సంఘర్షణ లేకుండా... శతాబ్దాల కాలం గోదావరి జిల్లాల్లో హైందవ ధర్మ వ్యాప్తికి ఆనాటి ఆలయాలతో పాటు కృషి చేసిన అసనపుర మూలఘటిక అనే ఓ మహా విద్యాసంస్థ ఆనవాలు కూడ మిగలకుండా కాలగర్భంలో నిశ్శబ్దంగా ఒదిగిపోయింది!



## సాధన పంచకమ్

**ఏకాంతే సుఖమాస్యతాం పరతరే చేత స్సమాధీయతాం**
**పూర్ణాత్మా సుసమీక్ష్యతాం జగదిదం తద్బాధితం దృశ్యతామ్।**
**ప్రాక్కర్మ ప్రవిలాప్యతాం చితిబలా న్నాప్యుత్తరైః శ్లిష్యతాం**
**ప్రారబ్ధం త్విహ భుజ్యతాం అథ పరబ్రహ్మాత్మనా స్థీయతామ్॥**

**తాత్పర్యం :** 1. ఏకాంతంలో సుఖంగా ఉండవలెను. 2. పరబ్రహ్మమునందు మనస్సును చక్కగా నిలుపవలెను. 3. పూర్ణాత్మను బాగుగా దర్శించవలెను. 4. బ్రహ్మానుభూతిలో ప్రపంచమును మిథ్యగా చూడవలెను. 5. సంచితకర్మలు చక్కగా విలీనం చేయబడవలెను. 6. జ్ఞానశక్తి చేత ఆగామికర్మ నుండి విడిపోవలెను. 7. ఈ లోకంలో ప్రారబ్ధ కర్మను పూర్తిగా అనుభవింపవలెను. 8. అటుమీదట పరబ్రహ్మ స్వరూపంగా భాసింపవలెను.

**వివరణ**

**5. ప్రాక్కర్మ ప్రవిలాప్యతామ్ –**

సంచిత కర్మలు చక్కగా విలీనం చేయబడవలెను. ప్రాక్కర్మ లంటే సంచిత కర్మ. ఇంతకుముందే అనేక జన్మలలో కూడబెట్టిన కర్మనే సంచిత కర్మ అంటారు. ఇందులోని కొంతభాగం ఈ జన్మతో అనుభవించడానికే కేటాయించబడిన దానిని ప్రారబ్ధ కర్మ అంటారు. ప్రారబ్ధాన్ని అనుభవిస్తూ ప్రస్తుతం చేసే కర్మలను ఆగామి అంటారు. ఇది రాబోవు జన్మలకై నిల్వగా చేరుతుంది. ప్రారబ్ధాన్ని చక్కగా అనుభవిస్తూ ఆగామి, సంచితకర్మలు లేకుండా చేసుకొన్నప్పుడే మనిషికి మోక్షం సిద్ధిస్తుంది. ఇది నియమం. పుణ్యకర్మలను ఆచరిస్తూ, జ్ఞాన సాధన చేసినచో సంచితం లేకుండా పోతుంది. నిద్రనుండి మేల్కొన్న తర్వాత స్వప్నంలో కలిగిన బాధలు లేకుండా పోయినట్లు జ్ఞానం కలిగితే సంచితం నశిస్తుంది.

**అహంబ్రహ్మేతి విజ్ఞానాత్ కల్పకోటి శతార్జితమ్।**
**సంచితం విలయం యాతి ప్రబోధాత్ స్వప్న కర్మవత్॥**

(వివేక చూడామణి 448)

(నిద్రనుండి మేల్కొన్న మీదట స్వప్నగతములైన కర్మలు అంతరించి పోయిన విధంగా 'నేను బ్రహ్మమును' అన్న జ్ఞానమ కలిగినంతనే శతకోటి కల్పముల నుండి కూడబెట్టిన (సంచిత) కర్మలు అన్నియును అంతరించిపోవును)

**6. చితిబలా న్నాప్యుత్తరైః శ్లిష్యతామ్ –**

జ్ఞానశక్తి చేత ఆగామికర్మల నుండి విడిపోవలెను.. గుణాగుణేషు వర్తంతే – ప్రకృతిలోని గుణములే గుణములయందు వర్తించుట వలన కర్మలు జరుగుచున్నవి. నేను కర్తను కాను భోక్తను కాను. **"కనెడువాడవు నీవె కనుట నీవే హరి! కమలనయన! వినెడు వాడవు నీవె వినిపించునది నీవె వినుట నీవే కృష్ణ! విశ్వవంద్య!!"** అని నిరహంకార భావంతో భగవంతుని ప్రార్థిస్తూ కర్మలు చేసిన యెడల కర్తృత్వం ఉండదు. కనుక భోక్తృత్వం కూడా ఉండదు. ఈ విధంగా జ్ఞానభావంతో కర్మలు ఆచరించి ఆగామికర్మలనుండి దూరంగా విడివడవలెను.


**స్వమ సంగముదాసీనం పరిజ్ఞాయ నభో యథా ।**
**న శ్లిష్యతే యతిః కించిత్ కదాచిద్భావి కర్మభిః॥**

(వివేక చూడామణి 450)

(ఆకాశము వలె తనను సంగరహితునిగా, ఉదాసీనునిగా (అనుభవ పూర్వకంగా) తెలిసికొన్న యతీశ్వరుడు రాబోవునట్టి యే ఆగామికర్మ చేతను ఎంత మాత్రమును లిప్తుడు కాడు.)

## సత్సంగం





### దర్శనం

ఏ దర్శనమైనా ఏదో ఒక పదార్థానికి సంబంధించినదే అవుతుంది. అంటే, దర్శించే వాడంటూ ఒకడున్నాడని దాని అర్థం. దర్శింపబడదే దానికి, దర్శించేవాని కంటె ఎక్కువ విలువేమీ లేదు. ఏదైనా దర్శన మయిందంటే, అది మాయమవటం కూడా సంభవమే. మనోదర్శనం నిత్యం కాదు. శివుడు నిత్యుడు.

దర్శనానికి ద్రష్ట ఉండాలి కదా. ఏ ద్రష్టా, ఆత్మ లేదని అనలేదు. చైతన్యంగా, ఆత్మలేని సమయమంటూ ఏదీ లేదు. చైతన్యానికి భిన్నంగా ద్రష్ట కూడా ఉండలేదు. ఈ చైతన్యమే నిత్యమైనది. అభిన్నమైనది. ద్రష్ట తనని తాను చూచుకోలేడు. తనని తాను తన కళ్ళతో చూసుకోలేనంత మాత్రాన తాను లేనని ఎవడైనా అనగలడా? అంటే, అపరోక్షానుభూతి అంటే చూడటం కాదు, ఉండటం.

ఉనికే సాక్షాత్కారం. అందువల్ల 'నేను – శివుడు'. శివునికి భిన్నంగా ఏదీ లేదు. అన్నీ శివునిలోనే ఉన్నాయి. శివుని వల్లనే ఉన్నాయి. అందువల్ల, "ఎవరిని నేను" అని విచారించు. లోపలికి ప్రయాణం చేసి, అక్కడ ఆత్మనిష్ఠ చెందు. అదే, శివునిగా ఉనికి. ఆయనకి సంబంధించిన మనోదర్శనాలు కావాలని కోరుకోక, నువ్వు చూచే ఈ పదార్థాలకీ ఆ శివునికీ తేడా ఏమిటి? ఆయనే కార్యమూ, కారణమూను. శివుడు లేకుండా నీవు లేవు. శివుడు ఎప్పుడూ సాక్షాత్కారమయే ఉన్నాడు. ఇప్పుడు, ఇక్కడ కూడా! ఆయనని గ్రహించలేదని నీవు తప్పుగా భావిస్తున్నావు. ఈ భావమే అవరోధం. ఆ భావాన్ని విడిచిపెట్టు.

# భారతీయీకరణ - 13

## ఆంగ్ల మూలం : బలరాజ్ మధోక్, అనువాదం : కోవెల సంపత్కుమార

బలరాజ్ మధోక్ దేశశాంతి సమైక్యతలను పరిరక్షించడానికి భారతీయ ప్రజల ఆలోచనలను భారతీయీకరించవలసిన అవసరాన్ని చెబుతూ ఇంగ్లీష్ లో వ్రాసిన Indianness కు అనువాదం ఈ భారతీయీకరణ. భారతీయీకరణ అంటే అన్ని రకాల దీపాసనా మార్గాలను స్థలాలను సమానంగా గౌరవించడం. ఒక వ్యక్తి తాను ఏ కుల, మత, భాషావర్గాలకు చెందినవాడైన వాటి ప్రయోజనాలన్నిటి కన్నా దేశ ప్రయోజనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ప్రధానమన్న అభిప్రాయాలు బలరాజ్ మధోక్ ఆలోచనల్లో కనిపిస్తాయి.

రాజకీయ వ్యవస్థలో జాతీయ భావన స్వరూపాన్ని, భారతీయీకరణ విషయంలో జరుగుతున్న చర్చలు, వ్రాసిన వ్యాసాలు, లేఖలు వాదోపవాదాలు ఈ గ్రంథ రచనకు బలరాజ్ మధోక్‌ను ప్రేరేపించాయి. భారతీయీకరణను గురించి ఒక జాతీయ భావన గల మేధావి ఆలోచనల ప్రతిబింబం భారతీయీకరణ. 1970లో వచ్చిన ఈ రచనను సంపత్కుమార తర్వాత కాలంలో సుమారు 80లకు ముందే అనువదించిందంటారు.

భారతదేశం భౌగోళిక స్వరూపం, జాతీయత - భారతీయత మధ్య గల తేడా, భారతీయీకరణ అంటే ఏమిటి? ఎందుకు? దానివల్ల ప్రయోజనమేమిటి? అది జరగవలసిన తీరు ఏమిటి? అన్న విషయాలను యథామూలంగా సంపత్కుమార అందించారు. అనువాదకుడిగానూ జాతీయభావనా చైతన్యం, దేశీయ ఆలోచనా విధానం వ్యక్తమయ్యే రచనను ఎన్నుకోవడం ఆయన దేశీయ నిబద్ధతను చెబుతుంది.

ఇస్లాం రావడానికి ముందు భారతదేశంలో వివిధమయిన ఉపాసన మార్గాలు ఇరుగుపొరుగులు సహజీవనం నెరపినాయి. వాటికి వేరువేరు దేవతలూ, గురువులూ ఉండేవారు. ఆచారాలు, పూజాస్థానాలు ఉండేవి. ఆత్మ, పరమాత్మ, ప్రకృతి మొదలయిన మౌలికాంశాలలోనూ, ముక్తి సంపాదక మార్గాల విషయంలోనూ, మరణానంతర జీవ ప్రవృత్తి భావనలోనూ ఆ మార్గాలు విభేదిస్తూ ఉండేవి కూడా. ఇతర మతాల వారిపై తమ ఆధిక్యాన్ని నిరూపించడానికీ, వారిని జయించడానికీ మతవాదాల- శాస్త్రార్థాల ద్వారా అవి ప్రయత్నిస్తూ ఉండేవి. ఈ శాస్త్రార్థాల సందర్భంలో అప్పుడప్పుడు ఆయా మతాచార్యుల మధ్య అత్యంత తీవ్రతలు గూడా కలిగేవి. అయినా గూడా భావస్వేచ్ఛ మాదిరిగానే, ప్రతివ్యక్తికీ తన మార్గాన్ని తాననుసరించడానికీ తన భావనననుసరించి అందరికీ ఒక్కడే అయిన భగవంతుని చేరుకొనడానికీ, తన కిష్టమయిన రీతిలో పూజలు చేయడానికీ, తనకిష్టమయిన భాషలో ప్రార్థనలు చేయడానికీ సంపూర్ణ స్వేచ్ఛ ఉండేదన్న విషయం విశ్వప్రసిద్ధమే. ఇదే అన్ని మతాల, మార్గాల విషయంలో సర్వధర్మ సమభావమన్న భారతీయ భావనకు మూలం. వినాకరించు మార్గంలో సాగే "సెక్యులరిజం" కన్నా, స్వీకరించు మార్గంలో ఈ భావన ఎంతో ముందుకు సాగిపోయింది.

యూరోపులో సాంస్కృతిక పునరుత్థానం తరువాత, ప్రభుత్వం మీద చర్చి యొక్క ప్రాబల్యాన్నీ, మతాన్నీ, రాజకీయాలనూ కలగలుపు చేయడాన్ని అక్కడి మేధావి వర్గం వ్యతిరేకించడం ప్రారంభించినప్పటి నుంచి "సెక్యులరిజం" అన్నమాట వ్యవహారంలోకి వచ్చింది. సెక్యులరిజం అన్న పదం "secular" అన్న పదం నుంచి నిష్పన్న





మయింది. **"కన్‌సైజ్ ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ ఆఫ్ కరెంట్ ఇంగ్లీష్"** "concise oxford dictionary of current English"ను అనుసరించి సెక్యులర్- అన్న పదానికి : concerned with the affairs of the world, worldly, not sacred,not monastic, not ecclesiastical, Temporal, profine lay (ప్రాపంచిక విషయాలకు సంబంధించినది, ప్రాపంచికమయినది, మత, దేవాదులకు అంకితము కానట్టి, సాధు సన్యాసులకు సంబంధించనట్టి, చర్చికి సంబంధించనట్టి, అశాశ్వతమయిన, లౌకికమయిన, పడి ఉండు) అని అర్థాలు. అందువల్ల సెక్యులరిజం- లౌకిక విధానం- అన్నది, థియోక్రసీ- theocracy (మత ప్రధాన రాజరిక విధానం)కి వ్యతిరేక రూపంలో వచ్చింది. క్రైస్తవ ప్రపంచంలో 16వ శతాబ్దం దాకా థియోక్రసీ యొక్క ప్రాబల్యం ఉండేది.

చర్చికి లొంగిపోక స్వతంత్రంగా వ్యవహరిస్తూ, ఇతర మతాల వారి పై ఆంక్షలను తొలగించి, వారితో పౌరసత్వం విషయంలోనూ, ఓటు విషయంలోనూ, పోషణ విషయంలోనూ మిగిలిన వారితో

సమాన స్థాయిలో వ్యవహరించే రాజ్యం, థియోక్రాటిక్ రాజ్యానికి భిన్నంగా, సెక్యులర్ స్టేట్ – లౌకిక రాజ్యంగా పరిగణింపబడుతుంది. అయితే, ఈ విధమయిన రాజ్యం మతాన్ని కించపరచడం గానీ, వైయక్తిక– సామాజిక జీవితంలో మతం నిర్వహించే పాత్రను వ్యతిరేకించడంగానీ చేయగూడదు. ఇట్లాంటి రాజ్యం ఒక "రాజ్య మతం" అంటూ కలిగి ఉండకూడదనేదేమీలేదు. కాని ఆ రాజ్యం, లేదా పాలకుని మతం, ఇతర మతాలకు చెందిన పౌరుల యొక్క పౌరహక్కుల మీద మతంమీద మాత్రం దాడి చేయగూడదు.

ఇతర మతస్తులన్న పేరిట, థియోక్రాటిక్ రాజ్యాల్లో మాదిరిగా కాకుండా, పౌరులందరి విషయంలో మత విశ్వాసాల ఈ స్వేచ్ఛను, అందరితో సమానత్వాన్ని ఇది అంగీకరిస్తుంది.

థియోక్రాటిక్ రాజ్యం ఒక సెక్యులర్ – లౌకికరాజ్యంగా మారడంలో బ్రిటన్ ఒక చక్కని ఉదాహరణ. 18వ శతాబ్దం ప్రారంభం దాకా ఆంగ్లిక్ చర్చినీ, ఆంగ్లికన్ ఉపాసనా విధానాన్నీ వ్యాపింపజేయడం, ఆ మహత్ కార్యంలో సహకరించడమే తన విధిగా బ్రిటన్ భావించింది. 1860 దాక గూడా రోమన్ కాథలిక్కులకు కేంబ్రిడ్జి, ఆక్స్ఫర్డ్ విశ్వవిద్యాలయాలలో ప్రవేశార్హత గూడా నిరాకరించబడింది. కానీ తార్కికత, ఆధునికత దినదినం పెరిగిపోతున్న కారణంగా బ్రిటిష్ పాలకులూ చర్చి నాయకులూ తమ ప్రభావ, ప్రవృత్తుల పరిధులను పునర్ వ్యవస్థీకరించుకొన్నారు. ఈనాడు బ్రిటన్ లౌకిక రాజ్యం అంటే, అది తన పౌరులలో మతప్రాతిపదికగా ఏ విధమయిన తేడాలనూ అంగీకరించదని అర్థం. కాని చర్చి యొక్క ప్రాధాన్యం ఇప్పటికీ సాగుతూనే ఉన్నది. రాజ్యప్రభువు రాజు కావచ్చు, రాణి కావచ్చు. దానికే సంబంధించిన వారు కావడం ఇప్పటికీ సాగుతూనే ఉన్నది. ప్రభుత్వ సమావేశాలన్నీ ఆంగ్లికన్ ప్రార్థనల తోటే ప్రారంభమవుతాయి. రోమన్ కాథలిక్కులు, ఇంకా ఇతర ఉపాసనా మార్గాలకు చెందిన బ్రిటన్‌లోని అధిక సంఖ్యాక ప్రజలూ ఈ ఆంగ్లికన్ చర్చి ప్రాధాన్యాన్ని మౌనంగానే అంగీకరించినారు.

ఇతర లౌకిక రాజ్యాలలో గూడా ఇంతే జరుగుతున్నది. యు.ఎ.ఆర్, నేపాల్, బర్మాదేశాలు క్రమంగా ఇస్లాం, హిందూ, బౌద్ధదేశాలు. కానీ ఆయా దేశాలు ఇస్లాం, హిందూ, బౌద్ధ విశ్వాసాలకు చెందని తమ ప్రజలకు మిగిలినవారికీ మధ్య ఏవిధమయిన అసమానతలను అంగీకరించని కారణంగా, అవి అలౌకిక రాజ్యాలుగా పరిగణింపబడుతున్నాయి.

ఇట్లాంటి లౌకికత్వం మతప్రసక్తి లేనిదేమీ కాదు. అయితే, కమ్యూనిస్టు దేశాలు గానీ, కమ్యూనిస్టు పక్షాలుగానీ లౌకిక విధానాన్ని గూర్చి అతి తీవ్రమయిన దృక్పథం కలిగి ఉన్నాయి. వాటి దృష్ట్యా, రాజ్యానికి ఒక మతం అంటూ ఉండగూడదు, పైగా, ప్రజలు మతాన్ని పూర్తిగా త్యజించే విధానాన్ని అతి కలుషితం చేయడం కూడా అవసరం. ఈ విధమయిన లౌకికరాజ్య భావన మతరాహిత్య సిద్ధాంతానికి సమానం. ఈ దృష్టితో లౌకికత్వం అంటే, సెక్యులరిజం అంటే– మత విహీనంగా, అపవిత్రంగా ఉండడం.

"సర్వధర్మసమభావ"మన్న భారతీయ భావన లౌకిక విధానాన్ని గూర్చిన ఈ రెండు అభిప్రాయాల కన్నా ఉదాత్తమయినది. అది మత రాహిత్యాన్నిగానీ, లేక ఏదో ఓకే ఒక ఉపాసనా మార్గ ప్రాధాన్యాన్ని గానీ సమర్థించదు. అన్ని ఉపాసనా మార్గాలనూ, అన్ని మతాలనూ ఉదాత్తంగా, సమస్థాయికంగానే అది భావిస్తుంది. అంతే కాదు, అన్నిమతాల, ఉపాసనా మార్గాల వారిని గూడా ఇతర మతాలవారి విశ్వాసాలనూ, ఉపాసనా మార్గాలనూ, పుణ్యక్షేత్రాలనూ తమ వాటితో సమానంగా గౌరవించవలెననీ, వాటిపై శ్రద్ధ చూపవలెనని గూడా నియమిస్తుంది. అందువల్ల ఈ సర్వధర్మ సమభావనను అందరూ అవలంబించినంతవరకూ మతతత్వ సమస్యగానీ, విభిన్న మతవర్గాల మధ్య హింసాత్మక సంఘర్షణల సమస్యగానీ సహజంగానే ఉండేది కాదు. ఈ దేశంలో యుగాల తరబడిగా శైవం, బౌద్ధం, జైనం, సిక్కు, బ్రహ్మ(సమాజ)మతం మొదలయిన అనేకోపాసనామార్గాలు ఏవిధంగా కలిసి మెలిసి వృద్ధి పొందినా యన్నదాన్ని ఈ అంశం స్పష్టీకరిస్తుంది. ఈ మతాలు మాత్రమేకాదు, ప్రపంచంలోని స్వమత దురభిమానం గల ప్రాంతాలనుంచి నిరాశ్రయులై వచ్చి ఈ దేశంలో మొదట ప్రవేశించినప్పుడు సిరియన్ క్రైస్తవులకూ, యూదులకూ, ఫారసీలకూ తగిన స్థానం ఈ దేశంలో కల్పించబడింది. ఇక్కడి వారితోబాటు వారికి హక్కులు ఉపాసనా స్వేచ్ఛ గూడా సమంగా ఇవ్వబడినాయి.

ఈనాడున్న రూపంలో మతతత్వ సమస్య భారతదేశానికి ఇస్లాం ఇచ్చిన కానుక. ఇస్లాం ఒక ఏకాండ (monolithic) మతం. ఆదినుంచీ ఆది రాజకీయాలతో సమ్మిశ్రితమయి ఉన్నది. మదీనాలో తన ఉనికిని స్థిరం చేసుకున్న తరువాత, మహమ్మదు ప్రవక్త తన అనుయాయులందరికీ ఐహిక– ఆముష్మిక విషయాలు రెంటిలోనూ అధినాయకుడే అయినాడు. ఇస్లాంకు "ఇమాం" మరియు "ఖలీఫా" గా కూడా ఏకకాలంలో వ్యవహరించినాడు. ఇది ఇస్లాం యొక్క మత రాజ్యతత్వానికి ఆరంభ కేంద్రం.

ఇతర మతానుయాయులపై అసహనం, వారిపై ఇస్లాం మతాన్ని అవసరమయితే కత్తిని గూడా ఉపయోగించి– బలవంతంగా రుద్దడం ఇస్లాంను గూర్చిన చారిత్రక సత్యమనేది, సత్యం మీద ఏమాత్రం అభిమానమున్న వాడయినా, నిరాకరించని విషయం. భారతదేశం లోని ఇస్లాం మతానుయాయులలో అధిక సంఖ్యాకులు "సున్నీ" ముస్లింలు "షియా"లు "అహమ్మదీ"యులు అల్పసంఖ్యాకులు. సున్నీ ముస్లింలకు ఇతర ముస్లిం వర్గాలపై ఉన్న అసహనం సుప్రసిద్ధమే. కర్బలాలో ఇమాం హుస్సేన్‌ను చంపడం మొదలుకొని 1969లో షియాలపై లక్నోలో సున్నీలు సాగించిన హత్యా, దహనకాండలు

చూచినా, ఇస్లాం రాజ్యమయిన పాకిస్తాన్‌లో అహ్మదీయులకు విరుద్ధంగా సున్నీలు 1954లో జరిపిన అహ్మదీయ వ్యతిరేక దౌర్జన్య కాండలూ, ఆటవిక చర్యలు గమనించినా, వారికి కేవలం ముస్లిమేతర మతాల మీద మాత్రమే అసహనం కాదనీ, స్వమతంలోని అన్య వర్గాలవారి విషయంలోనూ తీవ్రమైన అసహనం ఉన్నదని నిరూపించడానికి కావలసినంత సాక్ష్యం లభిస్తుంది.

ఇస్లాం చరిత్ర ప్రత్యేకంగా సున్నీల చరిత్ర భారతదేశంలో మొదలయినప్పటి నుంచీ మతతత్వ సమస్య సాగివస్తూనే ఉన్నది. ఈజిప్ట్, ఇరాన్‌ల మాదిరిగా భారతదేశం కూడా ఇస్లాంకు పూర్తిగా లొంగిపోయి ఉంటే, ఈ సమస్య మరొక రూపం దాల్చి ఉండేది. కాని, భారతదేశం ఇస్లాంకు కొరకరాని కొయ్య అయిపోయింది. ఇస్లాం ప్రవక్త మరణానంతరం ఉత్తర ఆఫ్రికా, పశ్చిమాసియాలోని అనేక ప్రాంతాలలో ముస్లిం అరబ్బుల ఆక్రమణకు యాబయి సంవత్సరాల కాలం పట్టగా, ఆఫ్ఘనిస్తాన్‌లోని కాబూల్, జబాల్ హిందూ రాజ్యాలను కబళించడానికి మూడు వందల సంవత్సరాల కాలం పట్టింది. ఆ తరువాత ఢిల్లీ చేరడానికి మరో రెండు వందల సంవత్సరాల కాలం పట్టింది. ఉత్తర, మధ్య భారతదేశంలోని పలు విస్తృత ప్రాంతాలలో అనేక ముస్లిం పాలకులు శతాబ్దాల తరబడి పాలన సాగించినా గూడా, భారతదేశాన్ని ఇస్లామీయ దేశంగా మార్చడానికి ఘనిష్ట యత్నాలు ఎన్నో చేసిన గూడా, భారతదేశం తన సాంఘిక సాంస్కృతిక ప్రత్యేకతను నిలబెట్టుకోవడంలో సఫల మయింది. మౌలానా హాలీ మాటలలో చెప్పితే–

**"వహ్ దిన్ ఎ ఇజాకీ కా బేబాక్ బేడా**
**కియే పార్ కిస్నే సాతో సముందర్,**
**న జైహు మె అటకా, నా సేహుమె అటకా,**
**డుబా దహనా మె గంగా కే ఆకర్"**

ఇస్లాం అనే ఓడ సప్త సముద్రాలను నిరాటంకంగా, సురక్షితంగా దాటుతూ, మొత్తం ప్రపంచాన్ని జయించి, చివరకు గంగానదీ వేణికల మధ్య మునిగిపోయింది.

ఇది జీవన విధానంలోనూ, భావనలోనూ రెండు విభిన్న మార్గాల మధ్య బహుకాలంగా జరుగుతున్న సంఘర్షణ. అయితే, ఇస్లాంను చాలావరకు మానవీకరించి, భారతీయీకరించిన గౌరవం భారతదేశానికే దక్కుతుంది. ముస్లింలలో నుంచి మలిక్ మహమ్మద్ జాయసీ, రహీం వంటి సూఫీలూ, అక్బర్, దారా షికోహ్ వంటి రాజనీతివేత్తలూ, పరిపాలకులూ ముందుకు రావడం సర్వ ధర్మ సమభావమనే భారతీయాదర్శం యొక్క విజయానికి ప్రకాశవంతమైన చిహ్నం లేదా ఘజినీ మహమ్మదు, ఫిరోజ్ తుగ్లక్, ఔరంగజేబు వంటి వారి దుర్మార్గానుసరణకు ఘోరమైన పరాజయ చిహ్నం.

ఈ విధంగా ఒకవైపు ఇస్లాం యొక్క భారతీయీకరణ విధానం సాగుతూ ఉండగా, మరోవైపు ఇస్లాం యొక్క కరుడుగట్టినతనం, దురభిమానం దీన్ని మధ్య మధ్య నిరోధిస్తూనే ఉన్నది. మొగల్ చక్రవర్తులలో మహోన్నతుడయిన అక్బర్ ఇస్లాంను జాతీయీకరించ దానికి ప్రయత్నిస్తూ ఉండగా, ముల్లాలు ఆ ప్రయత్నాలను భగ్నం చేసే పనులు సాగించేవారు. హల్దీఘాట్‌లో యుద్ధం జరుగుతున్నప్పుడు ఒక ముస్లిం యోధుడు ముల్లా బదాయూనీని ఇట్లా అడిగినారు– **"రాణా ప్రతాపసింహునికి సాయపడే రాజపుత్రులనూ, మొగలుల కోసం పోరాడే రాజపుత్రులనూ విడివిడిగా గుర్తించడం ఎట్లా?"** దీనికాయన సమాధానమిది. **"ఆలోచనా రహితంగా అందరినీ చంపు. ఏ పక్షంలోని రాజపుత్రులు చచ్చినా ఇస్లాంకు లాభమే"** ఈ సమాధానం, ముల్లాల బుద్ధి పనిచేస్తున్న తీరును స్పష్టీకరిస్తుంది. అక్బర్ ఇట్లాంటి ముల్లాలను నిరోధించగలిగినాడు. కానీ, ఆయన తరువాత సింహాసనం అధిష్ఠించిన జహంగీర్, షాజహాన్ ఈ ముల్లాల ముందు నతమస్తకులయినారు. మళ్లీ ఔరంగజేబు కాలంలో ఈ ఇస్లాం దురభిమానం, మతతత్వం మరోసారి పతాకా స్థాయికి చేరుకున్నది.

మొగల్ సింహాసనాధికార సహకారంతో విజృంభించిన ముస్లిం మతతత్వంపై భారతదేశ ప్రతి చర్య చరిత్ర ప్రసిద్ధమే. ఛత్రపతి శివాజీ, మహారాణా రాజాసింగ్, గురుగోవిందసింగ్ మొదలయిన వారి ద్వారా సాగిన **"జాతీయ పునరుజ్జీవనం"** భారతదేశంలో ముస్లిం అధికారాన్ని చివరకు అంతం చేసింది. ఆ తర్వాత ఇస్లాంకు సైనిక, రాజకీయ సహకారాలు వెనుకబడడంతో, ఎవరిదీ పైచేయి కానిస్థితి కొంత కాలం సాగింది. దీని ఫలితంగా, భారతదేశంలో ఇస్లాంను అనుసరించేవారికి మతతత్వంగానీ ఇస్లాం మత దురభిమానంగానీ లాభసాటి కాలేకపోయింది. ఇది వారి భారతీయీకరణను వేగవంతం చేసింది.

19వ శతాబ్దం మధ్యకాలానికి ఆంగ్లేయులు మొత్తం భారతదేశం మీద అధికారాన్ని సంపాదించారు. వారిపై కలిగిన ఉమ్మడి విరోధ భావం కూడా వీరిలో– హిందూ ముస్లింలలో పరస్పరం సర్దుబాటులు చేసుకొనడానికి ఒక కారణమయింది. అంతేకాదు, స్వీయాధిక్య భావాన్ని పెంచుకుని భారతీయులనే గాక ముస్లింలలోని క్రింది తరగతుల వారిని గూడా హీనంగా చూచే ముస్లింలను భారతీయీ కరించడానికి గూడా కారణమయింది.

ఆంగ్లేయులను పారద్రోలడానికి 1957లో జరిగిన సాయుధ సంఘర్షణ యొక్క వైఫల్యం రెండు రకాలుగా పనిచేసింది. ఒకవైపు కులం, తెగలతో నిమిత్తం లేకుండా భారతీయులందరినీ నైతిక శక్తిహీనులను చేసింది. మరోవైపు, ఆంగ్లేయులకు భారతదేశ ప్రజలు ముస్లింలతో సహా – ఏకంగా ఉండేట్లయితే, తమ అధికారం భారతదేశంలో ఏ క్షణాన్నయినా నశించి పోవచ్చు అనే ఒక గుణపాఠం నేర్పింది.

తమ రాచరిక ప్రయోజనాల కోసం దేశంలోని కుల, మత

విభేదాలను దుర్వినియోగించుకునే ఆంగ్లేయుల క్రొత్త విధానం 1851తో ప్రారంభమయింది. తత్ ఫలితంగా, ఆంగ్లేయుల భారతీయసేన కుల మత ప్రాతిపదికపయి పునర్ వ్యవస్థీకరించ బడింది. అంతేకాదు, ముస్లింలలోని ఉన్నత వర్గాల వారిని తమ వశం చేసుకొనడానికి చొరవచూపే ఆంగ్లేయుల విధానం గూడా ప్రారంభమయింది. ఈ విధానాన్ని 1874లో భారత ప్రభుత్వపు ఆర్థిక సంఘ సభ్యుడయిన సర్ జాన్ స్ట్రాచి ఈ క్రింది విధంగా స్పష్టీకరించినాడు–

**"భారతదేశంలో మన రాజకీయ సుస్థితికి బలవత్తరాంశాలలో ఈ రెండు విరుద్ధ వర్గాలు (హిందూ,ముస్లింలు) ప్రక్క ప్రక్కగా ఉ ండటం అనేది ఒకటి. మహమ్మదీయులలోని ఉన్నత తరగతులవారు మనం బలపడడానికే ఉపయోగించేవారు తప్ప బలహీనపడడానికి కాదు. వారిది చిన్న వర్గమే అయినా, మన రాజకీయ ప్రయోజనాలతో పోలిన రాజకీయ ప్రయోజనాలు గలవారికి చెందిన, శక్తివంత మయిన అల్పసంఖ్యాక వర్గమది."**

ఈ విధానాన్ని అనుసరించడంలో ఆంగ్ల – ముస్లిం కూటమికి MAO కళాశాల నుంచి అవకాశం కలిగించింది. ఇదే కళాశాల అనంతర కాలంలో అలీఘర్ విశ్వవిద్యాలయంగా పెరిగింది. ఆగాఖాన్ 1906లో ప్రదర్శించిన మతతత్వ విధానం మింటో తన డైరీలో వ్రాసుకున్నట్లు– **"రాజ ద్రోహులయిన హిందువుల స్థాయి నుంచి అరవై మిలియన్ల ముస్లింలను విడగొట్టడం"** గా ఫలించింది. ఆ సంవత్సరంలోనే అఖిల భారత ముస్లిం లీగ్ కూడా ఏర్పడింది. ఇవన్నీ గూడా ముస్లింలలో వేర్పాటు ధోరణిని పునః క్రియాశీలంగా చేయడానికీ, ఇస్లాంనూ ముస్లింలనూ భారతీయీకరించడానికి వ్యతిరేకంగానూ సాగిన ముఖ్య ప్రయత్నాలు.

భారత రాజకీయ రంగంలో గాంధీ మహాత్ముని ప్రవేశం, ఆయన భారత జాతీయ కాంగ్రెసు రాజకీయాలలో తెచ్చిన మార్పులూ, దురదృష్టవశాత్తుగా, ముస్లిం మతతత్వాన్ని పెంపొందించడానికోసం ఆంగ్లేయులకు చక్కని సదవకాశాన్ని కల్పించినయి. ముస్లిం ప్రజానీకం ముల్లాల పిడికిలిలో ఒదిగిపోవడానికీ, అలీఘర్‌లో శిక్షణ పొందిన మేధావి వర్గం గుప్పిటిలో ఇముడడానికీ వీలుగా గాంధీ మహాత్ముడు ఖిలాఫత్ ఉద్యమానికి సహకరించడం, ఆయన తన జీవితంలో రాజకీయంగా చేసిన అతి ప్రమాదకరమయిన పొరబాటు. ఖిలాఫత్ ఉద్యమం భారత ముస్లింలలో విదేశ జాతీయతను పునరుజ్జీవింపజేయడమే కాకుండా, వారిలో భారతీయ భావనకు విరుద్ధంగా ఇస్లాం భావనను సృష్టించింది. ఆంగ్లేయులుపయోగించే "విభజించి పాలించు" విధానం, మరియు కాంగ్రెసు అనుసరించిన బుజ్జగింపు విధానం, ఈ రెండు ఏకమయి, ముస్లిం నాయకత్వానికి గొంతెమ్మ కోరికలు కోరే అవకాశాన్నీ, స్థాయినీ కల్పించినయి. ఈ అవకాశాన్ని ఆ నాయకత్వం అతి నేర్పుగా, ప్రభావాత్మకంగా ఉ పయోగించుకున్నది. అహంభావంలో అతి తీవ్రులయిన జిన్నా– పండిత జవహర్‌లాల్ నెహ్రూల కోరికల మధ్య చెలరేగిన ఘర్షణ, ముస్లిం లీగు యొక్క రాజీపడని మనస్తత్వానికి ఒక క్రొత్త పదును కలిగించింది. (సశేషం)


## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే

ఉత్తమ గ్రంథం **'కదంబం'.**

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/–**

## ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/– (అసలు 500/–) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

# గ్రంథాంతరంగం 25 బ్రహ్మశ్రీ మల్లాది సూర్యనారాయణ శాస్త్రి : షష్ఠి పూర్తి సంచిక

శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076

జీవితయాత్రలో అరవై, డెబ్బై, వెయ్యి పున్నములు గడిపిన శుభ సందర్భంలో శాస్త్రోక్తంగా ఘనంగా బంధు మిత్రాదుల సమక్షంలో పండుగ జరుపుకొనడం చాలాకాలం నుంచి కొనసాగుతున్న సత్సంప్రదాయమే. అయితే ఈ శుభసమయంలో సాహిత్య, సంగీత, సాంఘిక, రాజకీయ ఆధ్యాత్మిక క్షేత్రాల్లో సత్ఫలితాల్ని పండించి, ప్రసాదించిన మహనీయుల కృషిని తెలియచేస్తూ, వాళ్ల శిష్య ప్రశిష్యులు, అభిమానులు, భక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించిన అక్షరకృతులే ఈ అభినందన గ్రంథాలు, సన్మాన సంచికలు. మహా పురుషుల శతజయంతి, వర్ధంతి సంచికలు కూడా ఈ శ్రేణికి చెందిన అనర్ఘరత్నాలే. తాళ్లపాక అన్నమయ్య వారన్నట్లు **'సేసిన వారికి మరి సేసినంత పుణ్యము'** అంతేకదా!

షష్టి, సప్తతి, అశీతి, శత జయంతి సంచికలు భారతీయ భాషా సాహిత్యంలో ఓ విశిష్ట ప్రక్రియగా రూపొందడం హర్షణీయమైన సంగతే సరి. ఈ అభినందన గ్రంథాలు తెలుగులో గణనీయమైన సంఖ్యలో వెలువడ్డాయేకాని వాటి అధ్యయన అనుశీలనాలు జరిగినట్లు కనపడదు. అయితే తెలంగాణ విశ్వవిద్యాలయ తెలుగు విద్వాంసులైన డా. సిహెచ్. లక్ష్మణ చక్రవర్తి గారి పర్యవేక్షణలో అంతటి బాలస్వామి **'తెలుగులో షష్టిపూర్తి సంచికలు : పరిశీలన'** అనే విషయంపై పిహెచ్.డి. సిద్ధాంతగ్రంథం ఇటీవలే సమర్పించారు.

అభినవ వాగనుశాసన బిరుదాంకితులైన మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు సంస్కృతాంధ్ర భాషల్లో ఘన విద్వాంసులు. సంస్కృత, తెలుగు వ్యాకరణాల్లో తలస్పర్శి. పాండిత్య వివేచనలు కల ఘనపాఠి. అసామాన్య దేశికోత్తములుగా కీర్తిమంతులైన మనీషి.

బ్రహ్మశ్రీ మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారికి ఆయన సహోద్యోగులు, శిష్యులు, ప్రశిష్యులు, అభిమానులు 1941లో విశాఖపట్టణంలో షష్టిపూర్తి మహోత్సవం జరిపి ఆ శుభ సందర్భంగా ఎంతో విలువైన 'షష్టిపూర్తి సంచిక'ను వెలువరించారు. మల్లాది వారి షష్టిపూర్తి సమ్మాన సంఘాధ్యక్షులుగా మామిడిపూడి వెంకట రంగయ్యగారు, కార్యదర్శిగా దివాకర్ల వెంకటావధాని గారు సారథ్యం వహించి ఈ 'షష్టిపూర్తి సంచిక' ను అచ్చులోకి తెచ్చారు. 378 పేజీలు కల ఈ సత్కృతికి పై ఇద్దరు పండితులు సంపాదకులుగా పేర్కొనబడలేదు కాని వీళ్లే సంపాదకత్వ బాధ్యత వహించి, ఈ సాహితీ యజ్ఞాన్ని సఫలం చేశారని చెప్పొచ్చు. ఈ షష్టిపూర్తి సంచికను విశాఖపట్టణంలోని కింగ్ అండ్ కో సంస్థ 1941లో ముద్రించింది.

'షష్టిపూర్తి సంచిక'లో రెండు భాగాలున్నాయి. మొదటి భాగంలో మల్లాది వారి శిష్యులైన శివశ్రీ బండారు తమ్మయ్య సమర్పించిన **'గురుదక్షిణా రత్నములు, దూపాటి కొండమాచార్యులవారి 'అభినందన పద్య రత్నములు'** ఉన్నాయి. ఇవి కాక మరి ఇద్దరు రాసిన రెండు కవితలు కూడా చోటు చేసుకున్నాయి. ప్రముఖ విద్వాంసులు 16 వ్యాసాలతో పాటు ఐదు మంది ప్రసిద్ధ పండితులు రాసిన 6 వ్యాసాలు అనుబంధంగా ఇయ్యబడ్డాయి. రెండవ భాగంలో మల్లాది సూర్యనారాయణశాస్త్రుల వారి 15 తెలుగు, 2 సంస్కృత వ్యాసాలు గమనింపవచ్చును.

'షష్టిపూర్తి సంచిక' 'విజ్ఞాపనము' ద్వారా మామిడిపూడి వారు, దివాకర్లవారు బహుముఖీన ప్రతిభావంతులైన మల్లాది వారి సంస్కృతాంధ్ర సాహిత్య సేవను మనసారా ప్రశంసించారు. అలాగే 'సంచిక' చివరి నాలుగు పేజీల్లో (పేజి: 39-42) **'శ్రీ శాస్త్రిగారు'** అనే వ్యాసంలో



ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ

రచయిత మల్లాదివారి వ్యాకరణ పాండిత్యాన్ని, బోధనా పటిమను, అనువాద కౌశలాన్ని కొనియాడారు. దీన్ని దివాకర్ల వేంకటావధాని గారు రాసి వుంటారని భావిస్తే తప్పుకాదు.

ఈ అభినందన గ్రంథంలోని కొన్ని వ్యాసాలు పరిచయం చేయడం అవసరం. జటావల్లభుల పురుషోత్తం గారు **'సంస్కృత భాషా గౌరవము'** అనే వ్యాసంలో సంస్కృతం లో ఎంతో విలువైన కావ్య నాటకాదులు, వ్యాకరణ గ్రంథాలు, వివిధ శాస్త్ర గ్రంథాలు పుష్కలంగా వున్నాయన్నారు. దక్షిణాది భాషలు ద్రావిడభాషా కుటుంబానికి చెందినవైనా సంస్కృత ప్రభావితాలన్నారు. మత, న్యాయ శాస్త్ర గ్రంథాలకు సంస్కృతం ఆటపట్టని జటావల్లభులవారు ఉగ్గడించారు.

చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారి వ్యాసం **'కవులెవరికేనా నవుకర్లా?'** సంభాషణా శైలికీ, తర్కానికీ, తెలుగు నుడికారానికీ, చమత్కారానికీ మచ్చుతునక. వ్యాస ప్రారంభమే చెళ్ళపిళ్ళవారి రచనా కౌశలాన్ని చాటి చెప్తుంది. కవులెవరికేనా నవుకర్లా? అని నన్నెవరేనా అడిగితే **"కారు స్వతంత్రులనే జవాబిస్తాను. నవుకర్లు కారు గాని అందతికీ చుట్టాలని చెవుతాను కూడాను. ఆ చుట్టతికం కూడా నిర్వ్యాజమైన చుట్టతికమే అని కూడా**

**చెబుతాను."** అని బల్లగుద్ది వాదిస్తారు కింకవీంద్ర పంచానన చెళ్ళపిళ్ళ వారు. **"రాజానుగ్రహం కోసం యే కొందఱో కొంత రచన సాగిస్తే సాగిస్తారు గాక. అంత మాత్రం చేత కవులందఱూ అట్టివారే అనుకోవడం యుక్తం గాదు"** అని తన వాదనను పటిష్టం చేస్తారు. కవులు ఒకరికి నౌకర్లు కారని ఢంకా బజాయించి చెప్తారీ **'అద్యతనాంధ్ర కవితా ప్రపంచ నిర్మాతలు'**. కాని కాలచక్రం ఎన్ని సార్లు తిరిగిందో? ఆనాడు అరవై రెండేళ్ల క్రితం చెళ్ళపిళ్ళ వారు **'కవు లెవరికేనా నవుకర్లా?'** ప్రశ్నించి **'ఎవరికీ కారు.'** అని ఘంటాపథంగా ఘోషించారు. కాని నేడు మహాకవులుగా, మహా పండితులుగా చలామణి అవుతున్న పెద్ద మనుషు లెవరన్నా చెళ్ళపిళ్ళ వారిలా ఛాతీ విరిచి చెప్పగలరా?

వేంకటశాస్త్రి గారి మరో వ్యాసం- **'లోకో భిన్నరుచిః'** సహృదయుడు రససిద్ధి కోసం చదువుతాడు. ఒక్కో పాఠకుడికి ఒక్కో రుచి వుంటుంది. **'అమ్మా మాదాకవళం'** అన్న ఓ ఆధునిక గేయాన్ని విని, దాన్ని విశ్లేషించిన చెళ్ళపిళ్ళ వారు తనకు ఆ కవిత ఏ మాత్రం రుచించలేదనీ, వచ్చుకాలంలో రుచించవచ్చేమో అన్న మాటతో తన కవితా వివేచనానికి మంగళం పాడారు. గేయకవుల రచనలు- ఏ కవుల రచనలైనా సరే- వాటిలోని **"మార్పు హృదయంగమంగా వుంటే సంతోషిస్తారు సహృదయులు. యేవాన్ని కలిగించేదిగా వుంటే విచారిస్తారు."** (పేజి:23) ఎంత మర్యాదా పూర్వకంగా, సంస్కారవంతంగా తమ అభిప్రాయాన్ని విన్నవించారు ఈ కవిశేఖరులు. భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసేటప్పుడు ఎంతమంది విమర్శకుల్లో ఈ సభ్యతా సంస్కారాలు కనబడతాయి నేడు?

మహా పండితులు దీపాల పిచ్చయ్యశాస్త్రిగారి వ్యాసం- **'కొన్ని శబ్దములు - వాని యర్థములు'** అనే వ్యాసంలో ప్రాచీనాంధ్ర కావ్యాల్లోని పదిశబ్దాల లోతైన చర్చ చేశారు. ఆముక్తమాల్యద, ప్రబంధంలోని **'చేవెలుంగిడి'** అన్న పదానికి అర్థం చేయెత్తి కూక వేసి అనుట కాదనీ, **'చేవంఎలుగు'** తప్పనీ, చేంవెలుగు అన్న సంధి సరైనదనీ చేతి సాయమున నేర్పదు వెలుగు సరైన అర్థమనీ ప్రతిపాదించారు దీపాలవారు. వేదం వారి ఆముక్తమాల్యద సంజీవనీ వ్యాఖ్యలోని కొన్ని పదప్రయోగాలకు సరైన అర్థాన్ని సూచించిన దీపాలవారి పాండిత్యం ప్రశంసనీయం. **'పిల్ల పిల్లతరము'** అనే పదానికి వేదం వారిచ్చిన **'పిల్లలను సయితము వరుసగా'** అనడం సరికాదనీ పిల్లల తరములు (జెనరేషన్స్) అన్న సార్థకార్థాన్ని సూచించారు పిచ్చయ్య శాస్త్రిగారు. ప్రాచీనాంధ్ర కావ్యాల్లోని వ్యాఖ్యాతల పొరపాట్లను సాధికారంగా దిద్దిన దీపాల వారి ఈ వ్యాసం పాఠ పరిష్కరణకు కైదివ్వె లాంటిది. ఈ వ్యాసం చివర్లో దీపాల పిచ్చయ్య శాస్త్రిగారు రాసిన ఈ మాటలు కావ్యప్రియులు, ప్రబుద్ధ విద్వాంసులు గమనించతగ్గవి- **"నేనీ వ్యాసమున జూపిన దోషముల వంటి దోషములు పై వ్యాఖ్యానములలో వందల కొలదిగా నున్నవి. అంతేకాక మూలమున పాఠదోషములును బహుళముగా నున్నవి. నేటి విద్యార్థులందఱును, ఆ యప పాఠములనే, ఆ యపార్థములనే పాఠము చేయుచున్నారు. ఈనాడితరులు వ్రాయు టీకలలోను, నిఘంటువులలోను గూడా, ఆ పాఠములే, ఆ యర్థములే శాశ్వతముగా నెలవుకొను చున్నవి. ఈ రీతిగా భాష కపారమయిన యపకారము జరుగుచున్నది. కాబట్టి భాషాసేవా పరాయణతను, ప్రాచీన పాఠములను, ప్రాచీన భాషా మర్యాదలను చక్కగా నెఱిగిన వారునునైన పండితులు ఆ యీ గ్రంథములను- వ్యాఖ్యానములను పరిశోధించి, శుద్ధి పత్రములను తత్తద్గ్రంథముల కనుబంధములుగా ప్రచురించి భాషా సౌభాగ్యమును కాపాడవలయు నని విన్నపము."** (పేజి: 40)

సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకులు మల్లంపల్లి సోమశేఖర శర్మగారి 'గౌరన మంత్రి- సింగయ, మాధవుడు' అనే వ్యాసంలో 'హరిశ్చంద్ర చరిత్రము', 'నవనాథ చరిత్రము' కావ్యకర్త గౌరన ఇంటిపేరు అయల లేదా అయ్యల అని నిరూపించబడింది. అంతే కాదు. గౌరన కాలాన్ని వెంకట శ్రీనివాసమూర్తి 1400-1460 అనీ, కోరాడ రామకృష్ణయ్య 1400-1450 అనీ, కందుకూరి వీరేశలింగం పంతులు 1440-1450 అనీ నిర్ణయిస్తే సోమశేఖర శర్మగారు 14 వ శతాబ్దపు చివరి కాలం వాడని నిరూపించారు. సంస్కృత సాహిత్యంలో ప్రకాండ పండితులైన ఈయుణ్ణి వేంకట వీరరాఘవాచార్యులు **'సంస్కృత వాఙ్మయమున ముగ్గురు మహారాజ కవులు'** వ్యాసంలో రణాదిత్య కవి ఒక పద్యాన్ని, కలశుడి కొన్ని చాటు శ్లోకాల్ని ప్రస్తావించారు. కాని హర్షదేవుని రచన లేమీ లభించలేదని పేర్కొన్నారు. ఇది ఒక మంచి పరిశోధనాత్మక వ్యాసం.

కుందూరి ఈశ్వరదత్తుగారి **'వెలమకుల నిర్ణయము'** 17 పేజీల నిడివిగల పరిశోధనాత్మకమైన వ్యాసం. (పేజీలు 62-79) కుందూరి వారు వెలమకుల వ్యుత్పత్తిని ఈ విధంగా చెప్పారు.


**కాంపులు లేక కాపులు**
**రట్టోడి కాపులు (రెడ్లు)**
**కమ్మనాటి కాపులు (కమ్మలు)**
**వెలుమల కాపులు ( వెలుమలు)**
**తెలగాణ కాపులు (తెలగలు)** (పేజి: 78)

ఈశ్వరదత్తు గారు వెలమలు మొదట కాకతీయుల సామంతులుగా నుండి, తెలంగాణలోని నల్లగొండ ప్రాంతంలో నివసించిన వారన్నారు. ఈ కొండ ప్రదేశంలో నివసిస్తున్న కారణంగా శ్రీశైలము, నల్లమలకు వెలుపలి (అవతలి) ప్రాంతం నందుండటం వల్ల వీళ్ల వెలుమలల - బయటి కొండ ప్రాంతం వాళ్లుగా పిలువబడ్డారు. వెలుమలలె, వెలుమలై తర్వాత వెలమలైరి. వెలుమలె ప్రాచీన రూపమని ఈశ్వరదత్తు గారు శాసనాధారం (తెలంగానా శాసనములు - మేళ్ల చెఱువు శాసనము (సం. 50. పుట-92) చూపారు. (షష్టిపూర్తి సంచిక. పేజి: 77)

నిజాం కళాశాల తెలుగు ఉపన్యాసకులైన సరిపెల్ల విశ్వనాథశాస్త్రి గారి వ్యాసం **'నవ్యాంధ్ర సాహిత్య మర్యాదలు'** విశ్లేషణాత్మక రచన. పండితవర్యులు సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రిగారు నవ్యుల కవిత్వంలో నవ్యత కొంచెం కూడా లేదన్న వాదానికి, ప్రతివాదంగా ఈ వ్యాసం వెలువడింది. నవ్యకవుల రచనల్లో అడుగడునా కొత్తదనం వుందని వాదిస్తూ గురజాడ, రాయప్రోలు, పింగళి– కాటూరి, శ్రీశ్రీ మొదలైన కవుల కవితాంశాల్ని ఉదాహరించి సరిపెల్ల విశ్వనాథశాస్త్రి నవ్యాంధ్రకవుల కవిత్వంలోని నవ్యతను చక్కగా చూపారు.

**'షష్టిపూర్తి సంచిక'** మొదటిభాగంలోని వ్యాసాల్లో వస్తు వైవిధ్య ముంది. పాండిత్య ప్రకర్ష కనపడుతుంది. విశ్లేషణ పటిమ వ్యక్తమవు తుంది. మరొక ముఖ్య విషయమేమంటే దాదాపు అన్ని వ్యాసాలు గ్రాంథికభాషలో రచింపబడ్డా పాఠకులకు బాగా అర్థమవుతాయి.

రెండవ భాగంలో మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారి 14 తెలుగు, 2 సంస్కృత వ్యాసాలు, ఆంధ్రవాగ్దేవి అనే ఓ పద్య కవిత వెరసి 17 రచనలు సంకలింపబడ్డాయి. శాస్త్రిగారు 'ఆంధ్రభాష' వ్యాసంలో తెలుగు పద్య కవిత్వం శాఖోపశాఖలుగా విస్తరిల్లిన విధానాన్ని వివరిస్తూ, ఆధునికాంధ్ర సాహిత్య వైవిధ్యాన్ని ప్రదర్శించారు. తెలుగు భాషాభివృద్ధికి తగిన కొన్ని సూచనలు చేశారు. సంస్కృతంలోని ఉత్తమ కావ్యనాటకాదుల్ని సరళమైన తెలుగులోకి అనువదింపబడటం, విశాలమైన తెలుగు వ్యాకరణ రచన, తెలుగు పదాలు అన్నిటితో కూడుకొన్న సమగ్ర నిఘంటు నిర్మాణం, దేశ చరిత్రలు, సాంఘిక, రాజకీయాది చరిత్రలు, భౌతిక, రసాయనికాది శాస్త్ర గ్రంథాలు సుబోధకంగా తెలుగులో వెలువడటం ఎంతో అవసరమని మల్లాది వారు ఆశించారు. ఈ వ్యాసంలో మనం ముఖ్యంగా గమనించాల్సిన సంగతి శాస్త్రిగారికి వ్యావహారిక భాషపట్ల గల చిన్నచూపు మల్లాది వారి మాటల్లో చెప్తే **"ఇదియుం గాక వాడుకలో గ్రంథభాష వలెనే పుస్తకములలో గ్రామ్యభాష యుపయోగించుట యర్థ సారస్యము గలిగింపక పరిహాస పాత్రమగు ననుటకు సందియములేదు. అట్టిచో గ్రామ్యభాష తోనే గ్రంథములు వ్రాయుటయు, వానిని సరసలోకం బాదరించుటయు నుత్తమ గ్రంథభాష కనర్థదాయకము లనుటలో నాశ్చర్య మేమున్నది? ఇట్టి దురవస్థ యీ కాలంబున మన భాషకు మెల్లగా సంప్రాప్త మగుచున్నది."** (పేజి: 161) మల్లాది వారు గ్రామ్యభాష, నీచభాషగా భావించిన వ్యావహారిక భాష నేడు యోగ్యమైన గౌరవప్రదమైన స్థానాన్నే అలంకరించి వుంది. కాని వ్యావహారిక భాషను తలకెత్తుకున్న విద్యార్థులు, విశ్వవిద్యాలయ పరిశోధకులు, ఆచార్యవతంసులు ఆ వాడుక భాషలో కూడా స్పష్టంగా, పటిష్టంగా వ్యక్తం చేయలేక పోవడమే తల బాదుకోవాల్సిన సంగతి. మల్లాది వారు **"ఆంధ్రభాష సంప్రదాయము"** (పేజీలు: 194–206) వ్యాసంలో తెలుగు భాష కాలక్రమంలో ఎన్నో మార్పులకు లోనయినం దనీ, కాని వ్యాకరణ వేత్తలు ఆ మార్పుల్ని శ్రద్ధతో గమనించి తమ దృష్టిని విశాలతరం చేసుకోలేదనీ చెప్పారు శాస్త్రిగారు. సూక్ష్మ పరిశీలన చేసి ఘోషించిన ఈ వాక్యాలు మరీ మరీ ఆలోచించ తగ్గవి– **"మొదట భాషావిషయమున రెండు పక్షములే కాని, యిప్పుడు రెండువందల పక్షము లేర్పడినవి. ఎవరి సంప్రదాయము వారిదే. ఎవరి ప్రయోగములు వారివే. ఎవరి వ్యాకరణము వారిదే. ఎవరి యిష్టము వారిదే. హద్దు లేదు ఆజ్ఞలేదు. ఆ లేదు ఊ లేదు – తన సారస్వతమునకు సంభవించిన యీ గ్రహచార దోషమును బట్టి ఆంధ్రభాష తన్నుదా మరచిపోయి గంగవెఱ్ఱు లెత్తినట్లు గంతులేయు చున్నది. ఇపు డెవరి నే మంటే యేమి లాభమున్నదో, ఆలోచించండి."**


శ్రీ

షష్టిపూర్తి సంచిక.

(వ్యాసములు – ప్రథమ ద్వితీయ భాగములు.)

ఇది
బ్రహ్మశ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రి
షష్టిపూర్తి సన్మాన సంఘమువారు
ప్రకటించినది.

మామిడిపూడి వేంకట రంగయ్య, ఎం. ఏ.,
సన్మాన సంఘాధ్యక్షుడు.

దివాకర్ల వేంకటావధాని, ఎం. ఏ., (ఆనర్సు.)
సన్మాన సంఘ కార్యదర్శి.

(పేజి: 197) మన విశ్వవిద్యాలయాల్లో చాలా మంది తెలుగు ఆచార్య పుంగవులు ఎం.ఏ.పాఠ్యక్రమం నుండి వ్యాకరణాన్ని తొలగించేందుకు కంకణబద్ధులయ్యారు. ప్రాచీనాంధ్ర కవిత్వాన్ని చదవడం చేత కాని దుస్థితిలో వుంటూ, ఆధునికాంధ్ర సాహిత్యాన్ని కూడా అవగాహన చేసుకోలేని విషమస్థితిలో తనుకులాడుతున్న సమయంలో వ్యాకరణం గురించి చర్చించి, నిర్వేదం చెందడం వ్యర్థమేకదా.

సూర్యనారాయణశాస్త్రిగారు **'శృంగారరస విమర్శనము'** (పేజీలు: 209–234) వ్యాసంలో ప్రాచీన ఆలంకారికులు శృంగారరస నిర్వహణ గురించి చేసిన చర్చల్ని లోతుగా పరామర్శించి, సంస్కృత సంప్రదాయాన్ని అనుసరించిన తెలుగు కవుల శృంగార రసవర్ణనా వైఖరిని ప్రదర్శించి ఈ నిర్ణయానికి వచ్చారు. **"అయినను, దేశకాల పాత్రముల బట్టి దేశభాషకు గొంత మార్పు గలిగింపక తప్పదందురా? సరియే. యట్లయిన యెడల నీ విషయంబున సంపూర్ణముగా సంస్కృత లక్షణము ననుసరించినచో నట్లు వలనుపడదు గావున గొంతవఱకు దాని ననుసరించి యాధునిక కావ్యరచనంబున కనుగుణంబుగా మనమిట్లు శృంగారరస సంస్కరణము చేసికొనిన బాగుగా నుండునని నా యభిప్రాయంబును దెల్పుచున్నాడను."** (పేజి: 233)

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 9 (28) హైదరాబాద్ జులై : 2023

మల్లాదివారు పిడివాదులు కారు. సంస్కృత కావ్యశాస్త్ర సంప్రదాయ నిష్ఠులైనా కొత్తదనానికి స్వాగతం పలికే సహృదయులు. **'షష్టిపూర్తి సంచిక'** లోని వీరి వ్యాసాలు అగాధమైన విద్వత్తుకు, అద్వితీయమైన తర్కానికి, స్పష్టమైన అభివ్యక్తికి తార్కాణాలు.

మల్లాది సూర్యనారాయణ శాస్త్రి గారి 'షష్టిపూర్తి సంచిక' ఈ ప్రక్రియ పరంపర ప్రారంభదశలో వెలువడింది (1941). అయినా ఈ ప్రక్రియకు వేసిన పునాది రాళ్లలో ఒకటి. ఈ సంచికలో మల్లాది వారి జీవిత సాహిత్య వ్యాకరణ శాస్త్ర వైదుష్యాల సంక్షిప్త పరిచయం వుంది. సంస్కృతాంధ్ర సాహిత్యాల గురించి విద్వాంసుల విశ్లేషణాత్మక వ్యాసాలు ఉన్నాయి. మల్లాది వారి విద్వత్పూర్ణ వ్యాసాలు వున్నాయి. ఒక మహా పండితుడి ప్రతిభా విశేషాల్ని తెలుపడంతో పాటు ఈ సంచిక పండితాగ్రణుల సునిశిత ఆలోచనల్ని నమోదు చేసే వ్యాసాలు వున్నాయి. తాళ్లపాక వారి మాటల్లో చెప్తే- **"చెల్లుబడియైన చేతలెన్ని సేసినాను యెల్లవారి కింపే కాని యెరవుకాదు."** అవును కదా!

# విసిరేయాలనిపిస్తోంది



చీకటి ప్రయాణంలో
దారులు లేని దారులలో దారులు వెతుక్కుంటూ
రేపటి కోసం రేపటి భవిత కోసం
బ్రతుకులో వెలుగు కోసం నడుస్తున్న
దళిత చరిత్రలను
తలుచుకొంటూ తడుముకుంటూ పయనిస్తున్న
మరో ప్రపంచపు తీరంలోకి!

ఇసుమంతైన జాలి లేని లోకమిది
దారి పొడుగునా దగా పడ్డ బతుకులే అన్ని
అందుకే! అందుకే!
నడిస్తున్న జీవితాల్ని
ఈ నటన ప్రపంచాన్ని
చూపుకు అందని, చేతికి అందని
ఈ మాయలోకపు తీరుని
దూరంగా విసిరేయాలనిపిస్తోంది
నడిరోడ్డున నగ్నంగా తగలబెట్టాలనిపిస్తోంది!

మొకం నిండా తెల్లటి నవ్వు
నోటినిండా తియ్యటి మాట
చూపునిండ చల్లని దీవెన
అందరిమీద కురుస్తున్నట్లుంటుంది
అదే క్షణంలో ఎవరో గుండెను
చేత్తో పట్టుకొని లాగినట్లు ఉంటుంది
నమ్మకాన్ని నమ్మిన సిద్ధాంతాన్ని
బజారులో తాకట్టు పెట్టినట్టు అనిపిస్తోంది
అందుకే! అందుకే!
దూరంగా విసిరేయాలనిపిస్తోంది

న్యాయాన్ని నమ్మని మనిషిని
న్యాయంవైపు అడుగు వేయని మనిషిని
నడిరోడ్డులో న్యాయదేవతకు బలివ్వాలనిపిస్తోంది
సంఘంలో సగం కూడా సక్రమంగా లేరు
ఒకరికొకరు ఒకేబాటలో నడిచేవాళ్లు లేరు
ఎట్లా కాపాడాలి మానవత్వాన్ని
అడుగడుగున ఏదో ఒక చిక్కుముల్లు
తగులుతూనే ఉంటుంది
వేటగాడు అడివిలో వలలు వేస్తుంటే
మోసగాడు ఊరిలో మాయ వలలు వేస్తున్నాడు
అందుకే! అందుకే!
దూరంగా విసిరేయాలనిపిస్తోంది!

విసిరేయడం కంటే చితిమంటల్లో వేసి
శాశ్వతంగా భస్మం చేయాలనిపిస్తోంది
మాయగాళ్ళ మోకకారితనాన్ని!!

**లక్ష్మి శ్రీనివాస్**
**967 660 1192**

ISSN 2457-0796 — UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 9 (29) హైదరాబాద్ జులై : 2023

# తెలుగుజాతి వినోద జాతే కాని విజ్ఞాన జాతి కాదు

## ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి

తెలుగు కథానికకు రెండోతరం అగ్రశ్రేణి కథకుడు. ముఖ్యంగా సీమకు కొండారెడ్డి బురుజులా వాస్తవి'కథ'కు గ్రామనామమై నిలిచిన పరిశోధకుడు కేతు విశ్వనాథరెడ్డి గారిని 18 ఏప్రిల్ 2023న వారి సొంత నివాస గృహంలో (మలేషియా టౌన్ షిప్, కడప) కలిసే అవకాశం కలిగింది. పరిశోధక విద్యార్థులుగా మేము చేసిన ఈ ముఖాముఖిలో సాహిత్య సాహిత్యేతర అంశాలపై తనదైన శైలిలో అభిప్రాయాలను వెల్లడించారు. బహుశా కేతుగారి చిట్టచివరి ముఖాముఖి అని కూడా కావచ్చు. ఈ ముఖాముఖి చేసిన పరిశోధక విద్యార్థులు....

**రవి బండారు, నాగరాజు సారిపల్లి, మదన మోహన్ రెడ్డి బుగదూరు**
**పరిశోధక విద్యార్థులు, హైదరాబాదు విశ్వవిద్యాలయం, 998989 4308.**

**1. పదవీ విరమణ తర్వాత మీ శేషజీవితం ఎలా సాగుతుంది సర్?**

ఏమీ పట్టించుకోకుండా బతుకున్నా. అత్యాశ, కీర్తికాంక్ష, పదవీ వ్యామోహం ఇలాంటి వాటి వెంట పరుగు పెట్టకుండా ఒకవిధమైన వానప్రస్థ జీవితం గడుపుతున్న. పిల్లలు సెటిల్ అయ్యారు. వాళ్ళు మా నుంచి-మేము వాళ్ళ నుంచి ఆశించడాలు లేవు. కుటుంబం నుంచి వచ్చే ఆస్తుల్ని అన్నదమ్ములకే ఇచ్చేశా. ఇద్దరం (భార్య పద్మావతి) పెన్షన్‌తో ప్రశాంతంగా ఉంటున్నాం. ఊరితో ఇప్పుడు సంబంధాలు పెద్దగా లేవు. కేవలం జ్ఞాపకాలే ఉన్నాయి.

**2. మీ బాల్యానికి, నేటి మీ మనవాళ్ళ బాల్యానికి తేడాలు అడిగితే ఏం చెబుతారు?**

నా బాల్యం గ్రామంలోనే గడిచింది. పై చదువు, ఉద్యోగం అంటూ నగరానికి వచ్చాను. మా బాల్యమంతా ఉమ్మడి కుటుంబ నేపథ్యంలో గడిచింది. మా అబ్బగారు (తాత) ఆయన పిల్లలు, పిల్లల పిల్లలు మొత్తం లెక్క వేసుకొంటే 30, 40 మందికి తక్కువగాము. ఆప్యాయతలు, అనురాగాలు ఉండేవి. అలాగే ఆడ-మగ మధ్య చిన్నచిన్న డిఫరెన్సెస్ ఉండేవి. ఆ ఉమ్మడి జీవితాల్లోని మంచి లక్షణాల్ని మాకు అందించారు. చెడు లక్షణాలు ఏమైనా మాలో ఉంటే తొలగించారు. ఇప్పటి తరానికి వచ్చేసరికి సమిష్టి కుటుంబాలు లేవు. కేవలం న్యూక్లియర్ ఫ్యామిలీస్ (సూక్ష్మ కుటుంబాలు). ఏదైనా జరిగితే తట్టుకొనే శక్తి లేకుండా ఉంది. అలాగనే ఉమ్మడి జీవితాలు మాత్రమే గొప్పవి ఇప్పటి వ్యష్టి జీవితాలు కావు అనను. మాకు సొంత నిర్ణయ అధికారం లేదు. ఇప్పటి తరానికి ఇది గొప్పగా ఉంది. కాకపోతే ఏదైనా ఇబ్బందులు వస్తే సలహా, సంప్రదింపులు జరపడానికి స్నేహితులు తప్ప కుటుంబం లేకుండా పోతుంది.




**3. ఖండాలను కుగ్రామాలు చేస్తున్న ప్రపంచీకరణపై మీ అభిప్రాయం?**

ప్రపంచీకరణ ఇప్పుడు కొత్తగా వచ్చింది కాదు. ఎప్పటి నుంచో ఉంటూ వస్తున్నదే. కాకపోతే దాని ప్రభావం ఇప్పుడు అధిక మయ్యింది. ఒక పల్లెలో ఉన్న అధిక ఉత్పత్తిని పక్క పల్లెకి తీసువెళ్లి అమ్మడమే ప్రపంచీకరణ.

**4. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం మీది. మీరు రాజకీయాలవైపు ఎందుకు వెళ్ళలేదు?**

కుటుంబం కాంగ్రెస్ సానుభూతిపరులు. నేను చదువుకొనే రోజుల్లో విశాలాంధ్ర ఉద్యమంతో పాటు రాజకీయాల్లోకి వెళ్లాలను కొంటున్న ఆలోచనకు మా నాన్న అడ్డుపడ్డాడు. **'ఇంటికి పెద్దకొడుకువి... ఒకవైపు ఆస్తులు తరిగిపోతున్నాయి. ఇటువంటప్పుడు...'** అప్పటి పరిస్థితులకి తలొగ్గి ఆంధ్రరత్న పత్రికలో సబ్ ఎడిటర్‌గా జాయిన్ అవ్వాల్సి వచ్చింది. ఉమ్మడి కుటుంబ బాధ్యతలు తీసుకోవాల్సి వచ్చింది.



**5. నాన్న వాళ్ళందరు కాంగ్రెస్. మీరెలా వామపక్ష భావజాలం వైపు ఆకర్షితులయ్యారు? ఆ వాతావరణం ఇంట్లో ఎలా ఉండేది?**

నేను బి.ఏ చదివే రోజుల నుంచి వామపక్ష ధోరణి. కుటుంబంలో మాత్రం కాంగ్రెస్ వాతావరణం. స్వాతంత్ర్య పోరాటంలో ఆస్తులు కూడా త్యాగం చేసారు. చిన్న అబ్బ అరెస్టు అయ్యి అలీపూర్ జైలులోనే ప్రాణాలు వదిలారు. నేను చిన్నప్పటి నుంచి చాదస్తపు మాటలు ఎవరు చెప్పినా వినేవాడిని కాదు. కులం, మతం తేడా లేకుండా అందరితో తిరిగేవాడిని. ఒకింత మా ఇంట్లో ఉండే ఉదారవాదం, పుస్తక పఠనం కారణం కావచ్చు. ఈ విధమైన వాతావరణం ఉన్న వాళ్ళు అప్పట్లో వామపక్షాలవైపు ఆకర్షితులు అయ్యే అవకాశం ఎక్కువగా ఉండేది.

**6. శ్రీకాకుళ ఉద్యమ ప్రభావం మీ మీద ఏమైనా ఉందా?**

లేదు. ఉత్తరాంధ్ర ఉద్యమం వేరు. రాయలసీమ ఉద్యమం వేరు. ఉత్తరాంధ్రాది తిరుగుబాటు అయితే రాయలసీమది నిరసన ధోరణి. వేమన, పోతులూరి వీరబ్రహ్మం, దూదేకుల సిద్ధయ్య వంటివారు తిడుతూ నిరసన ఉద్యమం చేసారు గానీ, తిరుగుబాటు చెయ్యలేదు. అలాగే తెలంగాణలో ఉన్న మౌఖిక సాహిత్యం వెల్లివిరిసింది. ఇప్పటికీ అక్కడ చైతన్య ప్రతీకగా పాట నిలిచే ఉంది. కమ్యూనిజం మార్క్స్ ఊహించినట్టు జర్మనీలో, యూరప్‌లో ఎందుకు రాలేదు. ఇంగ్లాండులో రాలే, ఫ్రాన్సులో రాలే. రష్యాలోను, చైనాలోనూ వచ్చింది. అంటే కమ్యూనిజం పుట్టుక ఆయన ఊహించినట్టు జరగలేదు. రైతుల నుంచి ఉద్యమం వచ్చింది. సైనికుల నుంచి తిరుగుబాటు వచ్చింది. అందువల్ల నాకు అనిపిస్తుంది యూరో కమ్యూనిస్టులం గానీ, ఏషియన్ కమ్యూనిస్టులం కాదని. యూరో సంస్కారం డెమోక్రటిక్. కమ్యూనిజం వస్తే డెమోక్రటిక్‌గా వస్తే మంచిదే. కానీ ఎప్పుడు వస్తుంది అన్నది ఒక కల.

**7. రాయలసీమ సమాజాన్ని చిత్రసీమ ఆధిపత్య సమాజంగా చిత్రించడంపై మీరెలా స్పందిస్తారు?**

నిజానికి అనకూడదు గానీ వాళ్ళంతా నీచులు. కొందరు హీరోలు, ప్రొడ్యుసర్లు ఈ విధమైన నీచ సంప్రదాయానికి ఒడిగడుతున్నారు. ఇదే ప్రచారం చెయ్యడం వల్ల ఇతర ప్రాంతాలవాళ్ళు కూడా ఈ తప్పుడు అభిప్రాయాన్ని ఏర్పరుచుకొంటున్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత వారిని చూస్తున్న తీరు మారింది. నీచ స్వభావం కలిగినవాళ్ళను చెప్పుతో కొట్టినట్టు ఉన్నాయి. ప్రొడ్యుసర్ల నీచపు సంస్కారం, హీరోల నీచపు అభిరుచులు ఈ చర్యలకు దారి తీస్తున్నాయి. నిజంగా నేను ఆ స్థానంలో ఉంటే అటువంటి సినిమాలు ఒప్పుకోను. 'మల్లీశ్వరి' లాంటి సినిమా కడప జిల్లాలోని సింహాద్రి పురం మండలంలోని పద్మశాలీ వాళ్ళ జీవితాలను గురించి తీశారు. ఇది రాయలసీమంటే. ఎంతసేపు ఒక రకమైనవే తియ్యడం సినిమావాళ్ళ నీచత్వానికి పరాకాష్ట.

**8. రాయలసీమకంతకి ఒక ఎత్తు పులిమితే కడప జిల్లాకు మరో ఎత్తులో ఈ సంస్కృతిని పులిమారు. ఈ జిల్లా వాసిగా మీరెలా చూస్తారు?**

అవును. ఈ మధ్య పులివెందుల అన్నది ఎక్కువగా అలాగే ప్రచారం చేస్తున్నారు. గుడివాడ, అనకాపల్లి, శ్రీకాకుళం వంటి ప్రాంతాలలో గొడవలు ఉండవా? కొట్టుకోరా? సొంత స్వార్థ ప్రయోజనాలకు మనుషులు గుంపు కడుతారు. కొట్టుకొంటారు. హత్యలు చేసుకొంటారు. దాన్ని ఒక ప్రాంతానికి, కొన్ని సామజిక వర్గాలకి చెందిన వారి పేర్లు పెట్టడం ఎంతమేరకు సబబు. అంతెందుకు చిత్తూరు జిల్లాలో బెల్లం వ్యాపారం చేసే వారికి గుర్తుగా అప్పట్లో రేలంగి వంటి వారికి హాస్య పాత్రలకు కూడా మా భాషను పెట్టేవారు. మొన్నటివరకు విలన్లకు రాయలసీమకు ఈ ప్రాంత భాషనే పెట్టారు. హీరోలకు ఎందుకు పెట్టరు? తెలంగాణ నుంచి హీరోలు వచ్చేసరికి ఇప్పుడు నోరు మూసుకొని ఉన్నారు.

**9. చిత్ర నిర్మాణంలో బలమైన ఒకప్పటి బి.యన్.రెడ్డి, కె.వి.రెడ్డి లాంటి వాళ్ళు ఇప్పుడు లేకపోవడం ద్వారానే ఈ సంస్కృతి రుద్దబడుతుంది అనుకోవచ్చా?**

అలా అని కాదు. ఎక్కడైతే డబ్బు కేంద్రీకృతమవుతుందో, వ్యాపారమెక్కడ కేంద్రీకృతమవుతుందో ఆ డబ్బు సినిమాల్లోకి వస్తుంది. వారి అభిరుచులు సినిమాగా వస్తాయి. ఎక్కువగా కోస్తా జిల్లాల వారికి అనుకూలంగా ఉంది. సహజంగా వారి దగ్గర డబ్బు విపరీతంగా ఉండడం, భూముల విలువెక్కువ. డెల్టా ప్రాంతం అవ్వడం వంటివి ప్రధాన కారణాలు. ఏవైనా ప్రశ్నలు ఉంటే మా పద్మని కూడా అడగండి.

**10. మేడం ఏం చదివారు సర్?**

తను ఏడో తరగతివరకు చదువుకొన్నది. కానీ విపరీతంగా పుస్తకాలు చదువుతుంది.

పద్మావతి మేడం : అలా ఏమీ లేదు.

**11. సార్ పుస్తకాల్లో మీకు బాగా నచ్చింది-నచ్చనిది ఏవి మేడం?**

నచ్చనది అంటూ ఏదీ లేదు. అన్నీ నచ్చుతాయి.

**12. మీ వ్యక్తిగత జీవితంలో రుణపడిపోయిన వ్యక్తులు ఎవరైనా ఉన్నారా సర్ ?**

ఉన్నారు. మా గురువు జి.యన్. రెడ్డి. నేను సాహిత్యంవైపు రావడానికి, యస్వీ యూనివర్సిటీకి, ఓపెన్ యూనివర్సిటీకి రావడానికి కూడా ఆయనే కారణం. నేను నిరంతరం గుండెల్లో పెట్టుకోవలసిన వ్యక్తి ఆయన.

**13. మీ గురు శిష్యుల సంబంధం ఎలా ఉండేది?**

ఒకరకంగా మాది డెమోక్రటిక్ రిలేషన్. ఆయనకి పెళ్లి అయ్యేంతవరకు నేను ఆయన ఇంట్లోనే ఉంటూ వాళ్ళ అమ్మగారు వండిపెడితే తిని యూనివర్సిటీకి వెళ్ళేవాళ్ళం. నేను ఎక్కువగా సిగరెట్లు కాల్చేవాణ్ని. జి.యన్. రెడ్డిగారు ఎప్పుడైనా మనసుకు ఒత్తిడి కలిగితే మాత్రమే తాగేవారు. ఎవరినైనా పంపి 'మా విశ్వం దగ్గర ఒక సిగరెట్ తీసుకు' రమ్మనేవారు. ఆయన దగ్గర శిష్యుడిగా, పరిశోధకుడిగా, కొలీగ్‌గా కూడా ఉన్నాను. ఆయన ఏవిధమైన డెమోక్రటిక్‌గా ఉన్నారో నేను కూడా నా శిష్యులతో అంతే డెమోక్రటిక్‌గా ఉన్నాను.

**14. అప్పటికే మీరు మంచి విద్యావంతుడు. మేడం ఏడో తరగతి వరకు మాత్రమే చదివారు. పెళ్ళికి అంగీకరించడంలో ఎక్కడా మనోభేదాలు కలగలేదా?**

అలా నాకెప్పుడు అనిపించలేదు. నేను కథలు అవి ఇవి రాసేవాడిని. అవేవీ ఆమెకు తెలీదు. వాళ్ళ నాన్నకు కొంతమేరకు తెలుసు. వాళ్ళది మాది సుమారు 200 ఏళ్ళ బంధుత్వం ఉంది. కాకపోతే కొద్దిగా దూరపు చుట్టరికం. పెళ్ళికి ముందు తనని నేనెప్పుడూ, నన్ని తననేప్పుడూ చూసింది లేదు. చదువు అంటని ఎక్కువగా పట్నంలోనే ఉంటూ వస్తుండే వాన్ని. 1962 ఆగస్టు 9 నేను ఉద్యోగంలోకి చేరాను. ఆగస్టు 24 మా పెళ్లి. ఒకరకంగా తనని చేసుకోవడంతో నాకు అన్ని కలిసొచ్చాయని ఇంట్లోవాళ్ళు అంటుండేవాళ్ళు.

**15. తెలుగు భాష అంతరించిపోతుంది. పాఠకుల ఆదరణ తగ్గిపోతుంది. ఇంగ్లీషు వ్యామోహం ఏవేవో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీనిపై మీ స్పందన?**

తెలుగు భాష ఎప్పటికీ అంతరించిపోదు. మనం అంతరించిపోతాం అంతే. ఇప్పటికే 60 శాతం అక్షరాస్యత. సగటు సామాన్యుడు కార్యకలాపాలు, సంభాషణలు తెలుగులోనే జరుగుతున్నాయి. అందులో కొన్ని ఇంగ్లీష్ మాటలు ఉండొచ్చు. ఏదో UNO listలో







చెప్పిందని అందరూ అంతరించిపోతుందన్నారు. అలా ఏమీ జరగదు. కానీ భాషాభివృద్ధికి పాటుపడవలసిన అవసరం ఎంతో ఉంది. అది కేవలం కొన్ని సంఘాల వల్ల మాత్రమే జరగదు. సమిష్టి కృషితో సాధ్యమవుతుంది. భాషాభివృద్ధి అంటూ కొన్ని పత్రికల వాళ్ళు అచ్చ తెలుగు పదాల చాదస్తం ప్రదర్శిస్తున్నారు. కొత్తగా వచ్చే మాటలకు కొత్త పదాలు సృష్టించండి. అంతేగానీ వాడుకలోకి వచ్చేసిన పదాలకి కొత్త పదాలు అవసరం లేదు. రైలుని ధూమశకటం అని ఎందుకు అనాలి? తెలుగు పదాలుగా అయిపోయిన వాటిని యథాతథంగా స్వీకరించాలి. ఆధునిక కాలంలో అనువాదాలు ఎక్కువగా ఉండాలి. ముఖ్యంగా మన భాష నుండి ఇతర భాషల్లోకి ఎన్ని అనువాదాలు జరిగితే అంత మంచిది. అనువాద సంస్కారం నన్నయ నుండి ఉందని మనవాళ్లు డబ్బా కొట్టుకుంటుంటారు. ఆధునిక సాహిత్యం నుంచి ఎన్ని అనువాదాలు వచ్చాయి?. జపాన్‌లో ఒక సామెత ఉంది **'జపాన్ అభివృద్ధి అంతా అనువాదాల వల్లనే'**నని. నీకు జపాన్‌లో ఏ పుస్తకం వచ్చినా వాళ్ళ భాషలో అనువాదంలోకి వచ్చేస్తుంది. మన దేశంలో మలయాళంలో కూడా అంతేనయ్యా. ఇప్పుడిప్పుడు తెలుగులో వేగం అందుకుంటుంది. ఇంకా పెంచాలి. అలాగే మనవి ఇతర భాషల్లోకి చాలా తక్కువగా జరుగుతున్నాయి. తెలుగులోకి ప్రపంచ సాహిత్యం 1950లో కొంత వచ్చింది. ఇప్పటికి రావాల్సినవి చాలానే ఉన్నాయి. ఒకవైపు అనువాదాలు పెరగాలి. మరోవైపు భాషాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

**16. పొరుగురాష్ట్రంలో భాషకు, సంస్కృతికి సంబంధించిన సమస్య తలెత్తినప్పుడు రాజకీయ శక్తులు కూడా ఏకతాటి మీదకు వస్తాయి. ఇది తెలుగు వాళ్లలో తక్కువగా ఉండటానికి గల కారణమేంది?**

నేనెప్పుడూ చెబుతుంటాను అప్పాజోస్యుల వంటివారితో **'తెలుగుజాతి వినోద జాతేగాని విజ్ఞాన జాతి కాదు'**. మనకు వినోదం మీద ఉన్నంత శ్రద్ధ విజ్ఞానం మీద ఉండదు. అది సినిమాలు,

పత్రికలను చూస్తే అర్థమవుతుంది. ఇది మన జాతికి పట్టిన జబ్బు. ఈ జబ్బు వదిలించుకోలేనంత కాలం ఇలాగే ఉంటుంది. పొరుగు రాష్ట్రాల సినిమాల్లో కూడా వారి కట్టుబొట్టు కనిపిస్తుంది. మన సినిమాల్లో అదేమీ ఉండదు. ఏదో ఈ మధ్య కొన్ని సినిమాలు తప్పితే. పల్లెటూరు మధ్యతరగతి వాడి మీద సినిమా తీస్తారు. మధ్యలో ఒక పాట అది అమెరికాలో ఉన్నట్టు తీస్తారు. వాస్తవానికి దూరంగా తీసుకెళ్లడం ఎప్పటి నుంచో జరుగుతూవుంది.

**17. మీరు ఉధృతిగా రాస్తున్నప్పుడు చిత్రసీమ నుంచి పిలుపులు, సంప్రదింపులు జరిగాయా?**

జరిగాయి. కానీ నేనే వెళ్ళలేదు. అందుకు రెండు కారణాలు. ఒకటి నేనున్న చోటకు వాళ్లు రావాల్సి ఉంటుంది. గానీ నేను వాళ్ల దగ్గరికి వెళ్లి పని చేసే అంత తీరుబడి ఉండదు. రెండు నిలకడ లేమి. ప్రాధాన్య రహిత ధోరణి. రావిశాస్త్రిని సినిమాల్లోకి తీసుకు పోయారు. ఆయన నాతో అన్నాడు **'మన భోజనం మనల్ని తిననియ్యరు. మన పాట మనల్ని పాడనీయరు. మన మాట మనల్ని రాయనివ్వరు'** అంటే అంతా మార్పులే. సిట్టింగ్ అని కూర్చోబెడతారు. ఎవడెవడో **'అది ఉండని, ఇది ఉండొద్దు'** అంటుంటారు. అంత మాత్రానికి అంత గొప్పరచయితని తీసుకొచ్చి పెట్టుకోవడం దేనికి? సినిమాలలో ఇమడడం అన్నది మనసున్న రచయితకి, దృక్పథం కలిగిన రచయితకి సాధ్యం కాదు అన్నది నాభావన. ఇప్పుడున్న వాళ్లకి అది లేదా అంటే ఏమో కొంతమంది వ్యక్తిత్వం నిలుపుకుంటూ కొనసాగుతున్నవారు కూడా ఉన్నారేమో మరి. నాకు చక్కగా ఉద్యోగం ఉంది. ఆ ఇబ్బందులు ఎందుకులే అనిపించింది.

**18. ఆరుద్ర, ఆత్రేయ, శ్రీశ్రీ లాంటి వాళ్ళు అక్కడ అంతో ఇంతో నిలదొక్కుకున్నారు కదా సర్?**

వాళ్లు వేరు. ఉదాహరణకు సి.నారాయణరెడ్డి రాజీనామా చేయకుండా సినిమాల్లోకి వెళ్లారు. దాశరథి రేడియోలో పనికి రాజీనామా చేసి వెళ్లారు. చివరికి ఎవరు ఎక్కువ బాగుపడ్డారు? సి. నారాయణరెడ్డినే. ఇటువంటి పరిశీలనలు చేసుకొంటూ ఉండే వాడిని. ఒకసారి తిరుపతి మీటింగ్‌కు వచ్చినప్పుడు దాశరథిగారితో అన్నా 'ఉద్యోగం వదిలి చాలా తప్పు చేశారు సార్' 'నిజమే విశ్వనాథరెడ్డి' అంటూ నాతో ఏకీభవించారు కూడా.

**19. విశాలాంధ్ర ద్వారా ఉత్తరాంధ్ర, తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల వారిగా కథా సంపుటాలను తీసుకొచ్చే బృహత్ కార్యాన్ని మీరు మొదలుపెట్టారు. ఆ ఆలోచన మీకు ఎలా వచ్చింది సర్?**

మొదట విశాలాంధ్ర ఎడిటోరియల్ బోర్డులో మెంబర్‌గా ఉండేవాణ్ణి. 70, 80 దశకంలో ప్రాంతీయ చైతన్యం, అస్తిత్వం ఎక్కువైంది. అది గమనించి ప్రాంతాల వారిగా తీసుకురావడానికి పూనుకున్నా. సీమ కథలకు సింగమనేని అర్హుడని ఆయనకు సంపాదకత్వం అప్పగించాం. ఈ పనికి చాలా పెద్ద గుర్తింపు వచ్చింది. చంద్ర రాజేశ్వరరావు లాంటి వాళ్ళు ఫోన్ చేసి **'మీ సీమలో ఇంత మంది రచయితలు ఉన్నారంటే ఆశ్చర్యంగా ఉందం'**టూ అభినందించారు. ఇందులో ప్రధానంగా నేను, ఏటుకూరి వరప్రసాద్ కీలకపాత్ర పోషించాము. ఇది సాహిత్యంలో గొప్ప కార్యక్రమమని చెప్పను గాని తర్వాత తరం ఈ విధమైన సంపాదకత్వాలు రావడానికి నాంది పలికామని మాత్రం చెప్పగలం. ఇది సమిష్టి కృషి వల్లనే జరిగింది.

**20. సుదీర్ఘ జీవితం చూసిన మీరు మాలాంటి యువకులకు జీవితం గురించి ఏం చెబుతారు?**

హాయిగా జీవించండి. ధైర్యంగా జీవించండి. మీ విలువల్ని, సమాజంలో ఉన్న మంచి విలువల్ని కాపాడుకుంటూ జీవించండి. డెమొక్రటిక్ గా జీవించండి. ఎదుటివారి భావాలని ఏకీభవించక పోవచ్చు గానీ గౌరవించాలి. ఇదేదో సన్యాసులకు బుద్ధుడు చెప్పినట్టు కాదు. ఒక యువ స్నేహితులకు ఒక వృద్ధుడు చెప్పిన సంగతులు.

సరే సార్ ట్రైన్‌కి టైం అవుతుంది. మేము మరో సందర్భంలో పూర్తిస్థాయిలో మీతో ముచ్చటిస్తాం సార్. థాంక్యూ సర్.

భోజనం ఏమైనా చేసి వెళ్ళండి.

లేదు సార్ అరగంటలో మాకు ట్రైన్ ఉంది.

అవునా అయితే ఇక్కడ పక్కన మనకు తెలిసిన హోటల్ ఉంది. వాళ్లకు చెబుతాను మీకు పార్సిల్ కట్టిస్తారు తీసుకెళ్లండి.

అయ్యో వద్దు సార్. పర్లేదు.

కనీసం బొప్పాయి అయినా తీసుకెళ్లండి బాబు' అంటూ 'పద్మా' అని పిలుస్తూ మేడంని పురమాయించాడు. మేడం తీసుకొచ్చి ఇచ్చింది. అలా గేటు దాకా వచ్చి మమ్మల్ని ఇద్దరు సాగనంపారు.


## శిలాక్షరం


**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**

**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**

**వెల : 300/-**




**సంప్రదించండి.**

**మూసీ మాసపత్రిక**

**ఫోన్ : 934 7971177**

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 9 (33) హైదరాబాద్ జులై : 2023

# ఉపనిషత్తులలో సరస్వతీ ప్రస్తావనలు

**శ్రీవైష్ణవ వేణుగోపాల్,** పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, కాశీహిందు విశ్వవిద్యాలయం. ఫోన్ : 98487 07978

వేదంలోను నాలుగు భాగాలున్నాయి. అవి సంహితలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు. వేదముల చివరిభాగములే ఉపనిషత్తులు. ఉపనిషత్తులకే వేదాంతములు అని మరొక పేరు ఉంది. ఇవి పూర్తిగా జ్ఞానకాండకు సంబంధించినవి. ఉపనిషత్తులు బ్రహ్మ విద్య, జీవాత్మ, పరమాత్మ, జ్ఞానము, మోక్షము, పర బ్రహ్మ స్వరూపమును గురించి వివరిస్తాయి. నాలుగు వేదాలకు కలిపి 1180 ఉపనిషత్తులు ఉన్నాయి. వాటిలో 108 ఉపనిషత్తులు ముఖ్యమైనవి. వాటిల్లో 10 ఉపనిషత్తులు మరింత ప్రధానమైనవి. వీటిని దశోపనిషత్తులు అంటారు. దశోపనిషత్తులను చెప్పే ప్రామాణిక శ్లోకం

**"ఈశ కేన కఠ ప్రశ్న ముండ మాండూక్య తిత్తిరిః**
**ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం తథా"**

ఈ ఉపనిషత్తులలో సరస్వతి ప్రస్తావనల గురించి వివరించడం ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

**1. సరస్వతీ రహస్యోపనిషత్తు**

సరస్వతీ మంత్రాలు ఋగ్వేదంలోనివి. అందులోని ఋగ్వేదోపనిషత్తులలో ఒకటి సరస్వత్యుపనిషత్తు. ఇందులో సరస్వతీ సూక్తాలలో సరస్వతిని పూజ, జప, ధ్యానాదికాలు చేసుకోవటానికి కావలసిన వివరాలు ఉన్నాయి. అంటే ఈ మంత్రాలకు ఋషి, ఛందస్సు, ధ్యాన శ్లోకము, ఫలితాలు వివరింపబడినాయి.

ఆశ్వలాయనునకు తన శిష్యులైన ఋషులకు మధ్య నడిచిన సంవాదమే ఈ ఉపనిషత్తు. దేని వలన సారస్వత ప్రాప్తి కలుగుతుంది? ఏ విధంగా ధ్యానించాలి? దేని వలన మహా సరస్వతీ దేవి సంతోషము చెందుతుంది అని అడిగిన ప్రశ్నలకు ఆశ్వలాయన మహర్షి చేసిన బోధయే ఈ ఉపనిషత్తు. ముఖ్యంగా ఈ పది శ్లోకాలు సరస్వతి దేవి స్వరూపంతో పాటు అక్షరపరబ్రహ్మ రూపంగా కీర్తించడం కనిపిస్తుంది. ఉదాహరణకు –

**నీహార హార ఘనసార సుధాకరాభాం**
**కళ్యాణదాం కనక చంపక దామ భూషామ్**
**ఉత్తుంగ పీన కుచకుంభ మనోహరాంగీం**
**వాణీం నమామి మనసా వచసా విభూత్యై**

ఈ ప్రార్థనలో సరస్వతి దేవి భౌతిక వర్ణన కనిపిస్తుంది. మంచు గడ్డ వలె స్వచ్ఛమైనది, ముత్యాల హారమువలె ప్రకాశించునది. పచ్చ కర్పూరమువలె పవిత్రమైనది, చంద్రునివలె ఆహ్లాదకరమైనది, అమృతము వర్షించునది, శుభములు ప్రసాదించునది. సువర్ణ సంపెంగ పుష్పముల మాలిక ధరించినది. ఎత్తైన వక్ష స్థలముతో, మనోహరమైన శరీర శోభతో దర్శనమిచ్చే వాగ్దేవతను వచో విభూతి సిద్ధించుటకై నమస్కరిస్తున్నాను.

మిగిలిన శ్లోకాలలో వేదాంతార్థ తత్త్వైక స్వరూపిణిగా, నామరూపాత్మకంగా వ్యక్తమయ్యే దేవిగా, సాంగోపాంగంగ నాలుగు వేదాలలో వాగ్రూపంగా కీర్తించబడేదని, అనన్య బ్రహ్మశక్తియని, వర్ణపద – వాక్యార్థ స్వరూపంతో ప్రవర్తించే ఆద్యంతనాశరహితాయని, దేవతలకు అధిదైవతమని, సమస్త సృష్టికి అంతర్యామియని రుద్రాదిత్యాది దేవతా రూపంలో వర్తిస్తుందని ప్రత్యభిజ్ఞ జీవకోటికి కలిగించేదని – ఇలా వర్ణించబడింది.



**నామజాత్యాదిభిర్భేదైః అష్టధా యా వికల్పితా**
**నిర్వికల్పాత్మనా వ్యక్తా సా మాం పాతు సరస్వతీ**

నామము, జాతి, రూపము, పరిమాణము, వర్ణము, స్పర్శ, గంధము, రుచి అను భేదములచేత ఎనిమిది విధాల సృష్టిగా వికల్పింపబడి కూడ ఆత్మ స్వరూపముగా వికల్పము లేనిదై ప్రత్యక్ష మగుచున్న సరస్వతి నన్ను రక్షించు గాక!

**2. ఛాందోగ్యోపనిషత్**

ఛాందోగ్యోపనిషత్తు సామవేదానికి చెందినది. ఉపనిషత్తులన్నిటి లోకి ప్రాచీనమైనదని కొందరి అభిపాయం. నాలుగు మహా వాక్యాలలో ఒకటైన "తత్త్వమసి" ఈ ఉపనిషత్తులోనిదే. ఎనిమిది అధ్యాయాలకు విస్తరించిన ఈ ఉపనిషత్తులో దేవకీ పుత్రుడైన శ్రీకృష్ణుని గురించి, సుయోధనుని తండ్రియైన ధృతరాష్ట్రుని గురించి ప్రస్తావించబడింది. ఇందులో ఎనిమిది అధ్యాయాలు ఉన్నాయి. మొదటి రెండు అధ్యాయాలలో సామమును గురించి, ఓంకారోత్పత్తిని గురించి, బ్రహ్మచర్య, గృహస్థ,

వానప్రస్థాశ్రమ ధర్మాలను గురించి యతి విధులను గురించి చెప్పగా మూడవ అధ్యాయం అచ్యుతుడైన బ్రహ్మ మానవుని హృదయంలో వసిస్తాడని, బ్రహ్మ సాక్షాత్కారానికి జీవాత్మ పరమాత్మల ఐక్యతకు జ్ఞానమే కారణము అని చెబుతోంది. నాల్గవ అధ్యాయం ప్రాణవాయువు మొదలైన వాటి గురించి ఆత్మ బ్రహ్మను చేరే విధానాన్ని గురించి చెబుతుంది. ఈ ఉపనిషత్తులోనే "బ్రహ్మ సత్యం జగన్మిథ్య" అని తొలుత చెప్పటం జరిగింది. సత్తు నుండి పంచ భూతాలు జన్మించెనని. జీవాత్మ ఈ పంచ భూతాలతో ప్రవేశించినదని. అసత్తే సత్యమైనదని జీవాత్మ, జాగ్రత్, స్వప్న, సుషుప్తులనే త్రివిధావస్థలలో ఉంటుందని పేర్కొనటం కనిపిస్తుంది.

**ధర్మం చాధర్మం చ సత్యం చానృతం చ సాధు చాసాధు చ హృదయజ్ఞం చాహృదయజ్ఞం చ యద్వై వ్నాభవిష్యన్న ధర్మో నాధర్మో వ్యజ్ఞాపయిష్యన్న సత్యం నానృతం న సాధు నాసాధు న హృదయజ్ఞో నాహృదయజ్ఞో వాగేవైతత్సర్వం విజ్ఞాపయతి వాచముపాస్స్వేతి॥**

**(ఛాన్దోగ్యోపనిషత్ – అధ్యాయము 7 ద్వితీయః ఖండః –1)**

**స యో వాచం బ్రహ్మేత్యుపాస్తే యావద్వాచో గతం తత్రాస్య యథాకామచారో భవతి యో వాచం బ్రహ్మేత్యుపాస్తేऽస్తి భగవో వాచో భూయ ఇతి వాచో వావ భూయోऽస్తీతి తన్మే భగవాన్బ్రవీత్వితి॥**

**(ఛాన్దోగ్యోపనిషత్ – అధ్యాయము 7 ద్వితీయః ఖండః –2)**

పరస్పరాభిప్రాయము తెలియుటకై వాక్కునకంటే ప్రధాన సాధన ఏదియు లేదు. వాక్కు లేనట్లయితే ధర్మం గాని, అధర్మం గాని, సత్యా సత్యములు కాని తెలిసేవి కావు. ఇట్లు సరస్వతి తత్త్వం వాగ్దేవతా పరంగా చెప్పబడింది.

### 3. బృహదారణ్యకోపనిషత్తు

బృహదారణ్యకోపనిషత్తు శుక్ల యజుర్వేదంలో శతపథ బ్రాహ్మణంలో ఉంది. ఈ ఉపనిషత్తు (అన్ని ఉపనిషత్తులకంటే) పరిమాణంలో చాలా పెద్దది (బృహత్తు). అందుకే దీనిని బృహదారణ్యకోపనిషత్తు అని అంటారు. ఇది పరిమాణంలోనే గాక, విషయ విశిష్టత, సమగ్రత, వివరణలన్నింటిలో కూడా విశేషమైనది. బృహదారణ్యకోపనిషత్తులోని మంత్రాలు 6 అధ్యాయాల్లో విస్తరించి ఉన్నాయి. 1,2 అధ్యాయాలను మధు కాండ అని 3, 4 అధ్యాయాలను యాజ్ఞవల్క్య కాండ అని 5, 6 అధ్యాయాలను ఖిల కాండ అని అంటారు.

యాజ్ఞవల్క్యుడు, జనకుడు, గార్గి, మైత్రేయి – ఇలా అనేకమంది ఈ ఉపనిషత్తులో ప్రధాన పాత్రధారులు.

గార్గ్యుడనే వానికి విద్యా గర్వం మెండు. ఆతను అజాతశత్రువు అనే రాజు వద్దకు వెళ్లి అర్థించబడకుండానే **'నేను నీకు బ్రహ్మ విద్యను ఉపదేశిస్తా'** నన్నాడు. సరేనన్నాడు అజాతశత్రువు. చివరకు గార్గ్యుడు భంగపడి అజాతశత్రువు దగ్గరే ఉపదేశం పొందుతాడు. ఇలా విద్యా గర్వం పనికి రాదనీ, ఎదుటి వారి సత్తా తెలుసుకోకుండా అహంకరించకూడదనే సందేశంతో ఈ ఉపనిషత్తు మొదలవుతుంది.

జనకుని యజ్ఞం, అక్కడ జరిగిన సభ, అందులోని వాదోపవాదాలు ఈ ఉపనిషత్తులోని పెద్ద ముచ్చట. ఆత్మను ప్రత్యక్షంగా చూపమన్న ఉషస్తుడికి, కహోలుడికి, ఆత్మ బాహ్య ప్రపంచంలోని వస్తువు (object) కాదని అది మనలోనే ఉండే కర్త (subject) అని యాజ్ఞవల్క్యుడు బోధించాడు.

యాజ్ఞవల్క్యునితో గార్గి వాదోపవాదాలు అత్యంత ఆసక్తికరం, భారతీయ తత్త్వశాస్త్ర సారస్వతంలో ఒక మధుర ఘట్టం. జనకుడికి ఆత్మజ్ఞానం మీద, దేహాత్మల మీద ఇంకా అనేక విషయాల మీద ఉపదేశం ఇచ్చాడు. గార్గి మైత్రేయి సంవాదం కూడా ప్రసిద్ధమైన ఘట్టం. **"అహం బ్రహ్మాస్మి". "అసతో మా సద్గమయ । తమసో మా జ్యోతిర్గమయ । మృత్యోర్మా అమృతం గమయ"** వంటి మహా వాక్యాలు ఇందులోనివే.

ప్రపంచం అంటే నామం, రూపం, కర్మ అని ఉపనిషత్తు చెప్పింది. నామములకు ముఖ్యకారణం వాక్కు. దీని నుండే నామాలన్నీ పుట్టుకు వస్తాయి.

యాజ్ఞవల్క్యమహర్షి జనకునకు వాక్కును జ్యోతి స్వరూపంగా వర్ణించి చెప్పాడు.

**వాచైవాయం జ్యోతిషాస్తే పల్యయతే కర్మ కురుతే విపల్యేతీతి తస్మాద్వై సమ్రాడపి యత్రస్వః పాణిర్న వినిర్జ్ఞ. యతేజ థ యత్ర వాగుచ్చరత్యుపైన తత్ర న్యేతీత్యేవ మేవైత ద్యాజ్ఞవల్క్య!!**

సూర్యుడు, చంద్రుడు, అగ్ని ఇవన్నియు అస్తమించినప్పుడు (లేనప్పుడు) ఈ పురుషునకు జ్యోతి ఏది? అని వేసిన ప్రశ్నకు సమాధానంగా వాక్కే అతనికి జ్యోతియై వున్నది. వాక్సహాయంతో అటు ఇటూ తిరుగుతూ, కర్మ చేస్తూ తిరిగి వస్తున్నాడు. తన హస్తము గూడ తనకు తెలియని అంధకారంలో ఉండే స్థితిలో వాక్కు ఏ దిక్కునుండి వస్తున్నదో ఆ దిక్కునకే మనుష్యుడు వెళుతున్నాడు. అని యాజ్ఞవల్క్యుడు జనకునితో చెప్తాడు.

### 4. యోగశిఖోపనిషత్తు

యోగోపనిషత్తులలో ఇది అగ్రగణ్యమైనది. అందుకే దీనికి 'యోగశిఖ' అనే పేరు వచ్చింది. భగవద్గీతకూ దీనికీ పోలికలున్నాయి. భగవద్గీతలో ఎలాగైతే తన పద్దెనిమిది అధ్యాయాలలో పద్దెనిమిది విభిన్న సాధనా మార్గాలను వివరించిందో, అదే విధంగా, ఈ ఉపనిషత్ కూడా తన ఆరు అధ్యాయాలలో ఆరు సాధనా మార్గాలను చెప్పింది. సిద్ధ యోగానికి ఎక్కువ ప్రాధాన్యత నిచ్చిన ఈ గ్రంథం, కుండలినీయోగాన్ని, అద్వైతసంప్రదాయాన్ని, యోగసాధనంలోని

అనేక అంశాలను ఒకేచోట వివరించే ప్రయత్నం చేసింది.

భాషాశాస్త్రానికి ప్రాణ భూతమైన స్వర, అక్షరాలను గురించిన వివేచనతో పాటు ఆయా అక్షరాల ఉత్పత్తికి కారణమైన వాయునిర్గమనాన్ని వాటి ఉత్పత్తి స్థానాన్ని అక్షరపరబ్రహ్మగా భావించి చేసిన వివేచన ఇందులో కనిపిస్తుంది. పరా, పశ్యన్తి, మధ్యమా, వైఖరి వాక్కుల వివరణతోపాటు వాక్కు ఎలా ఏర్పడుతుందో వంటి చర్చలు కూడా కనిపిస్తాయి.

**శ్లో. ప్రాణేన చ స్వరాఖ్యేన ప్రథితా వైఖరీ పునః**
**శాఖాపల్లవరూపేణ తాల్వాదిస్థానఘట్టనాత్ 5**
**శ్లో. అకారాదిక్షకారాన్తాన్యక్షరాణి సమీరయేత్**
**అక్షరేభ్యః పదాని స్యుః పదేభ్యో వాక్యసంభవః 6**
**శ్లో. సర్వే వాక్యాత్మకా మన్త్రా వేదశాస్త్రాణి కృత్స్నశః**
**పురాణాని చ కావ్యాని భాషాశ్చ వివిధా అపి 7**
**(యోగశిఖోపనిషత్తు అధ్యాయం: 3)**

స్వరమను ప్రాణముచే 'వైఖరి' ప్రసిద్ధమైనది. తాలువులు మున్నగు స్థానముల యొత్తిడిచే శాఖాపల్లవ రూపమున, అకారాది క్షకారాంత అక్షరములు కల్గును. అక్షరముల నుండి పదములు, పదముల నుండి వాక్యము ఏర్పడును. మంత్రములు, వేద శాస్త్రములన్నియు పూర్తిగా వాక్యాత్మకములు, పురాణములు, కావ్యములు వివిధ భాషలు అన్నియు వాక్యాత్మకములే. సప్త స్వరములు, గాథలు అన్నియు నాదము వలన పుట్టినవే.

**శ్లో. సప్తస్వరాశ్చ గాథాశ్చ సర్వే నాదసముద్భవాః**
**ఏషా సరస్వతీ దేవీ సర్వభూతగుహాశ్రయా 8**
**శ్లో. వాయునా వహ్నియుక్తేన ప్రేర్యమాణా శనైః శనైః**
**తద్వివర్తపదై ర్వాక్యైరిత్యేవం వర్తతే సదా 9**
**శ్లో. య ఇమాం వైఖరీ శక్తిం యోగీ స్వాత్మని పశ్యతి**
**స వాక్సిద్ధిమవాప్నోతి సరస్వత్యాః ప్రసాదతః 10**
**శ్లో. వేదశాస్త్ర పురాణానాం స్వయంకర్తా భవిష్యతి**
**(యోగశిఖోపనిషత్తు, అధ్యాయం: 3)**

ఈ సరస్వతీ దేవి సర్వ భూతముల యొక్క గుహను (నోటిని, హృదయమును) ఆశ్రయించినది. వహ్ని యుక్తమైన వాయువుచే మెలమెల్లగా ప్రేరేపింపబడినదై దాని వివరమైన (మార్పు) పదములతో, వాక్యములతో ఈ రీతిగా ఉండును. ఏ యోగి ఈ వైఖరీ శక్తిని స్వాత్మ యందు చూచునో అతడు సరస్వతీ ప్రసాదమున వాక్సిద్ధిని పొందును. స్వయముగా వేద శాస్త్రములకు కర్తయగును.

**5. శ్వేతాశ్వతరోపనిషత్తు**

శ్వేతాశ్వతరోపనిషత్తు కృష్ణ యజుర్వేద శాఖకు చెందినది. ఈ ఉపనిషత్తులో ఆరు అధ్యాయములు ఉన్నాయి. ఈ ఆరు అధ్యాయాల్లో మొత్తం 113 మంత్రములు ఉన్నాయి. ఈ ఉపనిషత్తు శ్వేతాశ్వతర



బ్రహ్మర్షి తన శిష్యులకు బోధించగా ఆయన పేరిటనే ఈ ఉపనిషత్తు విఖ్యాతమైంది. శ్వేతాశ్వతరం అనే పదానికి చాలా అర్థాలు ఉన్నాయి. ఇంద్రియ నిగ్రహం అని ఒక అర్థం (శ్వేత – శుభ్రమైన, అశ్వతర – ఇంద్రియములు), మంచి కోడెదూడ అని ఇంకొక అర్థం (శ్వేత – స్వచ్ఛమైన, అశ్వ తర – కోడెదూడ) మనం వినే ప్రవచనాలలో ఏ ఒక్క సిద్ధాంతాన్ని ఈ ఉపనిషత్తు బలపరచదు. ద్వైతానికీ, విశిష్టాద్వైతానికీ, అద్వైతానికీ, తదితర వేదాంత శాఖలకూ కూడా సంబంధపడే మంత్రాలు ఇందులో ఉన్నాయి. కొన్ని మంత్రాల్లో సాంఖ్యము, యోగముల భావాలు ప్రముఖ స్థానాన్ని వహిస్తాయి. కొన్ని మంత్రాల్లో వైదిక శైలి, ఊహ, భావ ప్రకటనలు కూడా ఉన్నాయి. ఈ ఉపనిషత్తుల్లో సరస్వతీ దేవి శక్తిని కొనియాడుతూ చేసిన ప్రస్తావనలు ఉన్నాయి.

**న తస్య కార్యం కరణంచ విద్యతే న తత్సమ శ్చాభ్యధికశ్చ దృశ్యతే**
**పరాకస్య శక్తిర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబల క్రియా చ**
**(శ్వేతాశ్వతరోపనిషత్తు అధ్యాయం: 6, మంత్రం :8)**

ఆ పరమేశ్వరికి కార్యం లేదు. పనిముట్లు లేవు. కారణం కూడా లేదు. ఆమెతో సమానమైనది గాని అధికమైనది కానీ కనబడదు. ఆమె శక్తి అనేక విధములుగా ఉన్నట్లు వేదాల వల్ల వినబడుతోంది, జ్ఞానము, బలము, క్రియ అనేవి ఆ పరమేశ్వరి స్వరూపులైన సరస్వతికి స్వాభావికాలయ్యాయి. ఇట్టి పరాశక్తిని శ్రుత్యాదులు దేవి అని పేర్కొంటున్నాయి. ఈ విధంగా శ్వేతాశ్వతరోపనిషత్తు సరస్వతి శక్తిని కొనియాడుతోంది.

పై ఉపనిషత్తులలోనే కాకుండా సుబాలోపనిషత్తు, ముక్తికోపనిషత్, శాండిల్యోపనిషత్, జాబాలోపనిషత్, కేనోపనిషత్ లలో కూడా సరస్వతీ ప్రస్తావన ఉన్నది.

ఈ విధంగా ఉపనిషత్తులలో సరస్వతీ రూపాన్ని తత్త్వాన్ని బహుముఖాలుగా ప్రస్తావించటాన్ని గమనించవచ్చు.

# తెలుగు భాష – సి.పి. బ్రౌన్ కృషి

**కొల్లేటి రవిబాబు,** ప్రాచీన విశిష్ట తెలుగు అధ్యయన కేంద్రం, నెల్లూరు. ఫోన్ : 94 94 39 8884

పందొమ్మిదో శతాబ్దంలో ఈస్టిండియా కంపెని పాలనలో చాలా మంది అధికారులు స్థానిక భాషలు నేర్చుకున్నారు. కంపెని వారు తెలుగు భాషను నేర్చుకోవడానికి రెండు కారణాలున్నాయి. ఒకటి తెలుగుభాషను నేర్చుకొని, వారి క్రైస్తవ మతాన్ని తెలుగు ప్రజల్లో వ్యాప్తిచెందించటం. రెండు పరిపాలనా దృష్ట్యా ప్రజలతో వ్యవహార కార్యకలాపాలు జరపడానికి. అలా తెలుగు నేర్చుకున్నవారిలో సర్ విలియం జోన్స్ (1746-94), చార్లెస్ విల్కిన్స్ (1750-1836), కన్నల్ కాలిన్ మెకంజీ (1753-1821), విలీమ్ కెరీ(1761-1834) లాంటి వారున్నారు. వీరులో కొందరు సేవా దృక్పథంతో, భాష, సాహిత్య పరిశోధనా దృక్పథంతో కృషిచేసి తెలుగువారి హృదయాలలో శాశ్వత స్థానం సంపాదించుకున్నారు. అలాంటి కొద్దిమందిలో చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (1798-1884) ఉద్యోగ విధులు నిర్వహిస్తూనే విలువైన సాహిత్య సంపదను భవిష్యత్ తరాలవారికోసం భద్రపరిచాడు.

చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ తన జీవిత సర్వస్వాన్ని తెలుగు సాహిత్య సేకరణకు అర్పించి సార్థకత చేకూర్చుకున్నాడు. ఈస్టిండియా కంపెనీ తరఫున ఎందరో యూరోపియన్లు వర్తకం పేరుతో మన దేశానికి వలస వచ్చారు. పరిపాలనలో భాగమై బ్రిటిష్ ప్రభుత్వానికి లాభాన్ని చేకూర్చారు. అయినా ఇదంతా జరిగి రెండు వందల సంవత్సరాలు దాటినా ఎందుకు గుర్తు తెచ్చుకుంటున్నామంటే, వాళ్లు తమపని తాము చక్కబెట్టుకుంటూనే మనకు ఎంతో కొంత సేవచేశారు. సి.పి. బ్రౌన్ తెలుగు నేర్చుకునేటప్పుడే మన భాషలోని మాధుర్యానికి, సాహిత్యంలోని గొప్పదనానికి ఆకర్షితుడయ్యాడు. బ్రౌన్ ఏం చేశాడనే వారికీ, వలస ప్రభుత్వ ప్రతినిధి అని చిన్నచూపు చూసేవారికి **"ఒంటిచేతి మీదుగా ఏ సాహిత్యానికైనా మళ్ళీ ప్రాణం పోయటం, అందులోనూ ఒక విదేశీయుడు ఆ పని చేయడం నిండా దుష్కరమైన కార్యం. 1825లో తెలుగు సాహిత్యం చచ్చుబడి ఉన్నది. ముప్పది సంవత్సరాలలో నేను దానిని బతికించి నిలబెట్టాను"** అని చెప్పుకున్న సి.పి. బ్రౌన్ మాటలు గుర్తు చేస్తూ, తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన సేవ వివరించడం ఈ వ్యాసం ఉద్దేశం.

**కుటుంబ నేపథ్యం:** బ్రౌన్ పంద్దొమ్మిదో శతాబ్ది పూర్వార్ధంలో 1798, కలకత్తాలో జన్మించాడు. తల్లిదండ్రులు ఫ్రాన్సిస్ కౌలే, డేవిడ్ బ్రౌన్. వారి అయిదుగురు సంతానంలో బ్రౌన్ రెండోవాడు. సువార్త ప్రచారం చేయాలనే సంకల్పంతో భారతదేశం చేరిన క్రైస్తవ బోధకుడు రివరెండ్ డేవిడ్ బ్రౌన్ తన కొడుకు భవిష్యత్తుకు చిన్ననాడే బాటలు వేశాడు. తండ్రి ప్రోత్సాహంతో బ్రౌన్ బాల్యంలోనే హిబ్రూ, అరబ్బీ, గ్రీకు, లాటిన్, హిందూస్తానీ భాషలు నేర్చుకున్నాడు. ఆ జ్ఞానంతో అప్పుడప్పుడు తండ్రికి "ప్రూఫులు చదవడంలో సహాయపడేవారు. ఒకానొక సందర్భంలో తన మిగతా పిల్లలకంటే సి.పి.బ్రౌన్ తెలివైనవాడని డేవిడ్ బ్రౌన్ అన్నాడట. డేవిడ్ బ్రౌన్ తన పిల్లలకు గ్రంథ ఆవిష్కరణ విధానాలు, వివిధ పాఠాంతరాలను సేకరించి తులనాత్మకంగా పరిశీలించే పద్ధతి నేర్పాడు. ఈ విధానాలే తర్వాత పండితులకు అనేక తెలుగు కావ్యాల పాఠ నిర్ణయానికి మార్గదర్శకా లౌతాయని ఎవరూ ఊహించి ఉండరు. ఈ విధంగా చిన్నతనంలోనే బ్రౌన్ భవిష్యత్కార్యానికి పనికివచ్చే విషయాల్లో పునాదులు పడ్డాయి.

**విద్య, ఉద్యోగ జీవితం:** కుంఫినివారు భారత దేశంలో ఉద్యోగం చేస్తూ ఎవరైనా మరణిస్తే వారి కుటుంబంలోని వారికి ఉద్యోగ అవకాశంతో పాటు అందుకు అవసరమైన చదువు, శిక్షణ ఇచ్చేవారు. డేవిడ్ బ్రౌన్ మరణించడంతో బ్రౌన్ కుటుంబీకులకు ఆ అవకాశం వచ్చింది. 1816లో సివిల్ సర్వీస్ శిక్షణ పూర్తి చేసిన ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ తన పందొమ్మిదో ఏట మద్రాసు సివిల్ సర్వీసులో రైటరు గా చేరాడు. "తెలుగు" అనేది ఒక భాష ఉందని అప్పటికి తెలియదట. కానీ మద్రాను కాలేజీలో 1817లో వెలగపూడి కోదండరామ పంతులు గారు చెప్పిన పాఠాలు విని అనతి కాలంలోనే తెలుగులో మంచి పట్టు సాధించాడు. 1820లో కడప జిల్లా కలెక్టర్‌కి అసిస్టెంట్ గా, 1822లో మచిలీపట్నం జిల్లాకు రిజిస్టర్ గా ఉన్నారు. 1823 తర్వాత ఉద్యోగంలో భాగంగా మచిలీపట్నం, రాజమండ్రి, కడపలలో విధులు నిర్వహిస్తూనే ప్రాచీన కావ్యాలకి, చరిత్రకి, సంస్కృతికి సంబంధించిన అనేక గ్రంథాలను సేకరించి ప్రచురించాడు. 1824 నుండి తెలుగులోగల కావ్యాలను చదవటం ఆరంభించాడు. తెలుగు సాహిత్యాన్ని చదవడంకోసం స్థానిక పండితులతో స్నేహం చేశాడు. 1826లో బ్రౌన్ కు రాజమండ్రి నుండి కడపకు బదిలీ కావడంతో అతడు సేకరించిన ఛందో గ్రంథాన్ని స్థానిక పండితుల సహాయంతో పూర్తి చేసే అవకాశం కలిగింది అని సంతోషించాడు. కడపలో తెలుగు రాయడం, చదవడం వచ్చిన వారితో, అప్పటికే తాను సేకరించిన తెలుగు కావ్యాలను, పాఠాంతరాలతో ఉన్న వాటిని పండితులకు ఇచ్చి, వారిచేత పరిష్కరణ చేయించాడు.

ఆ రోజుల్లో ఎందరో పాశ్చాత్యులు తెలుగు చదివారు. కానీ ఎవరూ బ్రౌన్ వలె భాషాసేవకు పూనుకోలేదు. తెలుగు భాషా సాహిత్యాలకు ఆకర్షితుడైన బ్రౌన్ తాళపత్ర గ్రంథాలలో, శాసనాలలో, జనవ్యవహారంలో నిక్షిప్తమైన తెలుగు సాహిత్యాన్ని వెలుగులోకి తెచ్చాడు. నూతన పద్ధతిలో వ్యాకరణాలు రాశాడు. అకారాది

క్రమంలో నిఘంటువులు నిర్మించాడు. భాషోత్పత్తి క్రమాన్ని పరిశోధించాడు. అప్పటికే మూలనపడిన చాలా తాళపత్ర గ్రంధాలను సేకరించి శుద్ధ ప్రతులను రూపొందించాడు. బ్రౌను కృషి ఫలితంగా వెలుగులోకి వచ్చిన ప్రాచీన కావ్యాలు పాఠకుల్లో సాహిత్య పఠనాభిలాషను పెంచాయనడంలో ఏమాత్రం సందేహంలేదు.

**సాహిత్య సంపద సేకరణ:** ఆధునిక పద్ధతులలో తెలుగు కావ్యాలని పరిష్కరించి ప్రచురించిన వారిలో బ్రౌన్ మొదటివాడు. వివిధ పద్ధతులలో సేకరించిన లిఖిత ప్రతులను పండితుల సహాయంతో పరిష్కరించి భద్రపరిచాడు. అలా భద్రపరిచిన వాటిని విషయం దృష్ట్యా అయిదు భాగాలుగా విభజించవచ్చు.


**1. వేమన పద్యాల పరిష్కరణ**

1829లో వేమన పద్యాల ఆంగ్లీకరించడం. వేమన గురించి బ్రౌన్ మొట్టమొదటిసారిగా 1824లో జె.ఏ. దుబాయ్ రాసిన "హిందూ మానర్స్ కస్టమ్స్ అండ్ సెరిమనీస్" పుస్తకం చదువుతూ తెలుసుకున్నాడు. ఆ తరవాత వేమన గురించి ఆరాతీయడం మొదలుపెట్టాడు. 1824లో బ్రౌన్ మచిలీపట్నంలో ఉన్న సమయంలోనే వేమన పద్యాల సేకరణ, పరిష్కరణకి నాంది పడింది. బ్రౌన్ వివిధ ప్రాంతాల నుండి వేమన పద్యాలకి సంబంధించిన తాళపత్ర ప్రతులు సంపాదించాడు. వాటిని పరిష్కరింపజేసి 1829లో కాలేజీ బోర్డువారి చేత మొదటిసారిగా వేమన పద్యాలను ప్రకటింపజేశాడు. రెండోసారి పరిష్కరించి 1839లో ద్వితీయ ముద్రణ కూడా వేయించాడు. వేమన పద్యాల గురించి బ్రౌను దాదాపు 18 ఏండ్లు శ్రమించాడు. ఇంతటి సుదీర్ఘమైన కృషిలో కూడా బ్రౌను రెండు ముద్రణలు మాత్రమే వెలువరించారంటే ఆయన ఎంతటి పరిశోధనా పటిమగలవాడో మనకు అవగతమౌతుంది.

బ్రౌన్ పరిష్కరించిన అనేకానేక తాళపత్ర ప్రతుల్లో వేమన పద్యాలు ఒక చిన్న భాగం మాత్రమే. వేమన పద్య సంచయంలో సుమతి, భాస్కర, తిరుమలేశ పద్యాలున్నాయని మొదట గుర్తించింది బ్రౌనే. ఈనాడు మనం వేమన పద్యాలు చదువుతున్నామంటే దానికి కారణం బ్రౌన్ ఒక్కడే. ఏదేమైనా బ్రౌన్ సేకరించిన వేమన పద్యాలు చాలు ఆయనకు మనం ఎల్లప్పుడూ ఋణపడి ఉండటానికి!

**2. తాళపత్ర ప్రతులు**

తాళపత్ర గ్రంథాల్లో అప్పటికే మరుగున పడిఉన్న తెలుగు కావ్యాలను సంస్కరించడానికి బ్రౌన్ చేసిన కృషి వెలకట్టలేనిది. ఈ కృషిలో ఆయనకు జూలూరి అప్పయ్య, రావిపాటి గురుమూర్తి శాస్త్రి, చర్మం అద్వైత బ్రహ్మశాస్త్రి మొదలైన పండితులు సహాయం చేశారు. తెలుగులోగల పంచ మహాకావ్యాల్లో భాగమైన మనుచరిత్ర, వసుచరిత్ర మొదలైన కావ్యాలు వ్యాఖ్యానాలతో సహా అచ్చయ్యాయంటే అది బ్రౌను కృషి ఫలితమే. తాను తలపెట్టిన భాషా సాహిత్యాల సేవకు



అప్పట్లోనే వేలకొద్ది డబ్బు ఖర్చుచేశాడు. అంతేకాకుండా కొంతమంది దగ్గర అప్పు కూడా చేశాడనీ తెలుస్తుంది. పాలకునిగా వచ్చిన బ్రౌన్, స్వదేశస్థులకంటే తెలుగును అధికంగా ప్రేమించి, తెలుగు భాషా సాహిత్యం పురోభివృద్ధికి తోడ్పడ్డాడు.

బ్రౌన్ కు ఆంధ్రదేశంలో గల పండితులతో, సాహిత్య పోషకులతో సత్సంబంధాలు ఉండేవి. అందుల్లే తెలుగు కావ్యాలను సంపాదించ డానికి మార్గం సుగమమైంది. వసుచరిత్ర, మనుచరిత్రలే కాకుండా బమ్మెర పోతనామాత్యుని "ఆంధ్ర భాగవతం" శుద్ధప్రతిని తయారు చేయించినది బ్రౌనే. గౌరన మంత్రి రాసిన "హరిశ్చంద్ర" అనే ద్విపద కావ్యాన్ని కూడా పరిష్కరణ చేయించాడు. అంతేకాకుండా "పల్నాటి వీరచరిత్ర', 'విజయ విలాసం', 'సారంగధర చరిత్ర', 'దశావతార చరిత్ర', "కవికర్ణ రసాయనం" వంటి తెలుగు కావ్య సాహిత్యాన్ని భద్రపరిచాడు. అంతే కాకుండా తెలుగు సాహిత్యంతో ఆంగ్లసాహిత్యాన్ని పోల్చిచూశాడు.

ఈ విధంగా మొట్టమొదటగా తెలుగులో తులనాత్మక పద్ధతిని ప్రవేశపెట్టినవాడు కూడా బ్రౌనే. అంతేకాకుండా బ్రౌన్ చాలా సంస్కృత గ్రంధాలను కూడా సేకరించి, పండితులచేత వ్యాఖ్యానాలు రాయించి, ముద్రణకు సిద్ధంచేయించాడు. గ్రంధ సేకరణ విషయంలో హిందువుల మంత్ర తంత్రాలపై అంత విశ్వాసం లేకున్నా వాటికి సంబంధించిన గ్రంథాల్ని కూడా సేకరించాడు. అచ్చువేయగలిగినన్ని కావ్యాలను స్వయంగా అచ్చు వేయించాడు. ఇంకొన్ని ఇతరుల కిచ్చాడు. మిగిలిన వాటిని ఎక్కువ కాలం ఉండేవిధంగా మంచి కాగితాలపై దేశి సిరాలతో రాయించి భద్రపరిచాడు.

బ్రౌను తెలుగు భారతాన్ని 1825లో చదవడం ప్రారంభించాడు. ఆ భారతానికి ప్రజల్లో ఉన్న ఇష్టాన్ని గుర్తించి శుద్ధప్రతిని తయారు చేయించాడు. తెలుగు కావ్యాలను వెలుగులోకి తేవడంతో తృప్తిపొందక తెలుగు లక్షణ గ్రంధాల్ని కూడా వెలుగులోకి తెచ్చాడు. ఇలా లెక్కలేనన్ని కావ్యాలను సేకరించి, ముద్రించి తెలుగు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాడు.



### 3. నిఘంటు నిర్మాణం

బ్రౌన్ కాలానికి తెలుగులో "ఆంధ్రనామ సంగ్రహం", "ఆంధ్ర నామ శేషం", "సాంబ నిఘంటువు" వంటి కొన్ని నిఘంటువులు ఉన్నాయి. అయితే సంస్కృత "అమరకోశం" లాగా ఈ నిఘంటువు లన్నీ ధారణ చేయవలసి వచ్చేది. అది గమనించిన బ్రౌన్ తెలుగు నేర్చుకోవాలనుకునే పాశ్చాత్యులకు, ఆంగ్లం నేర్చుకోవాలనుకునే భారతీయులకు ముఖ్యంగా తెలుగువారికి ఉపయోగపడే విధంగా నిఘంటువుల్ని నిర్మించాలని, తెలుగు నిఘంటు నిర్మాణంలో బ్రిటిష్ పద్ధతిని ప్రవేశపెట్టాడు. 1852, 1853 సంవత్సరాల్లో "తెలుగు టు ఇంగ్లీష్", "ఇంగ్లీష్ టు తెలుగు" నిఘంటువులను, 1855లో మిశ్రభాషా నిఘంటువును కూర్చాడు. వీటినే "బ్రౌణ్యం" అని అంటారు. వీటిలో పాలనా సంబంధమైన పర్షియన్, ఇంగ్లీషు, ఉర్దూ మొదలైన పదాలు, వాటి వివరణలు ఇచ్చాడు. అంతేకాకుండా "The Prosody of Telugu and Sanskrit", "The Refuge of poets" అనే ఛందో ప్రాశస్త్యంగల పుస్తకాలనూ రాశాడు. బ్రౌను రచనల్లో తెలుగు పండిత లోకాన్ని విశేషంగా ఆకర్షించినవి ఆయన కూర్చిన నిఘంటువులే.

### 4. వ్యాకరణాలు

ఆంగ్లంలో తెలుగుకు సాధ్యమైనంతవరకు సమగ్రమైన వ్యాకరణం రాయాలని అతడు చేసిన కృషిచేశాడు. 1840లో తెలుగు వ్యాకరణాన్ని ముద్రించాడు. దీని ముందుమాటలో తెలుగులో వచ్చిన వ్యాకరణాలను గురించి రాస్తూ, చాలా చిన్నవని చెప్పాడు.

### 5. చరిత్ర పట్టికలు, వ్యాసావళి

తెలుగు వాచకాలు, ఛందస్సుపై వ్యాసాలు, హిందూ ముస్లింల చరిత్రకు సంబంధించిన కాలనిర్ణయ పట్టికలు, క్రైస్తవమత సంబంధమైన రచనలను కూడా బ్రౌన్ వెలువరించాడు.

వీటితోపాటు బ్రౌన్ 'తాళపత్రాల సేకరణ' పాఠశాలలను నెలకొల్పడం వంటివి ఎన్నో చేశాడు. ఇలా గ్రంథసేకరణ–పరిష్కరణ, లేఖలు, నిఘంటువులు, చిన్న చిన్న రచనలు, చాటువులు మొదలైన ప్రక్రియా సాహిత్యాన్నీ సేకరించాడు.

1855లో ఇంగ్లాండు తిరిగి వెళ్లినా, 1884లో కాలధర్మం చెందేవరకు తెలుగుభాషకు, సాహిత్యానికి సేవ చేస్తూనే ఉన్నాడు. ఈ కాలంలోనే లండను విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యులుగా పనిచేశాడు.

బ్రౌను జీవించిన ఎనభై ఆరు సంవత్సరాలలో అరవైఏడు సంవత్సరాలు (1817–1884) తెలుగుభాషా సేవలోనే గడిపాడు. తన ఇంటినే ఒక విద్యాకేంద్రంగా, తానే ఒక మహారాజ పోషకుడిగా వ్యవహరించాడు. భాషా సాహిత్యాలకు అమూల్యమైన సేవ చేశాడు. పండితుల్ని పోషించాడు. అందుకే సమకాలికులు ఆయనను **"నూరార్లు లెక్క సేయక పేర్లందిన విబుధ జనులను", "ఆంధ్ర భాషోద్ధారకులలో కలకాలం స్మరించదగిన మహనీయుడు, మహావిద్వాంసుడు", "సి.పి. బ్రౌన్ అనునాతడు ఆంధ్రభాషామతల్లి సేవకే జన్మమెత్తినట్లు కానవచ్చుచున్నది. ఈతదాంధ్ర వాఙ్మయోభివృద్ధికై చేసినంతటి పని ఇటీవలి. వారెవ్వరూ చేయలేదు"** అని పొగిడారు.

తెలుగుకు ఇంత సేవ చేసిన ఆయనకు తెలుగు వాళ్లు చేసింది ఏమీ లేదనే చెప్పాలి. ఒక విశ్వవిద్యాలయానికి కూడా వారి పేరు పెట్టలేదు. కడపలో జానమద్ది హనుమచ్ఛాస్త్రిగారి అధ్యక్షతను సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయాన్ని మాత్రం కట్టించారు. బ్రౌను 1820–22 సంవత్సరాల్లో, 1826–29 సంవత్సరాల్లోనూ నివసించిన ఇంటి స్థానంలోనే ఈగ్రంథాలయాన్ని నిర్మించారు. ఈ గ్రంథాలయంలో బ్రౌన్ సేకరించిన గ్రంథాలతో పాటు 50,000 పైచిలుకు గ్రంథాలున్నాయి.

బ్రౌన్ ఆనాడు తెలుగు సాహిత్యాన్ని సేకరించి, భద్రపరచకపోతే ఈనాడు మాదీ అని చెప్పుకుంటున్న సాహితీ సర్వస్వం ఉండేదికాదు. ''జనని సంస్కృతంబై సర్వభాషలకును'' అన్న భావాన్ని తొలగింపజేశాడు బ్రౌన్. తెలుగును స్వతంత్ర భాషగా గుర్తించేలా చేశాడు బ్రౌన్. "ఆంధ్రత్వమాంధ్ర భాషాచ నాల్పస్య తపసః ఫలమ్" అని అప్పయ్య దీక్షితులు చెప్పిన సత్యాన్ని తెలుగువారు గుర్తుంచుకునేలా చేశాడు బ్రౌన్.

**ఆధార గ్రంథాలు :**

1. ఆరుద్ర. బ్రౌన్ సాహిత్య క్రౌన్. 2012. సమగ్ర ఆంధ్ర సాహిత్యం (సం. 3 ). తెలుగు అకాడమి, హైదరాబాదు.

2. రాధాకృష్ణ శర్మ, చల్లా. సి. పి. బ్రౌన్ సాహితీ సేవ. 1975. సి. ఎల్. ఎస్. బుక్ షాప్, హైదరాబాదు.

3. వీరభద్ర రావు, కొత్తపల్లి. సి. పి. బ్రౌన్. 1963. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి . హైదరాబాదు

4. హనుమ చ్ఛాస్త్రి, జానుమద్ది. సి పి బ్రౌన్. 1992. తెలుగు అకాడమి, హైదరాబాదు.

# ఉస్మానియా విశ్వవిద్యాలయ తొలి తెలుగు అధ్యాపకురాలు – గాలి ఇందిరా వందనం

ఆచార్య వెలుదండ నిత్యానంద రావు, ఫోన్ : 9441 666 881

చరిత్ర ఎప్పుడు ఎలాంటి మలుపులు తీసుకుంటుందో ఎవరూ ఊహించలేరు. దాని మంచి చెడ్డలు మన అభిరుచులకు, ఇష్టానిష్టాలకు అనుగుణంగా వ్యాఖ్యానించుకుంటాం. అయ్యో! ఇలా జరిగి ఉంటే ఎంత బాగుండేది. ఇలా జరగకపోయి ఉంటే బాగుండేది కదా! అని అనుకోవడం కూడా సాధారణ అంశం. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ 1940దాకా చీకటి యుగమే. ఎంతటి మహాకవులయినా, ఎంతటి మహానుభావులైనా కాలం అనుకూలించక పోతే మౌనాన్ని, నిష్క్రియత్వాన్ని ఆశ్రయించక తప్పదు. 1938 వందేమాతర ఉద్యమానంతరం 1940 లో ఉస్మానియాలో ఎం.ఎ తెలుగు ప్రారంభమైంది. 1942లో పల్లాదుర్గయ్య, 1947లో ఈటూరి లక్ష్మణరావు (సమాచారశాఖలో పనిచేసి 1965లో దివంగతులయ్యారు. సమగ్రవ్యాసం కోసం చూడుడు. నా అక్షరమాల పుటలు 532–537), 1949లో కే. గోపాలకృష్ణారావు ఉత్తీర్ణు లయ్యారు. 1946లో రాయప్రోలు సుబ్బారావు రిటైర్ అయి వరంగల్ డిగ్రీ కళాశాలకు వ్యవస్థాపక ప్రిన్సిపల్ అయ్యారు. ఖండవల్లి లక్ష్మీరంజనం, కే. గోపాల కృష్ణారావులు తెలుగుశాఖలో అధ్యాపకులు. చెలమచర్ల రంగాచార్యులు వరంగల్ డిగ్రీ కళాశాలలో లెక్చరర్. ఇది 1950 వరకు ఉన్న ఉస్మానియా తెలుగుశాఖ ముఖచిత్రం.

1948 సెప్టెంబర్ లో పోలీస్ చర్య జరిగింది. మేజర్ జయంత్ నాథ్ చౌదరి కొంతకాలం పాలించాక ఎం.కే. వెల్లోడి అనే సివిల్ అధికారి హైదరాబాద్ స్టేట్ ముఖ్యమంత్రి అయ్యారు. హైదరాబాద్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పడింది. తెలుగుశాఖకు అధ్యాపకుల నియామకం జరిగింది. ఎక్కడి వారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు అలియావర్ జంగ్, తెలుగుశాఖ అధ్యక్షులు ఖండవల్లి లక్ష్మీరంజనం, విషయ నిపుణులు మదరాసు విశ్వవిద్యాలయానికి చెందిన కోరాడ రామకృష్ణయ్య, పబ్లిక్ సర్వీసు కమీషన్ సభ్యులైన ఆచార్య తనికెళ్ల వీరభద్రుడు తదితరులు ఎన్నిక కమిటీలో సభ్యులు. అప్పుడు ముగ్గురు తెలుగుశాఖకు అధ్యాపకులుగా ఎన్నికయ్యారు.

**1. వెల్లలూరు వెంకట రాఘవ శర్మ** (జననం.3-9-1912) చిత్తూరు ప్రాంతీయులు. మద్రాస్ లో ఎం ఓ ఎల్ చేశారు. అద్భుతమైన పండితులు. వెంటనే చేరిపోయారు. చేరిన తేది. 10-8-1950. విద్యార్థులను అమితంగా ఆకట్టుకొన్నారు. ఎంతగా అంటే వారి శిష్యులు ఇప్పుడు 90 దాటిన వారు ఉన్నారు. ఇప్పటికీ ఆయనను ప్రశంసిస్తారు. కానీ ఏడాదిన్నర, రెండేళ్ళు తిరగక ముందే రాజీనామా ఇచ్చి వెళ్లిపోయారు. ఎంఏ ద్వితీయ సంవత్సరంలో బి. రామరాజు, ఇల్లిందల సుజాతగారలకు, బి.ఎ. ద్వితీయ సంవత్సరంలో సి. నారాయణ రెడ్డి, ఇరివెంటి కృష్ణమూర్తి గారలకు, బి.ఏ. మొదటి సంవత్సరంలో ఎం.కులశేఖర రావు గారికి రాఘవశర్మ పాఠాలు చెప్పారు. (సమగ్రవ్యాసం కోసం చూడుడు. నా అక్షరమాల పుటలు 592-596 అయితే జన్మించిన తేది, తెలుగుశాఖలో చేరిన తేది అధికారికంగా ఆనాటికి దొరకకపోవడంతో అక్కడ పేర్కొనలేదు.)



**2. దివాకర్ల వెంకటావధాని :** విశాఖపట్నం నుంచి వచ్చి ఎన్నికయ్యారు. ఆయన విశాఖపట్నం నుంచి రావాలా వద్దా అన్న ఊగిసలాటతో కొంత వ్యవధి కోరుకున్నారు. నాన్చి, నాన్చి మొత్తం మీద 1951 జులై 9న చేరారు. హైదరాబాదులో నిలదొక్కుకొని అసాధారణ ప్రతిభాశాలిగా, మహావక్తగా, ఆదర్శ అధ్యాపకునిగా తెలుగుశాఖకు శాశ్వత కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిపెట్టారు.

**3. మూడవ వ్యక్తి కుమారి గాలి ఇందిరా వందనం.** ఆ రోజుల్లో ఉద్యోగం కోసం వచ్చిన దరఖాస్తుల్లో కొత్తపల్లి వీరభద్రరావు లాంటి మగవారివి ఉన్నాయి తప్ప ఆడవారివి లేకుంటాయని ఊహించడానికి పెద్దగా కష్టపడాల్సిన పనిలేదు. మద్రాసు, ఆంధ్రవిశ్వవిద్యాలయాలు తప్ప మరేవీ లేవు. అప్పటివరకు అర్హులు వేళ్ళ మీద లెక్కించదగినవారే.

కుమారి గాలి ఇందిరా వందనం ఒక క్రైస్తవ వనిత. గుంటూరు వాస్తవ్యురాలు. తల్లిదండ్రులు రత్నమ్మ, గాలి వందనం. తమిళనాడు పద్ధతిలో తండ్రి పేరు చివర పెట్టుకొని ఇందిరావందన మయ్యారు జన్మించిన తేదీ. 20-8-1920. తల్లిదండ్రులు విద్యావంతులైతే పిల్లలను



చక్కగా చదివించగలరనడానికి వారే ఉదాహరణ. వందనం గారు మద్రాస్ ప్రెసిడెన్సిలో జిల్లా విద్యాశాఖాధికారి. 9 మంది సంతానంలో ఇందిరగారు మూడవ సంతానం. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో జపాన్ వారు బాంబులు వేస్తారన్న భయంతో ఆంధ్రవిశ్వవిద్యాలయం గుంటూరుకు తరలి వచ్చింది. (1942–1946) పింగళి లక్ష్మీకాంతం, గంటి జోగి సోమయాజి, దువ్వూరి వెంకటరమణశాస్త్రి మొదలైన వారు అధ్యాపకులు. ఆంధ్రవిశ్వవిద్యాలయం గుంటూరులో ఉన్న కాలంలో బి.ఎ. ఆనర్స్ పూర్తి చేసిన ఇందిరావందనం ఉస్మానియా విశ్వవిద్యాలయం అధ్యాపకురాలిగా ఎంపికయ్యారు. 6-3-1950న కోఠి, మహిళా కళాశాలలో చేరారు. మెదటి నెలజీతం 300రు. అప్పటి ప్రిన్సిపల్ డా.జి.ఎం. లిన్నెల్ అనే పాశ్చాత్యవనిత. అంతా కొత్త వాతావరణం. నిజాం రాజ్యంతో ఏ మాత్రం సంబంధం లేని ప్రాంతం నుండి వచ్చారు. ఇంటర్, డిగ్రీ క్లాసులు చెప్పారు. ఆనాడు ఆమె క్లాసుల్లో ఉన్న విద్యార్థినులు పి.యశోదారెడ్డి, (వక్తగా, అధికారభాషాసంఘం అధ్యక్షులుగా, ఆచార్యులుగా పేరు పొందారు.) వి. సీతా కళ్యాణి, సంయుక్తారెడ్డి గారలు తదనంతరకాలంలో ఉస్మానియా తెలుగుశాఖలో అధ్యాపకులయ్యారు. ఒక సంవత్సరం probation కూడా దిగ్విజయంగా పూర్తి చేసుకొన్నారు.

ఇంతలో గాలి ఇందిరా వందనంగారికి టి. జాన్ మోసెస్ విల్సన్ గారితో పెళ్లి కుదిరింది. దాంతో ఇక్కడ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి తమ దేశం (బ్రిటిషాంధ్ర- గుంటూరు) వెళ్లిపోయారు. విల్సన్ గారు రైల్వే సర్వీస్ కమిషన్ చైర్మన్ గా, గోదావరి జిల్లాల పార్లమెంట్ సభ్యుడిగా వ్యవహరించారు. శ్రీమతి ఇందిరా విల్సన్ గుంటూరులోని మిసెస్ గుడ్ హోప్ కాలేజి (నేటి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల) లో తెలుగు అధ్యాపకులుగా చేరారు.

ఇందిరా వందనం గారి అసంఖ్యాక విద్యార్థినులలో రచయిత్రి, ఉత్తమ అధ్యాపకురాలు, ప్రిన్సిపల్ డాక్టర్ పులిగడ్డ విజయలక్ష్మిగారు (82ఏళ్ళు) ఒకరు. విజయలక్ష్మి 1955-57,1958-60లలో ఆ కళాశాలలో ఇంటర్మీడియట్, బి.ఎ.( మ్యాథమెటిక్స్) చదివారు. బి.ఎ అప్పుడు రెండేళ్ళే. ఆ తర్వాత మూడేళ్లు అయింది. బిఎస్సీ లోనేకాక బి.ఎ.లో కూడా సైన్సు, లెక్కలు ఉండేవి. ఆ తరువాత అవి పూర్తిగా బిఎస్సిలోకి మారాయి. ఇందిరా విల్సన్ ఎంతో ఆకర్షణీయంగా, మనోహరంగా పాఠం చెప్పేవారనీ, ఒక్కసారి చెబితే చాలు అలా మనసులో ముద్ర పడిపోయేదని చెప్తూ, ప్రతిభను ప్రోత్సహించడంలో ఆమెకు ఆమెనే సాటి అని విజయలక్ష్మిగారు ఆనాటి ఒక ఉదంతాన్ని పేర్కొన్నారు. డిగ్రీలో కొమ్మనమంచి జోగయ్యశర్మ రాసిన కుమారసంభవం పాఠ్యాంశంగా ఉండేది. దాని మీద తాను రాసిన ప్రశ్న పత్రాన్ని తరగతిగదిలోకి తీసుకొని వచ్చి చదివి వినిపించి ఇలా విజయలక్ష్మి రాసినట్లుగా రాయాలని చెప్పడం ఆమె గొప్పతనం. ఇది నాకు లభించిన గొప్ప సత్కారం. నేను ఎప్పటికీ మర్చిపోలేనని విజయలక్ష్మిగారు అన్నారు. ఆనాటి అధ్యాపక వర్గంలో మేటిగా నిలిచిన ఇందిరా విల్సన్ గారిని 68 తర్వాత మళ్లీ తలుచుకునే అవకాశం నీవల్ల కలిగిందని నన్ను ప్రశంసించారు.

విల్సన్ ఇందిర దంపతులకు ఐదుమంది మగ పిల్లలు. ఆడపిల్లలు లేరు. ఉద్యోగం చేయాల్సిన అవసరం లేకపోవడం, వరుస కాన్పులు, అనారోగ్యాలు మొత్తం మీద ఓ పదేళ్లపాటు మధ్య మధ్య సెలవులతో ఉద్యోగం చేసి చివరకు రాజీనామా చేసినట్లుగా తెలుస్తుంది. ఇందిరగారి చెల్లెలు శ్రీమతి విమలావందనం భౌతికశాస్త్ర ఉపన్యాసకురాలిగా ఇదే కాలేజిలో రిటైరయి రెండు దశాబ్దాలకిందటే అస్తమించారు. విల్సన్ గారి వెంబడి వివిధ ప్రాంతాల్లో ఉంటూ చివరకు మద్రాసులో స్థిరపడ్డారు. సంతానంలో ఒకరు బెల్జియంలో, మరొకరు అమెరికాలో, మరో ఇద్దరు చెన్నైలో స్థిరపడ్డారు. 1987 డిసెంబర్ లో గాలి ఇందిరా విల్సన్ క్రీస్తు పిలుపునందుకని పరలోక ప్రయాణం చేశారు.

వెంకట రాఘవ శర్మ, గాలి ఇందిరా వందనం స్థిరంగా నిలదొక్కుకొని ఉస్మానియావిశ్వవిద్యాలయంలోనే ఉండి ఉంటే స్థానబలం వల్ల, అవసరాల నిమిత్తం డాక్టరేట్లు చేసి వక్తలుగా, రచయితలుగా, అధ్యాపకులుగా పేరు గడించేవారేమో! ఏమో ఎవరు చెప్పొచ్చారు!? 1951లో హైదరాబాదు కింత ప్రాధాన్యమేర్పడుతుందని వారు మాత్రం ఎలా ఊహించగలరు? మొత్తం మీద వారిద్దరూ అధికారికంగా నియమితులయ్యారు. ఏడాదిన్నర, రెండేళ్ళు పూర్తి కాకుండానే వెళ్లిపోయారు. వారిరువురు బయటకు వెళ్ళాక ఏ రకమైన సాహిత్యకృషి చేసినట్లు కనబడడం లేదు. వారు ఖాళీచేసిన స్థానాల్లో వచ్చిన బి. రామరాజు, నాయని కృష్ణకుమారి గారలు ప్రభావశీలురైన ఆచార్యులుగా, రచయితలుగా వెలిగిపోయిన సంగతి అందరికీ తెలిసిందే.

[అధికారిక సమాచారమున్న ఉద్యోగుల జాబితాలు. ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు చేసిన సూచన,

గాలి ఇందిరావందనంగారి చెల్లెలి కుమారులు శామ్యూలు గారు అందించిన ఫోటో, వ్యక్తిగతవివరాలు వ్యాసరూపకల్పనకు మూలం. అందరికీ కృతజ్ఞతలు.]

# కె. విశ్వనాథ్ చలన చిత్రాలు – సామాజిక అవలోకనం – 32

# శుభప్రదం

**టి. లక్ష్మీనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254

**"కె.విశ్వనాథ్ చలన చిత్రాలు– సామాజిక అవలోకనం"** నందు ఈ మాసం చర్చించబోయే చిత్రం **"శుభప్రదం"**. ఈ చిత్రం 2010 లో విడుదలైంది. శంకరాభరణం, స్వాతిముత్యం, సాగర సంగమం లాంటి గొప్ప చిత్రాలతో తెలుగు చలన చిత్ర సీమలో తన కంటూ శిఖరప్రాయమైన గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు కె.విశ్వనాథ్ గారికి దర్శకుడిగా ఇదే చివరి చిత్రం. యాదృచ్ఛికంగా తన దర్శకత్వ ప్రస్థానానికి స్వస్తి పలికి నటుడిగా తదుపరి కాలాన్ని కొనసాగించారు. అల్లరి నరేష్, మంజరి ఫడ్నవీస్ నాయకానాయికలుగా నటించారు. స్వరాభిషేకం చిత్రం తర్వాత చాలా కాలం విరామం తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందించారు దర్శకులు కె.విశ్వనాథ్.



**చిత్ర కథ :**

చిత్ర కథ కేరళలోని ఒక పవిత్ర దైవ క్షేత్రానికి భక్తులను చేర్చే రైలుతో మొదలవుతుంది. ఇందూ(మంజరి) తన భర్త చక్రి(నరేష్) తో దైవ క్షేత్రానికి వస్తుంది. వారు దిగిన రైల్వేస్టేషన్ లోనే అదే సమయానికి వయసు పైబడడం వల్ల అస్వస్థతకు గురైన ఒక పెద్ద మనిషి ఇందూ కంటపడ్తాడు. ఆయన పరిస్థితిని అర్థం చేసుకున్న ఇందూ మంచి హృదయంతో ఆయన స్టేషన్‌లో విశ్రాంతి తీసుకునేలా ఏర్పాట్లు చేస్తుంది. ఆ సమయంలో పెద్దమనిషి ఇందూకు సంబంధించిన వివరాలు అడుగుతాడు. ఇందు ఆమె గతాన్ని చెప్పడం మొదలెట్టడంతో కథ ఫ్లాష్‌బ్యాక్‌లో కొనసాగుతుంది.

**"ఇందు"** ఒక సంపన్న కుటుంబానికి చెందిన అమ్మాయి. ఆమె తండ్రికి ఇద్దరు సోదరులు. అంతా కలిసి ఒకే ఇంట్లో ఉమ్మడి కుటుంబంగా జీవిస్తుంటారు. ఆ ఇల్లు ఆనందాలకు, సంతోషాలకు చిరునామాగా వుంటుంది. వారి కుటుంబంలో అన్ని ప్రధాన రాష్ట్రాలకు చెందిన అమ్మాయిలు కోడళ్ళుగా వస్తారు. ఇందూ వాళ్ళింట్లో మగవాళ్ళందరికీ బట్టతల వుంటుంది. దానికోసమై తలపై వెంట్రుకలు మొలిచేలా చేసేందుకు ఆమె తాత వింత, వింత ప్రయోగాలు చేసి విఫలం అవుతూ వుంటాడు. ఇందూకు సంగీతం అంటే ప్రాణం. ఇందూకు ఒకసారి చక్రి తంబుర వాయిస్తూ కన్పిస్తాడు. ఆ సందర్భంలో చక్రి ఇందూతో సంగీతం అంటే తనకు కూడా చాలా ఇష్టం అని అబద్దం చెప్పి ఆమెతో పరిచయం చేసుకుంటాడు. ఆ పరిచయం చాలా తక్కువ కాలంలోనే ప్రేమగా మారుతుంది. ఇందూ తన ప్రేమ విషయాన్ని ఇంట్లో చెప్తుంది. ఆమె మాటను దృష్టిలో వుంచుకుని కుటుంబ పెద్దలు చక్రితో అతడి కుటుంబ నేపథ్యం, అతడి ఆలోచనలను తెలుసుకుంటారు. చివరికి చక్రి ఆమెకు సరైన అబ్బాయి కాదని నిర్ణయిస్తారు. కాని ఇందూ మాత్రం చక్రిపై వున్న ప్రేమతో అతడితో ఎలాగైనా జీవితం పంచుకోవాలనుకుంటుంది. దానికోసమై చక్రికి డబ్బు సంపాదించి మా ఇంట్లో కలవమని చెప్తుంది. కొన్నాళ్ళ తర్వాత చక్రి నగలతో ఇందూ ఇంటికి వచ్చి ఆమెను వివాహం చేసుకోవడానికి ఒప్పిస్తాడు. అంతేకాక ఆమెను వివాహం చేసుకుని తనతో తీసుకెళ్తాడు. ఇందూ గతాన్ని విన్న ఆ పెద్దమనిషి (శరత్ బాబు) ఆమెను ఆశీర్వదించి వెళ్ళిపోతాడు.

అదే సమయానికి చక్రి వచ్చి ఇందూతో స్టేషన్‌కు దగ్గరలో ఒక గణపతి దేవాలయం వుంది అక్కడికి వెళ్దాం అని చెప్తాడు. ఆ దేవాలయం ప్రత్యేకత ఏమిటంటే ఆ గుడి ప్రాంగణంలో కొలువైన గణపతి విగ్రహం చెవి వద్ద ఒకవైపున నిలబడి మనకు ఇష్టమైన మనిషిని మరో చెవి వైపు వుంచి మనం చేసిన పాపాలు చెప్తే ఆ పాపాలు ప్రాయశ్చిత్తం అవుతాయి. అక్కడికి వెళ్ళాక చక్రి గణపతి విగ్రహం చెవిలో **"నేను మీ ఇంట్లో చూపించిన నగలు నిజమైనవి కాదు అని చెప్తాడు. అంతేకాక నాకే సంగీతం రాదనే విషయాన్ని చెప్తాడు".** అది విని ఇందూ షాక్ అవుతుంది.

చక్రి ఇంటికి ఇందూ భార్యగా వెళ్లాక అతడి ఇంటిని చూసి ఆమె నోట మాట రాదు. కారణం అది రెండు గదులున్న చిన్న ఇల్లు కావడం. అంతేకాక చక్రి గతంలో ఇందూకు తాను డాక్టర్ ను అని పరిచయం చేసుకుని వుంటాడు. దానికి అనుగుణంగా రోజూ తను ఆసుపత్రికి విధుల నిమిత్తం వెళ్తున్నట్లు నటిస్తాడు. ఒకరోజు చక్రి ఇంటికి అతడు లేని సమయంలో అతడికి అప్పు ఇచ్చిన వ్యక్తి వస్తాడు. ఆ సందర్భంలో ఇందూకు చక్రి అప్పులున్నాడనే విషయమే

కాక అతడు ఏ వైద్య వృత్తీ చెయ్యట్లేదనే విషయం తెలుస్తుంది. అంతేకాక చక్రి కొండపైకి వృద్ధులను, వికలాంగులను భుజాలపై డోలీలతో మోసుకెళ్ళే చిన్న కూలీ పని చేస్తాడు అనే విషయం తెలుసుకుంటుంది. చక్రికి సంబంధించిన నిజాలన్నీ తెలుసుకుని ఇందూ లోలోపల క్రుంగిపోతుంది. అయినప్పటికీ చక్రి ముందు మాత్రం తన కోపాన్ని తెలీనీయకుండా, చక్రికి ఇందూ పై వున్న ప్రేమను అర్థం చేసుకొని అతడికి అర్ధాంగిగా జీవిస్తుంది.

చక్రి చేసిన తప్పులను క్షమించి ఇందూ అతడితో పెళ్లి తర్వాత జీవనాన్ని కొనసాగిస్తూ వుంటుంది. అలా సాగిపోతున్న వారి దాంపత్యంలోకి మునుపు రైల్వేస్టేషన్‌లో అస్వస్థతకు గురై పరిచయమైన పెద్దమనిషి (శరత్ బాబు) ప్రవేశిస్తాడు. అంతేకాక ఇందూ ఆయనకు ఇంట్లో ఆశ్రయం ఇవ్వడంతో పాటు ప్రేమగా చక్కటి అనుబంధంతో మనుమరాలిలా జీవిస్తుంది. ఇద్దరితోనే సంసారం నెట్టుకురాలేని అసమర్థుడైన చక్రి వారితో పాటు మరో పెద్ద మనిషి జీవించడాన్ని ఇబ్బందిగా భావిస్తుంటాడు. అంతేకాక ఆ పెద్దమనిషిని ఇంట్లో నుండి ఎప్పుడెప్పుడు బయటకు పంపించాలా అని ఎదురు చూస్తుంటాడు. దానికై వింత, వింత ప్రయోగాలు చేస్తుంటాడు. నిజానికి ఆ పెద్దమనిషికి కూడా చక్రికి అసౌకర్యంగా వుందని తెలుసు అయినా ఇందూతో అనుబంధాన్ని దూరం చేసుకోలేక, ఆమెకు దూరంగా వుండలేక చక్రి- ఇందూలతో కలిసి వుంటాడు. మరోవైపు ఇందూ కుటుంబానికి చక్రి వారిని మోసం చేసి వివాహం చేసుకున్నాడనే విషయం తెలుస్తుంది. అయినప్పటికీ ఇందూ వారికి తన భర్త తప్పు చేశాడు, మోసం చేశాడనేది నిజమే కావచ్చు, **"కాని నన్ను ప్రేమగా చూసుకునే విషయంలో మీ ప్రేమకి సరితూగగల ప్రేమను పంచగలడు"** అని చెప్పి కుదుటపరిచి పంపుతుంది. ఒకసారి చక్రి సూటిగా వారి ఇంట్లో ఉన్న పెద్ద మనిషికి ఆయన వారి ఇంట్లో వుండడం వల్ల కలిగే అసౌకర్యాన్ని గూర్చి చెప్తాడు. చక్రి అసౌకర్యాన్ని అర్థం చేసుకున్న పెద్దమనిషి చక్రి దంపతుల వద్ద నుండి వెళ్ళిపోతాడు. కాని రోజూ తమ ఇంట్లో మనిషిగా మెలిగిన పెద్ద మనిషి ఇప్పుడు తమతో పాటు లేడనే విషయాన్ని ఇందూ వెలితిగా భావిస్తుంది. ఈ మొత్తం తతంగంలో ఇందూ దంపతులకు ఒక విషయం మాత్రం అర్థం కాదు, అదేమిటంటే వారింటి దాకా వారితో జీవించిన ఆ పెద్దమనిషి వారితోనే ఎందుకు అంతటి చక్కటి అనుబంధంతో జీవించాడనే విషయం.

ఒకసారి ఇందూ దంపతులకు ఆ పెద్దమనిషి ఇంటి నుండి **"ఆయనకి ఆరోగ్యం బాగాలేదు, ఒకసారి వచ్చి చూసి పొమ్మనే ఆహ్వానం అందుతుంది"**. ఆ ఆహ్వానం గూర్చి తెలుసుకున్న చక్రి ఆయన ఇంట్లో లేకపోవడం వల్ల ఈ మధ్యే దాంపత్య జీవితాన్ని ఆస్వాదిస్తున్నా, ఇప్పుడు మళ్ళీ తగలడ్డాడా అనే అసంతృప్తితో ఇందూ అభ్యర్థన మేరకు వెళ్ళడానికి సిద్ధపడ్డాడు. కాని చక్రి ఊహించిన దానికి విరుద్ధంగా ఆ పెద్దమనిషి ఇంట్లో చక్రి దంపతులకు అతిథి మర్యాదలు జరుగుతాయి. అన్నింటికి మించి చక్రిని ఆనందాశ్చర్యాలకు గురిచేసే విషయం ఏమిటంటే వారితోపాటు జీవించిన ఆ పెద్దమనిషి ప్రముఖ వ్యాపారవేత్త శివానంద మూర్తి (శరత్ బాబు) అని తెలియడం. ఆయన ఇందూతో అంత ప్రేమగా వుండడానికి కారణం **"అతడి మనుమరాలు సింధు కూడా ఇందూలాగే వుండడం"**. ఇందూ చక్రితో వెళ్ళిన తర్వాత అక్కడి సిబ్బంది, పరివారం అంతా వారిని గౌరవించే విధానానికి విస్తుపోతారు. అందరిచేత గౌరవించబడే శివానంద మూర్తి ఇందూను స్వంత మనుమరాలిలా చూస్తున్నప్పుడు చక్రికి అక్కడే వుండిపోతే ఎంత బాగుంటుందో అనే ఆశ కల్గుతుంది.

శివానంద మూర్తి పరివారం ఇందూతో ఆయన మనుమరాలు సింధు కూడా అచ్చం మీలాగే వుండేదని చెప్తూ ఫ్లాష్ బ్యాక్ వివరిస్తారు. సింధు శివానంద మూర్తి గారాల మనుమరాలు. ఆమెను ఏ లోటూ లేకుండా సకల సౌకర్యాలతో ప్రేమగా చూసుకుంటాడు. సింధు చురుకుగా వుంటూ చదువుతో పాటు అన్ని క్రీడల్లోనూ కాలేజీలో ముందుంటుంది. మరో వైపు ఒక గుళ్ళో అర్చకుడిగా పనిచేసే గుడి పూజారి కుమారుడు అనంత శర్మ. పేదరికం వల్ల చదువుకు నోచుకోలేక ఇబ్బంది పడ్తున్న అనంత శర్మకు మెడికల్ సీటు వచ్చేలా చేస్తుంది సింధు. అనంత శర్మ కాలేజీలో ఒక ఎస్పీ కుమారుడి చేత దారుణంగా ర్యాగింగ్‌కు గురవుతాడు. ఆ ర్యాగింగ్ వల్ల అవమానానికి గురైన అనంత శర్మ మతిస్థిమితం కోల్పోయి జీవచ్ఛవంలా మారతాడు. అనంత శర్మను ర్యాగింగ్ చేసిన ఎస్పీ కుమారుడిని సింధు కాలేజీలో అందరిముందు కొడుతుంది. దాన్ని అవమానంగా భావించిన ఎస్పీ కుమారుడు సింధుపై పగ తీర్చుకోవాలనుకుంటాడు. ఒకరోజు కాలేజీలో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో సింధు నృత్య ప్రదర్శన చేస్తుండగా యాసిడ్ దాడి చేస్తాడు. సింధు ఆస్పత్రి పాలై ప్రాణాపాయ స్థితిలో వుంటుంది. ఆమె చివరి కోరికగా అనంత శర్మను కాపాడమని, మునుపటి స్థితికి వచ్చేలా చేయమని కోరుతుంది. కథ ప్రస్తుతంలోకి వస్తే తన మనుమరాలి పోలికలున్న ఇందూను దత్తత తీసుకోవడానికి ముహూర్తం నిర్ణయిస్తాడు శివానంద మూర్తి. ఆ విషయం తెలిసి ఈ ఆస్తిపాస్తులన్నీ అనుభవించపోయేది నేనే అని మురిసిపోతాడు చక్రి. కాని ఆశలపై నీళ్లు చల్లుతూ ఇందూ అనంత శర్మను శివానంద మూర్తికి దత్త పుత్రుడుగా చేసి మళ్ళీ తన స్వంత ఇంటికి భర్తతో వెళ్లి తన సాధారణ జీవితాన్ని ఆస్వాదిస్తుండడంతో కథ ముగుస్తుంది.

**చిత్ర విశేషాలు :**

కె.విశ్వనాథ్ దర్శకుడిగా ఇదే చివరి చిత్రం అయినప్పటికీ ఆయన సగటు సినిమాల స్థాయిని కూడా ఈ చిత్రం అందుకోలేకపోయింది అని చెప్పొచ్చు. కథలో ప్రధాన పాత్ర అయిన చక్రి (అల్లరి నరేష్)

పాత్ర యొక్క మనస్తత్వాన్ని, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిన విధానం సగటు ప్రేక్షకుడికి ఏ కోణంలోనూ దగ్గరవ్వదు. కథానాయకుడి పాత్రకు ఏ గమ్యం వుండదు. చిత్రం మొదలైనప్పటి నుంచీ చివరిదాకా ఆ పాత్ర చేసే తప్పులు, అవకాశవాదంతో ప్రయోజనం ఆశించే విషయాల పట్ల పాత్రలో ఏ మాత్రం పశ్చాత్తాపం వుండదు. పాత్ర ఆలోచనా విధానం, వ్యక్తిత్వంలో ఏ మాత్రం మార్పు లేకుండా చిత్రం చివరిదాకా కొనసాగడం చింతించాల్సిన విషయం. తన స్థాయికి మించి అత్యాశతో జీవించే చక్రి పాత్ర పతాక సన్నివేశంలోనూ తను చేసే పనులు, ప్రవర్తన పట్ల ఏ మాత్రం మార్పు లేకుండా కొనసాగడం అసహనానికి గురిచేస్తుంది.

కథా-కథనం అంతా కథానాయిక(మంజరి) వైపు నుండి కొనసాగుతుంది. ఇందూ, సింధు పాత్రల్లో మంజరి నటించారు. మంచి చేసేవారికి, నిస్వార్థంగా మనిషితనంతో జీవించే వారికి కాలమే మంచి రోజులు తీసుకుస్తుందనే తాత్వికతను పరోక్షంగా ఇందూ పాత్ర ద్వారా చెప్పినప్పటికీ, ఇందూ పాత్ర అలా ప్రవర్తించడానికి వెనకాల దానికి తగ్గ వాతావరణాన్ని ఏర్పాటు చేయలేదు. ఏ సగటు మనిషి తన సాధారణ జీవితలో ఇందూ పాత్రలా ప్రవర్తించే అవకాశం లేదు. సంపన్న కుటుంబానికి చెందిన అమ్మాయి ఇందూ. అంతేకాక దేశంలోని అన్ని ప్రధాన ప్రాంతాలకు చెందిన వారు ఆమె కుటుంబ సభ్యులు. దాంతోపాటు ఆమెను కుటుంబ సభ్యులంతా అత్యంత ప్రేమగా, అల్లారుముద్దుగా పెంచుకుంటారు. చక్రి ఇందూను ప్రేమలోకి దించడం, పెళ్లి ప్రతిపాదన తీసుకురావడం చేస్తాడు. తదుపరి ఇందూ కుటుంబం చక్రి కుటుంబ నేపథ్యం, వ్యక్తిత్వం తెలిసి అతడితో వివాహం తిరస్కరిస్తారు. తర్వాత చక్రి ఇందూ కుటుంబానికి గిల్ట్ నగలు చూపించి తాను కష్టపడి సంపాదించానని అబద్ధం చెప్పి వివాహం చేసుకుంటాడు. గిల్ట్ నగలు గుర్తించలేనంత అమాయక మనుషులు ఈ సమాజంలో వుంటారా? కథను ముందుకు నడిపే ఉద్దేశంతో ఏ మాత్రం వాస్తవికతకు పొంతన లేకుండా కథనం నడిపించారనడానికి ఇదే ఉదాహరణ. ఒకవేళ సంపాదించినా తక్కువ కాలంలో ఎలా సంపాదించాడనే ప్రశ్న మిగిలిన పాత్రల నుండి అసలే వుండదు. దీనికి మించి ఇందూ పాత్ర చక్రి వ్యక్తిత్వాన్ని ఆమోదించి అతడితో వైవాహిక జీవితాన్ని కొనసాగించే విషయం ఏ ప్రేక్షకుడూ హర్షించడు. అదెలాగంటే గణపతి విగ్రహం వద్ద గిల్ట్‌నగల విషయాన్ని చక్రి చెప్పినప్పుడు, తాను డాక్టర్ వృత్తి చేస్తున్నానని ఇంట్లో అబద్ధం చెప్పినప్పుడు, అంతేకాక ఇంటికి అప్పులడగడానికి వచ్చిన వ్యక్తితో మాటలు చెప్పి దాటవేసే ప్రయత్నం చేస్తున్నప్పుడు, అదీకాక శివానంద మూర్తి లాంటి పెద్ద మనిషి ఇంట్లో డబ్బుకు ఆశపడి వెకిలి చేష్టలతో ఆమె దత్తత విషయం గూర్చి కంగారుపెడ్తున్నప్పుడు ఇలా ప్రతిసారి చక్రి పాత్ర దిగజారుడు వ్యక్తిత్వాన్ని ప్రదర్శిస్తుంది తప్పితే చిత్రం చివరి దాకా ఆ పాత్రలో ఎలాంటి మార్పును వుండదు. నిజానికి చిత్రం చూస్తున్న




ప్రేక్షకుడికి చక్రితో పాటు అలాంటి వ్యక్తిని పదేపదే వెనకేసుకొస్తున్న ఇందూ పాత్రపై కూడా అసంతృప్తి కలుగుతుంది. ఇందూ తన ప్రేమతో చాలా అవలక్షణాలున్న చక్రి పాత్రను చిత్రం చివరికైనా వ్యక్తిత్వం కల్గిన మంచి పాత్రగా మార్చి వుంటే బాగుండేది.

చిత్రానికి ప్రధాన బలం శివానంద మూర్తి పాత్రలో శరత్ బాబు నటించడం. ఏ బంధం లేకపోయినా మానవత్వం, మనిషితనం అనే గుణం చాలు ఇద్దరు మనుషుల మధ్య బంధాన్ని ఏర్పరచడానికి, ఈ విషయాన్ని ఇందూ- శివానంద మూర్తి ల మధ్య వచ్చే సన్నివేశాల ద్వారా చూపారు. చిత్రంలో ప్రేక్షకుడిని నిమగ్నమయ్యేలా చేసే ఎపిసోడ్ ఏదైనా వుందంటే అది అచ్చం ఇందూ రూపంలోనే వుండే సింధు పాత్రే. తాతా- మనుమరాలు మధ్య అనుబంధాన్ని చూపే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. చిత్రంలో అంతర్లీనంగా పేదరికంలో మగ్గే అర్చక కుటుంబాల దయనీయ స్థితిని చూపారు. పేద అర్చక కుటుంబానికి చెందిన అనంత శర్మకు సహాయం చేసేందుకై సింధు అతడికి మెడికల్ కాలేజీలో సీటు ఇప్పిస్తుంది. అక్కడ అనంత శర్మ వేషధారణను ఎస్పీ కుమారుడు ర్యాగింగ్ చేయడం, దానికి బదులుగా సింధు ఆ ర్యాగింగ్ చేసిన వ్యక్తిని అందరి ముందు కొట్టడం. దాన్ని అవమానంగా భావించిన ఎస్పీ కుమారుడు సింధుపై పగ పెంచుకొని ఆమెపై యాసిడ్ దాడి చేయడం. దాని వల్ల సింధుయే ప్రాణంగా జీవించే ఆమె తాత తల్లిడిల్లిపోవడం. ఇలా సింధు సన్నివేశాల ద్వారా ర్యాగింగ్ దాని పర్యవసానాలను గూర్చి ప్రస్తావించారు. స్వప్నిక, ప్రణీత అనే వరంగల్ అమ్మాయిలపై జరిగిన యాసిడ్ దాడి ఈ ఎపిసోడ్ కు ప్రేరణ అయి వుండొచ్చు. చిత్రంలో ఎస్పీ తన కుమారుడు చేసిన తప్పుకుగానూ అతడిని తన చేతులతోనే షూట్ చేసే సన్నివేశం సమాజంలో జరుగుతున్న ఇలాంటి ఆకృత్యాల పట్ల ప్రేక్షకుడి అసహనాన్ని తృప్తిపరిచినా ర్యాగింగ్ పెనుభూతాన్ని రూపుమాపడానికి అది పూర్తి పరిష్కారం మాత్రం కాదు అనే విషయం అవగతమవుతుంది.

**చలన చిత్రం : శుభప్రదం**

**విడుదల : 16 జులై 2010**

**సంగీతం : మణిశర్మ**

**నిర్మాత : పి.ఎన్.తిలక్, హరి గోపాల్ కృష్ణ మూర్తి**

**కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం: కె. విశ్వనాథ్**

# మహాభారతానికి నాయకుడెవరు?

**కె. సుజన, ఫోన్ : 99664 35902**

ప్రాచీన గ్రంథాలలో అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్న గ్రంథం మహాభారతం. మహాభారతాన్ని సూక్ష్మంగా పరిశీలిస్తే అందులో చెప్పబడిన ప్రతి మాట ఆచరణీయమే. విద్యా విధానం మొదలుకుని సూక్ష్మధర్మాలు తెలుసుకునేంతవరకు, జ్ఞానాన్ని సముపార్జించడం మొదలుకుని ఆధ్యాత్మికతను సాధించడం వరకు, భూమండలం యొక్క స్థితిగతుల దగ్గర నుండి తీర్థయాత్రల విశేషాల వరకు, దౌత్య సంబంధాలు మొదలకుని రాజనీతి చాతుర్యతను ప్రదర్శించేంతవరకు ప్రతి అంశం, ప్రతి కథ ఒక విశిష్టతను సంతరించుకుంది. వేద సారాంశాన్నంత పుణికి పుచ్చుకున్న పవిత్ర గ్రంథం మహాభారతం. లౌకిక జ్ఞానానికి, ఆధ్యాత్మిక సాధనకు పునాది వంటిది మహాభారతం.

భారతమనగా 'భా' సూర్యః, ర – అగ్నిః, త – చంద్రః. **'చంద్ర సూర్యాగ్ని చంద్ర సంయోగాదేవ చరాచరాత్మ సృష్టిరిత్యర్థః'** అని బీజాక్షర నిఘంటువు.

సూర్య చంద్రాగ్నుల సంయోగం వలనే సమస్త చరాచర ప్రపంచం యొక్క సృష్టి జరుగుచున్నదని తాత్పర్యం. (శ్రీ రామచంద్రమూర్తి, యమ్.జి.పి. ఆంధ్రమహాభారతంలో ధర్మసూక్ష్మాలు, పుట:10.)

శ్రీరామచంద్రమూర్తి గారు **"ఆంధ్ర మహాభారతంలో ధర్మ సూక్ష్మాలు"** తన సిద్ధాంత గ్రంథంలో పై విధంగా భారతానికి నిర్వచనం ఇచ్చారు. సూక్ష్మపరిశీలన చేస్తే ప్రపంచం అంతా సూర్యచంద్రుల పరిభ్రమణం చేత నడుస్తుంది. సృష్టి సరైన క్రమంలో నడవడానికి ప్రతి ప్రాణి తన జీవనశైలిని సక్రమంగా నిర్వర్తించు కోవడానికి ప్రధాన ఆధారం సూర్యచంద్రులే అనే విషయం స్పష్టమవుతుంది.

ప్రముఖ ఆధ్యాత్మిక గురువు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ ముఖాముఖి లో మహాభారతానికి నాయకుడు అంటూ ఎవరూ లేరు కృష్ణుడే ప్రధాన సూత్రధారి అని చెపుతూ మహాభారతమే విష్ణువు అని చెప్తారు. అలాగే భారతానికి ప్రధాన కారకులు అనలుడు అంటే అగ్నిహోత్రుడు, సూర్యుడు, చంద్రుడు అని ఈ విధంగా తెలియజేస్తారు.

మహాభారతం బహునాయకత్వంతో కూడింది. దీనికి నాయకుడు నడిపించే దైవమే, సూత్రధారి అంతా కృష్ణుడే –

**"అనలుడు భాస్కరుండును, సుధాంశుడు సధ్వర సంప్రర్తకుల్, వినుము నరేంద్ర యీ క్రతువు విష్ణుమయంబిది నిర్వహించి ర ఝనుడును, గర్జుడున్, సమర రూపమునందగ నీ ప్రబంధ మిం పొనర బఠించినన్ వినిన నొందు నరుం జిరసౌఖ్య సంపదల్"**

మహాభారతం అద్భుతమైన ఘట్టం. ఈ మహాభారత యజ్ఞానికి అనలుడు, భాస్కరుడు, సుధాంశుడు, (చంద్రుడు). వీరు ముగ్గురు మహాభారతం అనే యజ్ఞానికి సంప్రవర్తకులు అంటే నడిపినవారు. క్రతువు ఎవరిది. మహాభారతమే విష్ణువు, విష్ణువే మహాభారతం. విష్ణువుని నాయకుడు అని కూడా అనలేము, అసలు ఆయనే భారతం. భారతమే విష్ణువు కాబట్టి ఆయన దైవం. అగ్ని లేకపోతే మహాభారతమే లేదు. అసలు మహాభారతం ఆరంభమే జనమేజయ యజ్ఞంతో మొదలై యజ్ఞంతో ముగిసే అపూర్వమైన ఘట్టం. కాబట్టి అగ్నిహోత్రుడు ప్రధాన పాత్రధారి అని చెప్తారు.

మన నిత్య జీవితంలో మన అతిథి అగ్ని. అగ్ని లేనిదే సృష్టి జరగదు. సనాతన ధర్మంలోనూ అగ్నికి అత్యంత ప్రాధాన్యం ఉంది. పూర్వం ప్రతి ఇంటిలోనూ హోమాలు నిర్వహించేవారు. ఒక యాగం జరగాలంటే అగ్నినే ప్రధానంగా ఆరాధిస్తారు. (బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ ముఖాముఖి.)

మహాభారతం అంటేనే విష్ణువు అనడంతో మహాభారతాన్ని చదివితే విష్ణుహృదయం ఏమిటో తెలుస్తుంది. ధర్మంగా జీవించేవారికి విష్ణువే సహాయకారి, అధర్మంగా నడిచేవారికి ఆ విష్ణువే దండన విధించే వాడవుతాడు. సమాజ పురోభివృద్ధికి విభిన్న మనస్తత్వాలు కలిగిన ప్రపంచాన్ని ఒక మార్గం వైపు నడిపించే ప్రయత్నమే మహాభారతానికి నాంది అనే అభిప్రాయం పై మాటల్లో అర్థమవు తుంది. అగ్నితో అంటే యజ్ఞంతో ప్రారంభం అవుతుంది మహాభారతం అంటారు అంటే అగ్నికూడా ప్రధాన పాత్రధారి అని చెప్పడంలో ఆంతర్యాన్ని గమనిస్తే వ్యర్థపదార్థాలను కూడా దగ్ధం చేసి వాటి వలన హాని కలగకుండా చేయగల శక్తి అగ్నికి ఉంది. అలాగే మన ఆలోచనల్లోని మాలిన్యాన్ని భారతమనే అగ్ని దహింపచేసి క్రొత్త మార్గనిర్దేశాన్ని అందిస్తుంది. అగ్ని లేనిదే సృష్టి జరగదు అంటారు. అగ్నికి మన జీవన విధానానికి అంతటి అనుబంధం ఉంది.

భారతమను సూర్యుని చేత మానవులంతః కరణమందలి చీకట్లు తొలగిపోవును. ఇక్కడ భారతమును సూర్యుని చేత పోల్చారు. సూర్యుడు అగ్ని స్వరూపుడు. తన కిరణాలతో ప్రపంచ చీకట్లు తొలగించినట్లు భారతం ప్రజల అంతరంగంలోని అజ్ఞాన చీకట్లు తొలగిస్తుందని చెప్తాడు. అంతేకాదు. మానవులై పుట్టాక అనేక సందేహాలతో మానసిక ఆందోళనతో సతమతమవుతారు. ఆ ఆందోళన తొలగడానికే మహాభారతం ఉంది అని పై వాక్యాల ద్వారా తెలుస్తుంది.

**"పురాణ పూర్ణ చంద్రేణ శ్రుతి జ్యోత్స్నా ప్రకాశితా"** పురాణమను పూర్ణ చంద్రుని చేత వేదములనే వెన్నెల వెలుగొందబడింది. (శ్రీ రామచంద్రమూర్తి, యమ్.జి.పి. ఆంధ్రమహాభారతంలో

ధర్మసూక్ష్మాలు, పుట:19.) ఈ వాక్యాలను పరిశీలిస్తే మహాభారతం పంచమవేదం. ఇతిహాసం. చతుర్వేదాలను తనలో ఇముడ్చుకున్న గొప్ప గ్రంథం. ఇక్కడ పురాణాలను పూర్ణ చంద్రునిలాగా వేదాలను వెన్నెల వెలుగును ఇస్తుంది అన్నాడు. అంటే పురాణాలలోని అంశాలు, ఎప్పుడూ క్రొత్తగా కనిపిస్తూ ఉంటాయి. వెన్నెల ఎంత చల్లదనంగా ఉంటుందో వేదాలలోని సారాంశం తెలుసుకుంటే అంతే ఆహ్లాదంగా ఉంటుంది. ప్రధానంగా మహాభారత కథలు పిల్లల దగ్గర నుండి ప్రతి ఒక్కరి ఆలోచనకు పదును పెట్టేవిగానూ, జీవితాన్ని సరైన క్రమంలో ఎలా సరిదిద్దుకోవాలో నేర్పుతాయి.

1. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు అవధూత బ్రహ్మశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ముఖాముఖిలో మహాభారతంలో శ్రీకృష్ణుడిని ప్రధాన సూత్రధారిగా పేర్కొంటేనే బాగుంటుందని తెలియజేస్తారు. శ్రీకృష్ణుడినే ప్రధాన సూత్రధారుడుగా ఎందుకు పేర్కొంటున్నారో తెలియజేస్తూ శ్రీకృష్ణుడే యోగేశ్వరేశ్వరుడు. ఆట ఆడించువాడు, నడిపించువాడు మాత్రమే. ఈ విషయం మనకు గీతలో, జ్ఞానయోగం లో 18వ శ్లోకంలో పరమాత్మే అర్జునుడికి యోగి లక్షణాలు చెపుతున్న సందర్భంలో బాగా తెలుస్తుంది.

**కర్మణ్య కర్మ యః పశ్యేదకర్మణి చ కర్మ యః**
**స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్నకర్మకృత్**

అర్జునా! కర్మలో కర్మ లేకపోవటాన్ని చూడగలగాలి. కర్మ లేకపోవటంలో కర్మను దర్శించగలగాలి. అదే నిజమైన తెలివి. అది కలవాడే యోగి. అతడే విహితకర్మలన్నీ చేసిన ముక్తపురుషుడు అన్నాడు. ఈ యోగి లక్షణాలన్నీ కృష్ణుడిలో ఉన్నాయి. కనుక ఆయన యోగేశ్వరేశ్వరుడు. సూత్రధారి మాత్రమే.

**"లోకవత్తు లీలా కైవల్యం"** అని బ్రహ్మసూత్రం. పరమాత్మ ఈ లోకమనే ఆట ఆడుతున్నా, ఈ ప్రపంచమనే పనిని చేస్తున్నా ఆయనకు ఏ ప్రయోజనమూ లేదు. అటువంటి వాడు పరమాత్మ. కనుక ఆయనను ఆట ఆడించేవాడు అనటమే బాగుంటుందని తెలియజేస్తారు. (బ్రహ్మశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి, ముఖాముఖి)

వీరి అభిప్రాయం ప్రకారం ఎటువంటి స్వార్థపూరితమైన ఆలోచనలు లేకుండా ఎటువంటి ప్రయోజనాన్ని ఆశించకుండా ఒక వ్యవస్థను సరైన మార్గంలో పెట్టడానికి ఒక బాధ్యతను స్వీకరించి దానిని అమలు చేయడంలోనే పూర్తిగా నిమగ్నుడై లోకంలో శాంతి స్థాపనకు, కృషి చేసేవాడే నిజమైన నాయకుడని అటువంటి నాయకుడు శ్రీకృష్ణుడే అని తెలుస్తుంది.

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ముఖాముఖిలో మహాభారతానికి నాయకుడు శ్రీకృష్ణున్ని నిస్సందేహంగా పేర్కొనవచ్చని తెలియజేస్తారు. ఎందుకంటే భగవంతుడే స్వయంగా ప్రతిజ్ఞ చేసాడని.



**యథా యథా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత**
**అభ్యుత్థానమధర్మస్య తథాత్మానాం సృజామ్యహం**

ఆయన రాక్షసులను సంహరించడం కోసం, సాధువులను రక్షించడం కోసం తర్వాత ధర్మసంస్థాపన చేయడం కోసం అవతారం స్వీకరిస్తానని చెప్తాడు. అంతే కాకుండా కురుక్షేత్ర యుద్ధం ద్వారా చాలా మంది అధర్మాత్ములను చంపవచ్చని భావించాడు, జరాసంధుని అందుకే అన్నిసార్లు వదిలిపెట్టాడు. చివరి సమయంలో మల్లయుద్ధం లో భీమునిచేత చంపించాడు కాబట్టి ఆయన సూత్రధారి ఆయనే నాయకుడు శ్రీకృష్ణుని కాదని ఇంకొకరిని నాయకుడుగా స్వీకరించడం సాహసం అవుతుందని వీరు తెలియజేస్తారు. (బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావుతో ముఖాముఖి).

భగవంతుడు ధర్మంగా జీవించేవారికి హాని కలిగించే దుష్టబుద్ధి కలిగిన వారికి ఎన్ని విధాలా నచ్చజెప్పాలో అన్ని విధాలుగా వారిని మంచి మార్గంలో పెట్టడానికి ప్రయత్నించి అయినప్పటికి వారి నడవడిలో మార్పురానప్పుడు వారిని శిక్షిస్తాడు. ఇటువంటి ధర్మ నిర్ణయాలను పాటించే కృష్ణుడు అర్జునుడిని యుద్ధానికి ప్రేరణోన్ముఖుడిని చేసాడు. దురాత్ములకు శిక్ష పడేటట్లు చేసాడు.

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చిర్రావూరి శివరామకృష్ణశర్మ గారు ముఖాముఖిలో మహాభారత దృష్ట్యా చూసినప్పుడు నాయకుడు ధర్మరాజు ఎందుకంటే చివరకు ఫలితం ఆయనకే దక్కింది. తర్వాత ప్రధాన సూత్రధారి అంటే భేదం వస్తుంది. నడిపించినటువంటి వాడు, ప్రత్యక్షంగా చూస్తే శ్రీకృష్ణుడే సూత్రధారిగా కనబడతాడని పరోక్షంగా ఈశ్వరుడు మహాభారతానికి సూత్రధారిగా కనబడతాడని తెలియజేస్తాడు. ఈశ్వరుడు సూత్రధారి ఎలా అవుతాడో వీరు కొన్ని ఉదాహరణలను చూపిస్తూ సైంధవుడిని చంపవలసి వచ్చినప్పుడు రాత్రి శ్రీకృష్ణ పరమాత్మ అర్జునున్ని కైలాసానికి తీసుకుని వెళ్ళి బాణం ఎలా ఉపయోగించాలో నేర్పుతాడు. అర్జునునికి బాణ విద్య నేర్పడం ఏమిటి అంటే పాశుపతాస్త్రాన్ని ఎలా పట్టుకోవాలో అవన్నీ నేర్పి మళ్ళీ పంపిస్తారు. అక్కడ ఈశ్వరుడే కారణం అని చెప్తారు. ఇలా

ఆయా సందర్భాలలో ఈశ్వరుడు పరోక్షంగా సూత్రధారిగా ఉన్నాడని హరిహరులకు భేదం లేదని భారతంలో నిరూపించబడిందని వారు తెలియజేస్తారు.

ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, సద్గురు శ్రీదేవిసెట్టి చలపతిరావు గారు ముఖాముఖిలో శ్రీకృష్ణున్ని మహాభారతానికి నాయకుడుగా పేర్కొనాలి అని చెప్తాడు అయితే మహాభారతానికి నాయకుడు, నాయకురాలు, ప్రతి నాయకుడు అనే పద్ధతిలో చూసుకుంటే ధర్మరాజు, ద్రౌపది, దుర్యోధనుడు ఇలా వస్తాడు. కాని మహాభారతాన్ని మొత్తంగా జాగ్రత్తగా పరిశోధన చేస్తే కేవలం శ్రీకృష్ణుడు మాత్రమే నాయకుడు. శ్రీకృష్ణుడే కథానాయకుడుగా ఎలా చెప్పవచ్చో చెప్తూ భగవద్గీతను ఉదహరిస్తారు. భగవద్గీత ఎటువంటిది, మానవ జీవితాన్ని ఎలా ఉన్నతమైన స్థితికి తీర్చిదిద్దుకోవాలో చెప్పేటటువంటిది. ఉపనిషత్తుల సారం అందులో ఉంది పరమాత్మను అందుకోవడానికి కావలసిన మార్గాలన్నీ ఉపనిషత్తుల్లో చెప్పబడుతాయి. ఇటువంటి భగవద్గీతను అందించింది శ్రీకృష్ణ పరమాత్మ. భారతం గురించి చెప్పేటప్పుడు భగవద్గీత గురించి ఎందుకు వచ్చింది అంటే భారతానికి భగవద్గీతకు భేదం లేదు. భారతం లక్ష శ్లోకాల గ్రంథం భగవద్గీత 700 శ్లోకాల గ్రంథం ఈ భగవద్గీతను సాగదీస్తే భారతం అవుతుంది. కాబట్టి భగవద్గీతకు ప్రధానమైన నాయకుడు ఎవరో భారతానికి అతనే అంటే శ్రీకృష్ణుడే నాయకుడు అని వీరు తెలియజేస్తారు.

మహాభారతానికి నాయకుడుగా చెప్పదగిన వ్యక్తికి కొన్ని అర్హతలు ఉండాలి. కాని సూత్రధారుడు అంటే సమస్తాన్ని తన అధీనంలో ఉంచి ధర్మ సంస్థాపనకు కృషి చేసేవారు ఎవరోవారు శ్రీకృష్ణుడిని ప్రధానంగా చెప్పడం వీరి మాటల్లో అంతర్లీనంగా కనబడుతుంది.

ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మగారు మహాభారతానికి నాయకుడు శ్రీకృష్ణుడే అని తెలియజేస్తూ మహాభారతానికి కథా నాయకుడు శ్రీకృష్ణుడేనని స్పష్టంగా వ్యాసుడు పలుచోట్ల పేర్కొన్నాడని అవతారికలోనే ధర్మవృక్ష స్వరూపాన్ని చెప్తూ ధర్మరాజాదులతో విలసిల్లే ఆ వృక్షానికి శ్రీకృష్ణుడు మూలమని వర్ణించారని వీరు తెలియజేస్తారు.

ప్రాచార్య శలాక రఘునాథశర్మ మహాభారతానికి నాయకుడు ధర్మరాజే అని చెప్తాడు కాని నాయకుడినే నడిపించేవాడు సూత్రధారి శ్రీకృష్ణుడని తెలియజేస్తారు. భారతంలో నాయకుడు ధర్మరాజు, నాయక, నాయకుడు శ్రీకృష్ణుడు అయితే అటువంటి స్థితి తక్కిన వాటిలో ఉండరు. నాయకుడే ఉంటాడు. కాని ఇక్కడ నాయకుడినే నడిపించేటటువంటి వాడిగా శ్రీకృష్ణున్ని నిబంధించడం భారతంలో గొప్పవిషయం కాబట్టి ఆయన నాయక నాయకుడు.

వీరి అభిప్రాయంలోనూ మహాభారతానికి ప్రధాన సూత్రధారి శ్రీకృష్ణ పరమాత్మయే అని తెలుస్తుంది. వీరి మాటల్లోని అంతరార్థాన్ని పరిశీలిస్తే మహాభారతానికి కర్త, కర్మ, క్రియ అన్ని శ్రీకృష్ణుడే అని అర్థమవుతుంది.

ప్రముఖ సాహిత్యకారులు, ఆధ్యాత్మిక వేత్త వి.వి.ఎల్. శ్రీనివాస మూర్తి (వెంపరాల వెంకట కృష్ణ శ్రీనివాస మూర్తి) మహా భారతానికి నాయకుడు – ప్రధాన సూత్రధారి. ఎవరు అనే విషయాన్ని వివరిస్తూ ఈ విధంగా తెలియజేస్తారు. ఈ ప్రశ్నలో రెండు కోణాలు గోచరిస్తున్నాయి. ఒకటి మహాభారతానికి నాయకుడు – రెండవది సూత్రధారి. మహాభారత సూత్రధారి అన్నప్పుడు కచ్చితంగా ఈ జగన్నాటకానికి మూల పురుషుడు – కర్త, కర్మ, క్రియ అయిన పురుషోత్తముడు శ్రీకృష్ణ పరమాత్ముడే అనే విషయాన్ని స్పష్టం చేస్తూ మహా భారత కథాచిత్రణా పరంగా చూస్తే – ఆదిపర్వంలోని కుమారాస్త్ర విద్యా ప్రదర్శన ఘట్టం నుంచి, కురుక్షేత్ర సంగ్రామం వరకు కథలో నాయకుడిగా కనిపించేది 'అర్జునుడు' మాత్రమే. కానీ మళ్ళీ అంతా జగన్నాటకమే కదా అనుకున్నప్పుడు, ముందుండి యుద్ధాన్ని నడిపించిన రథసారధి కృష్ణుడే కదా. అంతిమంగా చెప్పాలంటే – నడిపేది, నడిపించేది పరమాత్ముడే కాబట్టి శ్రీకృష్ణుడే నాయకుడు, ప్రధాన సూత్రధారి.

వీరి అభిప్రాయాలను పరిశీలిస్తే అస్త్ర విద్యానైపుణ్యంతో అర్జునుడు ఒక్కొక్క విజయ శిఖరాన్ని అందుకున్నప్పుడు అర్జునుడే నాయకుడు అనిపించినట్లు ఉంటుంది. కాని పరోక్షంగా అర్జునుని అంతరంగంలో ఉండి ప్రత్యక్షంగా అర్జునునికి రథసారథిగా ఉన్న శ్రీకృష్ణుడే ప్రధాన సూత్రధారి అని అర్థమవుతుంది.

**ముగింపు**

ఈ వ్యాసంలో ప్రధానంగా మహాభారతం యొక్క గొప్పతనాన్ని క్లుప్తంగా వివరించి మహాభారతానికి నాయకుడు ఎవరు అని ప్రశ్న వేసుకున్నప్పుడు సందేహాలు ఏర్పడుతుంటాయి. ఆ సందేహాలను నివృత్తి చేసే క్రమంలో ప్రముఖుల అభిప్రాయాలను సేకరించి వాటిని వివరించడం జరిగింది. మహాభారతానికి నాయకుడు ఎవరు అని చర్చించే ముందు నాయకుడుగా ఉండడానికి కావలసిన అర్హతలను పరిశీలించాలి, అలా పరిశీలన చేసినప్పుడు శాంతికాముకుడు, ధర్మం పట్ల ఆసక్తితో ఉన్నవాడు, అయిన ధర్మరాజు మనకు వెంటనే గోచరిస్తాడు. అయితే మహాభారతాన్నంతటికి సూత్రధారుడు ఎవరని భావించినప్పుడు మాత్రం శ్రీకృష్ణుడే కనబడుతాడు. ఎందుకంటే మహాభారతంలో ధర్మ సంకటం ఎక్కడ కలిగినా పాండవులు శ్రీకృష్ణుని సలహాల మేరకే ముందుకు వెళ్ళి విజయాలను అందుకుంటారు. చివరకు ద్రౌపది వస్త్రాపహరణ సమయంలో కూడా శ్రీకృష్ణుడి ప్రమేయంతోనే ద్రౌపది అవమానం పాలు కాకుండా కాపాడబడుతుంది. ఇలా ధర్మానికి హాని కలుగుతుంది అనుకున్న ప్రతి సన్నివేశంలోనూ శ్రీకృష్ణుడి ప్రవేశం ఉండటాన్ని మనం గమనించవచ్చు ఏ రకంగా చూసినా మహాభారతానికి శ్రీకృష్ణుడే ప్రధాన సూత్రధారిగా మనం గ్రహించవచ్చు.

# తెలంగాణ కథా ప్రక్రియ – కాలువ మల్లయ్య

డా. రాగ్యానాయక్ అడావతు



సాహిత్యానికి సమాజానికి మధ్య ఎప్పుడు విడదీయరాని సంబంధమే ఉంది. సమాజం లేకుండా సాహిత్యం లేదు. ఏ కాలం లోని సమాజం గూర్చి తెలుసుకోవాలన్నా ఆ కాలంలో వెలువడిన సాహిత్యమే ఎక్కువ ఉపయోగపడుతుందన్నది నిజం. అందుకే సమాజ దర్పణం సాహిత్యమన్నాడు మాక్సిమ్ గోర్కీ. సాహిత్య గ్రంథాల ఆధారంగానే ఆంధ్రుల వేయేళ్ళచరిత్రను ఆంధ్రుల సాంఘిక చరిత్రగా వ్రాసాడు సురవరం ప్రతాపరెడ్డి గారు. మంత్రాలకు చింతకాయలు రాలనట్టు కేవలం సాహిత్యం వల్లే సామాజిక మార్పు సాధ్యం కాకున్నా సామాజిక మార్పు కోసం అన్ని శక్తులూ కేంద్రీకరించుకోవడానికి నైతికంగా మరింత ఐక్యంగా నిలబడటానికి సాహిత్యం ఉపకరిస్తుంది. వాళ్ళు కోరిన విశ్వమేదైనా, వాళ్ళు కాపాడదలచుకున్నదే వర్గ ప్రయోజమైనా మన ప్రాచీనులు విశ్వశ్రేయస్సుకోసమే కావ్యమన్నారు ఏదోవిధంగా విశ్వశ్రేయస్సునాశించిన కావ్యాలే కాలగర్భంలో కలిసిపోకుండా నిలిచాయి. మొదటితరంలో తెలంగాణ నుంచి తక్కువ కథలే వచ్చినా వచ్చిన కథలన్నీ సమాజ శ్రేయస్సును, మార్పు నభిలషిస్తూ వచ్చినవే. సురవరం ప్రతాపరెడ్డి, దాశరథి రంగాచార్య, కాళోజీ, తిరునగరి, సురమౌళి, యశోదారెడ్డి, సి.వి.కృష్ణారావు, పొట్లపల్లి రామారావులాంటి వాళ్ళెంతోమంది తెలంగాణ కథను అభ్యుదయ పథంలో నడిపించారు.

తెలంగాణ ప్రత్యేక పరిస్థితులకు, సంఘర్షణలకు, పోరాటాలకు, గ్రామాల్లో వస్తున్న మార్పులకు ప్రతిస్పందనగానూ చక్కని కథలొస్తు న్నాయి. తాడిగిరి పోతరాజు, బి.యస్.రాములు, అల్లం రాజయ్య, వుప్పల నరసింహం, దేవరాజు మహారాజు, కాలువమల్లయ్య, భూపాల్ లాంటి ఎంతో మంది రచయితలీ పనిని సమర్థవంతంగా నిర్వహిస్తు న్నారు. ఇలా తెలంగాణ కథ సామాజిక నిబద్ధతకే పెద్దపీట వేస్తూ అన్ని కోణాలనూ స్పృశిస్తున్నది. అన్ని రకాల ప్రజా జీవితాలనూ స్వంతం చేసుకుంటుంది. అన్ని వస్తువులనూ కథావస్తువుగా స్వీకరించింది. గ్రామీణ జీవిత చిత్రణ, పల్లెసీమల సౌందర్యాలు, పల్లె ప్రజల ఆత్మీయానురాగాలు, పోరాటాలు, ఆరాటాలు, మారుతున్న విలువలు, జరుగుతున్న సంఘర్షణ అన్నీ తెలంగాణ కథల్లో చోటు చేసుకున్నాయి. సామాజిక బాధ్యతను గుర్తెరిగి రాసే రచయిత తన కథలు ఏ ప్రజల దగ్గరికయితే పోవాలని కోరుతాడో ఆ ప్రజల యొక్క భాషను స్వీకరించక తప్పదు. మాండలిక భాషా రచనలకు అత్యధిక ప్రాచుర్యం గత పది, పదిహేనేళ్ళనుంచి వచ్చినా మాండలిక భాషలో రచనలు రావడం మనకెప్పుడో మొదలైంది. మాండలికం గురించి ఇప్పటికే చర్చలు జరుగుతుండటం చూస్తుంటాం. తెలంగాణ రైతాంగ పోరాట కథను సుసంపన్నం చేసారు.

తెలంగాణ రైతాంగ పోరాట స్ఫూర్తితో ఉద్యమ కథలను విరివిగా రాస్తున్నాడు అల్లం రాజయ్య. ఈతని కథలను ఉద్యమ కథలకు ప్రతినిధి కథలుగా చెప్పవచ్చు. తెలంగాణ పోరాట కథ ఒరవడిని ముందుకు తీసుకెళుతూ ఉద్యమ కథను సుసంపన్నం చేసినవాళ్ళు బి.యస్. రాములు, రామ్మోహన్ రాజు, వుప్పల నరసింహం, సాహు, గోపి, రఘోత్తమరెడ్డి, కాలువ మల్లయ్య, యాదగిరిలాంటి వాళ్ళెంతో మంది ఉన్నారు. తెలుగు కథను ఉద్యమకథగా మళ్ళించడమే భూషణం, అల్లం రాజయ్యలు సాధించిన కథా విప్లవం. ఇలా తెలంగాణ కథ సామాజిక నిబద్ధతకు ఎప్పుడూ దూరం కాలేదు. కథా రచయితలు సాహిత్య ప్రయోజనాన్నెప్పుడూ మరిచిపోలేదు.

తెలుగులో అత్యధిక కథలు వ్రాసిన రచయిత కాలువ మల్లయ్య. సాహిత్యమే తనను బతికిస్తుంది, నడిపిస్తుందని హృదయపూర్వకంగా నమ్మి గత నాలుగున్నర దశాబ్దాలుగా సాహితీ సృజన చేస్తున్న అవిశ్రాంత రచయిత. కథ, నవల, కవిత, వ్యాసం, పరిశోధన ప్రక్రియ ఏదైనా మానవతా పరిమళం గుబాళించే రచనలు చేయడం ఈ రచయితకు వెన్నతో పెట్టిన విద్య. ప్రపంచ కథలకే ఆద్యుడయిన గుణాఢ్యుడు. కలం పట్టిన తెలంగాణ (కరీంనగర్ జిల్లా కోటిలింగాల) నుండి వచ్చిన ఈ రచయిత కలం నుండి అనేక ప్రసిద్ధ రచనలు వెలువడ్డాయి.

కాలువ మల్లయ్యగారు ప్రాథమికంగా కథకులు. కథే కాలువ మల్లయ్య గారితో నడుస్తుంది. ఆయన కథల్లో సజీవ పాత్రలు మనతో నేరుగా సంభాషిస్తాయి. తెలుగుభాషలో ఆయన రాసినన్ని కథలు మరే కథకుడు రాయలేదంటే అతిశయోక్తి కాదు. ఆయన వెయ్యి కథలకు చేరువలో ఉన్నారు. కొవ్వలి వెయ్యి నవలలు రాశారు. కాలువ మల్లయ్య వెయ్యి కథలకు దగ్గరలో ఉన్నారు. ఆయన కథల్లో తెలంగాణ బతుకు చిత్రం స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన వాడే భాష, యాస,

శైలి అన్నీ ఆయనను ఒక ప్రత్యేక కథకుడిగా నిలుపుతాయి. కథలే కాకుండా తొమ్మిది పదుల తెలంగాణ కథ (వ్యాస సంపుటి) నూట పదేళ్ళ తెలుగు కథ – విభిన్న ధోరణులు, తెలంగాణ కథ – తెలుగు కథ, అంటరానితనం అంబేద్కర్, చెప్పుల తయారి, మన జాతిపిత – సంస్కరణ వాది వీరేశలింగం వంటి పుస్తకాలను వెలువరించిన ప్రతిభావంతులు కాలువ మల్లయ్య.

కాలువ మల్లయ్య గారి కథల్లో అట్టడుగు వర్గాల కష్టాలు, కన్నీళు వారి దు:ఖాలు అన్నీ కనిపిస్తాయి. అనుభవాల నుంచి జీవితాల నుంచి, సమాజ మూలాల నుంచి వచ్చే సాహిత్యమే మంచి, గొప్ప సాహిత్యమవుతుంది. సాహిత్యం జీవిత వృక్షానికీ పూసే పువ్వు అన్న కొడవగంటి కుటుంబరావు మాటలు జ్ఞాపకం పెట్టుకోవాల్సిన అవసరముంది అంటారు కాలువ మల్లయ్య. ఇది అక్షర సత్యం. చూసిన ప్రపంచం అనుభవించిన జీవితం, తారసపడ్డ వ్యక్తులు, వ్యక్తుల కష్టాలు, బాధలు అన్నీ సాహిత్యంగా మారుతాయి. అలాంటి సాహిత్యమే నాలుగు కాలాల పాటు నిలిచి ఉంటుంది. అలా నిలిచి వుండే సాహిత్యాన్నే కాలువ మల్లయ్య గారు భుజానికెత్తుంటారు. గుండెకు హత్తుకుంటారు.

గురజాడ దిద్దుబాటు కథకు ముందే తెలుగులో కొన్ని కథలు వచ్చాయని కథా నిలయంవారు ప్రచురించిన తొలి తెలుగు కథ (ఏడు అభిప్రాయాలు అనే కథ సంకలనం వల్ల అర్థమవుతుంది. ఈ సంకలనంలో భండారు అచ్చమాంబ రాసిన ధనత్రయోదశి (హిందు సమాజం) 1902 నవంబర్ సంపుటం, స్త్రీ విద్య వంటి అనేక కథలు, అచంట సాంఖ్యాయన శర్మ రాసిన లలిత (కల్పలత 1903 నవంబర్) విశాఖ (కల్పలత 1904) అపూర్వోపన్యాసం (కల్పలత 1903 నవంబర్) కథలతో పాటు దిద్దుబాటు (ఆంధ్రభారతి 1910 ఫిబ్రవరి) మాడపాటి హనుమంతరావు హృదయ శల్యం (ఆంధ్రభారతి జనవరి 1912) కథలున్నాయి. అంటే గురజాడ కథకు ముందు కనీసం ఐదు కథలు వచ్చాయని అర్థమవుతుంది. అయినా గురజాడ కథనే మొదటి కథ అనాల్సిన అవసరమేముంది? భండారు అచ్చమాంబో, ఆచంట సాంఖ్యాయనశర్మనో మొదటి కథకులుగా గుర్తిస్తే గురజాడకు జరిగే నష్టమేం లేదు అంటారు. మొదటి వ్యాసంలో ఇక్కడ గురజాడ ప్రతిభను మల్లయ్య గారు తక్కువ చేసి మాట్లాడినట్లుగా మనం భావించకూడదు. చరిత్రను కూలంకుషంగా పరిశీలించి తేదీలవారిగా వచ్చిన కథలను ఈ వ్యాసంలో చూపిస్తూ భండారు రాసిన కథలే తెలుగులో మొదటి కథలని నిరూపించారు. కాలువ మల్లయ్య అభిప్రాయం ప్రకారం మొదటి కథలు తెలంగాణ నుండే వచ్చాయని మనమిక్కడ గ్రహించాలి.

తెలుగు కథా సాహిత్యంలో తెలంగాణ కథకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఇక్కడ కథ సమస్యల నుండే పుట్టింది. కోస్తా, రాయలసీమ ప్రాంతాలలోని కథలకంటే తెలంగాణ కథ భిన్నంగా అనిపిస్తుంది. అందుకు కారణం చారిత్రకంగా కొన్ని వందల సంవత్సరాలుగా ఈ ప్రాంతంలోని ప్రజలు నిత్యం సంఘర్షణలకు లోనవుతూ, పరాయిపాలనలో మగ్గిపోవడమే. ఇక్కడి వాతావరణ పరిస్థితులు, సంస్కృతీ సంప్రదాయాలు, జీవనవిధానం, ఆచార వ్యవహారాలు మిగతా ప్రాంతాల కంటే కూడా భిన్నంగా ఉంటాయి. **'పేదరికం, నిరక్షర్యాసత, భూసమస్య, వెట్టిచాకిరి, చాలీచాలనీ వ్యవసాయం, అణచివేత మొదలైన ప్రాంతీయ సమస్యలు తెలంగాణ కథకు మౌలిక లక్షణాలు.'** అందువల్లనే తెలంగాణ కథ సామాన్య మానవుని జీవితానికి వాస్తవికతా దర్శనంగా రూపొందింది.

వర్తమానంలో చరిత్రను తెలుసుకోవలసిన అవసరం ఉంది. తద్వారా ఆనాటి సామాజిక పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత తరానికి చరిత్ర ఒక ప్రేరణను కలిగిస్తూ మార్గదర్శకంగా నిలుస్తుంది. ఈ రోజు తెలంగాణలో ఏ బస్సు ఎక్కినా, ఏ గ్రామం వెళ్ళినా ఏ మనిషిని కదిపిన ఒక విషాద స్వరంతోనో, వీరత్వంతోనో ఏదో ఒక కథ మనకు కళ్ళకు సాక్షాత్కరిస్తుంది. తెలంగాణలోని ప్రతి ఇల్లు కథలకు పుట్టిల్లు, ప్రతి జీవితం ఒక కథాలయం. ఇది ఈనాటి తెలంగాణ కథ పరిస్థితి. తెలంగాణలో ఈనాడు అపారమైన వస్తు సంపద ఉంది. కాని దానికి తగినంత వాఙ్మయసంపద ఎదగలేదు. ఇందుకు కారణం తెలంగాణ అనేక రంగాల్లో ఎన్నో ఏళ్లుగా వెనుకబడిన ప్రాంతంగా ఉండటమే. ఇక్కడి ప్రజలు భూమికొరకు, భుక్తి కొరకు, విముక్తి కొరకు పోరాటాలు చేశారు. భారత దేశానికే పోరాటాల వారసత్వాన్నందించిన నేల తెలంగాణ. నిరంకుశ నైజాం వ్యతిరేక పోరాటాలు, భూపోరాటాలు తెలంగాణలో తీసుకొచ్చిన మార్పులు గణనీయమైనవి. ఉద్యమాలు తెలంగాణ రచయితలలో అనివార్యంగా కలం పట్టించినాయి. తెలంగాణ కథకులెప్పుడు నేలవిడిచి సాము చేయలేదు. వారు అన్ని ఉద్యమాలను, సామాజిక మార్పులను, విధ్వంసమవుతున్న విలువలను, జీవిత సమస్యలను, పల్లెపట్టణాల జీవిత చిత్రణను కథావస్తువుగా తీసుకుని రాయడం విశేషం.

సమాజ చరిత్ర సాహిత్య రూపం తీసుకున్నప్పుడు అది ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. సమాజ చరిత్రతో పాటు మరింత బలంగా ఉంటాయి. సైన్సు, టెక్నాలజీ, పారిశ్రామికీకరణ ద్వారా అభివృద్ధి చెందిన వారి జీవిత పరిణామాల గురించి ఎంతో సాహిత్యం వచ్చింది. ఇది అభివృద్ధి తాలూకు మరోవైపును చీకటి కోణాలను చూపే కథలు చాలా వచ్చాయి. తెలుగు నేలలో 150 ఏళ్లుగా పరిశ్రమలు, రైల్వేలు, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు విస్తరిస్తున్నాయి. లక్షలాదిమంది నిరాశ్రయులైనారు, నిరుద్యోగులైనారు, జీవితాలు కోల్పోయారు, నమ్ముకున్న నేలను కోల్పోయారు. శతాబ్దాలుగా నమ్ముకున్న పల్లెలు, గూడేలు వలస పోవడం వల్ల నిర్మానుష్యమై పోయాయి. సిమెంటు దుమ్మువల్ల భూగర్భ జలాలు

అడుగంటడంవల్ల, వాగుల రసాయనాలతో కలుషితమవడం వల్ల పంట భూములు బీడుగా మారాయి.

కాలువ మల్లయ్య కథల్ని కొన్ని ప్రత్యేకంగా పేర్కొనడం అవసరం. ఆయన రాసిన **'వెలి'** కథ చాకలి వాళ్ళ జీవితం చిత్రిస్తే, **'దొరసాని చీర'** కథలో చాకలి వాళ్ళపై భూస్వాములు చేస్తున్న దౌర్జన్యం చిత్రించింది. బట్టలు ఉతకటానికి ఇచ్చిన చీరలోంచి ఒక మంచి చీర ఒక పూట కట్టుకోవడం చూసి, దొరసాని చీర కట్టుకున్న నువ్వు కూడా నాకు అంటూ దొర చాకలి పడుచును దారుణంగా మానభంగం చేసిన విధానం ఇందులో కనబడుతోంది. ఫ్యూడలిస్టిక్ వ్యవస్థలో వున్న దౌర్జన్యం ఈ కథ ద్వారా కళ్ళకు కట్టించారు. **'అడవికాచిన వెన్నెల'** అనే కథలో గొల్లల జీవితాన్ని యదార్థంగా చిత్రించారు. గొర్రెలను ఆదాయ మార్గంగా ఎంచుకోవడంలో ఎన్ని కష్టాలు వున్నాయో వాటిని ప్రాణపదంగా చూసుకుంటూ కాపాడటానికి ఎన్ని ఇబ్బందులు పడాలో విశ్లేషించిన ఈ కథలో గొల్లల భాష వాస్తవికంగా నిక్షిప్తం చేశారు. స్వతంత్ర దినం, భూమి కోసం, ఓ గొల్లకథ, వాన రావాలె లాంటి కథలో తాను పుట్టి పెరిగిన గొల్లల జీవితాన్ని కాలువ మల్లయ్య సజీవంగా చిత్రించారు. **'ఎదురుచూపు', 'నిరీక్షణ'** లాంటి కథల్లో పద్మశాలీల, చేనేత కార్మికుల దీనమైన జీవితం, వలసలు పోవాల్సిన అనివార్యత భీవండికి గాని, గల్ఫ్ దేశాలకు గాని పోయిన క్రమం, పడిన బాధలు, అనుభవించిన వేదన, భీవండిలో జరిగిన మతకలహాల్లో మృత్యువాత పడ్డ యువకులు మొదలైన అనేక చారిత్రక అంశాలు ఈ కథల్లో కనబడతాయి. ఊరుమ్ముడి బతుకు కథలో గౌడులు కల్లమ్ముకుంటూ బతికే జీవితంలోని విషాదం, దొరలు వాళ్ళపై చేస్తున్న దౌర్జన్యం, వాళ్ళు పడుతున్న అవమానాలు వృత్తిలోని సాధక బాధకాలు చిత్రించారు. కుమ్మరి కులవృత్తిలో ఎదుర్కొన్న సమస్యలు గురించి **'ఈ భూమి నాది'** కథలో కుమ్మరి బ్రతకుల యదార్థ గాథ చిత్రించారు. తన భూమిలో కుండలు చేసుకోవటానికి మట్టిని తవ్వుకోవడానికి కూడా హక్కు లేని దుర్మార్గపు పద్ధతి చిత్రించడం జరిగింది. అలాగే పరాధీన కథలో చేనేత కులం నుంచి ఒక అమ్మాయి మూడు తరాల్లోని కూతురుగా, భార్యగా, తల్లిగా ఒక్క పట్టుచీరను కొనుక్కొలేని దుస్థితిని వర్ణించడం జరిగింది. అయితే చేపలమ్ముకోవడంలో వాళ్ళను హీనంగా చూడటంలాంటి అనేక విషయాలు ఇందులో కనబడతాయి. అద్దాల నాడు కథలోను, గోరుకాలు, కథలో మంగలి వారి జీవిత చిత్రణ వుంది. కొడుకును చదవిస్తే పైకి వస్తాడనుకొని చదివించిన తర్వాత తనకు కాకుండా పోయిన దీన దృశ్యాలు ఈ కథల ద్వారా తెలుసుకోవచ్చు. మంగలి వృత్తిలోని విషాదాన్ని, వాళ్ళను హీనంగా చూడడాన్ని ఈ కథలో చూడవచ్చు. కాలువ మల్లయ్య గతాన్ని ప్రేమిస్తారు. అంబేద్కర్‌ను అభిమానించినప్పటికీ ఆయనది మౌలికంగా గాంధీ మార్గం. గాంధీజీ వలె కాలువ మల్లయ్య పల్లెలను ప్రేమిస్తారు. కులవృత్తులను ప్రేమిస్తారు. పట్టణాల నుండి, నగరాల నుండి తిరిగి గ్రామాలకు వెళ్ళాలని తన కథలో పిలుపునిస్తారు. గ్రామం ప్రశాంతంగా వుంటుందని, పర్యావరణం, చక్కని ప్రకృతి, మానవీయ సంబంధాలు వుంటాయిని తన దళిత, బహుజన కథల్లో చిత్రించారు. ఆడెపు లక్ష్మీపతి త్రిభుజపు నాల్గోకోణం కథలో పద్మశాలి జీవితాల్లో కులవృత్తులు కోల్పోయి అనేక ఇతర వృత్తులు, వ్యాపారాలు చేపట్టి నష్టాలు సంభవించి జీవితాలు, కుటుంబాలు ఎలా శిథిలమవుతూ వస్తున్నాయో చిత్రించారు. బీసీ కులాల నుండి మధ్య తరగతిగా ఎదుగుతున్న జీవితాలలోని సంఘర్షణను, సంక్లిష్టతను శిల్ప వైవిధ్యంలో చిత్రిస్తున్నారు. అసందిగ్ధ కర్తవ్యంలో కులమతాల కారణంగా ప్రమోషన్ ఇవ్వాల్సి ఉండగా ఇవ్వకుండా అడ్డుకుంటూ అగ్రకులాల వాళ్లు, అధికారులు ఎలా వక్రమార్గాలు పడతారో, తద్వారా బాధితుల మానసిక సంఘర్షణ ఎలా ఉంటుందో చిత్రించారు. **విధ్వంస దృశ్యం** కథలో నూతన పారిశ్రామిక ఆర్థిక విధానాలు, గ్లోబలైజేషన్ పరిమాణాల్లో విచ్ఛిన్నమవుతున్న కుటుంబ విలువలు చిత్రించారు.

కాలువ మల్లయ్య తరువాత ఉధృతంగా కథలు రాసిన వారిలో కె.వి.నరేందర్ ఒకరు యువ రచయితల్లో ఆయన రాసినంత వస్తు వైవిధ్యం, శిల్ప వైవిధ్యం మరొకరిలో కనపడదు. అమ్మ గురించి విభిన్న కోణాల్లో 14 కథల్లో **"అమ్మ"** కథల పుస్తకం వెలువరించారు. సైనికుల జీవితాల గురించి 5 కథలతో యుద్ధం కథల సంపుటి వెలువరించారు. బాలకార్మికుల గురించి 15 కథలతో పల్లెల్లో శిథిల మౌతున్న వృత్తుల గురించి వారి జీవితాల గురించి కాలుతున్న పూలతోట కథల సంపుటిలో గ్రామీణ సమాజంలో వస్తున్న పలు పరిణామాలను అద్భుతంగా చిత్రించారు.

సామాజిక దృక్పథంతో బహుముఖాలుగా విస్తరిస్తున్న కె.వి. నరేందర్ కథలు. ఒకే విషయంపై ఒకే వస్తువు గురించి వివిధ పార్శ్వాల గురించి నాన్న కథల సంపుటిని వెలువరించారు. కె.వి. నరేందర్ నాన్న గురించి నాన్న కథల సంపుటిలో మ్యాచ్ ఫిక్సింగ్, కొడుకు నేర్పిన పాఠం, మట్టిమనసు, డియర్ పా, నాన్న డైరీ, డాడీ డాడీ, తెగిపోయిన పాట, నాన్నని పంచుకుందాం, నాన్నగది, నాన్న

తప్పిపోయాడు మొదలైన కథలలో గత పదేళ్ళలో నాన్న కుటుంబంలో ఎదుర్కొంటున్న సమస్యలను, నాన్న స్థానాన్ని చిత్రించిన తీరు, సామాజిక పరిణామక్రమాన్ని చరిత్రను చిత్రించిన తీరు అపూర్వం. తెలుగు సాహిత్యంలో ఈపని మరెవరూ చేయకపోవడం రచయిత దృక్పథాన్ని చెప్పకనే చెప్పుతుంది.

అయితే కొందరికి ఉద్యమ కథలు తప్ప మిగతావి కథలే కావు. మరి కొందరి దృష్టిలో ఉద్యమ కథల్లాంటివి కథలే కావు. ఈ రెండు ధోరణులూ తప్పే సామాజిక నిబద్ధతతో రాయబడిన ఏ కథయినా మంచి కథే అవుతుంది. సమాజాన్ని ప్రతిబింబించేది కథయినప్పుడు ఆయా ప్రాంతాల్లో వస్తున్న ఉద్యమాలు పట్టించుకోకుండా ఉండటం సామాజిక బాధ్యత గుర్తెరిగిన రచయితకెలా కథావస్తువు కానక్కర్లేదు. ఒకప్పటికి ఇప్పటికి తెలంగాణ లాంటి ప్రాంతాల్లోనూ మధ్యతరగతి గణనీయంగా పెరిగింది. వాళ్ళ సమస్యల స్వరూపమూ మారింది. గ్రామాల్లో రకరకాల సంఘర్షణుంది. వివిధ ఉద్యమాల ప్రభావమూ ఉంది. ఇవన్నిటినీ పట్టించుకొని కథలు వ్రాయాల్సిన అవసరముంది. వ్రాస్తున్నారు కూడా. సామాజిక మార్పును అభిలషిస్తూ ఈ విషయా లన్నీ పై వచ్చే కథలూ మంచి కథలే అవుతాయి.

అలాగే స్త్రీవాదం, దళితవాదం ప్రస్తుతం తెలుగు సాహిత్యంలో బలమైన పునాదులతో ముందుకొస్తున్నాయి. స్త్రీవాదమంటే పురుష ద్వేషమనో, దళిత సాహిత్యం, దళితులే రాయాలనో కాకుండా వాటి ఉద్దేశాన్ని, అవసరాన్ని గుర్తిస్తే ఆయా వాదాలకు మద్దతుగా మరెన్నో గొప్ప కథలు వచ్చే అవకాశముంది. సామాజిక నిబద్ధత కల్గిన రచనలంటే రా.వి. శాస్త్రిగారు చెప్పినట్టు 'అయ్యో అయ్యో' కథలు మాత్రం కావు. వీలైతే పరిష్కారాన్ని చూపడం కూడా అవసరం. అట్లని వాస్తవ విరుద్ధమైన, ఆవేశ పూరితమైన పరిష్కారాలను చూపడమూ సరియైంది కాదు. ఇప్పుడు తెలంగాణ కథ భాషా పరం గానూ, విషయ పరంగానూ నిబద్ధతతోనే వస్తుంది. ఏ భాషా సాహిత్యా నికి తీసిపోని మంచి కథలెన్నో తెలుగులో వస్తున్నాయి. సామాజిక నిబద్ధత ధ్యేయంగా వచ్చిన తెలుగు కథా సాహిత్యాన్నంతా ఒక గుది గుచ్చినట్టు పేర్చుకుంటూ పోతే ఆ కథలతో తెలుగు ప్రజల సామాజిక చరిత్ర రాయొచ్చుననేది అక్షరసత్యం. ఇప్పుడు వస్తున్న తెలుగు కథ మరింత వస్తువైవిధ్యాన్ని సంతరించుకొని ఇదివరకెప్పుడూ స్పృశించని విషయాలను స్పృశిస్తూ వస్తున్నదన్నమాట నిజమే. ఈ దశాబ్దంలో ఉధృతంగా కథలు రాసిన వారిలో కాలువ మల్లయ్య ప్రథములు. ఇప్పటివరకు 1000 పైగా కథలు రాసారు. ఇందులో ఆంధ్రప్రభ దినపత్రికలో వచ్చిన **'అవ్వతోడు' 'గిది తెలంగాణ'**, ప్రజాతంత్ర వారపత్రికలో వస్తున్న తెలంగాణా మట్టి కథలు, ఇంకా తన కథల్లో విద్యార్థుల చదువుల సమస్యల గురించి, స్త్రీల సమస్యల గురించి సగటు మధ్య తరగతి మనిషి గురించి, కార్మికుల గురించి, వ్యవసాయదారుల గురించి, తెలంగాణా గురించి, మేధావుల గురించి, దళితుల గురించి, మానవ సంబంధాల గురించి, విప్లవవాదం గురించి కథలు రాసారు.

**వలస బతుకుల వ్యథలు :** డబ్బు సంపాదించుకొని వచ్చిన తర్వాత మస్కట్ మల్లయ్యను అందరు గౌరవిస్తూ తమను కూడా అరబ్బు దేశాలకు పంపుమని కొరుతుంటే మస్కట్ మల్లయ్య తాను కోల్పోయిన యవ్వనాన్ని, పడ్డకష్టాల్ని ఎవరూ గమనించకపోవడం గురించి ఆవేదనని చిత్రిస్తుంది. **కక్రోడు** కథలో నలుపు వల్ల సమస్యలు ఎదుర్కొంటూ ఎదిగిన తర్వాత తాను తమ హెరీదాతో, అహంతో ఇతరులను తిరిగి కష్టపెట్టే తీరును చిత్రించింది. **నా తెలంగాణా** కథలో చెప్పులు కుట్టే మాదిగలోని చైతన్యాన్ని హీన వ్యక్తిత్వంతో బతికే ఇంజనీర్ తెలంగాణా ఉద్యమ పరిణామాలను చిత్రించారు. ఆస్తి ఉందని నమ్మిస్తేనే కొడుకులు, కోడళ్లు, బిడ్డలు చివరి దాకా మంచిగా చూసుకుంటారని నమ్మిన వృద్ధురాలు గిల్టు నగలను అసలు నగలుగా నమ్మకం కలిగించి సుఖంగా వెళ్లిపోయిన తీరును అమ్మమీది సొమ్ములు కథలో చిత్రించారు. భద్రత యుద్ధభూమి కథల్లో తెలంగాణా మధ్యతరగతి జీవితానికి భద్రత లేదని యుద్ధభూమి గా పరిణమిస్తున్నదని చిత్రించాయి.

గత దశాబ్దంలో 200ల పైగా కథలు రాసిన కాలువ మల్లయ్య కథలకు ఒక జీవనది. ఆయన కథల గురించి ఒక ప్రత్యేక అధ్యయనం అవసరం. 1990 నుండి కాలువ మల్లయ్య కథలు వివిధ సంకలనాల్లో 25 దాకా చేరాయి. ఇన్ని సంకలనాల్లో ఇన్ని కథలు చేరిన రచయిత కాలువ మల్లయ్యగారొక్కరే. సుమారు 12 పి.హెచ్.డి.ల్లో కాలువ మల్లయ్య గారి కథలు పరిశీలనాంశాలై పోయాయి. పైన పేర్కొన్న సమీక్షకులు కాలువ మల్లయ్య పదేళ్ళ కథల కృషిని వాటి వైవిధ్యాన్ని పట్టుకోలేకపోయారు. ఇది వారి కొంచెపు బుద్ధిని తెలుపుతుందే తప్ప జ్ఞానాన్ని కాదు. తెలంగాణ కథా సాహిత్యంలో కాలువ మల్లయ్య-కె.వి. నరేందర్, సామాజిక వైవిధ్యం: కాలువ మల్లయ్య స్త్రీల సమస్యల గురించి గలుమ, నిరీక్షణ, దగా దగామొదలైన కథలను, సగటు మధ్యతరగతి గురించి జీవచ్ఛవం, అల్లమురబ్బా, చావు మొదలైన కథలను, కార్మికుల జీవితాల గురించి ప్రస్థానం, మళ్లీ తల్లి ఒడిలోకి, అన్న కథలను, వ్యవసాయం చేసే రైతుల గురించి సృష్టికర్త అనే దాని నేలతల్లి సృష్టి కర్తలు చిరునామా, టెలిఫోన్ పల్లె వలసల గురించి అడవిగా చినమల్లయ్య, బోధివృక్షం, మస్కట్ మల్లయ్య కథలను, మేధావుల తీరు తెన్నుల గురించి గుప్పెడు నా తెలంగాణ, ఎంగిలిచేలో, అగ్ని అంశం మానవ సంబంధాలు, ఆర్థికాంశాల గురించి నిరుడు కురిసిన హిమ సమూహములు, రూపాయి రూపాయి, అమ్మ మీది సొమ్ములు, భద్రత, యుద్ధభూమి మొదలైన కథలను రాశాడు. వస్తు విస్తృతిలో కాలువ మల్లయ్య తెలుగు సాహిత్యంలో అనేక కథలు రాశారు, రాస్తున్నారు.

# గురజాడ 'తొలి కొత్త తెలుగు కథలు' – విశ్లేషణ

**డా. ఎన్. రజని,** ఫోన్ : 901 050 1030

రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి గారు రాసిన **"గురజాడ తొలి కొత్త తెలుగు కథలు"** అనే పుస్తకం నిజానికి ఎంతోమంది మా తరం విద్యార్థులకు గురజాడ వెంకట అప్పారావుపై అభిమానాన్ని పెంపొందించిందని నిస్సందేహంగా చెప్పొచ్చు. ఇది నా అభిప్రాయమే అయినా, నిజానికి ఆ పుస్తకం చాలామందిని గురజాడ అభిమానులుగా మార్చి ఉంటుంది. నా ఎం.ఫిల్, పిహెచ్.డిలకు ప్రేరణ కూడా ఈ పుస్తకమే.

ఈ పుస్తకం 73 పేజీలు కలిగి ఉంటుంది. కేవలం పది రూపాయలు మాత్రమే. పుస్తకం కవర్‌పేజీ (అట్ట) గుండ్రని చేతి రాతతో ఉంటుంది. గురజాడ తొలి కొత్త తెలుగు కథలు, గురజాడ కథలపై విమర్శ, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి అని రాసి ఉంటుంది.

పుస్తకంలో విషయముండడమే ముఖ్యం. పుస్తకానికి హంగులు అవసరం లేదని నిరూపించిందీ పుస్తకం. కేవలం 73 పేజీలతో ఉన్న ఈ పుస్తకం గురజాడ పట్ల, గురజాడ కథల పట్ల స్పష్టమైన అవగాహనను ఇస్తుంది. రచయితకు గురజాడ పట్ల ఉన్న దృక్పథాన్ని, గురజాడ కథలపై ఉన్న మమకారాన్ని అటు గురజాడకు ఇటు రచయితకు ఉన్న సామాజిక దృక్పథాన్ని ఈ పుస్తకం స్పష్టంగా తెలుపుతుంది.

ఈ పుస్తకంలోని అంశాలను అయిదు భాగాలుగా విభజించారు. ముఖ్యంగా తెలుగు పాఠకుడి సౌకర్యార్థం గురజాడ రచనల పట్ల, కథ అనే సాహిత్య ప్రక్రియ పట్ల, కథల్లోని సామాజిక, సాంఘిక, సంస్కరణ దృష్టికోణాల పట్ల విమర్శకుడిగా తన అభిప్రాయాలను ప్రకటించడం పట్ల స్పష్టమైన అవగాహన కలిగిన విమర్శకుడిగా రాచపాళెం చంద్రశేఖర రెడ్డిగారిని మనం గుర్తించవచ్చు.


మొదట గురజాడను పరిచయం చేస్తూనే వారి నేపథ్యం, వారి జీవితం వారు రాజావారి ఆంతరంగికుడిగా నేర్చుకున్న విషయాలు ఇవన్నీ మనకు చెప్తారు రాచపాళెం చంద్రశేఖర రెడ్డిగారు.

గురజాడ ఒక సాహితీ సంస్కర్తగా తాను ఈ కథలను రాయగలిగాడంటే, ఆ రచయిత ఇట్లాంటి కథలు రాయడానికి కావలసిన నేపథ్యాన్ని మనం గ్రహించేటట్టు చేస్తారు. ఆ తరువాత తెలుగు కథలో, కథా సాహిత్య రచనలో గురజాడకు ఉన్న స్థానాన్ని అంచనా కట్టే ప్రయత్నం చేస్తారు. ఈ ప్రయత్నంలో భాగంగా అప్పటివరకు ఉన్న కథా సాహిత్యాన్ని గురించి చెప్తూనే సమాజానికి కావలసిన తెలుగు కథను గురజాడ ఏ ప్రత్యేక పరిస్థితిలో అందించాడో చాలా స్పష్టంగా తెలుపుతారు.



మొత్తంగా కథానిక ఎట్లా ప్రారంభమయింది, ఎప్పుడు పుట్టింది, ఎట్లాంటి శిల్పం, ఎట్లాంటి వస్తువు, ఎట్లాంటి భాష ఉండాలి, అసలు కథ సమాజానికి ఎట్లాంటి ఉపయోగం కలిగించాలి? కథకు ఉండవలసిన క్లుప్తత, ముగింపు, సంభాషణల పట్ల, ఆది మధ్యాంతాలు ఎట్లా ఉండాలనే దాని పట్ల బుచ్చిబాబు, మొదలైన ప్రముఖ రచయితల అభిప్రాయాలను, వాళ్ళ భావాలను పాఠకులకు అందిస్తారు.

కథానిక స్వరూప స్వభావాలు, కథానిక పట్ల తెలుగు విమర్శకుల అభిప్రాయాలు, ముఖ్యంగా ప్రారంభం ఎట్లా ఉండాలి, మధ్యలో ఏం ఉండాలి? కథకు ఏవిధంగా ముగింపు ఇవ్వాలి? మొదలైన అంశాలన్నింటి పట్ల మధురాంతకం, బుచ్చిబాబు, శీలా వీర్రాజు, నార్ల వేంకటేశ్వరరావు, రారా మొదలైన విమర్శకులందరు చెప్పిన అభిప్రాయాలను పాఠకుల అవగాహన కోసం పొందుపరిచారు. అంటే ముఖ్యంగా గురజాడ కథలలో ఉన్న అన్ని కథా నిర్వచనాలు, స్వరూప స్వభావాలు, కథానికా లక్షణాలు ఎట్లా అన్వయించవచ్చో ఒక ఆలోచనకు అవకాశాన్ని ఇచ్చారు. అంటే తాను తనకు గురజాడ కథల పట్ల ఉన్న అభిప్రాయాలు చెప్తూనే, మంచి సాహిత్య విమర్శకులందరూ తెలుగు కథకుండవలసిన లక్షణాలను ఎట్లా



వివరించారో తెలపడం రాచపాళెంగారికి సాహిత్యవిమర్శ పట్ల ఉన్న స్పష్టమైన దృక్పథాన్ని తెలుపుతుంది అని చెప్పవచ్చు.

గురజాడ రాసిన ఐదు కథలలోని అన్ని లక్షణాలను ఈ విమర్శకులు చెప్పిన అభిప్రాయాలకు అన్వయించి చూపారు కూడా. ఆ విమర్శకులందరి గురించి ప్రస్తావిస్తూ **"ఇప్పుడు పేర్కొన్న విమర్శక లాక్షణికులందరు గురజాడకు తర్వాతివారే. గురజాడ ఒరవడిని దిద్దుకొని కొన్ని వేల కథలు వచ్చిన తర్వాత ఈ నిర్వచనాలు, లక్షణాలు పుట్టాయి. ఇక్కడ పేర్కొన్న అంశాలన్నీ గురజాడ కథలకు సరిపడవచ్చు, సరిపడకపోవచ్చు"** అనే మాట స్పష్టంగా చెప్పారు. చెప్తూనే, ఈ నేపథ్యంతో గురజాడ కథల్ని వస్తు శిల్ప దృష్టితో వివేచించి, గుణదోష విచారణ చేద్దాం అంటారు. అంటే రాచపాళెం గారు ఈ అయిదు కథలను తొలి కొత్త తెలుగు కథలుగా ప్రతిపాదిస్తూనే, ఈ కథలను ఏ నేపథ్యంలో వివేచించాలి? ఏ సామాజిక నేపథ్యంతో పరిశీలించాలి అనే స్పష్టతను కూడా పాఠకులకు తెలిపారు.

రాచపాళెంగారికి తనకు కన్యాశుల్కం పాఠం చెప్పే అవకాశం రావడం గురజాడను ఒక ప్రత్యేకాధ్యయనంగా పరిశీలించే అవకాశం రావడం కూడా ఈ తొలి కొత్త తెలుగు కథల గురించి రాయడానికి ఒక ప్రేరణగా చెప్తారు. 19వ శతాబ్దం భారతదేశ చరిత్రలోనే ఒక సంఘర్షణ యుగంగా చెప్పుకోవాలి. గురజాడ రాసిన కథల్లో ఆనాటి సామాజిక జీవితం ప్రతిఫలిస్తుంది.

ఒక స్త్రీకి చదువు చెప్పించడమనేది అప్పుడు పురుషుడు చేసే ఒక దుస్సాహసం అంటాడు రచయిత. వేశ్యను ఉంచుకోవడం గౌరవస్థాయికి అంటే (ప్రెస్టేజి)కి గుర్తుగా భావించేవాళ్ళు. అదే సమయంలో వేశ్యను కనీసం మనిషిగానైనా చూడని ఒక దుర్మార్గమైన సమాజం మరోపక్క ఉంది. అట్లాంటి సమాజాన్ని గురించి తెల్పుతూ, **"సానిపిల్లల్లో ఉండే మానవత్వాన్ని మరిచిపోకు. ఆమె సైతం ఒక మానవ వ్యక్తి అనే మాట విస్మరించకు. ఆమె విచారం, కన్నీళ్ళు, సంతోషం, ఆనందబాష్పాలు నీ నా సుఖదుఃఖాల వంటివే. ఆమె ఏ వివాహ బంధాలనూ, వైవాహిక సూత్రాలను ఉల్లంఘించడం లేదు"** అంటూ వేశ్యావృత్తి ప్రబలంగా ఉన్న సమయంలో అంత నిక్కచ్చిగా చెప్పారంటే గురజాడ ఒక మానవతావాదిగా, సాటి మనిషికి, ముఖ్యంగా స్త్రీని, స్త్రీ ఆలోచనలను అర్థం చేసకునే అభ్యుదయ వాదిగా మనం కచ్చితంగా చెప్పుకోవాలి.

గురజాడ తెలుగు సాహిత్య స్వభావాలనే మార్చారని చెప్పారు రాచపాళెంగారు. గురజాడ తెలుగు సాహిత్యాన్ని సంకుచితత్వం నుండి విశాల ప్రపంచంలోకి, అద్భుతత్వం నుండి వాస్తవికతలోకి, అనుపూర్వికత నుండి ఆధునికతలోకి, దేవుళ్ళు, రాజుల నుండి సామాన్యుల వద్దకు తీసుకొచ్చారనే వాస్తవాన్ని ఎంతో సహజంగా వ్యక్తీకరిస్తారు.

మరోచోట గురజాడ ఆధునికతకు ప్రతీక అని చెప్తూ ప్రాచీన సాహిత్యంలో వేశ్యను ప్రధానపాత్రగా పింగళి సూరన మలిస్తే, గురజాడ వేశ్యాసమస్యనే ప్రముఖం చేసి, వేశ్యలోని మానవత్వాన్ని గుర్తించాడు గురజాడ అంటారు రాచపాళెంవారు.

కథానికకు ఉండవలసిన అన్ని లక్షణాలు గురజాడ కథకు ఎట్లా ఉన్నాయో కొన్ని వివరణలిస్తారు. **"కొండంత సమస్యను ప్రదర్శించే గోరంతదీపం కథానిక"**... దిద్దుబాటు కథను మనం ఈవిధంగా చెప్పొచ్చు.

గురజాడ రాసిన ఐదు కథలు భిన్నరంగాలకు చెందినవి. దిద్దుబాటు, మెటిల్డా, సంస్కర్త హృదయం... మూడూ సాంఘిక కథాశిల్పాల్లో, మూడూ మూడు రకాలు, మూడూ స్త్రీ ప్రధానమైన కథలు. మూడింటిలో మోసగాళ్ళు, దుర్మార్గులు అయిన పురుషులు, మగవాళ్ళను మార్చగలిగిన, మగవాళ్ళ చేతిలో హింసించబడిన స్త్రీలు కనిపిస్తారు. ముఖ్యంగా చెప్పే నీతికీ, చేసే చేతకీ సంబంధం లేని పురుషుల పాత్రలను సృష్టించారు గురజాడ. కె.వి. రమణారెడ్డిగారు చెప్పినట్లు **"అప్పారావు కథలన్నీ జీవిత వాస్తవాన్ని ఆశ్రయించుకున్న సామాజిక చిత్రణలు".**

దిద్దుబాటు కథ గురించి చెప్తూ ఆధునిక మహిళ చరిత్రను తిరిగి రచించిన కథగా అభివర్ణిస్తారు. **"భర్త ఏమి చేసినా సహించే పతివ్రతా స్థాయి దాటి, బెదిరించి, తిరగబడి, యుక్తిని ప్రయోగించి భర్తను సరిదిద్దుకున్న మహిళ చాతుర్య చిత్రణ దిద్దుబాటు"** అంటారు రాచపాళెం.

మొత్తంగా గురజాడ కథలను చదివిన తర్వాత రాచపాళెం గారు వారి గురించి, వారి కథల గురించి చేసిన సునిశిత పరిశీలన గురించి పాఠకులు తెలుసుకోవలసిన అవసరం ఉంది.

సాంఘిక సమస్యల పట్ల ఆవేశంతో కాకుండా ఆలోచన కలిగినవాడు గురజాడ. వారి డైరీలు చదివితే, లేఖలు చదివితే, వారికి సామాజిక స్వభావం లేని సిద్ధాంతాలు నచ్చవనే విషయం అర్థమవుతుందంటారు రాచపాళెం.

మనిషికి ఆదర్శాలుండడం అవసరమే కాని, అవి ఆచరణ సాధ్యమైనవి కావాలి అన్నదే గురజాడ ఉద్దేశంగా వారి కథలు చదివితే అర్థమవుతుంది. గురజాడ సృష్టించిన రంగనాథయ్యరు పాత్ర జీవన సంఘర్షణ నుండి కాక పుస్తకాల నుంచి పుట్టే సిద్ధాంతాలకు కర్తగా పేర్కొంటారు.

గురజాడకు స్త్రీ పురుష సంబంధాల పట్ల, మానవ పరిణామం పట్ల స్పష్టమైన అవగాహన ఉంది. పైగా ఒక వేశ్య పాత్రైన సరళతో చంద్రవంశపు రాజుల నెత్తురు సానివాళ్ళదే కదుటండీ... అని ఒక బ్రాహ్మణపండితున్ని అడగలిగే ధైర్యం కల స్త్రీ పాత్రను, సరళ పాత్రను సృష్టించారు గురజాడ.

నాంచారమ్మ పాత్ర కథాస్థలంలో ఒక మెరుపు మెరిసినంత మేర నిలిచి ఉన్న కార్యశూరురాలిగా, సామాజిక పాత్రగా పేర్కొన్నారు.

మొత్తం కథలను తొలి కొత్త తెలుగు కథలుగా పేర్కొంటూనే కొన్ని సద్విమర్శలను కూడా చేస్తారు.

అప్పటికే వ్యావహారిక భాషోద్యమంలో స్వైరవిహారం చేసిన గురజాడ తన కథలలో కథనంలో గ్రాంథికభాషను ఎందుకు వదులుకోలేదో, విచారించవలసిన విషయమే అంటారు.

చిట్టచివరగా గురజాడ పట్ల తనకున్న అభిప్రాయాలను రాచపాళెంగారు ఈవిధంగా తెలుపుతారు.

సమాజం పట్ల ఉన్న మహత్తర బాధ్యతను గురజాడ తన కథలు, రచనల ద్వారా తన బాధ్యతను నిర్వహించారు.

తెలుగు సాహిత్యంలో స్త్రీని ప్రధానం చేసి రచన చేసిన మొదటి రచయిత గురజాడే. వీరి కథలకు సమకాలిక స్వభావం ఉంది. అవి సమజానికి ప్రతిబింబాలుగా కూడా ఉన్నాయి. గురజాడ సాహిత్యం స్త్రీజన ప్రాధాన్యం. కందుకూరి వీరశలింగం స్త్రీలకు విద్య చెప్పించడం కోసం ఉద్యమం చేసారు. గురజాడ చదువుకున్న స్త్రీల గాథల్ని రాయడమే కాక, చదువు కున్నా స్త్రీలు ఇంకా బాధలు పడుతూనే ఉన్నారనే స్పృహ కలిగిన రచయిత గురజాడ.

గురజాడ తీర్చిన పాత్రలలో చదువుకున్న కమలిని, చదువు భర్తను దిద్దుకోవటానికి ఉపయోగపడింది. మెటిల్డా ఉత్తరం పొరుగింటి అబ్బాయిని ప్రాధేయపడడానికి ఉపయోగపడింది. కమలిని తన సమస్యలను సుతారంగా, సున్నితంగా పరిష్కరించుకుంది. మెటిల్డా తన సమస్యకు రాజీపడింది. సరళ, సంస్కర్త చేతిలో మోసానికి గురయ్యింది. నాంచారమ్మ సామాజిక బాధ్యత నిర్వర్తించింది. ఆనాటి సమాజంలో స్త్రీలున్న స్త్రీలలో ఆనాడు ఉన్న వైవిధ్యమంతా ప్రదర్శించారు.

ఒక రచయిత అనేక కథలు రాస్తే అన్నిటిలో ఒకేరకమైన శిల్పం ఉండకూడదు అన్న రాచపాళెం మాటలకు గురజాడ ఒక అన్న రా.రా. మాటలకు గురజాడ ఒక ఉదాహరణ అని చెప్తారు రాచపాళెం. గురజాడ శైలి సమాజంలోని రుగ్మతలను బయటకు తోసే ఫోర్‌సెప్స్‌గా అభివర్ణిస్తారు.

గురజాడ తొలి కొత్త తెలుగు కథలను, కథల్లోని విశేషాంశాలను, లోతైన పరిశీలనను సూక్ష్మదృష్టిని మా తరానికి పరిచయం చేయడమే కాక, ఒక విమర్శనాత్మక దృష్టిని అందించిన రాచపాళెం చంద్రశేఖర రెడ్డిగారి ఈ పుస్తకం పాఠక లోకానికి ఒక మంచి కానుకగా భావిస్తూ గురజాడపట్ల, గురజాడ కథల పట్ల వారికున్న అభిప్రాయంతో ఏకీభవిస్తూ, ఆ అభిప్రాయంతోనే ముగిస్తాను.

**'మనిషిని మనిషి హింసించే వ్యవస్థను ఆచరణకు అసాధ్యమైన ఆదర్శాలను, సామాజిక సంస్థలను స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడానికి ప్రశ్నించే కథలు ఎప్పటికైనా ఆణిముత్యాలే'** – రాచపాళెం.

## సత్యం

ఆ పందొమ్మిది వందల
యాభై రెండు వత్సరపు
ముల్కీ ఉద్యమం నుండి
మొన్నటి ఘన తెలంగాణ
మహోద్యమం వరకు పోరి
ఉదయించిన తెలంగాణ ...
అనేక విధాల కేంద్రం
సహకరించక పోయినా
పరాయి మీడియా సదా
తక్కువ చేసి రాసినా
అక్కసుతో అన్యమతులు
ద్వేష విషము కురిసినా
కుసంస్కార జనముఖాలు
కుళ్ళుకూతలు కూసినా
కూల్చివేయు రాక్షసులే
కుతంత్రాలను పన్నినా ...

అనతి కాల ఖండంలో
పరుచుకున్న ప్రగతి చూసి
అన్య రాష్ట్రాల ప్రజలు కూడ
ఇచటి ఫలము లాశించగ
విదేశీయులును సైతం
విదితులుగా సన్నుతించ...
నిబద్ధతతో నిపుణతతో
ఆర్థిక క్రమ శిక్షణతో
అసమాన దర్శనంతో
పాలనమున దక్షతతో
శాంతిభద్రతలను పెంచి
రాష్ట్రాన్ని సమృద్ధి పరిచి
బహుముఖీనంగా ప్రజకు
బలము చేకూర్చుతున్నది...

కోటిపైన ఎకరాలకు
సాగునీరు సాచిపోసి
ఎపి నే అధిగమించి
వరి ఉత్పత్తులను పెంచి
అడవి వెడద పెరిగి చేర
ఇరవై నాలుగు శాతం
మారుమూల గిరిజనులకు
తాగునీరు తెచ్చి యిచ్చి
బ్రతుకు నింద విద్యుత్తును
భవిత పండ సంపత్తిని
అందించుచు పొందుపరిచె
కొత్తబాట దేశానికి...
రెండువేల పద్నాలుగా
నుండి ఇరవై మూడు వరకు
దేశ గణాంకాలు చూడ
తెలియవచ్చు నసలు నిజము...

ఆవిర్భావం వెంటనె
రెండువేల పదిహేనున
రాష్ట్రాదాయం చూస్తే
నాలుగు లక్షల కోట్లే
సమర్థతగ నడిపించగ
ఇరవై రెండున చూస్తే
రాష్ట్రాదాయం పెంపై
పదకొండు లక్షల కోట్లు...
అప్పులకొస కనిన కూడ
ఆరోగ్యమౌ ఆర్థికం
సాధించిన పరిణామం
జీవన బహుళ ముఖీనం
మన తెలంగాణ రాష్ట్రం
అందించే స్ఫూర్తితోడ
భారతాన ప్రతి ప్రాంతం
వర్తిలనీ... వర్ధిలనీ..
వసుధంతా వరించనీ...

**యముగంటి ప్రభాకర్**
ఫోన్ : 9440 152 258

# ఆంధ్ర మహాభారతం లాంటి అసామాన్య కావ్యం 'బాపూజీ ఆత్మకథ'

**చిటిప్రోలు వేంకటరత్నం**, ఫోన్ : 7702358616

**'అభినవ తిక్కన'** అనే బిరుదాన్ని విసర్జించి తమ్ము తాము **'తెలుగులెంక'**గా స్థిరపరుచుకున్న ప్రముఖ గాంధీయ కవివర్యులు తుమ్మల సీతారామమూర్తిగారి ఒక అనర్ఘ కావ్యం **'బాపూజీ ఆత్మకథ'.**

ఇది సాహితీవేత్తలను మెప్పించింది. అణ్ణామలై, మద్రాసు ఆంధ్ర విశ్వవిద్యాలయాల చేత పాఠ్యాంశంగా ఆమోదింపబడింది. అన్నింటిని మించి రచయితకు ఒక ఆత్మసంతృప్తి కలిగించింది. **"నా కావ్యములన్నింట నుత్తమము, పవిత్రమునైన యీ కావ్యం నా సారస్వతానుభూతికి, నా తెనుగుదనమునకు మూదలగా రూపెత్తులు నా భాగ్యమని తలంతును"** అని తుమ్మలవారు చెప్పుకున్నారు. తమ వ్యక్తిత్వం కూడా సత్యభరితమైన, స్వచ్ఛమైన బాపూజీ వ్యక్తిత్వం లాంటిదే కావడం ఈ ఆత్మసంతృప్తికి కారణమై ఉంటుంది.

వ్యక్తి చైతన్యానికున్న ప్రాధాన్యం సామాజిక చైతన్యానికి లేని కాల్పనిక కవిత్వం (భావ కవిత్వం) వారికి అసంతృప్తి కలిగించింది. ఇతివృత్తం విషయంలో ఒక స్పష్టమైన దృష్టి కలిగి ఉండడమే దానికి కారణం. ఆ స్పష్టదృష్టిని 'బాపూజీ ఆత్మకథ'లోని 'కృత్యాది'లో ఒక చక్కని పద్యం ద్వారా వెల్లడించారు.

**"ఏ నూరినో పేరినో సుబ్బినో నిల్పి**
**వచ్చి సింగారంబు పల్కు కంటె**
**హేతువాదమ్మున కింత నిల్వగ లేక**
**యౌదార్యమునకు దవ్వగుచు నీతి**
**రతులకెంతయు రోత రాజేయునట్టి పు**
**రాణమ్ములన్ బూని వ్రాయుకంటె**
**గాసులకు దాసుడగుచు ముక్కిడిని బొగడి**
**కల్ల కైతల నల్లుట కంటె నిట్టి**
**గుణ గరిష్ఠుల దేశభక్తుల చరిత్ర**
**చెప్పుట జగద్ధితంబగు చేత గాదె"**

అని ఇలాంటి దృష్టి కలిగినవారు గనక గుణగరిష్ఠుడు, దేశభక్తుడు ఐన బాపూజీ జీవితాన్ని ఇతివృత్తంగా కలిగి ఉన్న **'బాపూజీ ఆత్మకథ'**ను వెలయించారు.

బాపూజీ జీవితం ఇతివృత్తం కావడం వలన వారిలోని **'గాంధీకవి'**తాంశ ప్రస్ఫుటమైంది. కట్టమంచి రామలింగారెడ్డిగారి చేత **'సీతారామమూర్తి మహాత్ముని యొక్క ఆస్థానకవి. ఈ స్థానము శాశ్వతము'** అని స్తుతింపబడ్డారు. బాపూజీ ప్రధాన నాయకుడుగా ఉన్న భారత స్వాతంత్ర్య సంగ్రామం జరుగుతున్న రోజులలో ఇది రాయబడింది గనక దీనికి యుగలక్షణమబ్బింది. తుమ్మలవారి దృక్పథం కూడా **"ఉక్తి చణత గాదు యుగలక్షణము గుభాళింపవలయు గావ్యలేఖనమున"** అనే.

ఐతే ఇది స్వతంత్ర గ్రంథం కాదు. 'ఆత్మకథ' అనే వేలూరి శివరామశాస్త్రిగారి వచన గ్రంథం ముఖ్యాధారంగా కలిగింది. తుమ్మలవారు దాన్ని పద్యగ్రంథంగా మార్చారు. వచనానికి పద్యరూప మివ్వడం వలన ఇది రూపాంతీకరణమే గాని భాషాంతరీకరణం కాదు. అందువలన దీన్ని 'అనువాద'మనడానికి కూడ వీలులేదు. మరి ఏమనాలి దీన్ని? రూపపరివర్తన జరిగింది గనక **'పరివర్తన గ్రంథ'**మనాలి. ఐతే తుమ్మలవారు తమ గ్రంథాన్ని గురించి **'కబ్బము', 'మహాకావ్యంబు'** అనే రెండు పదాలు వాడారు. మరి ఈ రెండు పదాలు ఎలా సార్థకాలు? ఇవి సార్థకాలు కావడంలో ప్రధానంగా దోహదం చేసింది వారి పద్యరచనా చాతుర్యం. అందులోని విశేషం సంస్కృత ప్రభావ ప్రాబల్యం లేని అచ్చతెనుగు శబ్దజాలం ముచ్చటైన తెనుగు నుడికారం నిండి ఉండడం ప్రాచీన కవి ఐన తిక్కన సోమయాజి రచనలోని విశేషం కూడా ఇదే.

**"మా తిక్కన యజ్వలు త్రొక్కిన త్రోవకేను సమ్మతిపడెదన్"** అన్నారు తుమ్మలవారు. ఆ పద్యం పూర్తి రూపమిది.

**"తెలుగునకు స్వస్తి చెప్పిన**
**తెలుగు కవిత్వంబు పలుకదియ్యము నాకుం**
**గలుగద మా తిక్కనయ**
**జ్వలు త్రొక్కిన త్రోవకేను సమ్మతి పడెదన్"**

తిక్కన సోమయాజి ననుసరించే ప్రయత్నంలో తుమ్మలవారు మనం మరిచిపోయిన ఎన్నో అచ్చతెనుగు పదాలను ఈ గ్రంథంలో కుమ్మరించారు. ఉదా : లిబ్బి, ఒచ్చెము, తీఱము, ఒడమి, బూమియ మొదలైనవి. ఇక తత్సమ శబ్దాలు వాడే అవకాశమున్న చాలా సందర్భాలలో అచ్చతెనుగు శబ్దాలనే వాడారు. ఉదా : మఱుగు (రహస్య మనడానికి), నడివాడు (మధ్యవర్తి అనడానికి), సాంస్కృతిక సమాసాలకు దీటుగా ఆచ్చిక సమాసాలే సృష్టించారు. ఉదా : నేలప్రొద్దులు ('దేశకాలములు' అనడానికి) ఆకు బువ్వ (శాకాహారము అనడానికి), నగపాలు మెయికోలు (అర్ధాంగీకారము అనడానికి), రెండవకొండుకతనము (ద్వితీయ బాల్యమనడానికి), చావు సజ్జ (మరణశయ్య అనడానికి). విశేష్య విశేషణాలకు ఒకేవిధమైన లింగవచనాలుపయోగించారు. ఉదా : ఐచ్ఛిక భట ప్రతతిన్ సవిధస్థన్, అస్మదీయను జీవన యాత్రనింక, భారతీయులతోడ బలువుర తోడ. తెలుగులోని చిన్న చిన్న పదాలు వాడి **'అలతి యలతి తునియల గాహళ సంధించిన విధంబు'** అమరడానికి వీలుగా జాత్యుపజాతి

ఛందస్సునే ఎక్కువగా వాడారు. **"అల్పాక్షరాలలో అనల్పార్థ రచన చేయదానికి"** తిక్కన సోమయాజి వాడినట్లె అనేక కృదంతాలుప యోగించారు. ఉదా : ఈ తెరువుతనంబుక, తెలియమి, పొడమమి, అవమతిసేత.

ఇలా తిక్కన ననుసరించడం చేత గ్రంథం ఆంధ్రమహాభారతంతో పోల్చదగిన భాషా ప్రయోగం కలిగినదైంది. దేశి లక్షణ సంభరితమైంది. తుమ్మలవారి **'దేశికవి'**తాంశ ప్రస్ఫుటమైంది. ఐతే తెనుగును గుప్పించడమే తెనుగుదనం కాదు. తెలుగువాడు తాను చెప్పదలచుకున్న విషయాన్ని చెప్పే తీరును ప్రదర్శించడమే అసలైన తెనుగుదనం. అది కూడ తుమ్మలవారి రచనలో ఉంది. ఉదాహరణలు చూద్దాం.

**"చాటింపు మెల్ల భూముల**
**జాటింపుము నన్ను నోరి జడమతి! నాకుం**
**జాటన్నదున్నదటరా?**
**టాటోటుం బ్రదుకు నా కడన్ గలదటరా?**


ఈ పద్యంలో కాకువు వలన వాచ్యార్థానికి వ్యతిరేకార్థం వచ్చింది.

**"కనవమ్మ! తల్లి! మాకుటి**
**కనవమ్మా! యిందు గోడగదులని, బీర్వా**
**లని పెట్టెయలని చెప్పం**
**జను వస్తువొకందులెను చందమునెల్లన్"**

ఈ పద్యంలో నుడికారం వాడబడిన తీరు ఆ వ్యక్తి ఆంగికాభినయాన్ని స్ఫురింపజేస్తుంది. తెలుగువాడు మాట్లాడే సహజ విధానాన్ని పద్యాలు గొంతెత్తి పలుకుతున్నాయి.

ఇలాంటి పద్య రచనా విధానం వల్లనే కాకుండా వచన గ్రంథాన్ని పద్యగ్రంథంగా మార్చడంలో వారు తీసుకున్న జాగ్రత్త వలన కూడ ఈ గ్రంథానికి కావ్యత్వమబ్బింది. ఆ జాగ్రత్తలో మూడంశాలున్నాయి. 1. క్లుప్తీకరణం 2. మూల త్యాగం 3. విపులీకరణం.

ఉదాహరణకు బాపూజీ బాల్యంలో ఒకసారి దొంగతనం చేశాడు. తరువాత పశ్చాత్తాపపడి మనశ్శాంతి పొందదలచుకుని ఆ విషయం ఒక చిన్న కాగితం మీద రాసి తండ్రికిచ్చాడు. ఆ కాగితాన్ని చదివిన తండ్రి బాష్పాలు రాల్చాడు. ఈ సందర్భంలో ప్రేమబాష్పాలు రాల్చాడని మాత్రమే వచన గ్రంథంలో ఉంది. తుమ్మలవారు ఆ ప్రేమ బాష్పాలను విపులీకరించారు. **'పితృపాదలోచనచ్యుత విరుద్ధ ప్రేమ బాష్పధార స్రవంతి'** అని అంతేకాక ఆ బాష్పాలు తన మనస్సును ధౌతం చేసి పాపాన్ని కడిగివేశాయని బాపూజీ వచన గ్రంథంలో చెప్పుకోగా తుమ్మల వారి పద్య రచనలో ఇలా ఉంది. **"పూతమ్మొనర్చెనా చేతమ్మునౌర! మత్ కలుషపంకము నెల్లగడిగివైచె"** ధౌతమొనర్చడం అంటే పవిత్రీకరించడం, శుభ్రపరచడం కంటె పవిత్రీకరించడం గొప్పది కదా! ఇంకా **'కలుషపంకమ్ము'**లోని **'పంక'** శబ్దం వచన గ్రంథంలో లేనిది. పాపంలోని మాలిన్యాన్నిది స్పష్టపరుస్తోంది. ఈవిధమైన విపులీకరణం వలన వచన గ్రంథంలో కన్నా పద్యరచనలో ఈ సన్నివేశానికి అనుభూతి దాయకత్వం అధికంగా వచ్చింది. ఇలాంటి సన్నివేశాలెన్నో 'బాపూజీ ఆత్మకథ'లో ఉన్నాయి. అందువలన 'బాపూజీ ఆత్మకథ' వచన గ్రంథం కలిగించని అనుభూతిని కలిగిస్తూ 'కావ్య'మనడానికి యోగ్యమై ఉంది. ఐతే కవితాకళ ఇక్కడ అదుపు తప్పి విజృంభించడానికి వీలులేదు. ఇది బాపూజీ సత్య ప్రయోగ చరిత్రం గనక సత్యానికి భంగం కలగకుండా జాగ్రత్త పడుతూ ఒక పరిమితిలో మాత్రమే వర్తింపవలసి ఉంది. అందువలన ఇతర రసవత్కావాలలో ఉన్నట్లు ఈ కావ్యంలోని **'రసస్థితి'** సాంద్రంగా




ఉండదు. ఐనా ఇది కావ్యమే. ఇక **'మహాకావ్య'** శబ్దం ఈ గ్రంథానికున్న వైపుల్యం వలన, ఉపదేశ మహత్త్వం వలన అన్వయమౌతుంది.

ఇంతకీ ఈ అనుభూతి స్వరూపమేమిటి? అది శాంతానుభూతి. శాంత స్పందన. అందువలన ఈ కావ్యాన్ని **'శాంతకావ్యం'** అనాలి. దీన్ని వీరకావ్యమన్నవాళ్లు కొందరున్నారు. కాని అది శాస్త్రీయ వివేచనలో నిలబడదు. కారణం శాంతం అహంకార ప్రశమం కలిగింది కాగా వీరం అహంకార ఉల్బణం కలిగింది. ఈ కావ్యానికి నాయకుడే కాక వక్త కూడా ఐన బాపూజీ మనస్థితి అహంకార ప్రశమమే గాని అహంకార ఉల్బణం కాదు. ఎందుకంటే ఆయన ఋషి లక్షణం కలిగినవాడు. తుమ్మలవారు ఊడ **'ఎవని రూపంబులో రవణించు నద్వితీయంబు సనాతనంబార్షతేజమో'** ఆ వ్యక్తే బాపూజీ అన్నారు. ఋషి లక్షణం కలిగిన వ్యక్తి వాక్కులో అహంకార ప్రశమం ఉంటుంది. గాని అహంకార ఉల్బణం ఎలా ఉంటుంది?

అలాంటి అహంకార ప్రశమం గల ఋషి వాక్కే **'బాపూజీ ఆత్మకథ'** అంతా ఉంది. అందువలన **'శాంతకావ్య'**మనే మాటే శాస్త్రీయ వివేచనకు నిలబడుతుంది. ఐతే **"వీరుడు కృత్యాలను వర్ణించేది"** అనే ఒక సామాన్యార్థంలో ఈ **'వీరకావ్యం'** అనే

పదం వర్తిస్తుంది. బాపూజీ ఋషే కాక వీరుడు కూడ. వీరుడంటే క్రియాశీలమైన ఉత్సాహం గల వ్యక్తి అని బాపూజీ వీరుడని కూడా తుమ్మలవారు తమ ఇతర గ్రంథాలలో వ్యక్తపరిచారు. కానీ ఈ కావ్యానికి సంబంధించినంతవరకూ ఋషే. అందువలన శాస్త్రీయ వివేచనకు నిలబడే మాట 'శాంతకావ్య'మనేదే.

ఇలా 'శాంతకావ్య'మన్నప్పుడే ఆంధ్రమహాభారతంతో పోలిక కుదురుతుంది. దాన్ని కూడా **'ధర్మవీర'** ప్రధాన మన్నవారున్నారు గాని అధిక సంఖ్యాకుల అభిప్రాయం ప్రకారం అది శాంతరస ప్రధానమైందే.

**'శాంతరస ప్రధానమైందైనా ఆపదలోని రస శబ్దాన్ని బాపూజీ ఆత్మకథా విషయంలో వాడకూడదు. ఎందుకంటే అది కథాకావ్యాలకే వర్తించే మాట. తుమ్మలవారు కథాకావ్యమని 'మహాత్మ కథ'నన్నారు గాని 'బాపూజీ ఆత్మకథ'**ననలేదు.

ఇక అనుభూతి ప్రదాయకమైన కావ్యత్వంతో పాటు దీనిలో శాస్త్రత్వం కూడా ఉంది. అంటే చిత్తశుద్ధితో కూడిన హేతుబద్ధమైన ఆలోచనా విధానం కలిగి ఉండడమన్నమాట. బాపూజీలోని నిరంతర ఆత్మ పరిశీలనా ప్రవృత్తి వలన ఈ కావ్యంలో తాత్త్విక వివేచన, ధర్మాధర్మ విచారణ, ఆధ్యాత్మిక చింతన విస్తృతంగా ఉన్నాయి. ఇదంతా వచనగ్రంథంలో కూడా ఉంది. దీన్ని తొలగిస్తే బాపూజీ మూర్తిమత్వానికి అన్యాయం జరుగుతుంది. గనక తుమ్మలవారు దీన్ని తొలగించకుండా అలాగే ఉంచారు. అందువలన దీనికి శాస్త్రత్వం కూడా అబ్బింది.

కావ్యత్వ శాస్త్రత్వాలు రెండూ కలిగి ఉండడం అనేది ఆంధ్ర మహాభారతానికి కూడ ఉన్న స్వభావమే శాస్త్రేతిహాసమైన సంస్కృత మహాభారతాన్ని కావ్యేతిహాసంగా మార్చడానికి కవిత్రయం ఎంత ప్రయత్నించినా మూలభారతంలోని శాస్త్రత్వాన్ని పూర్తిగా తొలగించడం సాధ్యం కాలేదు. విదురనీతి, శాంతిపర్వం, భగవద్గీత మొ॥న విషయాల వలన అది అలాగే నిలిచి ఉంది. సంస్కృత భారతాన్ని ఆనందవర్ధనుడెలాగూ **'శాస్త్రకావ్య'**మనే అన్నాడు. ఆంధ్రమహాభారతం **'శాస్త్రకావ్య'**మనబడలేదు గాని శాస్త్రత్వ మిళితమైందే. అలాగే బాపూజీ ఆత్మకథ కూడా శాస్త్రత్వమిళితమైంది. దీనికి శాస్త్రత్వాన్నిచ్చే తాత్త్విక వివేచనకు ఒక ఉదాహరణాన్ని చూద్దాం.

దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడు బాపూజీని కొంతమంది క్రైస్తవుణ్ణిగా మార్చడానికి ప్రయత్నించారు. అప్పుడు బాపూజీలో ఇలా వివేచన తలెత్తింది. ఆ పద్యాలు కొన్ని...

**"నా మతము, నాదు నమ్మిక**
**లీ మాత్రాన ప్రిదుల జేయుటేలా స్వర్గ**
**శ్రీ మోక్షసుఖము లేసును**
**బ్రేమింపని వారలకు లభింపకయున్నే?"**

**యేసొకడే భగవత్సుతు**
**డా? సర్వేశునకు బిడ్డలని యుండన నా**
**డీ సర్వమనుజులతనిక**
**హా! సూనులు గాక యగుదురో పెఱవారల్?**
**జీసస్సు దేవుడగుచో**
**నీ సర్వమనుష్యులెవ్వ రీశులు కాదా!**
**యేసు తన రక్తధారల**
**జేసి కడుగునొక్కొ జగము చేయు నఘంబుల్?**

ఇలాంటి వివేచనాపుష్కలత వలన ఇది శాస్త్రకావ్యం.

శాస్త్రకావ్యం కావడం వలన ఆంధ్రమహాభాతరంతో మరొక విధమైన పోలిక కలిగింది. అది ఛందస్సంబంధమైంది. ఆంధ్ర మహాభారతంలో అది ఛందస్సబంధమైంది. ఆంధ్రమహాభారతంలో ఎలాంటి ఛందో విధానం ఉందో అలాంటి ఛందో విధానమే 'బాపూజీ ఆత్మకథ'లోనూ ఉంది. వృత్తాలు చాలా తక్కువగా, జాత్యుపజాతి పద్యాలు చాలా ఎక్కువగా ఉండడమే ఆ ఛందో విధానం. ఇది తుమ్మలవారి దేశికవితా దృష్టికి అనుబద్ధమైంది.

**"వృత్తముల త్రిక్క వొడముచో నెల్ల దప్పి**
**గుప్పవలె సంస్కృతము దాని కొప్ప నేను**
**జాతి నుపజాతిని దెనుంగు చక్కని ముప**
**గాన నవ్వారిగా వాని గారవింతు"**

అని అన్నారాయన. ఐతే ఈ ఛందోవిధానం కాకతాళీయంగా క్షేమేంద్రుడి ఔచిత్యదృష్టికి కూడ అనుగుణమై ఉంది. **'శాస్త్ర కావ్యేతి దీర్ఘానాం వృత్తానాం న ప్రయోజనమ్"** అని అన్నాడాయన.

ఈవిధంగా ఆంధ్రమహాభారతంలో 1. దేశిభాషా ప్రయోగం 2. శాంతానుభూతి 3. శాస్త్రకావ్యత్వం 4. దేశిచ్ఛందో విధానం అనే నాలుగు పోలికలు కలిగి ఉండడం వలన

**"ఈ జగమందు సత్యము నహింసయు నిల్పిన యంత వట్టురా**
**రాజులు మన్మసిద్ధులపరాజిత వైభవులేలు నాంధ్ర వా**
**ణీ జనయిత్రి భారతము నిల్పిన పొల్చిన యంత వట్టు నీ**
**పూజకునైన పుష్పమిది పొల్చును బిల్చునుదాత్త శీలురన్"**

అని ఆత్మవిశ్వాసంతో తుమ్మలవారు చెప్పుకోవడం సముచిత మైంది.

ఇది ఇంత విశిష్టమైన కావ్యం గనకనే 1. రాణాప్రతాపసింహ చరిత్ర 2. సౌందరనందనం 3. ఆంధ్రపురాణము 4. శివభారతం అనే ఉత్కృష్ట కావ్యాలతో పాటు నవ్యాంధ్ర పంచకావ్యాలలో ఒకటిగా పరిగణింపబడింది. ఈ పరిగణనం దీని ప్రశస్తికి పరాకాష్ఠ. మకుటాయమానం, శిఖరాయమానం.

సారాంశమేమిటంటే 'బాపూజీ ఆత్మకథ' ఆంధ్రమహాభారతంలాగే అసామాన్య కావ్యం – శాస్త్రకావ్యం, శాంతకావ్యం.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 9 57 UGC Care List Approved Journal
హైదరాబాద్ జూలై : 2023

# శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారి శతజయంతి విశేష సంచిక


**శివప్రియ,** ఫోన్ : 996 408 2076

శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ (1922-91) జగమెరిగిన సంస్కృతాంధ్ర విద్వాంసులు. అష్టావధానిగా పాండిత్య ప్రాగల్భ్యానికీ, రమణీయ కల్పనా చాతుర్యానికీ, సుకుమార హాస్యానికీ, సంస్కార ఔన్నత్యానికీ ప్రసిద్ధులు. ఇవన్నిటికీ మించి జిజ్ఞాసువులైన విద్యార్థుల పాలిటి కల్పతరువు. గౌరిపెద్ది వారు అవధాన ప్రతిభ, కవితా ప్రౌఢిమలకు పేరు మోసినా, తాళ్ళపాక సంకీర్తన సంపుటాల పరిష్కరణ, పీఠికా రచనలో వారు ప్రదర్శించిన ప్రతిభా సామర్థ్యాలు ఆలోచనామృతాలు, అపాతమధురాలు. ఈ మహానుభావుని శతజయంతి సందర్భంగా తి.తి.దేవస్థానం ఆధ్వర్యంలో 2022 సెప్టెంబరు 10 వ తేదీన తిరుపతి అన్నమాచార్య కళా మంటపంలో శ్రీగౌరిపెద్ది రామసుబ్బశర్మగారి శతజయంతి విశేష సంచిక ఆవిష్కరింపబడింది. ఈ సంచిక సంపాదకులు డా. ఆకెళ్ళ విభీషణ శర్మ. ఈ శతజయంతి ఉత్సవ కమిటీ సంచాలకులు శ్రీ గౌరిపెద్ది వేంకట శంకర భగవాన్.

శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారి జీవితం కొన్ని దశాబ్దాలు పాఠ ప్రవచనాల్లో గడిస్తే మరికొన్ని తాళ్ళపాక కీర్తనల పాఠ పరిష్కరణ లోనూ, పీఠికా రచన లోనూ సాగాయి. ఈ రెండు బాధ్యతలనూ శర్మగారు మనోవాక్కాయ కర్మల సాక్షిగా నిర్వహించి, సఫలీకృతు లయ్యారు. అయినా గౌరిపెద్ది వారికి తాళ్లపాక సంకీర్తన పాఠ పరిష్కరణ, పీఠికా రచనలో ధన్యతాభావం సిద్ధించింది. ఆ సరస్వతీ పుత్రునికి తాళ్లపాక అన్నమయ్య ఈ మాటే తారక మంత్రమయింది.

**"యెందు జనించిన నేమి యెచ్చోట**
**నున్ననేమి కందువ నీ దాస్యము గలిగితే జాలు**
**అంది స్వర్గమే కాని అల నరకమే కాని**
**అందపు నీనామము నా కబ్బుటే చాలు"**

**"శ్రీ గౌరిపెద్ది రామ సుబ్బశర్మ గారి శత జయంతి విశేష సంచిక"** లో చాలా మంది కవి, పండితులు శర్మగారి కవితా కౌశలం, పాఠ పరిష్కరణ, ప్రావీణ్యాల గురించి వ్యాసాలు రాశారు. డా. బేతవోలు రామబ్రహ్మం **'లిఖిత ప్రతుల నుంచి ముద్రిత ప్రతుల దాకా'** అన్న వ్యాసంలో కళ్లల్లో వొత్తులు పెట్టుకొని సమయాను సందర్భంగా పండితోత్తములతోనూ, పల్లెటూరి పెద్దలతోనూ చర్చలు జరిపి **'నిరహంకారమైన నిజాయితీ'** తో తాళ్లపాకవారి పాటల్ని పరిష్కరించా రన్నారు డా. రామబ్రహ్మం. రామసుబ్బశర్మ గారు ప్రాచీనాంధ్ర కవుల విలక్షణ పదప్రయోగాల ఆధారంగా కొన్ని తాళ్లపాక వారి పదాల్ని సమర్థవంతంగా పరిష్కరించారన్నారు. అన్నమయ్యగారి అతివేల శృంగారాన్ని వ్యాఖ్యానించేటప్పుడు గౌరిపెద్ది వారు ప్రదర్శించిన




(శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారి శత జయంతి విశేష సంచిక,
సంపాదకులు: డా. ఆకెళ్ళ విభీషణ శర్మ,
పేజీలు: 120, వెల: అమూల్యం.
ప్రతులకు : జి.వి. యస్. భగవాన్, 204, శేషాద్రి నిలయం అపార్ట్‌మెంట్, వరదరాజ నగర్, తిరుపతి- 517507.
సెల్. నం - 94927 04983.)

సంస్కారాన్నీ, సౌకుమార్యాన్నీ ఈ విధంగా ఉల్లేఖించారు. **"ఇంతటి తాదాత్మ్యం ఉన్నా దేశకాల పరిస్థితులను బట్టీ, భాషా నియమాలను బట్టీ పొసగని అంశాలను ప్రస్తావించడంలో వీరు వెనుకాడ లేదు. అలాగని పెద్దమనిషి తరహా ఔచిత్యాన్ని వీరు విడనాడలేదు.** కొన్ని **శృంగార కీర్తనల్లో కనిపించే పచ్చిదనాన్ని సున్నితంగా ప్రస్తావించారు.** కొన్ని **"పదములలోని భావములు వివరించితే పచ్చియగునని వదలితిని." "వ్యాఖ్యానిస్తే పువ్వు నలిపి వాసన చూచినట్లగునని మానితిని."** డా. బేతవోలు వారు రామసుబ్బశర్మగారి గడుసుతనాన్ని గౌరవించారు. పాండితీ ప్రకర్షను ప్రస్తుతించారు. తమ భిన్నాభి ప్రాయాల్ని ప్రకటించారు కూడా.

డా. పప్పు వేణుగోపాలరావు **'గౌరిపెద్ది వారి వరివస్య'** వ్యాసంలో అన్నమయ్య చిత్రించిన శృంగారం దైహికమైనది కాదనీ, భక్తిపరమైనదని శ్రీధరీయ వ్యాఖ్యానాల, నారద భక్తి సూత్రాల ఆధారంగా సమర్థించారు. (పేజి: 12-13)

**'అపరవ్యాస మహర్షి- శ్రీ గౌరిపెద్ది గురుదేవులు'** అన్న వ్యాసంలో మేడసాని మోహన్ **"అన్నమయ్య తొలి తెలుగు వాగ్గేయకారులే కాక, తొలి తెలుగు వ్యావహారిక కవి కూడ"** (పేజి: 23) అన్న అభిప్రాయంతో ఏకీభవించటం కష్టం. అన్నమయ్యను తొలి **'వ్యావహారిక కవి'** అనే దాని కంటే **'మలి దేశికవి'** (పాలకురికి సోమనాథుని తర్వాత) అనడం సమంజసం.

అవధాని గండ్లూరి దత్తాత్రేయ శర్మగారు **'ఆదర్శ గురుదేవుడు'** వ్యాసంలో గౌరిపెద్ది వారి సమస్యాపూరణ వైదగ్ధ్యాన్ని చక్కగా వివరించారు. (పేజి: 33-35), (36-38)

డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ **'జయంతి తే సుకృతినః'** వ్యాసంలో గౌరిపెద్ది వారు తాళ్లపాక వారి సంకీర్తనల పరిష్కరణలో చూపిన సంస్కృతాంధ్ర గంభీర అధ్యయనం, సునిశితమైన శబ్ద

# సమయమెందుకో ఊగిసలాడింది

ఉదయం వికసించిన పువ్వులు
సాయంత్రానికి వాడడం ఇష్టం లేకనే కాబోలు
సాయంత్రం కావడానికి
సమయం ఊగిసలాడింది
ఉదయం నవ్విన జీవితాలు
తెల్లావారితే ఎలా పరిణమిస్తాయో
నోళ్ళు తెరుచుకున్న రాకాసి అలలు
పరీక్షల ఫలితాలో వరకట్న వేధింపులో
ప్రేమల వైఫల్యాలో మొగుడి సాధింపులో
ఏ అల ఎవరిని మింగనుందో
సాయంత్రం కావడానికి
సమయమెందుకో ఊగిసలాడింది
పక్షులన్నీ ఇళ్లకు చేరుతున్నాయి
అన్ని వచ్చాయో లేదో లెక్క తేలలేదు
గూళ్ళు లెక్కపెట్టడంలో మునిగిపోయాయి
లెక్క తెలిసిన సమయం
సాయంత్రం కావడానికి
ఎందుకనో ఊగిసలాడింది
పగలు రోడ్డుమీద రక్తపు మరకల్ని
ఇళ్లకు చేరవేయడానికి గాలి రానంటుంది
వెలగని వీధి దీపాల కింద
పెగలని ఆర్తనాదాలు గుర్తొచ్చి కాబోలు
సాయంత్రం కావడానికి
సమయమెందుకో ఊగిసలాడింది



**బి. అంజనీదేవి**
హనుమకొండ

వ్యుత్పత్తి కౌశలం, ద్రావిడ భాషా ప్రావీణ్యం, వ్యాకరణ శాస్త్ర వైదుష్యాల్ని సోదాహరణంగా వివరించడం గమనార్హం. శ్రీమాన్ రామసుబ్బశర్మ ఈ అభిప్రాయం ప్రాచీన కావ్య పరిష్కర్తలకు, ముఖ్యంగా తాళ్లపాకవారి కృతుల్ని పరిష్కరించే వాళ్లకు శిరోధార్యం. **"ఈ తాళ్లపాక కవుల వాఙ్మయము భక్తి పీఠమైనట్లే, భాషా మర్మములకు కూడా పీఠమే. భారత కవులను, శివకవులను వదలినచో భాషా విషయమున తాళ్లపాక కవులను తాకగల, దాటగల మొనగాండ్లు లేరన్నచో అతిశయోక్తి కాదు. ఈ తాళ్లపాక కవుల భాషా సాగరమున మథింపవలసిన దెంతయో గలదు. మథించువారు ఎందరో ముందుకు రావలసి యున్నది. రాగలరు. ఆ పనికి ఉడుతసేవగా నా యీ పీఠికలు పనికి రావచ్చునని ఒక ప్రత్యాశ. అందుకే ఈ ప్రయత్నము."** (పేజి: 62) తాళ్లపాక కవుల సంకీర్తనలు- 27 సంపుటానికి శర్మగారు రాసిన పీఠికలోని ఈ మాటలు భావి గ్రంథ పరిష్కర్తలకు దారి దీపాలు కదా.

కోలవెన్ను మలయవాసిని గారు **'పరిశోధన కళా సంరంభకులు'** వ్యాసంలో తాము పరిష్కరించిన తాళ్లపాక సంకీర్తనల ఒక్కొక్క సంపుటంలో ఒక్కొక్క విశేషాంశాన్ని కూలంకషంగా పరిశీలించి గౌరిపెద్ది వారు శాస్త్రీయ సంప్రదాయాన్ని పరిపుష్టం చేశారన్నారు.

రామసుబ్బశర్మగారి సుపుత్రులు గౌరిపెద్ది వేంకట శంకర భగవాన్ గారి వ్యాసం ఆ మహా పండితుల జీవితం, వాఙ్మయ సేవలోని అంతరంగాన్ని చక్కగా వ్యక్తం చేస్తుంది.

గౌరిపెద్దివారు ఏనాడో రాసిన **'రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ'** అన్న వ్యాసం **'యువ భారతి'** సౌజన్యంతో మళ్లీ ఇక్కడ సాక్షాత్కరించింది. ఈ వ్యాస పారిజాత పరిమళం ఆఘ్రాణిస్తే కాని తెలియదు.

ఈ శతజయంతి సంచిక సాహిత్య శిరోమణి గౌరిపెద్ది రామసుబ్బ శర్మ జీవితం, సాహిత్య సేవను పాఠకులకు చక్కగా తెలియచేస్తుందని చెప్తే అది స్వభావోక్తే.

**మూసీ**

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక**
**మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి**
**వెంటనే శాశ్వత చందాదారులు కండి.**
**సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక**
**పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక**
**యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక**
**శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-**
**సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177**

# శ్రీనివాస విలాస కావ్యద్వయం

డా. శ్రీరంగాచార్య, ఫోన్ : 9299 451 266

ఒకప్పటి మహబూబ్‌నగరం జిల్లాలో వున్న సంస్థానాలు ఎంతో సాహిత్యసేవ చేసి గ్రంథాలను ప్రచురించి, అవధానాది కవితా విద్యలకాదరం గల్గించి, సాహితీలోకంలో అక్షర చిరంజీవులైన విషయం సర్వజన వేద్యం కాబట్టి వివరించవలసిన అగత్యం లేదు.

ఈ సంస్థానాల్లో వున్న **'ఆత్మకూరు (అమరచింత) కవితాస్పర్థలు,** వివిధ అవధానాదులచే ఎంత ఖ్యాతి చెందిందో విశేష గ్రంథరచన, ముద్రణ మొదలైన వాటివలన మరింత కీర్తనీయమైనది. ఈ పరంపరలో వచ్చినదే 'శ్రీనివాస విలాసము' అనే రచన. దీన్ని సంస్కృతంలో ఆశువుగా – ఇదే ఆత్మకూరు సంస్థానంలో తమ 26 సం.ల ప్రాయంలో శ్రీమాన్ హొసదుర్గం కృష్ణమాచార్యస్వామివారు (1839–1915) చెప్పి ఆనాడే సంస్థానాధిపతుల ప్రశంసలనందిన ఆచార్యులవారు అనంతరకాలంలో పరకాల మఠానికి 31వ అధిపతిగా (1884 – 1915) విశేష ఖ్యాతినందినారు. ఆనాడు వీరు శ్రీకృష్ణ బ్రమ్మతంత్ర పరకాల యతీంద్ర నామ ప్రఖ్యాతులు. ఆత్మకూరు సంస్థానాధీశులచేత గొప్పగా గజారోహణ సత్కారాన్ని పొందిన మహానుభావులలో వీరే మొదటివారు కావటం గమనార్హం.

శ్రీనివాస విలాస కావ్యం ఈ సంస్థానాధీశుల ఇష్టదైవమైన కురుమతి క్షేత్రంలో వేంచేసియున్న వేంకటేశ్వర స్వామిని ముఖ్యంగా చేసికొని రచించినది. ఈ క్షేత్రానికే కురుమతి, కుర్మతి అనే పేర్లు కూడా ప్రఖ్యాతం. ఈ క్షేత్ర దైవాన్ని ముఖ్యంగా చేసుకొని ఎంతో వైవిధ్య సాహిత్యం వచ్చింది. ఈ పరంపరలో వెలసినదే ప్రస్తుత శ్రీనివాస విలాస కావ్యం. ఇది పంచాశ్వాస పరిమితిగా ఛందో వైవిధ్యంగా రాణిస్తున్నది. శ్రీమాన్ హొసదుర్గంవారు దీన్ని ఆశు వుగా చెబుతుంటే కొందరు వ్రాసుకున్నారట. ఇది వారి అత్యద్భుత కవితా ప్రతిభ.

ఇప్పటివరకు తిరుపతి వేంకట కవుల సాహిత్య పరామర్శ చేసిన పరిశోధకులెవ్వరు గానీ శ్రీనివాస విలాస కావ్యం మూలమైన సంస్కృత ప్రతి అలభ్యం అనే వ్రాస్తున్నారు. ఒక విశేషమేమంటే బహువిధ గ్రంథకర్త, పరిశోధకోత్తముడు, గద్యపద్య రచనారాసిక్యుడైన కురుమూర్తి స్వామి భక్తుడు ఆ దేవుని పేర వచ్చిన బహువిధ కృతులను వెలుగులోనికి తెచ్చిన శ్రీమాన్ వైద్యం వేంకటేశ్వరాచార్య మహాశయుడు ఇంతకాలానికి అంటే క్రీ.శ. 1887నుండి సుమారు 156 సంవత్సరాలకు హొసదుర్గం వారి శ్రీనివాస విలాసం – దాని అనువాదమైన తి.వేం.కవుల శ్రీనివాస పద్యప్రబంధం ఒకే సంపుటంగా వెలుగు చూడటం మనందరి భాగ్య విశేషం. దీని సంపాదకులు విశేష విషయ సంభరిత పీఠికా కర్తలు వైద్యంవారు కావటం అంతా ఆ కురుమూర్తి స్వామివారి కృపా విశేషం.

సంస్కృత శ్రీనివాస విలాసం పంచోల్లాస పరిమితిగా 531 గద్యపద్యములుండి 37 వివిధ ఛందస్సులతో విశేష కవితాభిరామంగా రాణిస్తున్నది. ఇక హొసదుర్గంవారి రచనలు 96 కలవు. ఈ కృతి ప్రప్రథమంగా క్రీ.శ. 1887లో ముద్రణమయింది. ఎవ్వరికి కూడా ఈ మూలగ్రంథం లభించనందువల్ల 'అలభ్యం' అని వ్రాసి తి.వేం.కవుల కృతిని గూర్చియే వ్రాస్తున్నారు. ఎంతో శ్రమకోర్చి నిరంతర సాహిత్యోజ్జీవియైన వైద్యంవారు ఈ సంస్కృత కృతిని అకారాది శ్లోకసూచిక, వివిధ ఛందస్సులు (ఆశ్వాసాల వారీగా) మొదలైన ఎన్నో విషయాలను తెల్పటమే గాక దీన్ని ఈ 2023 సంవత్సరం ముద్రణమొనర్చి, ఉస్మానియా విశ్వవిద్యాలయ సంస్కృత ఎకాడమీ డిప్యుటీ డైరెక్టర్ శ్రీమతి డా. కె. వరలక్ష్మిగారు. ఎకాడమీలో వున్న పుస్తకాన్ని కూడా ప్రచురించటానికి వైద్యంవారి తోడ్పాటే ముఖ్యమని తెలుస్తుంది.

వైద్యంవారు సంస్కృత కృతిలోని ఎన్నో విశేష శ్లోకాలను వివరించి హొసదుర్గంవారి విశేష కవితా ప్రతిభను వ్యక్తపరచిన వేంకటేశ్వరా చార్య గారి సంస్కృత శబ్దార్థ స్ఫూర్తి ప్రశంసనీయమనటంలో సందేహం లేదు.

ఇక తి.వేం.కవుల 'శ్రీనివాస విలాసము'. ఆత్మకూరు ప్రభువు అనుమతినందిన వీరు తమ 'శ్రవణానంద' కృతి స్వీకర్తయైన వాడరేవు వెంకటరత్నం మంత్రిగారి సౌధంలో సకల సదుపాయయుక్తంగా దీన్ని 1879లో పూర్తి కావించినారు. దీని 1,3,5 ఆశ్వాసాలను చెళ్లపిళ్లవారు 2,4 ఆశ్వాసాలను తిరుపతి శాస్త్రిగారు పూర్తిచేసినారు. వీరుభయులూ కృత్యాదిలో తమ అనువాద రీతిని గూర్చి వివరంగా తెల్పటం ఒక విశేషం. ఈ గ్రంథాన్ని ఆత్మకూరు సంస్థానంలో చదివి వినిపించే సందర్భంలో ఎన్నెన్నో వాదోపవాదాలు జరిగినాయి. తి.వేం.కవులు వీటన్నిటిని ఎంతో వ్యంగ్యంగా మాలికల ద్వారా తెల్పినారు. ఈ మాలికలే గాక ఆత్మకూర సంస్థాన సంబంధ పద్యాలన్నీ ఈ గ్రంథం అనుబంధంలో వైద్యంవారు చేర్చటం మరొక విశేషం. తి.వేం.వారి శ్రీనివాస విలాసం అనే ఈ కావ్యాన్ని ఆత్మకూరు సంస్థానాధిపతులు ముద్రించినట్లు గానీ, ఆర్థికంగా తోడుపడినట్టు గానీ గ్రంథంలో ఎక్కడా లేదు. సంస్కృత కృతిని సంస్థానం వారే

ISSN 2457-0796

UGC Care List Approved Journal

మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 9  హైదరాబాద్ జూలై : 2023

# జీవితం (తెలుగు గజల్)



మూడు పూటల ముద్ద మ్రింగి మురియుటేనా జీవితం?
వాడు, వీడితో కబురులాడి పడుకొనుటేనా జీవితం?

శూన్య హస్తం, చితికిన బ్రతుకని శోకవార్ధిలో మునుగక –
కష్టపడి శిఖరాగ్ర స్థాయికి చేరుకొనుటే జీవితం!

సాధ్యం కాదని చతికిలబడక, సాధించాల్సిన గమ్యాన్ని
అహోరాత్రాలు కృషిని జేసి, అందుకొనుటే జీవితం!

అలవిగాని సౌఖ్యాలకై అర్రులు చాచకుండా –
ఆరోగ్యం, ఆనందం కాపాడుకొనుటే జీవితం!

నాది, నేనని, నాకేమిటని, స్వార్థంతో ఉండక –
నలుగురితో సుఖ సంతోషాలను పంచుకొనుటే జీవితం!

నువ్వు, నీ కుటుంబమంతా నిండుగా జీవిస్తూనే –
ఇరుగు, పొరుగు పేదల కంతో, యింతో ఇచ్చుట జీవితం!

బ్రతికి యుండగ పలువురి మెప్పు పొందుట కాదు –ఫణీంద్రా!
మరణించాక మనుజులు గొప్పగ చెప్పుకొంటే జీవితం!

**డా. ఆచార్య ఫణీంద్ర**

**995 988 2963**

ముద్రణ చేయించినా తెలుగు ప్రతి జాడలేదు. ప్రప్రథమంగా తెల్గు శ్రీనివాస విలాసం 'మంజువాణి' పత్రికలో 1903 నుండి 1905 దాకా ముద్రణమైన తరువాత 1905లోనే గ్రంథంగా వచ్చింది. 1905–1956 మధ్య శ్రీనివాస విలాసం కొన్ని ముద్రణలయింది. (నా వద్ద 1951 నాటి ముద్రణ పుస్తకం కలదు)

సంస్కృత కృతి 531 శ్లోక వచనాలతోను తెలుగు శ్రీనివాస విలాసం పద్యగద్యాలు 553 వున్నాయి. ఇక సంస్కృత గ్రంథం రచనాకాలం –

**"వర్షేషు శైలగజ గోత్ర ధరామితేషు**
**శ్రీశాలివాహన శకేక్ష్త్ర గతేష్విదానీం**
**రక్తాక్షి వత్సరతపస్సిత పక్ష ధాతృ**
**షగ్రే కృతః కురుమతీంద్ర విలాస ఏషః"(ఇది క్రీ.శ. 1865)**

తి.వేం.కవుల తెలుగు శ్రీనివాస విలాసం వాడరేవు వెంకటరత్నం గారి సౌధంలో 1897 నాటికి పూర్తి అయింది. శ్రీనివాస విలాసం 5–160 పద్యంలో –

**"అరయగ శాలివాహన శకాబ్దములందున రత్న చంద్ర దిక్**
**స్థిరలు పొసంగనిక్కురు మతి ప్రభుదివ్య చరిత్ర భవ్యమై**
**పరగగ హేమలంబియను వత్సరమందు శతావధానులే**
**తిరుపతి వెంకటేశ్వరులు తెల్గొనరించిరి శాశ్వతంబుగన్"**

దీని రచనాకాలాన్ని తెల్పి వాడరేవువారికి తర్వాతి పద్యంలో ధన్యవాదాలందించినారు.


ఈ రెండు సంస్కృతాంధ్ర కృతులను కాస్తా ఓపిగ్గా చదివితే గొప్ప కవితానుభూతి కలగటమే గాక శ్రీనివాస విలాసంలోని చాలా పద్యాలు వెంకటశాస్త్రిగారి **'కథలు – గాథలు'**లోను, **నానా రాజ సందర్శనం** లోను కన్పదుతాయి.

గ్రంథ పరిష్కర్తలైన వెంకటేశ్వరాచార్యులవారు ఎంత నిర్నిద్రదృష్టితో ముద్రణ పర్యవేక్షించినా అక్కడక్కడ కొన్ని అక్షర దోషాలు తప్పలేదు. ఇంకా వైద్యంవారు తమరికి మూల ప్రతి ఎక్కడ లభించింది? తెల్పలేదు. దీనికితోడు ఆత్మకూరు సంస్థానంలోని **'ఏనుగు నెక్కినాము...'** పద్యాన్ని **'దోసమటంచెరింగియును...'** పద్యాలను వారికి తెలిసిన విశేష విషయాలతో వివరిస్తే నేటి తరానికి ఆనాటి స్పర్థా విశేషాలు తెలిసేవని భావిస్తాను.


శ్రీ వైద్యంవారి సాహితీ వరివస్య అమూల్యమైంది. వీటిలో శ్రీనివాస విలాస కృతులను వెలిగించటం ఒక విద్యా తపస్సు. ప్రాచీన గ్రంథ పరిష్కరణం చేసి దాన్ని ఒక క్రమంలో కూర్చటం సామాన్య కృషి కాదు. విషయాలన్నీ సేకరించి, కళ్లంలో ధాన్యం కుప్ప పోసినట్టు సాహితీ లోకానికందించగలిగే వారే మిక్కిలి తక్కువైన ఈ రోజుల్లో వైద్యంవారు చక్షురక్షర సంయోజనం – బహు పాఠాంతర విపుల పీఠికా సహితంగాను శ్లోక పద్యముల అకారాది గూర్చి ఛందో విశేషాలు మొదలైనవాటన్నిటిని వివరించి ఒక సిద్ధాన్న 'కావ్యపాత్ర'ను మనకందించిన వైద్యం వేంకటేశ్వరాచార్యుల వారికి ఈ సాహితీ లోకం ఋణగ్రస్తం అనటం స్వభావోక్తియే. వారు ఒకనాటి శ్రీ వేంకటేశ శతకంలో (91వ పద్యం) **'నిను గురించిన సాహితిని సేకరింప...'** ఇత్యాది పద్యం అక్షరాల సత్యబద్ధమైంది.

శ్రీమాన్ వైద్యం వారిపైన తమ కులస్వామియైన కుర్మతీశుని కృపాకటాక్షములనవరతం వుండాలని అభిలషిస్తూ...


## స్వ'కృతి'




**సమగ్ర తెలంగాణ వాఙ్మయ కోశము**
ఆచార్య ఎస్వీ రామారావు
వెల : 400 /-
**ప్రతులకు :** నీల్ కమల్, నవోదయ, నవచేతన, తెలుగు బుక్ హౌసెస్, హైదరాబాద్.




**కవితా స్రవంతి (కవిశ్రీ సత్తిబాబు సప్తతి సంచిక)**
సంపా. కంది శంకరయ్య
వెల : అమూల్యం
**ప్రతులకు :** బ్లాక్ నం. 14, ప్లాట్ నెం. 102, ప్రజై సిటీ, ఆల్విన్ కాలనీ ఎదురుగా, మియాపూర్, హైదరాబాద్ - 500 049.
ఫోన్ : 83099 32940



**రస హృదయ -2**
సహృదయ రజతోత్సవ సంచిక
వెల : 500 /-
**ప్రతులకు :** సహృదయ, సాహిత్య సాంస్కృతిక సంస్థ, 1 - 7 - 1047, హంటర్ రోడ్, హనుమకొండ - 506 001.



**వేగుచుక్క (కవిత్వం)**
కె. లక్ష్మణ్ గౌడ్
వెల : 200 /-
**ప్రతులకు :** రచయిత, లుంబినీ హై స్కూల్, టీచర్స్ కాలనీ, మహబూబ్ నగర్
ఫోన్ : 9704 930 509



**బడి బువ్వ ... మరికొన్ని పిల్లల కతలు**
గరిపెల్లి అశోక్
వెల : 80 /-
**ప్రతులకు :** గరిపెల్లి సరోజన, 404, విఎల్ఆర్ రెసిడిన్సీ, బిసైడ్ సిద్ధార్థ స్కూల్, శ్రీనివాస నగర్, సిద్ధిపేట - 502 103.
ఫోన్ : 98496 49101



## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00


## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**


చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/
బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,
బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.
చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట,
హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com

# విజ్ఞాన చైతన్య ప్రదాత గురువు






గురువు అంటే 'త్రిమూర్తి' స్వరూపం
అజ్ఞానం నుండి జ్ఞానం వైపు నడిపించి
జీవితానికి అర్థం కల్పిస్తాడు
అజ్ఞాన అంధకారం నశింపచేసి
వెలుగువైపు నడిపిస్తాడు.

మంచి చెడుల వివక్షను తెలిపి
బతుకుబండి నడుపుబాట చూపి
జీవన సమరంలో సమస్యల
పరిష్కార మార్గదర్శి
జీవన విద్యలో మెలుకువలు చెప్పి
ఆత్మ విశ్వాసాన్ని పట్టుదలను ప్రేరేపించి అభ్యుదయ భావాలను
ఆవిష్కరించి అభివృద్ధికి దశ దిశ నిర్దేశిస్తాడు
మనిషి జననం నుండి మరణించేవరకు
ప్రతి విషయంలో గురువు ఉంటాడు.

భారతీయ సంస్కృతిలో గురువు పరంపర ప్రత్యేకతను
సంతరించుకుంది
గురువు భగవంతునికి, భక్తునికి మధ్య సంధానకర్త
అజ్ఞానంగా ఉన్న మనకు విజ్ఞానం బోధిస్తాడు
ఆదమరిచి వున్న మనకు అర్థశాస్త్రం బోధిస్తాడు,
ఆర్థిక అక్షరాస్యత పరిజ్ఞాన పరవ్యాప్తి స్పృహను సృష్టిస్తాడు
పౌరశాస్త్రం చరిత్ర చెప్పి సంస్కృతి పాలన ధర్మరక్షణ పట్ల
కార్యోన్ముఖులను చేస్తూ
వెన్నంటి వుండే కొండత అండ గురువు
పామరులను పండితులను చేసే నిర్మలమైన స్వచ్ఛమైన
ప్రేమాప్యాయతలు చూపే దైవం గురువు
గురువు విద్యతో పాటు వినయం విచక్షణ తాత్త్వికత నేర్పిస్తాడు
పరిశీలన పరికల్పన పరిశోధన
వివరణ విశ్లేషణా శక్తి సామర్థ్యాల
ఉద్దీపనకు ఉత్ప్రేరకంగా నిలుస్తాడు.

చీకట్లను తొలగించి వెలుగు పంచే దివ్వె గురువు
జీవితానికి గమ్యాన్ని మార్గనిర్దేశనం చేసే మహర్షి గురువు
ఉన్నతస్థాయిలో శిష్యుల ప్రగతికి
పాటుపడి దారి చూపే జ్ఞానజ్యోతి గురువు
సమాజంలో అజ్ఞానాన్ని తరిమి
విజ్ఞానాన్ని పెంచి మంచితనం పంచి
మేథో సామర్థ్యాలు పెంచుకొని భారతదేశ
కీర్తి ప్రతిష్ఠలు పెంచుదాం
భారతీయ సంస్కృతి ఆధ్యాత్మికతను జగతిన చాటుదాం
ఉత్తమ పౌరులుగా ఎదుగుదాం
ఉజ్జ్వల భవిష్యత్తుతో విజ్ఞాన భారత్
నిర్మాణ ప్రక్రియలో భాగస్వాములమై ప్రగతిశీల ప్రతిభా
ఆవిష్కరణలతో...
భారత్‌ను **'విశ్వగురువు'** స్థాయికి చేర్చుదాం

**కనకయ్య నేదునూరి**
**హైదరాబాద్. ఫోన్ : 9440 245 771**

Regd No. R.N.37723/80
P.R.No.HSE-824/2023-2025
Date of Publication 1st of Every Month
Date of Posting 5th / 6th of Every Month


# హరిహర త్రిశక్తి క్షేత్రం

నవాలయ ఆవరణం, శ్రీ విద్యాపురం, వలిగొండ, యాదాద్రి జిల్లా.



## శ్రీ నవచండీ మహాయాగం మరియు త్రిశక్తి మూర్తులకు వాయన సమర్పణ ఉత్సవము

ఆదివారము 30-07-2023

ఆలయ నిర్మాణ, నిర్వహణకు సహకరించండి.....

దాతలు తమ సహకారం ఆన్‌లైన్ ద్వారా కూడ అందించవచ్చు.

**State Bank of India, Nallakunta Branch,**

**A/c. No. 62011461764, IFSC Code : SBIN0020083**

**రండి ... ఈ ధర్మయజ్ఞంలో అందరం పాలుపంచుకుందాం.**

## వేద సంస్కృతి పరిషత్

వైదిక సాంస్కృతిక ఉద్దీపన పరిశోధనా సంస్థ

సెల్ : 9704227744, 9347971177

**Website : www.vsparishath.com, E-mail : vsp613@gmail.com**


From :

**The Manager, MUSI Telugu Monthly Magazie**

# 2-2-1109/BK - LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad- 500 013.

Cell : 9347971177, Email : editormusi@gmail.com

**Printed, Published and Owned by : B.Anantha Laxmi, Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.**

**Published at H.No.3-4-245/1, Lingampally, Hyderabad - 500 027. Telangana**

**Editor : Dr.Sagi Kamalakara Sharma**